తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com | WWW.VAARTHA.COM | హైదరాబాద్ సిటీ | fb.com/vaartha

PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

30-1-2018 మంగళవారం సంపుటి :23 సంచిక : 359 పేజీలు :16 వెల : 5.00



సోమవారం న్యూఢిల్లీలో బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పార్లమెంటుకు వచ్చిన రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, స్పీకర్ సుమిత్రామహాజన్, ప్రధాని నరేంద్రమోడీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ తదితరులు

దూసుకుపోతున్న ఆర్థికవృద్ధి

7.5 శాతానికి పెరిగే అవకాశం

పార్లమెంటుకు సమర్పించిన ఆర్థికసర్వే

పరోక్ష పన్ను వసూళ్లలో 50% పైగా పెరుగుదల

ఈ ఏడాది సాధించిన భారీ లక్ష్యం

జిఎస్‌టి: అరవింద్ సుబ్రమ్మాన్యన్

న్యూఢిల్లీ, జనవరి 29: భారత్ ఆర్థికవృద్ధి ఈ ఆర్థికసంవత్సరంలో ఏడుశాతంగా ఉంటుందని, తదుపరి సంవత్సరంలో 7.5 శాతంగా ఆర్థికవృద్ధి ఉంటుందని ఆర్థికసర్వే వెల్లడించింది. ఎగుమతులు, ప్రైవేటు పెట్టు బడుల ద్వారా ఆర్థికవృద్ధిమరింత కోలుకుంటుందని ఆర్థికమంత్రిత్వశాఖ, పరిధిలోని ఆర్థికవేత్త ప్రధాన ఆర్థికసలహాదారు తన సర్వేలో వెల్లడించారు. స్థూల జాతీయోత్పత్తి 6.75 శాతం వృద్ధిచెందుతుందని సర్వేలో స్పష్టంచేసారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి ముఖచిత్రంగా ఆర్థికసర్వే నిలుస్తుందని నిపుణులు చెపుతున్నారు. జిఎస్‌టి మండలి

≫2

కాంగ్రెస్‌కు 70 సీట్లు రావడం

ఉత్తమ్ భ్రమ

వనపర్తి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు

గడ్డి మొలవని పాలమూరు పచ్చబడింది..

వనపర్తిలో హారీష్‌రావు సుడిగాలి పర్యటన



సోమవారం వనపర్తి పర్యటనలో మంత్రి హారీష్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి29: వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామని నీటిపారుదల శాఖ మంత్రి హారీష్‌రావు చెప్పారు. పెద్దమందడి మండలం వెల్టూరులో రూ.3 కోట్ల ఖర్చుతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ గోదాంను ఆయన ప్రారంభించారు. చిట్యాల మండలంలో రూ.6కోట్లతో నిరి ్మంచిన 5వేల మార్కెట్ టన్నుల వ్యవసాయ మార్కెట్ గోదామ్‌ను హారీష్‌రావు ప్రారంభించారు. బుద్దారం పెద్దచెరువు నుంచి పెద్దమందడి మండలంలోని 21గ్రామాలకు సాగునీరు అందించే బ్రాంచ్ కాలువలకు హారీష్‌రావు శంకుస్థాపన చేశారు. సమైక్య రాష్ట్రంలో వనపర్తిలో ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన మూడేళ్లలోనే 41వేల ఎకరాలకు సాగునీరు అందించామని మంత్రి చెప్పారు. వనపర్తి జిల్లాలో మంత్రి హారీష్‌రావు సుడిగాలి పర్యటన చేశారు. వెల్టూరుల జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గడ్డిమొలవని పాలమూరులో తుంగ మొలుస్తుందని ఎక్కడ చూసినా పచ్చని పొలాలు, తోటలు కనిపిస్తున్నాయని మంత్రి హారీశ్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే పెద్దమందడి కాల్వ కింద 21వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని చెప్పారు. 108 కోట్ల రూపాయలతో రికార్డు టైమ్‌లో గణపురం కెనాల్‌ను పూర్తి చేశామన్న హారీష్‌రావు వనపర్తి నియోజక వర్గాన్ని లక్ష ఎకరాల మాగాణిగా మారుస్తామన్నారు. వనపర్తికి గతపాలకులు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. 'నిన్న వరంగల్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు 70 సీట్లు వస్తాయని భ్రమపడుతున్నారు. పగటి కలలు కంటున్నారు. పదేళ్లలో పాలమూరు జిల్లాలో 4 ప్రాజెక్టుల కింద50,000 ఎకరాలకు సాగు నీరిస్తే, మేము ఆరున్నర లక్షలు ఎకరాలకు కొత్త ఆయ కట్టుకు సాగునీరిచ్చాం. కాంట్రాక్టుల మీద, కమిషన్లు, మొబలైజేషన్ అడ్వాన్స్‌లపైనే కాంగ్రెస్ నాయకులకు దృష్టి, కల్వకుర్తి పనులు 90శాతం పూర్తయినట్లు బూటకపు మాటలు చెబుతున్నారు. అదే నిజమైతే కల్వకుర్తి కింద 13వేల ఎకరాలకే నీరెం దుకు ఇచ్చారో సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ హయాంలో ఎన్నడూ అయినా నాణ్యమైన కరెంట్ ఇచ్చారా. కరెంటు 9గంటలు పగటిపూట ఇస్తామని

≫2



సోమవారం హైదరాబాద్‌లో టి హబ్ సమావేశంలో మంత్రి కెటిఆర్

టిహాబ్-ఆర్ఇసి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాం

మంత్రి కెటిఆర్ సమక్షంలో ఒప్పందం

హైదరాబాద్ (గచ్చిబౌలి), జనవరి 29 ప్రభాత వార్త: గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆర్ఇసి)తో కలిసి టీ-హబ్ 'ఆర్ఇసి ఇన్నోవేషన్ ఫ్లాట్‌ఫాం'ను ప్రారంభించింది. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటిలో గల టీ-హబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐటి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కెటిఆర్, ఆర్ఇసి చైర్మన్, ఎండి డాక్టర్ పివి.రమేశ్‌లు

≫2

బెంగాల్ కాలువలో పడిన బస్సు

32 మంది దుర్మరణం

3లో

వచ్చే విద్యా సంవత్సరం నుంచి

తెలుగు తప్పనిసరి

మార్కుల స్కోరింగ్ సబ్జెక్టుగా మార్పులు

భాషా పండితుల అప్‌గ్రేడేషన్‌పై న్యాయ సలహా తీసుకుంటాం: డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి



సోమవారం హైదరాబాద్‌లో తెలుగు భాష అమలుపై సమీక్ష చేస్తున్న డిప్యూటీ సిఎం కడియం

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెలుగు భాషను తప్పనిసరి సబ్జెక్టుగా మొదటి తరగతి నుంచి ఇంటర్ వరకు అమలు చేయాలని డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. అన్ని స్థాయిల్లో విద్యార్థులకు ఇబ్బంది కలగని రీతిలో తెలుగు భాషను తప్పనిసరిగా అమలు చేసేలా తెలుగు భాషను ఆసక్తికర సబ్జెక్టుగా, స్కోరింగ్ సబ్జెక్టుగా రూపొందించాలని ఆయన సూచించారు. తెలుగు భాషను తప్పనిసరి సబ్జెక్టుగా చేయడం అంశంపై సోమవారం సచివాలయంలోని డిప్యూటీ సిఎం కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు, విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రధానంగా తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో మాతృభాషను తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేస్తున్న విధానాన్ని.. సిబిఎస్ఈ, ఐసిఎస్ఈల్లో కూడా తెలుగు భాషను తప్పనసరి సబ్జెక్టుగా అమలు చేయడంపై తీసుకుంటున్న చర్యలను, వాటన్నింటికంటే మన రాష్ట్రంలో ఇంకా మంచిగా తెలుగుభాషను సబ్జెక్టుగా అమలు చేయడంపై రూపొందిస్తున్న విధానాలను వివరించారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ఆదేశాల మేరకు తెలుగు బాషను తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడంపై ఈ సబ్ కమిటీ వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న

≫2



నల్లగొండలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసి తలను రోడ్డుపై పడేసిన దృశ్యం

నల్లగొండలో మరో దారుణం

ట్రాక్టర్ డ్రైవర్ కిరాతకంగా హత్య

తల, మొండాన్ని వేర్వేరుగా పడేసిన దుండగులు

వివాహేతర సంబంధంతోనే హత్య చేసినట్లుగా అనుమానం

నల్లగొండ రూరల్, జనవరి 29 ప్రభాతవార్త: నల్లగొండ పట్టణంలో మరో దారుణ హత్య జరిగింది. ప్రజలు గత ఐదు రోజుల క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిభర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య ఘటన మరిచిపోక ముందే మరో హత్యసంచలనం కల్గించింది. సోమవారం వెలుగు చూసిన ఈదారుణ హత్యతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ మండల కేంద్రానికి చెందిన పాలకూరి రమేష్‌ను అత్యంత కిరాతకంగా చంపిన దుండగులు తల,

≫2

పూర్తి కావొచ్చిన

ఉద్యోగుల విభజన

విభజన జరిగిన మొత్తం ఉద్యోగులు 56,419

ఎపికి 31,941 తెలంగాణకు 24,478

మిగిలినవి 757 మంది

డిఎస్‌పిల విభజనలో జాప్యంతో ఐపిఎస్ అవకాశాలు మృగ్యం

కోర్టు కేసు వల్ల వైద్య శాఖలో పెండింగ్

'వార్త'తో ప్రేంచంద్రారెడ్డి



కోనేటి రంగయ్య / హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడగా అందులో కీలకమైన ఉద్యోగుల విభజన ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తున్నది. సీనియారిటీ జాబితాను సకాలంలో అందించడలో పాలనా యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం వల్ల కీలకమైన పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్ (డిఎస్‌పి)ల విభజన ఇంకా ప్రారంభం కాలేదు. తెలంగాణతోపాటు, ఎపి రాష్ట్ర ప్రభుత్వాలు ఈ జాబితాలను అందించాల్సి ఉంది. ఇక ఎక్సయిజ్ సూపరింటెండెంట్స్, విషయంలోనూ ఇదే పరిస్థితి ఉంది. వైద్యఆరోగ్య శాఖకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనేపథ్యంలో విభజన అంశాలను పరిశీలిస్తున్న కమటీలో కీలకభూమిక నిర్వహిస్తున్న ప్రభుత్వ

≫2



భద్రాద్రి జిల్లా గుండాల మండలం యాపలగడ్డ గ్రామంలో గద్దెపై పూజార్లు, వడ్డెలు

వనం నుంచి జనజాతరకు

మేడారానికి బయల్దేరిన పగిడిద్దరాజు

ముస్తాబైన పెళ్లికొడుకు

కాలినడకనే ప్రయాణం

ఇల్లెందు, ప్రభాతవార్త: ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన 'మేడారం' జాతర. సమ్మక్క-సారలమ్మ జాతరకు వన దేవతైన సమ్మక్క పతిదేవుడు అయిన పగిడిద్దమహారాజు వనం నుంచి జనజాతరకు సోమవారం పయనమయ్యారు. రెండేళ్లకోసారి తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మేడారంలో జరిగే జాతరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం గుండాల మండలం యాపలగడ్డ గ్రామంలో అరెం వంశీయులు బర్లగుట్టపై కొలువైవున్న పగిడిద్దరాజును పురాతన గుడికి తోడుకొని వెళ్తారు. పగిడిద్ద రాజును పెళ్లికొడుకుగా తయారుచేసి గిరిజన సాంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి గద్దెలపై ప్రతిష్టించిన అనంతరం డప్పు వాయిద్యాల నడుమ గుండాల నుంచి మూడు రోజుల ముందు బయలుదేరి మేడారంకు ఈనెల 31న చేరుకుంటారు. దీంతో మేడారంలో జాతర మొదలౌతుంది. అనంతరం సమ్మక్క వనప్రవేశం అనంతరం తిరిగి గుండాలకు చేరుకొని పగిడిద్దరాజును బర్లగుట్టకు చేర్చుతారు. అనంతరం మార్చి మొదటివారంలో గుండాల మండలంలో పగిడిద్దరాజు జాతర అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. గుండాల మండల పరిధిలోని కొడవటంచ గ్రామసమీపంలో గల బర్లగుట్టపై కొలువుదీరిన సమ్మక్క భర్త పగిడిద్దరాజును సోమవారం యాపలగడ్డగ్రామ పురాతన ఆలయానికి తోడుకొని వచ్చారు. ఆనాటి వారి ఆయుధాలు, పడగలు, ఆభరణాలకు గిరిజన సాంప్రదాయం ఉట్టిపడేలా ప్రత్యేకపూజలు నిర్వహించారు. పగిడిద్దరాజును పెళ్ళికొడుకుగా తయారు చేసి తొట్టివాగు

≫2

వార్త, హైదరాబాద్, మంగళవారం, జనవరి 30, 2018

టిహబ్-ఆర్ఇసి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాం

హైదరాబాద్: టీ-హబ్, గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్లు సంయుక్తంగా ఆర్ఇసి ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. ఆర్ఇసి ఇన్నోవేషన్ ప్లాట్‌ఫాం కార్యక్రమం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 30 ప్రభుత్వ ఇనిస్టిట్యూట్ల విద్యార్థులు దాదాపు 1800మందికి సహకారం అందించడంతో పాటు మెంటరింగ్ ఏర్పాటు చేయనున్నారు. పునరుత్పాదక శక్తి రంగంలో ఈ విద్యార్థుల కొత్త ఆవిష్కరణలు, రీసెర్చ్‌లకు తోడ్పాటును అందించనున్నారు. సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ, బయో ఫ్యూయల్ వంటి రంగాల్లో కొత్త ఆవిష్కరణలను ఈ కార్యక్రమం ద్వారా చేపట్టనున్నారు. ఈమేరకు మంత్రి కెటిఆర్, ఆర్ఇసి చైర్మన్ పి.వి.రమేశ్ సమక్షంలో టీ-హబ్ సిఇఓ. జైకిషన్, ఆర్ఇసి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వెంకటేశన్‌లు ఎంఓయుల చేసుకున్నారు.

ఈ సందర్భంగా టీ-హబ్ సిఇఓ. జైకిషన్ మాట్లాడుతూ గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్‌తో కలిసి ఈ కార్యక్రమం చేపట్టడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమం ద్వారా దాదాపు 1800మంది కళాశాలలకు చెందిన విద్యార్థులకు పునరుత్పాదక రంగంలో 600 ప్రాజెక్ట్‌ల్లో సహాయ, సహకారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఇసి చైర్మన్ పి.వి.రమేష్ మాట్లాడుతూ నిజ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను నేటి యువతకు సరైన శిక్షణ అవసరమన్నారు. నేటి సమాజంలో పర్యావరణాన్ని దెబ్బతీయకుండా శక్తిని పుట్టించడమే పెద్ద సవాలని, దీనికి ప్రత్యామ్నాయం పునరుత్పాదక శక్తి అని పేర్కొన్నారు. పునరుత్పాదక శక్తితో పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌సిహెచ్ఇ చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డితో పాటు టీ-హబ్, ఆర్ఇసి అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు 70 సీట్లు రావడంఉత్తమ్ భ్రమ

2009లో ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చారు. దాన్ని తుంగలో తొక్కారు. మీ హయాంలో కరెంట్ లేదు. ఎరువులు లేవు. విత్తనాలు లేవు.ఇప్పుడు రైతులు కెసిఆర్‌కు బ్రహ్మరథం పడుతున్నారు.దీంతో అక్కసు,రైతుల మీద ప్రేమ ఉంటే,ప్రాజెక్టులను అడ్డుకోవడానికి కేసులు వేసిన వారంతా మీ నాయకులే. కనుక ముందుగా ఆ కేసులను తక్షణమే ఉపసంహరించుకుని బేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని ఉత్తమ్ కుమార్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నా, సర్పంచ్ టికెట్ ఇవ్వకపోతే పార్టీలు మారుతున్న సమయంలో 2009లో మహా కూటమి సందర్భంగా వనపర్తి నుంచి నిరంజన్‌రెడ్డికి టికెట్‌రాలేదు. నాకు తెలంగాణ ముఖ్యమని అయన ప్రకటించి టిక్కెట్ త్యాగం చేశారు' అని చెప్పారు.

'2014కు ముందు ఒక్క ఎకరం కూడా వనపర్తి నియోజకవర్గంలో కృష్ణా జలాలు రాలేదు. గడ్డి కూడా మొలవని పాలమూ రులో తుంగ వస్తున్నది.25వేల ఎకరాలకు సాగునీరిచ్చే ఘనపురం బ్రాన్ ్చ కాలువను మంజూరు చేశాము. పెద్ద మందడి ప్రాంతంలో 21వేల ఎకరాలకు సాగునీరిస్తాం. కల్వకుర్తి,భీమా లిఫ్ట్,మైనర్ ఇరిగేషన్ పథకాలతో మొత్తం లక్ష ఎకరాలకు వనపర్తి నియోజకవర్గంలో నీళ్ల పారిస్తాం, కృష్ణ సముద్రానికి రూ.12కోట్లు మంజూరు చేశాము. త్వరలో డిజైన్ పూర్తి చేసి నిర్మాణ పనులు పూర్తి చేస్తాము. వనపర్తి మార్కెట్‌ను అభివృద్ధి పరుస్తాం. ఎక్స్‌పోర్టు మార్కెట్‌గా ఆధునీకరిస్తాం. వనపర్తి జిల్లా కేంద్రం మినీ ట్యాంక్‌బండ్‌కు ఇంకా నిధులు కేటాయిస్తాం.ఖమ ్మం,యాదాద్రి జిల్లాలకు గోదావరి జలాలను ఇవ ్వనున్నాం.బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తర్వాత పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి కృష్ణా నికర జలాలను ఉపయో గిస్తాం. రైతులకు పంట పెట్టుబడి కింద రెండు పంటలకు రూ.8వేలు ఇవ్వబోతున్నాం. వేరుశెనగ రైతులకు మద్దతు ధర కోసం ప్రయత్నిస్తున్నాం. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. తొందరపడి అమ్ముకోవద్దు,ప్రజల్లో మా ప్రభుత్వంపై నమ్మకం ఇంకా పెరుగుతున్నది. ఇది రైతు సంక్షేమ ప్రభుత ్వంగా మేము రుజువు చేసుకున్నాము. ఈ కార ్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పలువురు టిఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం వస్తేనే నీళ్ల వస్తాయని ఉద్యమం సమయంలోనే చెప్పామన్నారు. అప్పుడు చెప్పిందే ఇప్పుడు చేస్తున్నామన్నారు.ఘణపురం చెరువుకు నీళ్లిచ్చిన ఘనత టిఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. కరువుతో అల్లాడిన ఉమ్మడి పాలమూరు జిల్లాను పచ్చని పంటలతో కళకళలాడేలా మార్చిన ఘనత సిఎం కెసిఆర్, హరీష్ రావుదే అన్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి జిల్లా ప్రజల తరఫున సిఎం కెసిఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నల్లగొండలో మరో దారుణం

మొండెం వేర్వేరు చోట్ల పడవేశారు. హత్య చేసి తలను బొట్టుగూడలోని ఓ దర్గా దిమ్మపై మొండెంను పట్టణ సమీపంలోని భారత్‌గ్యాస్ సమీపంలోని గుర్తించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈహత్య జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు రమేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండడంతో పాటు కామెర్ల వ్యాధి నయం కోసం వచ్చే వారికి మందులు కూడా ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. రమేష్ భార్యకు అదే గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తితో గత కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లుగా సమాచారం ఈనేపథ్యంలోనే గత ఆరు నెలల క్రితం రామకృష్ణ, రమేష్‌ల మధ్య గొడవ జరిగినట్లుగా తెలుస్తుంది. దీంతో రామకృష్ణ తన దగ్గర బంధువైన సత్తార్‌కు చెప్పడంతో సత్తార్ మొసిన్ అనే వ్యక్తితో రమేష్‌ను హత్య చేయించినట్లు మృతుని బంధువులు పేర్కొంటున్నారు. ఆదివారం రాత్రి రమేష్‌కు ఫోన్ చేసి కామెర్లకు మందు కావాలంటూ నల్లగొండకు రప్పించి మిర్యాలగూడ రోడ్డులోని భారత్‌గ్యాస్ గోడాం సమీపంలోకి పిలిపించి అనంతరం హత్య చేసినట్లుగా భావిస్తున్నారు. హత్య చేసిన తరువాత దుండగులు రమేష్ తల, మొండెంను వేరు చేసి వేర్వేరు చోట్ల పడవేశారు. దీంతో సోమవారం తెల్లవారుజామునే నల్లగొండ పట్టణంలో మరోహత్య జరిగిందని ప్రజలంతా భయాందోళనకు గురయ్యారు. పోలీసులు మొదట బొట్టుగూడలో తలను గుర్తించగా పోలీసు జాగిలాలతో మరోచోట ఉన్న మొండాన్ని గుర్తించి పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా కే ంద్ర ఆస్పత్రికి తరలించారు. రమేష్‌ను హత్య చేసిన దుండగులు సంచలనం కోసమే తలను తెచ్చి బొట్టుగూడలో వేసినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. సంఘటన స్థలాన్ని నల్లగొండ డిఎస్పి సుధాకర్‌తో పాటు, సిఐ, ఎస్ఐలు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

SINGAM KUIL YELLOW MONDAY
Draw No:138 DrawDate on:29/01/18

SINGAM SERIES	KUIL SERIES
1st Prize Rs.50,000/- 719326	1st Prize Rs.50,000/- 922626
2nd Prize Rs.7,000/- 15004	2nd Prize Rs.7,000/- 77587
3rd Prize Rs.3,500/-	3rd Prize Rs.3,500/-
24036 29099 44192 49960 54050	24547 29409 33850 56970 59813
61435 80507 88118 90169 98402	62682 82078 86322 88702 93972
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0186 0208 0398 0442 0456 5764 6331	0318 1091 1805 2255 2943 4002 4609
6461 7288 8636	6404 8427 8586
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
1112 1133 2554 3105 4764 5573 8099	0748 0860 1754 2396 2819 5567 6564
8405 8914 8959	7865 9280 9688
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0054 1168 2412 3935 5881 7096 8523	0113 1765 2830 4516 5783 7405 8827
0080 1264 2424 4228 5992 7358 8658	0122 1848 2837 4593 5873 7483 9152
0086 1377 2562 4244 6123 7468 8895	0227 1910 2993 4672 5894 7663 9213
0474 1404 2598 4360 6200 7524 8943	0541 1940 3141 4751 5963 7827 9341
0512 1482 2712 4690 6293 7546 9245	0870 2065 3632 4752 5986 7897 9769
0638 1618 2842 4789 6450 7566 9374	0914 2088 3633 4824 6060 8046 9795
0726 1687 2968 4984 6545 7702 9484	0933 2096 3637 4857 6080 8149 9836
0757 1769 2995 5094 6586 7781 9752	1081 2117 3762 4949 6104 8252 9972
0809 1886 3032 5311 6645 7811 9792	1253 2279 3765 5069 6286 8381 9996
0865 1931 3346 5342 6720 8026 9925	1254 2285 4080 5141 6357 8419 9997
0866 2009 3658 5421 6729 8087	1284 2394 4086 5234 6605 8447
0871 2018 3688 5436 6814 8157	1348 2522 4125 5351 6653 8464
0958 2181 3716 5596 6891 8282	1388 2552 4153 5498 6752 8569
0981 2227 3791 5669 6916 8344	1446 2754 4288 5585 7022 8755
1153 2411 3890 5784 7046 8506	1487 2758 4463 5665 7182 8810

ROSA DEER ROYAL MONDAY
Draw No:138 DrawDate on:29/01/18

ROSA SERIES	DEER SERIES
1st Prize Rs.50,000/- 581431	1st Prize Rs.50,000/- 143646
2nd Prize Rs.7,000/- 05958	2nd Prize Rs.7,000/- 03612
3rd Prize Rs.3,500/-	3rd Prize Rs.3,500/-
07280 09609 10268 24544 29290	00705 10754 14051 15815 34365
38030 44699 77731 78627 86634	48435 50731 74745 92360 98287
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0331 0927 1975 2052 2395 3325 3604	0009 0606 1705 1859 2715 2847 3357
4803 6086 7667	4545 5842 7948
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0898 1309 2344 2465 3472 4717 5205	1257 2103 2350 3954 4000 5067 5122
5690 5830 9940	8296 8758 8777
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0076 1409 2632 4051 5983 7045 9179	0037 1550 2250 3967 5230 7297 8733
0084 1493 2810 4222 6008 7122 9318	0260 1551 2301 4099 5238 7382 8794
0127 1522 2850 4267 6096 7160 9342	0279 1596 2324 4155 5483 7444 8949
0158 1571 3047 4350 6187 7481 9402	0284 1635 2429 4160 5902 7529 9098
0299 1714 3137 4391 6194 7858 9435	0544 1686 2578 4298 5916 7586 9156
0401 1816 3240 4646 6283 7940 9495	0617 1693 2672 4309 6061 7614 9258
0515 1852 3332 4662 6464 7951 9754	0687 1707 2690 4364 6299 7653 9599
0688 1854 3613 4964 6469 8053 9832	0758 1717 2958 4395 6356 7698 9656
1002 1875 3732 5011 6608 8330 9908	0825 1749 3103 4598 6549 7730 9843
1198 2034 3773 5086 6890 8560 9991	0857 1820 3183 4695 6730 7911 9902
1200 2045 3820 5192 6935 8841	0964 1858 3395 4710 6832 8119
1232 2058 3919 5477 6938 8852	1009 2111 3497 4807 6867 8338
1272 2110 3964 5522 6952 8880	1371 2123 3570 4967 7030 8339
1282 2217 4032 5731 6964 8899	1373 2136 3605 4980 7220 8367
1363 2514 4035 5965 7016 9064	1503 2198 3672 5062 7276 8370

THANGAM NALLANERAM LUCK MONDAY
Draw No:138 DrawDate on:29/01/18

THANGAM SERIES	NALLANERAM SERIES
1st Prize Rs.50,000/- 722581	1st Prize Rs.50,000/- 848943
2nd Prize Rs.7,000/- 92249	2nd Prize Rs.7,000/- 52680
3rd Prize Rs.3,500/-	3rd Prize Rs.3,500/-
02630 05880 13868 35104 41355	10283 13313 17120 27786 29694
50221 51544 69285 79605 85435	50440 60069 79470 83966 99422
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0239 1761 2081 3099 4934 5363 5621	0091 0371 0672 1065 4941 5325 6084
7260 8082 9304	8081 9116 9262
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0424 1815 4515 4894 5296 7466 8681	1050 2936 3016 3857 3997 4778 5044
8872 9725 9803	6547 7755 9562
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0073 1195 2901 4015 5695 7627 9039	0058 1456 2540 3401 5377 7292 8732
0215 1389 2972 4251 6041 7795 9202	0137 1494 2569 3805 5447 7380 8797
0290 1507 2986 4273 6068 7828 9274	0152 1502 2608 4141 5452 7569 9034
0322 1533 3086 4325 6082 7847 9287	0231 1545 2623 4175 5459 7717 9137
0335 1542 3147 4363 6134 7857 9333	0253 1654 2644 4332 5471 7894 9142
0374 1866 3309 4472 6242 7927 9434	0311 1822 2735 4338 5513 8000 9288
0384 2017 3371 4661 6433 7942 9445	0448 1853 2820 4564 5552 8033 9327
0432 2055 3428 4707 6674 8270 9492	0569 1946 2836 4741 5897 8090 9380
0505 2183 3539 4899 6707 8290 9613	0595 1948 2979 4760 5899 8300 9412
0600 2199 3653 5142 6959 8548 9785	0671 1961 3077 4989 5923 8340 9733
0604 2337 3673 5244 7010 8696	0693 2134 3149 5034 6238 8471
0727 2379 3700 5348 7057 8743	0804 2135 3222 5091 6311 8473
0761 2392 3734 5362 7075 8857	1228 2361 3224 5099 6424 8512
0835 2530 3764 5466 7204 8889	1295 2381 3261 5117 6485 8518
1170 2613 3842 5648 7375 8990	1432 2488 3334 5188 6717 8683

KUMARAN VISHNU SUN MONDAY
Draw No:138 DrawDate on:29/01/18

KUMARAN SERIES	VISHNU SERIES
1st Prize Rs.50,000/- 647540	1st Prize Rs.50,000/- 146980
2nd Prize Rs.7,000/- 08529	2nd Prize Rs.7,000/- 78070
3rd Prize Rs.3,500/-	3rd Prize Rs.3,500/-
23658 25108 28600 46381 65425	27224 33737 38648 43605 49577
75262 77918 82734 95299 97789	58910 73331 79774 85989 89686
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0873 1146 3131 3551 3607 3825 4063	0746 1270 1298 1932 3949 4693 4985
4097 4442 8618	5526 6961 8434
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0265 1041 3509 5216 6705 6811 7504	0197 1508 3963 4726 5102 5765 5985
9143 9475 9695	6918 9392 9889
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0016 1327 2692 4005 5792 8049 9049	0039 1376 2939 4562 5750 7115 8502
0018 1352 2877 4200 5867 8094 9052	0066 1554 3177 4606 5797 7136 8871
0218 1473 2899 4232 5874 8120 9528	0070 1575 3179 4617 5852 7139 8996
0415 1560 2900 4255 5960 8284 9653	0247 1870 3186 4692 5876 7174 9100
0524 1728 2905 4337 5979 8475 9655	0301 1919 3451 4761 5942 7183 9580
0585 1818 2956 4683 6374 8531 9704	0437 2026 3476 4822 6013 7210 9596
0921 1969 3053 4708 6402 8562 9737	0445 2265 3524 4922 6070 7311 9607
0924 2107 3146 4772 6475 8601 9786	0560 2288 3750 4995 6162 7312 9682
0925 2258 3161 4849 6504 8670 9808	0564 2312 3752 5063 6417 7485 9734
0936 2319 3398 4869 6657 8781 9943	0719 2366 3787 5221 6588 7701 9798
0987 2349 3478 4918 7050 8896	0807 2532 3876 5385 6748 7705
1044 2451 3525 4936 7062 8945	0816 2589 3988 5460 6756 8251
1071 2485 3538 4962 7268 8978	0900 2605 4031 5469 6823 8326
1111 2607 3719 4969 7935 9018	1159 2687 4144 5534 6837 8369
1207 2669 3840 5389 7978 9038	1296 2886 4556 5536 7036 8430

కలెక్టర్ ఆమ్రపాలికి మరో షాక్

రిపబ్లిక్‌డే ప్రసంగంలో నవ్వడంపై వివరణ కోరిన సర్కార్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి29: వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి మరో వివాదంలో చిక్కుకున్నారు. రిపబ్లిక్ డే వేడుకల్లో వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి చేసిన ప్రసంగంలో మరుగుదొడ్ల అన్న పదం సరిగా పలకలేక నవ్విన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్ స్పందించారు. ఆమ్రపాలితో సోమవారం ఫోన్‌లో మాట్లాడిన ఆయన రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రసంగం సమయంలో తడబాటుపై ఆరా తీశారు. కొన్ని పదాలు పలకడంలో ఇబ్బంది ఎదురైందని ఆమె సిఎస్‌కు వివరణ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ కార్యక్రమంలో అది రిపబ్లిక్‌డే ప్రసంగంలో కలెక్టర్ పదేపదే నవ్వడంపై సిఎస్ ఆమెకు క్లాస్ తీసుకుని ఉండొచ్చని ప్రచారం సాగుతోంది. రిపబ్లిక్‌డే రోజున హన్మకొండలోని పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమ్రపాలి ప్రసంగం మధ్యలో ఆమె పదేపదే అకారణంగా నవ్వడం, గణాంకాల దగ్గర తడబడటం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ రిపబ్లిక్ డే ప్రసంగం నవ్వులపాలయ్యిందంటూ చాలా విమర్శలు కూడా రావడంతో సిఎస్ ఆమెకు ఫోన్ చేసి వివరణ కోరినట్లు తెలిసింది.



సోమవారం న్యూఢిల్లీలోని విజయ్ చౌక్‌లో 'బీటింగ్ రిట్రీట్' వేడుకకు హాజరైన అశేష జన సందోహం

దూసుకుపోతున్న ఆర్థికవృద్ధి

పనితీరుద్వారా సహకారసమాఖ్యతత్వం మంచి పనితీరు చూపించిందని అరవింద్ సుబ్రహ్మణియన్ స్పష్టంచేసారు. విజ్ఞానసముపార్జనకు విజ్ఞాన దేశంగా ఉన్న భారత్ ఇకపై ఉత్పత్తిదేశంగా మారుతుందని ఆర్థికసలహాదారు వెల్లడించారు. జిఎస్‌టి ఆర్థిక వ్యవస్థలో కొత్త దృక్కోణాలు చూపించింది. పన్నులపరంగా పరిధి పెరిగిందని, సంఘటితరంగం గతంలో కంటే పెరిగిందని, ఎగుమతులు గణనీయంగాపెరగడం వల్ల కొన్ని పెద్ద రాష్ట్రాలు రానురాను మంచి వాణిజ్యకేంద్రాలుగా మారాయన్నారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేసేందుకు నిర్ణయించడంలేదని, అభివృద్ధికి, సాధికారతకు ప్రభుత్వం ప్రధాన అజెండాగా రూపొందిస్తుందన్నారు. చమురుధరలు పెరగడం వల్ల వినియోగరంగం దెబ్బతిన్నదని,ప్రభుత్వ పరంగా వాస్తవ ఆర్థిక కార్యకలాపాలను పెండింగ్‌లో పెట్టాల్సి వచ్చిందన్నారు. రెండు ఆస్తి అప్పుల పట్టీలను సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని,ఇందుకు గుర్తింపు, పరిష్కారం, పునఃమూలధనీకరణ, సంస్కరణలు వంటివి సవాళ్లుగా నిలుస్తాయని అన్నారు. జిఎస్‌టి ఈ ఏడాదిసాధించినభారీ లక్ష్యమని అన్నారు. ప్రత్యక్ష,పరోక్ష పన్నుల్లో పరిధిపెరిగిందని, పరోక్షపన్నుల్లో 50శాతంపెరిగిందని,జిఎస్‌టి విధానంతో మరింతమెరుగుపడుతుందని అన్నారు. మొత్తం 1.8 మిలియన్ వ్యక్తిగత ఆదాయపు పన్ను రిటర్నుదారులు 2016 నవంబరునుంచి రిజిష్టరయినట్లు ప్రధాన ఆర్థికసలహాదారు వివరించారు. వ్యవసాయేతరరంగంలో వేతనాలు భారీగాపెరిగాయని, రాష్ట్రాల అభ్యున్నతి జాతీయ అంతర్జాతీయ అంతర్‌రాష్ట్ర వాణిజ్యంపెంపొందించడంలోనే ఇమిడి ఉందన్నారు. రెడీమేడ్‌వస్త్రాలకు ప్రోత్సాహకప్యాకేజి వల్ల ఎగుమతులను పెంచుతుందని వెల్లడించారు. భారత తల్లితండ్రులు తమకు కుమారులు పుట్టేంతవరకూ తమపిల్లలను సాకాలనే కోరుతున్నట్లు తేలింది. పన్నులరంగంలో లిటిగేషన్‌ను తగ్గించి ప్రభుత్వ కార్యాచరణద్వారామరికొంత తగ్గించినట్లు తెలిపారు. వృద్ధిని మరింత పెంచేందుకువీలుగా పెట్టుబడులనుమరింతపెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. ముడిచమురురంగంలో ఉన్న అత్యధిక ధరలు స్టాక్ మార్కెట్లధరలను సవరించాయన్నారు. పెట్టుబడులను పెంచుకోవడం, పొదుపును పెంచడం, ప్రత్యక్ష పన్నుల వసూళ్లు మరింతపెరగడం వంటివి కనిపిస్తాయన్నారు. జిఎస్‌టి వల్ల 50శాతం పన్నులపరిధి పెరిగిందన్నారు. ప్రస్తుతం ముడిచమురుధరల పెరుగుదల కొంత ఆందోళనకరమని సర్వేలో వెల్లడించారు. గడచిన ఏడాదికాలంగా కొన్ని సంస్కరణలు చేపట్టినందున వాస్తవ జిడిపి వృద్ధి 6.75శాతంగా ఉంటుందని, తదనంతరం ఏడునుంచి 7.5శాతానికి పెరుగుతుందని ప్రధాన ఆర్థికసలహాదారు ధీమా వ్యక్తంచేసారు. పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వ కొనుగోళ్లలో ఎక్కువ మంది పారిశ్రామిక వేత్తలు పాల్గొనేటట్లుఅవకాశం కల్పించామని, కొత్త వ్యవస్థ ప్రభుత్వ ఇ-మార్కెట్ ప్లేస్ వంటివాటిని ప్రారంభించామని, జిఇఎం పేరుతో ఈ పోర్టల్‌పనిచేస్తుందని పార్లమెంటులో వెల్లడించారు. జిఇఎం పోర్టల్‌ద్వారా అతిచిన్న పారిశ్రామికవేత్తలు సైతం తమఉత్పత్తులు ప్రభుత్వానికి విక్రయించే అవకాశం ఉందన్నారు.

30-1-2018 మంగళవారం
హేవళంబి నామ సంవత్సరం
ఉత్తరాయణం, మాఘమాసం శుక్లపక్షం
చతుర్థశి రా. 10.22
పునర్వసు రా 08-18
వ. ఉ. 9.41-11.06వ
పునఃవ. రా.తె.3.24-4.49వ
రా.కా.ప.3.00-4.30
యమ ఉ.9.00-10.30

వనం నుంచి జనజాతరకు

సమీపంలో ఉన్న గద్దెలపై ప్రతిష్ఠించారు. వనదేవతలకు, ఆలయానికి దిష్టితీసి తోరణాలు కట్టారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో నిర్వహించే సమ్మక్క సారక్క జాతరకు ఆదివాసీయులు పూజారులు, వడ్డెలు పగిడిద్దరాజును తోడుకొని డప్పు వాయిద్యాల నడుమ బయలు దేరారు. గుండాల నుండి మేడారంకు 70 కిలోమీటర్లు పాదరక్షలు లేకుండా అత్యంత భక్తిశ్రద్ధలతో వెళతారు. గుండాల, దుబ్బగూడెం, కొడిసెల, పస్రా, నార్లాపూర్, అంకన్నగూడెం మీదుగా ఈనెల 31న మేడారం చేరుకుంటారు. మార్గ మధ్యలో లక్ష్మీపురం, పునుగొండ్ల గ్రామాల్లో రాత్రిళ్లు బసచేస్తారు. కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయిగూడెం నుండి గోవిందరాజు, గుండాల నుండి పగిడిద్దరాజులను మూకుమ్మడిగా మేడారం గద్దెగుడివద్దకు చేరుకొని ప్రభుత్వ లాంఛనాలతో వనదేవతలు వారివారిగద్దెలపై కొలువుదీరుతారు. ఫిబ్రవరి 1న కుంకుమ భరిణే రూపంలో ఉన్న సమ్మక్కను చిలుకలగుట్ట నుండి తోడుకొని గద్దెపై ప్రతిష్టించిన అనంతరం భక్తుల మొక్కులు చెల్లించుకున్న నేపధ్యంలో 3న శనివారం సమ్మక్క వనప్రవేశం అనంతరం పగిడిద్దరాజు తిరుగు పయనమౌతారు.

వార్తాఫలం

మేషం: ఉమ్మడి కుటుంబ సభ్యుల మధ్య వైరానికి అవకాశం. రుణాలు తీర్చక ఇబ్బందులకు అవకాశం. దుర్మార్గులతో కొన్ని నష్టాలకు కూడా అవకాశం.

వృషభం: కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. అధికార కోపాలకు గురయ్యే అవకాశం. వృత్తియందు ధనలాభాలను పొందుతారు. కుటుంబ సమస్యలు.

మిథునం: ధనప్రాప్తి, కొన్ని ఆందోళనలకు అవకాశం. మిత్రులతో కలహానికి అవకాశం. అధికార సందర్శనం చేస్తారు.

కర్కాటకం: వ్యాపారంలో రుణాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. యత్నకార్యసిద్ధి, ప్రమోషన్స్ పొందుతారు.

సింహం: మనోవ్యధలకు అవకాశం. పుత్రపుత్రికల విద్యా వివాహ చర్చలు చేస్తారు. కొన్నిచోట్ల ధనహానికి అవకాశం.

కన్య: మనోవ్యధలకు అవకాశం. బిడ్డల ఉన్నత చదువుపై చర్చలు చేస్తారు. కొన్నిచోట్ల ధనహానికి అవకాశం. భోజనసౌఖ్యంతో ఆనందంగా గడుపుతారు.

తుల: కొత్తవిషయాలపై చర్చలే చేస్తారు. ఉమ్మడి వ్యాపారస్తులకు లాభాలుంటాయి. విలాస జీవితాన్ని అనుభవిస్తారు.

వృశ్చికం: బంధుమిత్రులను కలుస్తారు. నూతన పరిచయాల వల్ల ఆనందాన్ని పొందుతారు. దుష్టులకు దూరంగా వుండడం మంచిది.

ధనుస్సు: కుటుంబ గౌరవాన్ని పొందుతారు. అధికారుల ఒత్తిడికి గురయ్యే అవకాశం. శత్రువుపై విజయాన్ని పొందుతారు.

మకరం: సంతానాది సుఖాలను అనుభవిస్తారు. వృత్తియందు ధనలాభాలను పొందుతారు. మానసిక బాధలకు అవకాశం. వస్తుసముదాయం.

కుంభం: కుటుంబ వ్యతిరేకతలకు అవకాశం. వ్యాపారంలో ధనలాభాలను పొందుతారు. దారిద్రసమస్యలకు అవకాశం. శత్రువులపై విజయాన్ని పొందుతారు.

మీనం: రుణయోగం, తలపెట్టిన పనులు పూర్తిచేస్తారు. మనోల్లాసంతో ఉంటారు. రుణాలు తీరుస్తారు. స్నేహితులను కలుస్తారు. వాహనయోగం.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

తెలుగు తప్పనిసరి

విధానాలపై అధ్యయనం చేసి తమ ప్రతిపాదలను కడియంకు వివరించింది. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా..5వ తరగతి వరకు తెలుగు భాషను చదువుకోని వారికి 6వ తరగతిలో అత్యంత సులభమైన పద్ధతిలో సబ్జెక్టును నేర్చుకునే విధంగా పాఠ్య పుస్తకాలు రూపొందిస్తున్నామన్నారు. అదేవిధంగా 7వ తరగతి వరకు తెలుగు చదువుకోని వారికి 8వ తరగతిలో..10వ తరగతివరకుచదువుకోని వారికి ఇంటర్ మొదటి సంవత్సరంలో తెలుగు భాషను సులభంగ నేర్చుకునేందుకు పుస్తకాలను రూపొందిస్తున్నామన్నారు.ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్. ఆచార్య, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్, తెలుగు భాష తప్పనిసరి సబ్జెక్టు అమలు సబ్ కమిటీ చైర్మన్ విసి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సోమవారం న్యూఢిల్లీలోని విజయ్ చౌక్‌లో 'బీటింగ్ రిట్రీట్' వేడుకకు హాజరైన ప్రజలతో మోడీ

ఉద్యోగుల విభజన

ఎక్స్ అఫిసియో ముఖ్య కార్యదర్శి ప్రేం చంద్రారెడ్డితో సోమవారం నాడు వార్త జరిపిన ఇంటర్వ్యూ వివరాలు..

ప్రశ్న. రెండు రాష్ట్రాల్లోనూ పరిపాలన సజావుగా సాగాలంటే ముందుగా ఉద్యోగుల పంపకంకీలకం. ఈ మేరకు ఉద్యోగుల విభజన ఎంతవరకు వచ్చింది.

జవాబు: ఉద్యోగుల విభజన విషయంలో రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు జరుగుతున్నాయి. ఈ విభజన ప్రక్రియకు ఛైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వ డిఒపిటి అధికారి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆయన అధ్యక్షతన జరుగుతున్న సమావేశాలకు అటు ఎపి, ఇటు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమక్షంలోనే నిర్ణయాలు జరుగుతున్నాయి.

ప్ర: ఉద్యోగులందరిని వారు కోరుకున్న ఆప్షన్స్ ప్రకారం ఆయా రాష్ట్రాలకు కేటాయించారా?

జ. ఉద్యోగుల విభజన దాదాపు పూర్తి అయింది. కేవలం మూడు ప్రభుత్వ శాఖలకు సంబంధించి 757 మందిని కేటాయించే ప్రక్రియ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. పోలీసు శాఖకు చెందిన డిఎస్‌పిలు, అడిషనల్ ఎస్పీలు, డిజి-ఐజిపి ఆధ్వర్యంలో ఉండే నాన్ క్యాడర్ ఎస్పీలు మొత్తం 683 మంది విషయంలో ఇంకా నిర్ణయం జరగలేదు. విభజన జరిగిన మొత్తం 56,419 ఉద్యోగుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్‌కు 31,941 మందిని, తెలంగాణకు 24,478 మందిని కేటాయించారు.

ప్ర: రాష్ట్రాల విభజన జరిగి మూడున్నర సంవత్సరాలకు పైగా సమయం జరిగిన ఇంకా పోలీసు శాఖలోని ఉన్నతస్థాయి ఉద్యోగుల విషయంలోనే తాత్సారం జరగడానికి ప్రత్యేక కారణాలున్నాయా?

జ: అవును. విభజన జరగకపోయినప్పటికీ పోలీసింగ్‌లో ఏ సమస్య లేదు. ఆయా రాష్ట్రాల్లో వారు తమతమ పోస్టుల్లో పనిచేస్తున్నారు.విభజన జరగాలంటే వారివారి సీనియారిటీ విషయం నిర్ధారణ కావాలి. దీంతో ఏ రాష్ట్రానికి ఏ సీనియారిటీ ఉన్నవారు ఎంతెంత మందిని కేటాయించాలనేది మా కమిటీ నిర్ణయిస్తుంది. అందుకే ఈ సీనియారిటీ జాబితాను పంపాలని ఎపి ప్రభుత్వాన్ని కోరాం. ఈమేరకు ఎపి ప్రభుత్వమే కమిటీకి సీనియారిటీ ప్రకారం పేర్లు పంపాల్సి ఉంటుంది. తెలంగాణ నుంచికూడా వివరాలు స్వీకరించి ఎపి ఈ జాబితాను అందించాలి.ఎక్సయిజ్-ప్రొహిబిషన్ శాఖకు సంబంధించిన 62 మందిఉన్నత ఉద్యోగుల విషయంలోనూ ఇదే విధంగా సీనియారిటీ జాబితా రావాల్సి ఉంది.ఎక్సయిజ్ సూపరింటెండెంట్ స్థాయి అధికారుల విభజన విషయంలోనూ ఈ జాప్యం జరుగుతున్నది.

ప్ర: కేవలం ఇద్దరు ఎపిఎస్‌పిఎఫ్ కమాండెంట్ల విషయంలోనూ ఎందు కు జాప్యం జరుగుతున్నది?

జ: వాస్తవం ఏమిటంటే ఈ ఇద్దరి విషయంలో రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమకు వద్దంటే తమకు వద్దని చెబుతున్నాయి. కేటాయింపు ప్రకారం వారిద్దరూ తెలంగాణకే చెందుతున్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ ఇద్దరిని వద్దంటున్నది. ఈ మేరకు కమిటీ తదుపరి నిర్ణయం తీసుకుంటుంది.

ప్ర: వైద్యశాఖలోనూ 10 పోస్టులకు సంబంధించి విభజన పెండింగ్‌లో ఉన్నట్లుంది?

జ: వైద్య శాఖలో కోర్టు కేసుల వల్ల ఆ పదిపోస్టుల విభజన ఆగిపోయింది. కోర్టు తీర్పు తర్వాత వారిని రెండు రాష్ట్రాలకు కేటాయిస్తారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పోస్టులు మూడు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి ఏడు పోస్టుల విషయంలో కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది.

ప్ర: కేవలం 757 పోస్టుల విభజన పెండింగ్‌లో ఉండటం వల్ల సమస్యలు ఏమైనా ఉన్నాయా?

జ: ఇతర పోస్టుల విభజన జాప్యం జరిగినా ప్రభుత్వ పరంగా ఇబ్బంది లేదు కానీ పోలీసు శాఖలో కేవలం డిఎస్‌పిల విషయంలో మాత్రం వారికే నష్టం కలుగుతున్నది. గ్రూప్-1 అధికారులుగా ఎంపికైన వారిలో మెరిట్ లేదా ఆప్షన్ ప్రకారం డిప్యూటీ కలెక్టర్లుగా, డిఎస్‌పిలుగా ఇతరత్రా పోస్టులకు ఎంపికవుతారు. అయితే డిప్యూటీ కలెక్టర్ లేదా ఆర్డీఒలుగా పనిచేసిన వారికి నిబంధనల ప్రకారం కొందరికి ఐఎఎస్‌లుగా ప్రమోషన్ లభిస్తుంది.ఇది మంచిగౌరవం వారికి. ఇదే విధంగా డిఎస్‌పిలుగా పనిచేస్తున్నవారిలోనూ కొందరికి తర్వాతి కాలంలో నిబంధనలననుసరించి ఐపిఎస్‌లుగా ప్రమోషన్ లభిస్తుంది. అయితే రాష్ట్రాల వారీగా విభజన పూర్తి కానందున ప్రస్తుతం డిఎస్‌పిలు ఈ మంచిఅవకాశాలను కోల్పోతారు. ఇప్పటికే ఒకసారి అవకాశం వారికి లభించలేదు. ఈ మేరకు జరిగిన జాప్యంవల్ల వారికి తర్వాతి క్యాడర్‌కు సంబంధించి కూడా వెనుకబడి పోతారు. కానీ డిప్యూటీ కలెక్టర్స్‌గా ఉన్న వారిలో కొందరికి ఇటీవలే ఐఎఎస్‌గా ప్రమోషన్ లభించింది. ఇక ఇతర పోస్టుల విషయంలో సమస్యలు పెద్దగా ఉండవు. కాగా విభజన ప్రక్రియకు సంబంధించి ఇతర అంశాలపై ఎప్పటికపుడు సమావేశాలు నిర్వహించి పరిష్కరిస్తున్నారని ఆయన చెప్పారు. షీలాబిడె కమిటీఇస్తున్న సిఫారసుల ప్రకారం పలు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కమిటీ గడువు ఫిబ్రవరి నెలతో ముగుస్తున్నదని అయితే ఈలోగా విభజనకు సంబంధించిన అన్ని అంశాలు ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు లేవని, ముఖ్యంగా విభజన చట్టంలోని షెడ్యూలు9,10లోని విషయాలపై ఇంకానిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని ఈ చట్టం ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలకు కార్పొరేషన్ల ఆస్తుల విభజన వంటి కార్యక్రమాలు పూర్తి కావాల్సి ఉన్నదని జిఎ(ఎస్‌ఆర్)ఎక్స్ అఫిసియో ముఖ్య కార్యదర్శి ఎల్.ప్రేం చంద్రారెడ్డి తెలిపారు.

కెటిఆర్‌కు దావోస్ ఆహ్వానం బూటకం

- బిఆర్‌శెట్టి పెట్టుబడులు నాటకం

తెలంగాణ సర్కార్‌పై ఉత్తమ్ ఫైర్

మల్లేష్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరిన టిఆర్ఎస్ నేతలు



సోమవారం గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లేష్ ఆధ్వర్యంలో ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన టిఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి కెటి రామారావు సూటు బూటు వేసుకుని మాటలతో కాలం గడిపేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు ఆహ్వానం ఉందని కెటిఆర్ చెబుతున్న మాటలు అవాస్తమవని పేర్కొన్నారు. ప్రభుత్వం రిజస్ట్రేషన్ ఫీజు చెల్లించి దావోస్‌కు కెటిఆర్ దరఖాస్తు చేసుకుంది నిజం కాదా అని ఉత్తమ్ ప్రశ్నించారు. దావోస్‌లో కెటిఆర్‌కు అపూర్వ స్వాగతం లభించిందని, అరుదైన అవకాశం ఉంటూ బూటకపు ప్రచారాలు చేసుకుని మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని కెటిఆర్ చెబుతున్న మాటలన్నీ అబద్ధమని ఆరోపించారు. ఈ విషయంలో కెటిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే స్పందించాలని సవాల్ విసిరారు. బిటిశెట్టి అనే వ్యాపారి 4వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఇదంతా బూటకపు ప్రచారమని దుయ్యబట్టారు. సోమవారం గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యామ మల్లేష్ అధ్యక్షతన ఉతమ్ సమక్షంలో యాచారం మండలం మాల్ గ్రామ సర్పంచ్ టిఆర్ఎస్ నాయకురాలు పద్మ, జహంగీర్‌లతో సహా వందలాది మందితో కా ంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ బిఆర్‌శెట్టి అనే వ్యాపారి పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం చేసుకున్నారని, గతంలో ప్రధానమంత్రి మోడీ నియోజకవర్గం వారణాసిలో 3వేలకోట్లు పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం చేసుకున్నా మూడు రూపాయలు కూడా రాలేదన్నారు. ఎపిలో రాజధారి అమరావతిలో కూడా పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం చేశారని పైసా రాలేదన్నారు. గతంలో కర్ణాటకలో యడ్యూరప్పతో కలిసి భూకుంభకోణంలో బిఆర్‌శెట్టి ఇరుక్కున్నారని అలాంటి వ్యక్తి ఇక్కడ పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం చేసుకోవడం మోసం చేయడమేనని విమర్శించారు. కెటిఆర్, కెటిఆర్ కుటుంబం విలాసాలకు అలవాటు పడ్డారని, ప్రజల సమస్యలు వారికి పట్టింపులేదన్నారు. కెటిఆర్ జపాన్, ఉత్తర కొరియా అంటూ తిరుగుతున్నారని, కెసిఆర్ రూ.500కోట్లతో ఇళ్లు కట్టుకుని విలాసాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 2.50లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో 50లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్న ఐటిఐఆర్ ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. నేటి వరకు టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవక పోవడంతో దీనిపై ఎలాంటి ముందడుగు పడలేదని విమర్శించారు. టిఆర్ఎస్ సర్కార్‌లో ఎలాంటి పెట్టుబడులు లేవు, ఉద్యోగాల లేవు, పరిశ్రమలు లేవన్నారు. కేవలం కెసిఆర్, కెటిఆర్‌లు ప్రచారం మాత్రమే చేసుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణలో కెసిఆర్ కుటుంబం తప్ప ఎవరూ సంతోషంగా లేరని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నంలో క్యామ మల్లేశంతో సహా 12 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కాయమని అన్నారు. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక తెలంగాణ కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. మల్లేశంను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు. ఈ సమావేశంలో కిసాన్ కా ంగ్రెస్ అధ్యక్షులు కోదండరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద తదితరులు పాల్గొన్నారు.

బస్సు కాలువలో పడి 32మంది మృతి

-20 మంది పైగా గల్లంతు - అతివేగమే కారణం

- ఇప్పటివరకూ 6 మృతదేహాల వెలికితీత

- కోల్‌కత్తాకు 220 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం

- దౌలతాబాదు వద్ద బ్రిడ్జిపై నుండి కాలువలో పడిన బస్సు

ముర్షీదాబాద్ (పశ్చిమబెంగాల్), జనవరి 29,ప్రభాతవార్త: కోల్‌కత్తాకు 220 కిలోమీటర్ల దూరంలో బెహరంపూర్‌కు 12 కిలోమీటర్ల దూరంలో సోమవారం 56మందితో కిక్కిరిసిన బస్సు దౌలతాబాదు వద్ద బ్రిడ్జి మీదనుండి కాలువలోకి జారిపడిన సంఘటనలో 32 మంది చనిపోగా 20మందికి పైగా గల్లంతు అయ్యారు. ఇప్పటివరకు 6 మృతదేహాలను వెలికితీసారని అధికారులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 6గంటల ప్రాంతంలో రాష్ట్రరవాణా సంస్థకు చెందిన బస్సు మాల్దా నుండి నాదియాకు వస్తున్న బస్సు దౌలతాబాదు వద్ద అదుపుతప్పి పక్కన ఉన్న కాలువలో పడిపోయింది. ప్రత్యక్షసాక్షుల ప్రకారం డ్రైవరు మొబైల్ ఫోనులో మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించుకొనే ప్రయత్నంలో ప్రమాదానికి లోనైనట్లు తెలిపారు. డ్రైవరు మితిమీరిన వేగంతో బస్సును నడిపాడని ప్రాథమిక విచారణలో తేలింది. కాగా తక్షణం పోలీసులు స్పందించలేదని సహాయక చర్యలు తీసుకోవటంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని స్థానికులు పోలీసులపై రాళ్ల దాడిచేసారు. పోలీసుల వాహనాలకు నిప్పు పెట్టారు. పోలీసులు కూడా భాష్పవాయువు ప్రయోగం చేయటంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బస్సు ప్రమాదంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. మృతుల కుటుంబాలకు 5లక్షల,తీవ్ర గాయాలైనవారికి లక్షరూపాయలు, స్వల్పంగా గాయపడిని వారికి 50,000 పరిహారాన్ని ప్రకటించారు.



బెహరంపూర్ వద్ద బ్రిడ్జి మీదనుండి కాలువలోకి జారిపడిన బస్సు

1 నుంచి 21 వరకూ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: తెలంగాణలో ఫిబ్రవరి నుంచి 21వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ఫస్టు, సెకండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి డా. అశోక్ తెలిపారు. ఈఏడాది నుంచే ప్రాక్టికల్ పరీక్షల్లో 30 నిమిషాల ముందు పరీక్ష పేపర్‌ను బోర్డు వెబ్‌సైట్‌లో పెడుతామని.. దీన్ని ఎగ్జామినర్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు చెబుతారన్నారు. ఈ పరీక్షలకు 3,33,480 మంది విద్యార్థులు ఈ ప్రాక్టికల్ పరీక్షలు హాజరుకానున్నారని చెప్పారు. ఇందులో ఎంపిసి విద్యార్థులు 1,66,364, బిపిసి విద్యార్థులు 91,745 మంది, జియోగ్రఫీ 422, ఒకేషనల్ ఫస్టు ఇయర్ 40,365, సెకండ్ ఇయర్ 34,584 ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. 6410 మంది అనుభవజ్ఞులైన వివిధ కాలేజీలకు చెందిన జూనియర్ లెక్చరర్లను ర్యాండమ్‌గా ఎంపికచేసి జంబ్లిక్ తర్వాత ఈ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు నియమించినట్లు సెక్రెటరీ పేర్కొన్నారు. ప్రైవేటు జూనియర్ కాలేజీల్లోని పరీక్ష కేంద్రాల్లో డిపార్టుమెంటల్ ఆఫీసర్లను అబ్జర్వర్లుగా నియమించామన్నారు. వీరితోపాటుగా ప్లైయింగ్ స్క్వాడ్‌లు, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీలుకూడా ఈ పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తాయన్నారు. ఇంటర్‌బోర్డు కూడా అన్ని జిల్లా కేంద్రాల్లో అబ్జర్వర్లను నియమించామన్నారు. ఈ పరీక్షల్లో కొత్తగా ప్రవేశపెడుతున్న అన్‌లైన్ విధానం, ప్రశ్నాపత్రం అఫ్‌లోడింగ్‌పై ఎగ్జామినర్లకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఒరియంటేషన్ క్లాసులను నిర్వహిస్తున్నామని అశోక్ వెల్లడించారు.

మేడారం జాతరకు వనంలో వసతులు

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: మేడారం మహాజాతరకు తరలివచ్చే భక్తులకోసం ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ఇప్పటికే జాతరకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి కాగా, జాతర జరుగనున్న ప్రాంతమంతా భక్తజన సందోహంగా మారింది. జాతరను విజయవంతం చేసేందుకు సుమారు 29 శాఖల సమన్వయంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సారి జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.80 కోట్లు కేటాయించింది. ఇందుకోసం ప్రత్యేక అధికారిని కూడా నియమించింది. భక్తుల సౌకర్యాలలో లోపాలను పూర్తి స్థాయిలో ఈనెల 30వ తేదీ లోపే సరిదిద్దాలని ఆదేశించారు. అనేక వ్యయ ప్రయాసల కోర్చి తల్లులను కొలిచేందుకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించింది. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం కల్పించిన వసతులపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా జంపన్న వాగు వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నాణ్యతతోనే నిర్మించినప్పటికీ సరైన నీటి వసతి కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్న అంశంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా, తల్లులను కొలిచేందుకు వచ్చిన భక్తులు దర్శనం అనంతర గుడికి దాదాపు కిలోమీటర్ నుంచి 10 కి.మీ.ల పరిధిలో ఉన్న అడవిలోకి వెళ్లి భోజనాలు చేసుకుంటున్నారు. జాతర సందర్భంగా మొత్తం 11,225 మరుగుదొడ్లను నిర్మించారు. రూ.11,45 కోట్లను కేటాయించారు. 519 బ్లాకులలో 9160 రేకులు, 1200 తడకలతో పాటు 300 వరకు రుసుం చెల్లించేవి ఉన్నాయి.

ఏర్పాట్లపై ప్రతీరోజూ సమీక్షలు

మేడారంలో దుమ్ము తీవ్రంగా ఉంటుంది అందువల్ల ప్రధానంగా మాస్కులు వెంట తీసుకు రావాలనీ, కలుషితమైన నీరు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఇంటి దగ్గరి నుంచే నీటిని తెచ్చుకోవడం మంచిదని అధికారులు చెబుతున్నారు. రోడ్లపై ఏర్పాటు చేసే హోటల్స్, తిను బండారాలపై ఈగలు, దోమలతో పాటు దుమ్ము కూడా పడుతుందనీ, ఇవి తినడం వల్ల అనారోగ్యం సోకే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పిల్లలకు తినిపించే పదార్థాలు, పెద్దలు భుజించేందుకు అవసరమైన ఆహారం ఇంటి నుంచి తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఇక వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, జ్వరం వంటి వాటికి సంబంధించిన ట్యాబ్లెట్లను వెంట ఉంచుకోవడం కూడా మంచిదేననీ, ఇక ఎక్కడికి వెళ్లాలి అనేది ముందుగానే నిర్ణయించుకుంటే భారం తగ్గుతుందనీ, చిరు పదార్థాలు తినకుండా ఉండాలనీ, అనారోగ్యంతో చనిపోయిన జంతువుల మాంసం కూడా విక్రయించే అవకాశాలు ఉన్నందున జాతరలోని హోటళ్లలో మాంసాహారం తినకపోవడం మంచిదని సూచిస్తున్నారు. జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు ప్రతీరోజూ సమీక్షలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూస్తున్నారు.

తెలంగాణ పోలీసు విభాగంలో

తీరనున్న సిబ్బంది కొరత

- తొలిసారిగా 935 మంది స్పెషల్ పోలీసు కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి

- పది బెటాలియన్లకు కేటాయింపు - త్వరలో మరో 8 వేల మంది కానిస్టేబుళ్ల చేరిక

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: తెలంగాణ పోలీసు విభాగంలో సిబ్బంది కొరత కొంత మేర తగ్గనుంది. ఉమ్మడి ఎపి నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏ ర్పాటైన తరువాత తెలంగాణ పోలీసు శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఏర్పడిన విషయం తెలిసిందే. ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణకు కేటాయించబడిన సిబ్బంది 68 వేల పైచిలుకు మాత్రమే వుండడం విదితమే. ఇదే సమయంలో ఎపికి చెంది తెలంగాణలో పనిచేస్తున్న వారు అనేక మంది సొంత రాష్ట్రానికి వెళ్లిపోగా ఇదే సమయం లో అక్కడ పనిచేస్తున్న వారు మాత్రం తెలంగాణకు రాలేక పోవడంతో సిబ్బంది కొరత మరింతగా పెరిగింది. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు గత ఏడాది చేబట్టిన పోలీసు భర్తీలలో నియామకమైన తొమ్మిది వేల మంది యువ కానిస్టేబుళ్లలో మొదటి బ్యాచ్ అభ్యర్థులు సోమవారం శిక్షణను పూర్తి చేసుకుని విధుల్లో చేరారు. వీరంతా స్పెషల్ పోలీసు బలగానికి చెందిన వారు కాగా ఇందులో వున్న 935 మంది కానిస్టేబుళ్లను రాష్ట్ర వ్యాప్తంగా వున్న పది బెటాలియన్లకు సర్దుబాటు చేశారు. వీరంతా ఆయా బెటాలియన్లలో చేరగానే సమీప పోలీసు స్టేషన్లలో లేదా ఇతర జిల్లాలలో సివిల్ పోలీసులకు సహాయకారులుగా విధుల్లో చేరనున్నారు. కాగా సివిల్ పోలీసు విభాగంలో ఎంపికైన మరో ఎనిమిది వేల మంది ఫిబ్రవరి, మార్చి నెలల్లో శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరనున్నారు. కొత్త సిబ్బంది రాకతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో పోలీసులపై ఇప్పుడున్న పనిభారం కొంత మేర తగ్గే వీలుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత మొదటిసారిగా చేబట్టిన పోలీసు భర్తీలకు సంబంధించి మొదటి బ్యాచ్ కానిస్టేబుళ్లు శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరారు. టి.పోలీసు శాఖకు ఇది కచ్చితంగా శుభవార్తగా చెప్పాలి. టి.పోలీసు విభాగంలో అధికారికంగా 7731 పోస్టులు ఖాళీగా వుండగా అనధికారిక లెక్కల ప్రకారం ఇది 15 వేల పైచిలుకేనని చెప్పాలి. అంటే మొత్తం ఖాళీల్లో 20 శాతం పైమాటేనని నిర్ధారణ అయ్యింది. ఉమ్మడి ఎపిలో తెలంగాణలో పది జిల్లాలు వుండగా ఇప్పుడు 31 జి ల్లాలు అయ్యాయి. ఇదే సమయంలో తొమ్మిది పోలీసు కమిషనరేట్లు ఏర్పాటయ్యాయి. హైదరాబాద్ కమిషనరేట్ సహా పొరుగునే వున్న సైబరాబాద్, రాచకొండ కమిష నరేట్‌లలో సిబ్బంది కొరత ఇతర ప్రాంతాలకన్నా తీవ్రంగా వుండడం గమనార్హం. హైదరాబాద్‌లోనే మూడున్నర వేల పోస్టులు, సైబరాబాద్, రాచకొండ పరిధుల్లో మ రో మూడున్నర వేల పోస్టుల వరకు ఖాళీగా వున్నాయి. ఇదే సమయంలో ఇతర కమిషనరేట్లు, జిల్లాలలో కూడా సిబ్బంది కొరత తీవ్రంగానే వుంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు 2016 డిసెంబర్ నెలలో పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు తొమ్మిది వేల పైచిలుకు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా ఇందులో 300 పైచిలుకు ఎస్ఐ స్థాయివి కాగా మిగతావి కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించినవి. ఈ పోస్టుల భర్తీ గత ఏడాది ఫిబ్రవరి నెలలో మొదలై ఏప్రిల్ నెల నాటికి పూర్తయ్యింది. మే నెలలో కానిస్టేబుల్ అభ్యర్థులకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీసు శిక్షణా కాలేజిల్లో శిక్షణ మొదలైంది. మహిళా అభ్యర్థులకు సంబంధించి ఎస్ఐ, కానిస్టేబుళ్ల వరకు హి మాయత్‌సాగర్‌లోని పోలీసు అకాడమిలో శిక్షణను మొదలు పెట్టారు. ఇదే సమయంలో స్పెషల్ పోలీసు విభాగానికి సంబంధించిన 935 మంది కానిస్టేబుళ్లకు రంగా రెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో గల ఆక్టోపస్ కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. వీరి శిక్షణ పూర్తవడంతో సోమవారం దీక్షాంత్ పరేడ్ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి డిజిపి మహేందర్ రెడ్డితో పాటు స్పెషల్ పోలీసు విభాగం ఐజి అభిలాష్ బిస్త్ తదితరులు పాల్గొన్నారు. కాగా శిక్షణ పూర్తి చేసుకున్న యువ కానిస్టేబుళ్లు తమకు కేటాయించిన బెటాలియన్లలో చేరనున్నారు. దీంతో స్పెషల్ పోలీసు విభాగంలోని ఖాళీలలో కొంత మేర తగ్గే వీలుంది. మొత్తం మీద స్పెషల్ పోలీసు విభాగంలో మూడు వేల పోస్టులు ఖాళీగా వుండగా తాజాగా చేరనున్న 935 మంది కానిస్టేబుళ్లతో ఇది కొంత తగ్గనుంది.

ఫిబ్రవరి, మార్చి నెలలో సివిల్ పోలీసుల శిక్షణ పూర్తి

ఇదిలావుండగా స్పెషల్ పోలీసుల శిక్షణ ఓవైపు పూర్తవగా మరోవైపు వచ్చే ఫిబ్రవరి, మార్చి నెలల్లో సివిల్ విభాగానికి సంబంధించిన కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి కానుం ది. ఈ విభాగంలో దాదాపు ఎనిమిది వేల మంది యువకులు శిక్షణ చివరి దశను పూర్తి చేస్తున్నారు. వీరికి సంబంధించిన దీక్షాంత్ పరేడ్ ఫిబ్రవరి నెలాఖరు నుంచి మార్చి నెల రెండవ వారంలో పూర్తి కానుంది. అనంతరం వీరంతా ఆయా జిల్లాలు, కమిషనరేట్లలో విధుల్లో చేరనున్నారు. వీరి చేరికతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కమి షనరేట్లతో పాటు జిల్లాలలో పోలీసు సిబ్బంది కొరత కొంత మేర తీరనుంది. కొత్త సిబ్బందిలో హైదరాబాద్ కమిషనరేట్‌కు వెయ్యి మంది రానుండగా సైబరాబాద్, రా చకొండ కమిషనరేట్లకు తలా 500 మంది కానిస్టేబుళ్లు వచ్చే అవకాశాలున్నాయి. కొత్త సిబ్బంది మార్చి నెలాఖరున విధుల్లో చేరే వీలుంది. కొత్త సిబ్బంది రాకతో ఇప్పుడున్న పోలీసులపై పనిభారం కొంతమేర తగ్గే వీలుంది. ఇదే సమయంలో పోలీసు గస్తీతో పాటు ఇతరత్రా విభాగాలు పటిష్టం కానున్నాయి.

రాజకీయాలు వికృతంగా మారినప్పుడు ప్రశ్నించాలి: ప్రొఫెసర్ కోదండరామ్

సైఫాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: రాజకీయాలు వికృతంగా మారినప్పుడు ప్రశ్నించాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్ని అన్యాయాలు జరుగుతున్నాయని వీటిపైన ప్రశ్నించాలని తెలంగాణ జెఎసి ఛైర్మన్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ సూచించారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో కాంట్రాక్టులు అన్ని ఆంధ్రా పెట్టుబడిదారులకే వెళుతున్నాయని ఆయన ఆరోపించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రూపొందించిన నూతన సంవత్సరం డైరీని సోమవారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆవిష్కరించి, 'వర్తమాన రాజకీయాలు-విద్యావంతుల పాత్ర' అనే అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగించారు. కార్పోరేట్‌శక్తులతో ప్రభుత్వం కుమ్మక్కై రాజకీయాలను వ్యాపారంగా మార్చుతున్నప్పుడు ప్రశ్నించక తప్పదన్నారు. వర్తమాన రాజకీయాలు మారాలని, ప్రత్యామ్నాయ రాజకీయాలు రావాలని, రాజకీయాలు ప్రజలకు మేలుజరిగేలా ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వం విచ్చలవిడిగా అధికారాన్ని ఉపయోగిస్తున్నదని, ప్రభుత్వవైఖరిని ప్రశ్నించకపోతే.. బతకడం కష్టమని, మనం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రైవేటు కంపెనీల వద్ద కమీషన్‌కోసం విద్యుత్ కొనుగోలు చేసి 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తుంటే.. మరొకవైపు రైతుల భూగర్భ జాలాలు ఎండిపోతున్నాయని మొరపెట్టుకుంటున్నారని, 24 గంటలు వద్దు 9 గంటలు చాలునని చెపుతున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వం చేపట్టే పనులవల్ల కార్పోరేట్ సంస్థలకు మేలు జరుగుతున్నదని, ఆంధ్రా పెట్టుబడిదారుల పెత్తనం పెరిగిపోయిందని టిఆర్ఎస్ మంత్రులు మొత్తుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయాలపై చర్చ జరగాలని ఆయన సూచించారు. ఈ సభకు తెలంగాణ విద్యావంతుల వేదిక తెలంగాణ అధ్యక్షుడు రవీందర్ అధ్యక్షత వహించగా సభలో సీనియర్ పాత్రికేయుడు వేణుగోపాల్, నాయకులు యాదయ్య, ప్రొఫెసర్ సుజాత, డిపిరెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తం, నాగేశ్వరరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మరో కొత్త విధానానికి శ్రీకారం చుట్టిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ట్రాఫిక్ జంక్షన్లలో రద్దీని క్రమబద్ధీకరించేందుకు, బిక్షగాళ్లు, చిరు వ్యాపారులను లేకుండా చేసేందుకు అక్కడి పోలీసులు వినూత్న వి ధానానికి శ్రీకారం చుట్టారు. జంక్షన్ల వద్ద ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తూ బిక్షగాళ్లకు దానం చేయడం, లేదా అక్కడవున్న చిరు వ్యాపారుల నుంచి ఏ దైనా వస్తువులు కొంటే వెయ్యి రూపాయలు జరిమానా విధించే విధంగా కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన చట్టాన్ని రూపొందించిన ఢిల్లీ పోలీసులు దీనిపై కేంద్రం అనుమతి కోసం పంపారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే కొన్ని నెలల పాటు వాహనదారులకు అవగాహన కల్పించి ఆ తరువాత కచ్చితంగా అమలు చేస్తామని ఢిల్లీ పోలీసు కమిషనర్ దీపక్ పాఠక్ మీడియాకు తెలిపారు.
రోడ్లపై వున్న జంక్షన్ల వద్ద అమ్మకాలు చేయడం, బిక్షగాళ్ల కారణంగా ప్ర మదాలు చోటుచేసుకుంటున్నాయని వీటిని నివారించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

మేడారం జాతరకు వనంలో వసతులు

ఏర్పాట్లపై ప్రతీరోజూ సమీక్షలు

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: మేడారం మహాజాతరకు తరలివచ్చే భక్తులకోసం ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ఇప్పటికే జాతరకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి కాగా, జాతర జరుగనున్న ప్రాంతమంతా భక్తజన సందోహంగా మారింది. జాతరను విజయవంతం చేసేందుకు సుమారు 29 శాఖల సమన్వయంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సారి జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.80 కోట్లు కేటాయించింది. ఇందుకోసం ప్రత్యేక అధికారిని కూడా నియమించింది. భక్తుల సౌకర్యాలలో లోపాలను పూర్తి స్థాయిలో ఈనెల 30వ తేదీ లోపే సరిదిద్దాలని ఆదేశించారు. అనేక వ్యయ ప్రయాసల కోర్చి తల్లులను కొలిచేందుకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు కల్పించింది. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం కల్పించిన వసతులపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా జంపన్న వాగు వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నాణ్యతతోనే నిర్మించినప్పటికీ సరైన నీటి వసతి కల్పించకపోవడంతో నిరుపయోగంగా మారుతున్న అంశంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశాయి. అదేవిధంగా, తల్లులను కొలిచేందుకు వచ్చిన భక్తులు దర్శనం అనంతంర గుడికి దాదాపు కిలోమీటర్ నుంచి 10 కి.మీ.ల పరిధిలో ఉన్న అడవిలోకి వెళ్లి భోజనాలు చేసుకుంటున్నారు. జాతర సందర్భంగా మొత్తం 11,225 మరుగుదొడ్లను నిర్మించారు. రూ.11,45 కోట్లను కేటాయించారు. 519 బ్లాకులలో 9160 రేకులు, 1200 తడకలతో పాటు 300 వరకు రుసుం చెల్లించేవి ఉన్నాయి. మేడారంలో దుమ్ము తీవ్రంగా ఉంటుంది అందువల్ల ప్రధానంగా మాస్కులు వెంట తీసుకు రావాలనీ, కలుషితమైన నీరు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఇంటి దగ్గరి నుంచే నీటిని తెచ్చుకోవడం మంచిదని అధికారులు చెబుతున్నారు. రోడ్లపై ఏర్పాటు చేసే హోటల్స్, తిను బండారాలపై ఈగలు, దోమలతో పాటు దుమ్ము కూడా పడుతుందనీ, ఇవి తినడం వల్ల అనారోగ్యం సోకే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పిల్లలకు తినిపించే పదార్థాలు, పెద్దలు భుజించేందుకు అవసరమైన ఆహారం ఇంటి నుంచి తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఇక వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, జ్వరం వంటి వాటికి సంబంధించిన ట్యాబ్లెట్లను వెంట ఉంచుకోవడం కూడా మంచిదేననీ, ఇక ఎక్కడికి వెళ్లాలి అనేది ముందుగానే నిర్ణయించుకుంటే భారం తగ్గుతుందనీ, చిరు పదార్థాలు తినకుండా ఉండాలనీ, అనారోగ్యంతో చనిపోయిన జంతువుల మాంసం కూడా విక్రయించే అవకాశాలు ఉన్నందున జాతరలోని హోటళ్లలో మాంసాహారం తినకపోవడం మంచిదని సూచిస్తున్నారు. జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు ప్రతీరోజూ సమీక్షలు నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూస్తున్నారు.

కెటిఆర్‌కు దావోస్ ఆహ్వానం బూటకం

- బిఆర్‌శెట్టి పెట్టుబడులు నాటకం

తెలంగాణ సర్కార్‌పై ఉత్తమ్ ఫైర్

మల్లేష్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరిన టిఆర్ఎస్ నేతలు



సోమవారం గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లేష్ ఆధ్వర్యంలో ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన టిఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి కెటి రామారావు సూటు బూటు వేసుకుని మాటలతో కాలం గడిపేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు ఆహ్వానం ఉందని కెటిఆర్ చెబుతున్న మాటలు అవాస్తమవని పేర్కొన్నారు. ప్రభుత్వం రిజస్ట్రేషన్ ఫీజు చెల్లించి దావోస్‌కు కెటిఆర్ దరఖాస్తు చేసుకుంది నిజం కాదా అని ఉత్తమ్ ప్రశ్నించారు. దావోస్‌లో కెటిఆర్‌కు ఆపూర్వ స్వాగతం లభించిందని, అరుదైన అవకాశం ఉంటూ బూటకపు ప్రచారాలు చేసుకుని మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని కెటిఆర్ చెబుతున్న మాటలన్నీ అబద్ధమని ఆరోపించారు. ఈ విషయంలో కెటిఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే స్పందించాలని సవాల్ విసిరారు. బిటిశెట్టి అనే వ్యాపారి 4వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఇదంతా బూటకపు ప్రచారమని దుయ్యబట్టారు. సోమవారం గాంధీభవన్‌లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యామ మల్లేష్ అధ్యక్షతన ఉతమ్ సమక్షంలో యాచారం మండలం మాల్ గ్రామ సర్పంచ్ టిఆర్ఎస్ నాయకురాలు పద్మ, జహంగీర్‌లతో సహా వందలాది మందితో కా ంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ బిఆర్‌శెట్టి అనే వ్యాపారి పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం చేసుకున్నారని, గతంలో ప్రధానమంత్రి మోడీ నియోజకవర్గం వారణాసిలో 3వేలకోట్లు పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం చేసుకున్నా మూడు రూపాయలు కూడా రాలేదన్నారు. ఎపిలో రాజధారి అమరావతిలో కూడా పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం చేశారని పైసా రాలేదన్నారు. గతంలో కర్ణాటకలో యడ్యూరప్పతో కలిసి భూకుంభకోణంలో బిఆర్‌శెట్టి ఇరుక్కున్నారని అలాంటి వ్యక్తి ఇక్కడ పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం చేసుకోవడం మోసం చేయడమేనని విమర్శించారు. కెటిఆర్, కెటిఆర్ కుటుంబం విలాసాలకు అలవాటు పడ్డారని, ప్రజల సమస్యలు వారికి పట్టింపులేదన్నారు. కెటిఆర్ జపాన్, ఉత్తర కొరియా అంటూ తిరుగుతున్నారని, కెసిఆర్ రూ.500కోట్లతో ఇళ్లు కట్టుకుని విలాసాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 2.50లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో 50లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్న ఐటిఐఆర్ ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. నేటి వరకు టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవక పోవడంతో దీనిపై ఎలాంటి ముందడుగు పడలేదని విమర్శించారు. టిఆర్ఎస్ సర్కార్‌లో ఎలాంటి పెట్టుబడులు లేవు, ఉద్యోగాల లేవు, పరిశ్రమలు లేవన్నారు. కేవలం కెసిఆర్, కెటిఆర్‌లు ప్రచారం మాత్రమే చేసుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణలో కెసిఆర్ కుటుంబం తప్ప ఎవరూ సంతోషంగా లేరని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నంలో క్యామ మల్లేశంతో సహా 12 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కాయమని అన్నారు. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక తెలంగాణ కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. మల్లేశంను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని అన్నారు. ఈ సమావేశంలో కిసాన్ కా ంగ్రెస్ అధ్యక్షులు కోదండరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద తదితరులు పాల్గొన్నారు.

బస్సు కాలువలో పడి 32మంది మృతి

-20 మంది పైగా గల్లంతు - అతివేగమే కారణం

- ఇప్పటివరకూ 6 మృతదేహాల వెలికితీత

- కోల్‌కత్తాకు 220 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం

- దౌలతాబాదు వద్ద బ్రిడ్జిపై నుండి కాలువలో పడిన బస్సు

ముర్షీదాబాద్ (పశ్చిమబెంగాల్), జనవరి 29,ప్రభాతవార్త: కొల్‌కత్తాకు 220 కిలోమీటర్ల దూరంలో బెహరంపూర్‌కు 12 కిలోమీటర్ల దూరంలో సోమవారం 56మందితో కిక్కిరిసిన బస్సు దౌలతాబాదు వద్ద బ్రిడ్జి మీదనుండి కాలువలోకి జారిపడిన సంఘటనలో 32 మంది చనిపోగా 20మందికి పైగా గల్లంతు అయ్యారు. ఇప్పటివరకు 6 మృతదేహాలను వెలికితీసారని అధికారులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 6గంటల ప్రాంతంలో రాష్ట్రరవాణా సంస్థకు చెందిన బస్సు మాల్దా నుండి నాదియాకు వస్తున్న బస్సు దౌలతాబాదు వద్ద అదుపుతప్పి పక్కన ఉన్న కాలువలో పడిపోయింది. ప్రత్యక్షసాక్షుల ప్రకారం డ్రైవరు మొబైల్ ఫోనులో మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించుకొనే ప్రయత్నంలో ప్రమాదానికి లోనైనట్లు తెలిపారు. డ్రైవరు మితిమీరిన వేగంతో బస్సును నడిపాడని ప్రాథమిక విచారణలో తేలింది. కాగా తక్షణం పోలీసులు స్పందించలేదని సహాయక చర్యలు తీసుకోవటంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని స్థానికులు పోలీసులపై రాళ్ల దాడిచేసారు. పోలీసుల వాహనాలకు నిప్పు పెట్టారు. పోలీసులు కూడా భాష్పవాయువు ప్రయోగం చేయటంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బస్సు ప్రమాదంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. మృతుల కుటుంబాలకు 5లక్షల,తీవ్ర గాయాలైనవారికి లక్షరూపాయలు, స్వల్పంగా గాయపడిని వారికి 50,000 పరిహారాన్ని ప్రకటించారు.



బెహరంపూర్ వద్ద బ్రిడ్జి మీదనుండి కాలువలోకి జారిపడిన బస్సు

1 నుంచి 21 వరకూ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: తెలంగాణలో ఫిబ్రవరి నుంచి 21వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ఫస్టు, సెకండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి డా. అశోక్ తెలిపారు. ఈఏడాది నుంచే ప్రాక్టికల్ పరీక్షల్లో 30 నిమిషాల ముందు పరీక్ష పేపర్‌ను బోర్డు వెబ్‌సైట్‌లో పెడుతామని.. దీన్ని ఎగ్జామినర్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు చెబుతారన్నారు. ఈ పరీక్షలకు 3,33,480 మంది విద్యార్థులు ఈ ప్రాక్టికల్ పరీక్షలు హాజరుకానున్నారని చెప్పారు. ఇందులో ఎంపిసి విద్యార్థులు 1,66,364, బిపిసి విద్యార్థులు 91,745 మంది, జియోగ్రఫీ 422, ఒకేషనల్ ఫస్టు ఇయర్ 40,365, సెకండ్ ఇయర్ 34,584 ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. 6410 మంది అనుభవజ్ఞులైన వివిధ కాలేజీలకు చెందిన జూనియర్ లెక్చరర్లను ర్యాండమ్‌గా ఎంపికచేసి జంబ్లిక్ తర్వాత ఈ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు నియమించినట్లు సెక్రెటరీ పేర్కొన్నారు. ప్రైవేటు జూనియర్ కాలేజీల్లోని పరీక్ష కేంద్రాల్లో డిపార్టుమెంటల్ ఆఫీసర్లను అబ్జర్వర్లుగా నియమించామన్నారు. వీరితోపాటుగా ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీలుకూడా ఈ పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తాయన్నారు. ఇంటర్‌బోర్డు కూడా అన్ని జిల్లా కేంద్రాల్లో అబ్జర్వర్లను నియమించామన్నారు. ఈ పరీక్షల్లో కొత్తగా ప్రవేశపెడుతున్న అన్‌లైన్ విధానం, ప్రశ్నాపత్రం అప్‌లోడింగ్‌పై ఎగ్జామినర్లకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఓరియంటేషన్ క్లాసులను నిర్వహిస్తున్నామని అశోక్ వెల్లడించారు.

జాతిపిత వర్ధంతి సందర్భంగా నేడు ప్రతిఒక్కరూ మౌనం పాటించాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశం

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: జాతిపిత వర్ధంతి సందర్భంగా స్వాతంత్ర్యంకోసం బలిదానంచేసి అమరులైనవారి త్యాగాలను స్మరించుకుంటూ మౌనం పాటించాలని కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలకు అనుగుణంగా సోమవారం తెలంగాణ ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీచేసింది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి రెండు నిమిషాల పాటు రాష్ట్రవ్యాప్తంగా మౌనం పాటించాలని స్పష్టం చేసింది.

వార్త

డబ్బు తప్ప ఇతరత్రా ఏమీ లేనివాడే ప్రపంచంలో అందరికంటే నిరుపేద.

-ఫ్రాన్సిస్ బేకన్

గాంధీయిజమా? బ్రాందీయిజమా?

'జనవరి 30సోదరా, జాతికి ముప్పైనాదిరా, కరంచెంద్ నేడుండినా ఈ నిషా బంద్ కాకుండెనా' ఎంతో ఆవేదనతో అన్నాడు ఓ కవి. వాస్తవానికి మద్యంపానం నిషేధం అన్నది మహాత్ముడు భారతదేశానికి అందించిన అమృత సందేశం. ఆనాడు కాంగ్రెస్ పార్టీకి సంబంధించి కూడా మద్యపానాన్ని దేశం నుండి పారద్రోలాలనేదే సిద్ధాంతం. నినాదం. అఖిల భారత కాంగ్రెస్ సమావేశాల్లో ఎన్నోసార్లు తీర్మానాలు చేశారు. అఖిల్ భారత కాంగ్రెస్ పార్టీ ఆదేశాలమేరకే అప్పట్లో దేశంలో అనేక రాష్ట్రాల్లో మద్యపానం నిషేధాన్ని అమలు చేశారు. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ఆ నిర్ణయాన్ని శిరసావహించి అమలుకు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేసింది. అప్పట్లో తాగుబోతులంటేనే సమాజంలో ఏమాత్రం గౌరవభావాలు ఉండకపోయేవి. ఒకరకంగా చెప్పాలంటే వారినిసమాజం బహిష్కరించినట్లుగా వ్యవహరించేది. ఎక్కడో చాటుమాటుగా తాగేవారు. పూర్తి మైకంలో పదిమంది లోకి రావాలంటే సిగ్గు,బిడియం ఉండేవి. తాగుబోతుల విషయంలో ఆనాటి ప్రభుత్వాలు ఎంతో కఠినంగా వ్యవహరించేవి. దొంగసారా,మద్యం అమ్మకాలు,వ్యాపారులపై దృఢ వైఖరి అవలంబించేవి ఆనాటి ప్రభుత్వాలు. కానీ రానురాను పరిస్థితులు మారిపోయాయి. ఆదాయం కోసం ప్రభుత్వమే దుకాణాలు పెట్టించి మద్యంసేవించండి. ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చండి అంటూ బతిమాలిభంగపడి తాగించే దురదృష్టపురోజులు దాపురించాయి. ఏటేటా క్రమం తప్పకుండా గాంధీజయంతి, వర్ధంతులు ఘనంగా జరుపుకునే నేతలే ఇలా ప్రజలను మత్తు బానిసలు చేసేందుకు ప్రయత్నించడం అత్యంత బాధాకరం. ఏడాదికేడాదికి ఆదాయాన్ని పెంచుకుంటూపోతున్నారు. ఏమిచేసి అయినా మద్యం ద్వారా ఆదాయాన్ని ఎంత వీలైతే అంత పెంచుకోవాలనే ధ్యేయంగా విధానం అమలుకు కూడా వెసులుబాటు కల్పిస్తూ వ్యవహరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మంచినీరు దొరకని గ్రామాలున్నాయి. గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్ల కొద్దీ నడిచేపరిస్థితి నుండి బయటపడని పల్లెలు కోకొల్లలు. కానీ ఇక్కడ, అక్కడ అనికాదు మద్యం దొరకని గ్రామాలు దుర్భిణి పెట్టినా కన్పించకపోవచ్చు. బెల్టు షాపుల విధానాన్ని ప్రవేశపెట్టిన ఆనాటి తెలుగుదేశంనేతలు గ్రామగ్రామానికి వీధివీధికి అమ్మకాలను ప్రోత్సహించారు. రికార్డుపరంగా సారాను నిషేధించారు. కానీ అమలు చేసే త్రికరణశుద్ధి పాలకులకు లేదనేది అందరికీ తెలిసిందే. పొరుగున్న రాష్ట్రాల నుండి పెద్దఎత్తున దొంగసారా తరలి వస్తున్నది. కారుచౌకగా లభించే గుడంబా,నాటుసారా వ్యాపారం తెలుగురాష్ట్రాల్లో మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతున్నది. ఈ నాటుసారా,గుడంబా తయారీ కుటీర పరిశ్రమగా తయారైపోయింది. అప్పుడప్పుడు రికార్డుల కోసం దాడులు చేసిసారా బట్టీలను పగులగొట్టి కేసులుపెడుతున్నా దాడులన్నా,ఎక్సైజ్ అధికారులన్నా ఈ అక్రమసారా వ్యాపారుల్లో భయభక్తులు లేకుండాపోయాయి. అందుకేవారు పదిబట్టీలు పగులగొడితే ఇరవై పుట్టుకొస్తున్నాయి. ఈ అక్రమసారా వ్యాపారాన్ని ఎలాగో నియంత్రించలేమని కొందరు మద్యం వ్యాపారులు మద్యంపేరుతో చీప్‌లిక్కర్ తయారు చేసి నాటుసారా తాగేవారిని తమవైపు తిప్పుకొంటున్నారు. చీప్‌లిక్కర్‌అంటే రంగుకలిపి నాటుసారా. రెక్టిఫైడ్ స్పిరిట్‌లో నీళ్లు కలిపి రంగుపొడి చల్లి సీసాల్లో నింపితే చీప్‌లిక్కర్ అంటున్నారు. తగిన పరిణామంలో నీరు కలవకపోయినా, వాడే రంగులు కాలం చెల్లిపోయినా ఖాళీ సీసాలను సరిగ్గా శుభ్రంచేయకపోయినా కలుషిత నీరు కలిపినా చీప్ లిక్కర్ కాస్త విషతుల్యంగా మారుతున్నది. దీనికితోడు తాగినవెంటనే కిక్ బాగా రావాలని కొందరు వ్యాపారులు రసాయనికాలు కలుపుతున్నారు. చీప్‌లిక్కర్ అమ్మకాలే అగ్రస్థానంలో ఉన్నాయి. ఇది తాగిలక్షలాది మంది నిరుపేదలు ఆస్పత్రిపాలవుతున్నారు. అక్కడక్కడతాగగానే కొందరు ప్రాణాలుగాలిలో కలిసిపోతున్నాయి. మరికొందరు కృంగికృశించి మంచానికే పరిమితమై లేవలేని స్థితిలో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంకొందరు ప్రాణాంతక వ్యాధుల బారినపడుతున్నారు. ఇదంతా ఎక్సైజ్ అధికారులకు తెలియంది కాదు. ఒకనాడు ఎక్సైజ్‌శాఖ అధికారులుఅంటే గడగడలాడే ఈ వ్యాపారులు వారిని పట్టించుకునే పరిస్థితిలో కూడా లేరు. గతంలో ఒకసారి పోలీసుఅధికారులు జరిపిన దాడిలోనే ఏపోలీసు స్టేషన్‌కు ఎంత మామూలు ఇస్తున్నారో? ఎక్సైజ్ అధికారులకు మరెంత దక్షిణలు చెల్లిస్తున్నారో? బయటపడింది. కేసులు నమోదు చేసి కొందరిని అరెస్టు కూడా చేశారు. ఆ తర్వాత ఏమైందోఏమోకాని ఆ కేసులకు సంబంధించి వివరాలు నేటికీ వెలుగుచూడలేదు. మరోకపక్క మద్యంవల్ల ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఒకటి రెండు కాదు. వేలసంఖ్యలో ఏటా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మరెంతోమంది వికలాంగులవుతున్నారు. ఇక నేరాలగూర్చి చెప్పక్కర్లేదు. మహిళలపై జరుగుతున్న నేరాల్లో అధికశాతం మద్యం మత్తులోఉండి చేసినవవేనని రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఇన్ని అనర్థాలకు మూలమైన ఈ మద్యాన్ని పాలకులు వదిలిపెట్టే పరిస్థితిలో లేరు. కేవలం ఆదాయం కోల్పోయే స్తోమత ప్రభుత్వానికి లేదని పెద్దలు చెబుతున్నారు. ఈ ఒక్క కారణంగానే బార్లు, షాపులు పెంచి ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. కానీ ఒక్క విషయం విస్మరిస్తున్నారు. జూదం,వ్యభిచారం,మత్తుపదార్థాల వ్యాపారం, లాటరీ వంటివి ప్రభుత్వాదాయ వనరులుకాదని రాజ్యాంగంలోని 47వ నిబంధన స్పష్టంచేస్తున్నది. ఈ నిబంధనను కొట్టివేయించేందుకు కొందరు మద్యం వ్యాపారులు 1978లో సుప్రీం కోర్టులో కేసువేసి ప్రయత్నంచేశారు. కానీవారి వాదనతో ఏకీభవించనిసుప్రీం మద్యనిషేధాన్ని సమర్థిస్తూతీర్పు ఇచ్చింది. అటురాజ్యాంగాన్ని కానీ,ఇటు న్యాయస్థానాల ఆదేశాలను కానీగౌరవించకుండా,పాటించకుండామద్యంఆదాయమే పరమార్థంగా పాలకులు వ్యవహరించడం దురదృష్టకరం. ●

నారీ శక్తి కుటుంబాన్ని, సమాజాన్ని ఏకం చేస్తుంది. వైదికకాలం నుంచీ ఇది నిరూపితమైంది. మహిళలే మనకు స్ఫూర్తి. దేశానికి కొత్త వెలుగులు తెచ్చేదీ వారే.



నరేంద్రమోడీ
ప్రధాన మంత్రి

రాజ్యాంగం ప్రధాన ఉద్దేశ్యం సమానత్వం. సమాజంలో వ్యక్తిపరమైన నిర్ణయాలు క్షేమకరం కాదు. ప్రజాస్వామ్య దేశంశంలో సమష్టి నిర్ణయం శిరోధార్యం.



జస్టిస్ జాస్తి చలమేశ్వర్
సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ప్రజావాక్కు



గ్రూప్-2 రద్దయిందా లేదా?

2016 నవంబరులో టి.ఎస్.పి.ఎస్.టి రాత పరీక్షలు నిర్వహించారు. అయితే కొన్ని పరీక్షా కేంద్రాలలో అక్రమాలు జరిగాయని పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. జవాబు పత్రాలలో వైట్‌నర్ వాడినట్లు తేలింది. ఒకే సెంటర్‌లో రాసిన అభ్యర్థుల్లో చాలా మంది ఇంటర్వ్యూకు ఎంపిక అయ్యారు. అవకతవకలు జరిగాయన్న విషయం వెల్లడికావడంతో ఈ పరీక్ష రద్దుకు సంబంధించి ప్రభుత్వంవెంటనే నిర్ణయం తీసుకుంటుందన్న వార్తలు వెలువడ్డాయి. నెలలు గడిచిపోయాయిగానీ నేటి వరకు ప్రభుత్వం ఏప్రకటనా జారీచేయలేదు. ఇంతకూ ఆ పరీక్షా రద్దయిందా లేదా? ఒకవేళ పరీక్షరద్దు కానట్లయితే ఇంటర్వ్యూ లు నిర్వహించడానికి ఎందుకీ జాప్యం? ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. నిరుద్యోగులతో ఆటలాడొద్దు.

-జి. అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

పెన్షనర్లను పట్టించుకోండి

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పే రివిజన్ బేసిక్‌ను ఉద్యోగుల తోపాటు అటు రిటైర్డ్ పెన్షనర్‌లకు వర్తింపచేస్తారు. కానీ ప్రతి బైపార్టయిట్ సెటిల్‌మెంట్ బేసిక్‌ను బ్యాంకు ఉద్యోగులకే వర్తింపచేస్తారు. పెన్షనర్లను పక్కకు పెడతారు. దీనివలన రిటైర్ అయినప్పుడు ఎక్కడ బేసిక్ ఫిక్స్ చేస్తారో అది నేటికీ మారదు. కేవలం ప్రతిఆరు నెలలకు అంటే ఫిబ్రవరి, ఆగస్టులో వర్కింగ్ క్లాస్ ఇండెక్స్ ప్రకారం కరవుభత్యం పెరిగితే పెంచుతారు. తగ్గితే తగ్గిస్తారు. దీనివలన సుమారు 15 సంవత్సరాల క్రితం రిటైర్ అయిన బ్రాంచ్ మేనేజర్ పెన్షన్ నిన్నమొన్న రిటైరైన సబ్‌స్టాఫ్ కంటే తక్కువగా వస్తోంది. ఇందుకు ఆర్థిక మంత్రి ఇతర పెద్దలు జోక్యం చేసుకొని పెన్షనర్లను ఆదుకోవాలి.

-సి.వి.ఆర్.కృష్ణ, హైదరాబాద్

ధరలను తగ్గించాలి

దీర్ఘకాలంగా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల మధ్య తరగతి వారికి గుండెదడ పుట్టిస్తుంటే నిరుపేదలు బతుకుల మీద ఆశలు వదులుకోవలసి వస్తోంది. ఒక్కసారి పెరిగిన ధరలను ఎక్కువ ఆదాయంగల వర్గాల వారే తట్టుకోలేకపోతున్నారు. నిత్యావసరవస్తువులేవీ అందుబాటులో లేవు. బియ్యం,నూనెలు,ఉల్లిపాయలు,కూరగాయలు,పప్పులు,కాస్మోటిక్స్,తదితర వస్తువుల ధరలు కొన్నేళ్ల క్రితంతో పోల్చుకుంటే దాదాపు రెట్టింపు అయ్యాయి.

-కె.రాధాకృష్ణ, నల్గొండ

రాంగ్‌రూట్ డ్రైవింగ్స్

జాతీయ రహదారులపై రాంగ్‌రూట్ డ్రైవింగ్స్ ఎక్కువవుతున్నాయి. హైదరాబాద్‌లో పోలీసుల నిఘా ఉన్నా యధేచ్ఛగా రాంగ్‌రూట్ డ్రైవింగ్స్ జరుగుతున్నాయి. ఊళ్ల వెలుపల కూడా భారీ వాహనాలు ముఖ్యంగా ట్రాక్టర్లు రాంగ్‌రూట్లలో నడుస్తున్నాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఎందరో మరణిస్తున్నారు. కాబట్టి రాంగ్‌రూట్ డ్రైవింగ్స్‌ను అరికట్టాలి. రాంగ్‌రూట్లలో ప్రయాణించే డ్రైవర్లకు కఠిన శిక్షలు భారీ జరిమానాలు విధించాలి.

-సరికొండ శ్రీనివాసరాజు, వనస్థలిపురం

విద్యావ్యవస్థలో మార్పులు అవసరం

శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానం శరవేగంతో అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకురావల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. బట్టీ విధానానికి స్వస్తి పలికి విద్యార్థులు స్వంతంగా ఆలోచించగలిగి జవాబు రాసే పరీక్షా విధానంరావాలి. పాఠ్యాంశాలకు ఆచరణాత్మక అనువర్తనం అనుసంధానం కావాలి. పేజీల కొద్దీ జవాబులు, వ్యాసాలు బట్టీ పట్టి రాయడం వలన ఎలాంటి ప్రయోజనం సిద్ధించదు.

-ఎం.కనకదుర్గ, తెనాలి, గుంటూరుజిల్లా

వ్యాయామం తప్పనిసరి

రోజురోజుకీ చిన్నపిల్లలనుండి వృద్ధులవరకు మహిళలకు రక్షణ లేకుండాపోతుంది. బయటికి వెళ్లిన స్త్రీ ఇంటికి వచ్చే దాకా గ్యారంటీ లేదు. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, ప్రేమపేరుతోదాడులూ ఎక్కువైనాయి. ఈ నేపథ్యంలో బాలికలకు,మహిళలకు తమను తాము రక్షించేందుకునేందుకు కరాటే, యోగా వంటి విద్యలు ఉచితంగా ప్రభుత్వం నేర్పాలి.

-ఎస్.శ్రీనివాస్, హైదరాబాద్

పర్యాటకరంగాన్ని అభివృద్ధిచేయాలి

పర్యాటకశాఖ అధికారులు మొద్దునిద్రలో ఉన్నారని చెప్పకతప్పదు. చాలాప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో వీరునిర్లక్ష్యం వహిస్తున్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుంది. పర్యాటక ప్రదేశాలుగా ఎన్నికైన ప్రాంతాలలో పర్యాటకుల కోసం అన్ని వసతులు కల్పించాలి. ప్రజలను పర్యాటక ప్రదేశాలవైపు ఆకర్షించే విధంగా ప్రయత్నాలు కొనసాగాలి.

-షేక్ అస్లాం షరీఫ్, జోగులాంబ, గద్వాల జిల్లా

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

వాస్తవాలకు విరుద్ధమైన అధికార వైఖరి



ప్రొ॥ లక్ష్మణ్ గడ్డం
పొరవాక్కుల సంఘం అధ్యక్షుడు

కష్టం చేసేటోడుపోయే, డ్యూటీకెళ్తున్నానని చెప్పిండు,తిరిగి రాని లోకానికి వెళ్లిండు. పిల్లలు చిన్నోళ్లు. తల్లిదండ్రులు ముసలోళ్లు నేనెట్ల బతికించాలని సాయిలుభార్య సాయమ్మ కంటికి పుట్టెడు ఏడుస్తున్నది. ప్రభుత్వ పనుల్లో చనిపోయిన సాయిలు ప్రభుత్వానికి పట్టని వ్యక్తి అయిండు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కారేగావ్ గ్రామానికి చెందిన బోయిన సాయిలు (35) విఆర్‌యే విధులు నిర్వర్తిస్తూ 3,జనవరి 2018న ఇసుక ట్రాక్టర్లు ఢీ కొట్టడంతో చనిపోయాడు. భార్యాపిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం సాయిలు మావుద్యోగి కాదంటూ బాధ్యతల నుండి తప్పించు కుంటుంది. కాని పిట్లం మండలం ప్రజలకు మాత్రం సాయిలు విఆర్‌యేగానే తెలుసు.

తెలంగాణలో విఆర్‌యేలను కాందార్, సుంకరి, మస్కూరి, నీరుడి, కావాలి కార్‌లని ఒక్కోచోట ఒక్కో పేరుతోపిలుస్తారు. ఈ విధులు అధికంగా దళిత, వెనుకబడిన తరగతి కుటుంబాలు మాత్రమే నిర్వర్తిస్తారు. ముదిరాజ్ కులానికి చెందిన బోయిన సాయిలు జూన్ 2017 నుండి పక్క గ్రామమైన మార్దాండ్‌లో డ్యూటీ చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు సోనిపెల్లి అయింది. చిన్న కూతురు లావణ్య 8వ తరగతి, కొడుకు విఠల్ 6వతరగతి చదువుతున్నారు. ఇది వీరికి వంశపారంపర్యంగా సంక్రమిస్తున్న ప్రభుత్వబాధ్యత. కారేగావ్‌లో మొత్తం 30 ముదిరాజ్ కుటుంబాలున్నాయి. ఏళ్ల తరబడి ఈ కుటుంబాలే ఒకరి తర్వాత ఒకరు వంతుల వారిగా ఈకాందార్ విధులు నిర్వహిస్తున్నారు. అయితే కుటుంబాలు పెరిగిపోవడంతో ఒక అవగాహనకు వచ్చిన ఈ కుటుంబాలన్నీ కలిసి 1992లో రూ. 25,100లకు బోయిన విఠల్‌కు అమ్మేశారు. ఈ మేరకు బాండుపేపరు రాసుకున్నారు. విఠల్‌అనంతరం ఆయన కుమారులైన శివయ్య, నారాయణ వంతుల వారిగా కాందార్ పనులు నిర్వహిస్తున్నారు. అయితే అధికారికంగా మాత్రం నారాయణ పేరు మీద ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. శివయ్య నారాయణ నిరక్షరాస్యులు కనుక వారికుమారులను డ్యూటీలోకి పంపమని ప్రభుత్వ అధికారులు సూచించారు. కనుక నారాయణ కొడుకు సంతోష్ శివయ్య కొడుకుసాయిలు వంతుల వారీగా డ్యూటీ చేస్తున్నారు. జూన్ 2017 వరకు సంతోష్ విధిని ఆ తర్వాతి నుంచి చనిపోయేంతవరకు సాయిలు నిర్వర్తించాడు. సాయిలు 10వ తరగతి వరకు చదువుకున్నాడు. సాయిలుకు ప్రతి బుధవారం ప్రత్యేక డ్యూటీ పడుతుంది. మండల కేంద్రమైన పిట్లంలోని మం డల రెవెన్యూ కార్యాలయంలో రాత్రిపూట కాపలా డ్యూటీ చేయాలి. ఆ రోజు మూడు జనవరి 2018న మార్దాండ గ్రామంలో మధ్యాహ్నం వరకు గ్రామసభ పనులు ముగించుకుని తర్వాత పిట్లంలోని విఆర్‌వో శ్రీనివాస్ దగ్గర పనులు చేసిండు. సాయంత్రం ఆరు వర కు భూమి సర్వేకు సంబంధించి ఫైళ్లన్ని మోసింది. ఈ పనులన్ని ముగిసిన తర్వాత సాయంత్రం 6.30కు కారేగావ్‌లో తన ఇంటికి చేరుకున్నాడు. భోజనం చేశాక తిరిగి ఏడున్నర ఎనిమిదిగంటలకు డ్యూటీ కెళుతున్నానని భార్యకు చెప్పి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం9గంటలకు వస్తానన్నాడు. సాయిలు నేరుగా పిట్లం వెళ్లకుండా మార్దాండు మీదుగా వెళ్లాలన్నాడు. మార్దాండులో సర్పంచ్‌ను కలిసి వెళ్లాలనుకున్నాడు. అనుకోకుండా తన మోపెడ్ పంక్చర్ అయి వుండడంతో కాలినడకన బయలుదేరాడు. శివారులోని కాకి వాగు దాటి దాదాపుగా 100 మీటర్ల దూరంలో ఇసుక ట్రాక్టరు ఢీ కొట్టడంతో శవమై పడిపోయాడు. ట్రాక్టరు టైర్లు తలమీదుగా ఎక్కడంతో సాయిలు అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. కాకివాగు నిజానికి పెద్ద ఇసుక రీచ్ కాని మాట ఎంత వాస్తవమో ఇక్కడి నుంచి ఇసుక రవాణా జరుగుతుందనే మాట కూడా అంతే వాస్తవం. ఈ ఘటన జరిగిన వారంరోజుల ముందు కుర్మదుర్గయ్య, మేతరి హన్నాండ్ల ట్రాక్టర్లను ఇసుక అక్రమ రవాణా నేరం కింద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన విచారణలో భాగంగా ఈ ఇద్దరిని పిలిపించి కూడా పోలీసులు ప్రశ్నించారు. కనుక ఆ రోజు కారేగావ్ గ్రామానికి చెందిన ఎర్రదుర్గయ్య ట్రాక్టరు డ్రైవరు ఎర్ర అంబయ్య ట్రాక్టర్‌పైఇసుక తరలించిన మాట వాస్తవం. ప్రతిరోజు రాత్రిపూట వీరు ఇదే పనిచేస్తారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత ఇసుకని తీసుకొని తడ్కల్, సిర్నాపూర్, నారాయణఖేడ్, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తారు. అయితే దీనికి ఏ అనుమతులు లేవు. దొంగతనంగా ట్రాక్టర్ లైట్లు కూడా వేసుకో కుండా తరలించడం నిత్యం జరిగేపని. ఆ రోజు కూడా లైట్లు వేసు కోకుండా హడావుడిగా నడుపుతున్న క్రమంలోసాయిలు కనబడ్డాడు. విషయం బయటికి పొక్కుతుందనే భయంతో ఢీ కొట్టడంతో సాయిలు మరణించాడు. సాయిలు మద్యం సేవించి రహదారిపై పడుకుని వుండడంతో జరిగిందనడం వాస్తవం కాదు.

నీలిరంగు ప్యాంటు, తెల్లని షర్టు వేసుకుని, షర్టుకు ప్రభుత్వం ఇచ్చిన బ్యాడ్జు పెట్టుకుని శాలువ మెడలో వేసుకున్న సాయిలు పిట్లం ఎంఆర్‌ఒ కార్యాలయంలో సెక్యూరిటీ గార్డు డ్యూటీ చేయడానికి బయలుదేరాడు. ఏ వ్యక్తికైనా కొరికే చలిలో బహిరంగంగా బాటలో,పైగా ట్రాక్టర టైర్ల దిశలో తలబెట్టి పడుకోవడం సాధ్యమేనా? ఎంతటి మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అయినా వెచ్చటి ప్రదేశం చూసుకుని పడుకుంటాడు కదా! భారత సైనికునికి బ్యాడ్జ్ వున్నట్టుగానే సాయిలు ఎదలో తెల్లటి షర్టుపై బ్యాడ్జ్ చెక్కు చెదరకుండానే వుంది. 'అతను విఆర్‌యే కాదు, అసలు ప్రభుత్వ ఉద్యోగి కాదు. ట్రాక్టర్‌తో గుద్దించి చంపించింది వాస్తవం కాదు' అని గవర్నర్ నరసింహన్ అంటారు. 'జిల్లా కలెక్టర్‌కు ఫోను చేసి వాస్తవాలు తెలుసుకున్నా, ఆ ఘటనలో చనిపోయిన సాయిలు విఆర్‌యే కాదు అని మంత్రి కెటిఆర్ అంటారు. జిల్లా కలెక్టరు కూడా అదే మాటంటారు. కాని సంబంధిత విఆర్‌వో గదా సాయిలు విఆర్‌యే నా కాదా అని తెల్చాల్సింది. సాంకేతికంగా సాయిలు పేరున ఆర్డర్ లేని మాట వాస్తవమే కాని ఆ డ్యూటీ 8 నెలలుగా చేస్తున్నది మరింత వాస్తవం.ఆ మాటకొస్తే ఆర్డర్ వున్న నారాయణ ఆ డ్యూటీ చేసింది. ఎన్నడూ లేదు. చేసిందల్లా వంతుల వారిగా సంతోష్, సాయిలే గదా! వీరు చేస్తేనే కదా కిందిస్థాయి పనులు సజావుగా సాగినవి. రోజూ రిజిష్టర్‌లో సాయిలు సంతకాల ఎదురుగా ధృవీకరిస్తూ ఎం.ఆర్.వో లేదా వి.ఆర్.వో సంతకాల సాక్ష్యం వుంది కదా. ఇన్ని రోజులుపని చేయించుకుని చనిపోయిన వెంటనే ఆయనెవరో మాకు తెలియదనడం అన్యాయం.అమానవీయం కదా! పిట్లం మండలంలోనే ఇంకా 70మంది ఇలాంటి నిరాదరణ వ్యవస్థలో పనిచేస్తున్నారు. రేపు వీరి గతి ఇంతేనా? ప్రభుత్వమంటే మనుషులే గదా మరి వారికి మానవత్వం ఉండదా. అనాధలుగా మారిన పిల్లల ఎడల కనీస బాధ్యత ఉండదా? గవర్నర్ దగ్గర్నుంచి ఎస్సీవరకు అసలు సాయిలు కాందార్ కాదని చెప్పడంలో, ఆయనను ఢీకొట్టింది ఇసుక లారీకాదని చెప్పడంలో చూసిన ఆసక్తత కనీసం చనిపోయిన వ్యక్తి కుటుంబీకులను పరామర్శించడంలో వ్యక్తపరచలేదు. ప్రభుత్వంకనీసం దహన సంస్కారాలకు కూడా డబ్బులు ఇవ్వలేదు. రాష్ట్రంలో ఇసుక మాఫియా మారణకాండ కొనసాగుతుందంటే ప్రభుత్వం ఎందుకంత ఉలిక్కిపడుతుంది. గత జూలైలో సిరిసిల్ల జిల్లా తంగళ్ల పల్లి మండలం నేరెళ్లలో బదనాపురం భూమయ్యను అక్రమరవాణా చేస్తున్న ఇసుక లారీ గుద్దిచంపింది. అంతకు ముందే ఇక్కడ మరో ఐదుగురు చనిపోయారు. ఆగస్టు 2న గన్నెవారి పల్లెకు చెందిన గన్నె శంకరయ్యను పోతుగల్ గ్రామం దగ్గర వేగంగా వస్తున్న ఇసుక లారీఢీ కొట్టి చంపేసింది. ఈ నేరం వెంటాడుతుంది కనుక ఉన్నతస్థాయి యంత్రాంగమంత రంగంలోకి దిగి భుజాలు తడుము కునే ప్రయత్నం చేశారు. ఇలాంటి వైరుధ్యాలు ఏర్పడినప్పుడు ప్రభుత్వాలు తప్పుకునే ప్రయత్నం చేయడం కాకుండా మానవీయంగా పరిష్కరించే ప్రయత్నాలు చేయాలి. సాయిలు విధి నిర్వహణలో భాగంగానే చనిపోయాడు. ప్రతిబుధవారం ఎంఆర్‌వో ఆఫీసు రాత్రి కాపలా డ్యూటీ సంబంధిత ఎంఆర్‌వోనే నిర్దేశించాడు. ఈ డ్యూటీలో ఆరోజు సాయిలుతోబాటు కిష్టాపూర్ బాలరాజుకు, బుర్నిపూర్ హన్మాండ్లుకు పోతిరెడ్డిపల్లి అంజయ్యకు రాత్రి కాపలా డ్యూటీ వేసింది. పిట్లం ఎంఆర్‌వోనే. అటెండెన్స్ రిజిష్టరులో సాయిలు సంతకాలను ఎంఆర్‌వో ధృవీకరించాడు కనుక సాయిలును విఆర్‌యేగా గుర్తించాలి. పైగా ప్రజలందరు సాయిలును కాందార్‌గా గుర్తిస్తారంటే ఆ డ్యూటీ చేస్తేనే గదా.సాయిలుకు జరిగిన అన్యాయం పునరావృతం కాకూడదంటే ఎవరు డ్యూటీలో చేరితే వారి పేరున నిర్దిష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలి. ఒకరితో పనిచే యించుకుని వేరొకరి పేరున జీతం జమ చేసే వ్యవస్థకు స్వస్తిపలకాలి. రాష్ట్రంలో సాయిలు లాగ ఎంత మంది విఆర్‌యేలు పనిచేస్తున్నారో గుర్తించి వారి పేరున నిర్దిష్ట సమయానికి ఉత్తర్వులు జారీ చేసి ఆర్డర్లు లేని విఆర్‌యేలను రక్షించాలి. సాయిలు కుటుంబానికి 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబాన్ని ఆదుకోవాలి. సాయిలు భార్య సాయమ్మకు ఉద్యోగం కల్పించి, పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యనందించాలి. రాష్ట్రంలో ఇసుక మాఫియాను అరికడితే తప్ప ఈ మరణకాండ ఆగదు. ●


జాతిపిత అడుగు జాడల్లో పయనిద్దాం



తండప్రభాకర్ గౌడ్

అందరికన్నాఅతిబీద వాళ్లు సైతం ఈ దేశం తమ దేశమని భావించాలి. దేశ నిర్మాణంలో వాళ్లవాణి కూడా వినపడాలి. పై తరగతి,కింది తరగతి ప్రజలు అనే భేదం ఉండరాదు. అన్ని కులాల, మతాల వారు పరిపూర్ణ సామరస్యంతో జీవించాలి. ఇవన్నీ ఉండే భారతదేశం కోసం నేను కృషి చేస్తాను. అలాంటి భారతదేశంలో అస్పృశ్యతకు తావులేదు. పురుషులకుండే హక్కుల్ని స్త్రీలు కూడా అనుభవిస్తారు. ఇది నేను కలలుకనే భారతదేశం' అన్నారు గాంధీజీ. 20వ శతాబ్దంలో జీవించిన గొప్ప శాంతి,అహింసా మూర్తుల్లో గాంధీజి అగ్రగణ్యులు. రక్తమాంసాలతో ఇటువంటి వ్యక్తి భూమ్మీద జీవించారంటే రాబోయే తరాలవారు ఆశ్చర్యపోతారని 'ఐన్‌స్టీన్' కొనియాడారు. గాంధీజీ అనుసరించిన పద్ధతులేవైనా ఆయన అవలంభించిన సత్యాగ్రహ పోరాటం గ్రామీణ ప్రజలు, కార్మికులు, బీద ప్రజలతో ఆయన్ని సన్నిహితున్ని చేసింది. బ్రిటిషు వారు మన దేశంలో మనను శాసించలేరని ఆయన నిరూపించారు. ఆయన గ్రామీణ ప్రజలతో, వారి వేష భాషలతో తాదాత్మ్యం చెంది వారి జీవన సరళిని తాను అవలంబించి వారికి అర్థమయ్యే భాషలో మాట్లాడారు. హిందూముస్లిం ఐక్యత, అస్పృశ్యత నివారణ, మహిళల సాంఘికస్థితి ఉద్ధరణకోసం పాటుపడితే తప్పదేశానికి విముక్తి లేదని ఆయన భావించారు. భారతీయులు తమ కాళ్లపై తాము నిలబడి ఆత్మగౌరవంతో స్వేచ్ఛాస్వాతంత్ర్యం పొందడానికి పోరాడేలా వారిలో చైతన్యాన్ని రగిల్చడంలో విజయవంతమయ్యారు.

అక్టోబర్ 2,1869లో పశ్చిమతీరంలోని గుజరాత్ కథియావాడ్ సంస్థానంలో గల చిన్నపట్టణమైన పోరుబందర్‌లో మధ్యతరగతి వైశ్యకుటుంబంలో గాంధీజీ జన్మించారు. ఆయన పూర్తి పేరు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ. హిందూ మోద్ బనియా కుటుంబానికి చెందిన కరంచంద్ గాంధీ, ప్రాణమి వైష్ణవ కుటుంబానికి చెందిన పుత్లీభాయి (కరంచంద్‌కు 4వ భార్య) గాంధీ తల్లిదండ్రులు. గాంధీకి 1 సోదరుడు, 1 సోదరి ఉన్నారు. తల్లి నడవడిక, భక్తి ప్రపత్తులు ఆయనపై ప్రభావం చూపాయి. గాంధీ తాత ఔతాచంద్‌గాంధీ పోరుబందర్ దీవాన్‌గా పనిచేసి మరణించాక వారసత్వంగా తండ్రికి ఆ పదవి వచ్చింది. చిన్నతనంలో గాంధీ చూసిన శ్రావణకుమారుని కథ, సత్యహరిశ్చంద్రుని కథ ఆయన వ్యక్తిత్వంపై ప్రభావం చూపాయి. 1883లో 13 సంవత్సరాల వయసులో 14 సంవత్సరాల కస్తూరిభాయి మఖంజీ కపాడియాతో గాంధీ వివాహం జరిగింది. వివాహం వల్ల ఒక సంవత్సరం చదువు వృధా అయింది. వీరికి హరిలాల్ (1888) మణిలాల్ (1892)రాందాస్ (1897) దేవ్‌దాస్(1900)జన్మించారు. 1887లో బావ్‌నగర్‌లోని సామల్‌దాస్ కాలేజీ నుండి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడయ్యాక 1888లో బారిస్టర్ (లా) కోసం లండన్ వెళ్లారు.లండన్‌లో మద్యం, మగువ, మాంసం ముట్టనని తల్లివద్ద, జైన సన్యాసివద్ద ప్రమాణం చేశారు. లండన్‌లోని 'శకాహార సంఘానికి' కార్యవర్గ సభ్యునిగా ఎంపికయ్యారు. 1891లో గాంధీలండన్‌లో ఉండగా తల్లి మరణించింది.1892లో ఇండియాకు వచ్చిన గాంధీ బొంబాయిలో 'లా' ప్రాక్టీసు పెట్టి నిందితులను ప్రశ్నించడంలో విఫలమయ్యాడు. అబ్దుల్లా సేఠ్ అనే వ్యాపారి కేసును వాదించడానికి 1893లో దక్షిణాఫ్రికా వెళ్లారు. వాదోపవాదాల సమయంలో తలపాగ తీయమన్న 'జడ్జీ' ఆదేశంతో నిరసిస్తూ బయటకువచ్చారు. పీటర్ మారిట్‌బర్గ్ రైల్వేస్టేషన్‌లో ఫస్ట్ క్లాస్ టికెట్‌ఉన్నప్పటికీ 'రైలు' నుండి బయట గెంటివేయబడ్డాడు. అక్కడి శ్వేతజాతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నల్లవారి హక్కుల కోసం 1906, 1908 అహింసాయుత సత్యాగ్రహం చేశారు. 1913లో న్యూకాజిల్ నుండి నాటాల్‌కు సత్యాగ్రహయాత్ర చేశారు.



1900 సంవత్సరంలో 'బోయెర్' యుద్ధంలో 1100 సైనికుల దళాన్ని నిర్మించి బ్రిటిషు వారికి యుద్ధంలో సహకరించారు. మొత్తంగా 21 సం॥ దక్షిణాఫ్రికాలో గడిపిన గాంధీ 1915 లో బొంబాయికి తిరిగి వచ్చినప్పుడు ఘనస్వాగతం లభించింది.

తన రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలే సలహా మేరకు 1915లో మూడవ తరగతి రైలులో దేశ పర్యటన ప్రారంభించారు గాంధీ. 1915 'మే'లో అహ్మదాబాద్ దగ్గర 'కొచ్రాబ్'లో ఆశ్రమం నిర్మించి 1917లో సబర్మతీ నది ఒడ్డుకు మార్చారు. హరిజనులకు ప్రవేశం గల ఆశ్రమంలో సభ్యులందరూ సత్యం, అహింస, బ్రహ్మచర్యం, జిహ్వాను అదుపులో ఉంచుకోవడం దొంగతనం చేయకుండా ఉండడం అనే నియమాలను పాటించాలి. వీటికి స్వదేశీ, నిర్భీతిలను తర్వాత చేర్చారు. 1915 జూన్ 3న బ్రిటన్ చక్రవర్తి జన్మదినం సందర్భంగా గాంధీజీకి 'కైజర్-ఇ- హింద్' అనే బిరుదు ప్రదానం చేశారు. 1915 నుండి గాంధీజీ కాంగ్రెస్ సమావేశాలలో పాల్గొనడం ప్రారంభించారు. ఆయన సాధారణ జీవితం వస్త్రధారణ,ఆహార పానీయాలు, ముక్కుసూటిగా మాట్లాడే పద్ధతి చాలామందికి నచ్చలేదు.1916లో బెనారస్ హిందూ వర్సిటీ శంకుస్థాపనకు నిండా నగలతో వచ్చిన సంస్థానాధీశులను గాంధీ విమర్శించి మాట్లాడుతుంటే రెండు,మూడుసార్లు అనిబీసెంట్ కూర్చోమని గాంధీని ఆదేశించారు.

1915 నుండి 1948 వరకు 33 సంవత్సరాలు నిరాహారదీక్షలు, సత్యాగ్రహపోరాటాలతో ఆయన గడిపారు. 1915లో పోరుబందర్ ప్రజల సుంకాల రద్దు, 1917 చంపారన్ సత్యాగ్రహం, 1918 ఖెడా సత్యాగ్రహం, 1918-అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సమ్మె, 1919 ఖిలాపత్ ఉద్యమం, 1920-22 సహాయ నిరాకరణ ఉద్యమం, 1930-34ఉప్పు సత్యాగ్రహం, 1942 క్విట్ఇండియా ఉద్యమం గాంధీ చేసిన ప్రముఖ స్వాతంత్ర్య ఉద్యమాలు. 1945లో బ్రిటన్ ప్రధాని 'తిట్లీ' పంపిన కేబినెట్ మిషన్ ప్లాన్ ప్రకారం ఆగస్టు 12, 1946న నెహ్రూ 'తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధానిగా వైస్రాయి ఆహ్వానించగా'జిన్నా' మారణహోమం ప్రారంభించారు. గాంధీజీ నౌకాలీ(బీహార్),కలకత్తాలో కాలినడకన గ్రామాలు పర్యటించి హిందూ-ముస్లిం' ఐక్యతకు కృషి చేశారు. 'మీరు మళ్లీ పిచ్చివాళ్లైతే మొదట నన్ను చంపండి' అని ఆయన అన్నారు. ఆగస్టు 15,1947 స్వాతంత్ర్య దినోత్సవం నాడు గాంధీ కలకత్తాలో 'ఉపవాస' దీక్ష చేశారు. జనవరి 21, 1948న ప్రార్థన చేస్తున్న గాంధీజీకి దగ్గరల్లో బాంబు పడినా కనీసం ఆయన లేవలేదు. సరిగ్గా 10 రోజుల తర్వాత నాదూరాం గాడ్సే అనే పూనాకు చెందిన హిందూ యువకుడు మందిని తోసుకుంటూ వచ్చి ఆటోమెటిక్‌పిస్టల్‌తో గుండెలో మూడు బుల్లెట్లు పేల్చాడు. 'హేరామ్' అంటూ గాంధీ నేలకు వాలిపోయారు. మనిషి ప్రేమకు తపించిన ఆయన 'గుండె' జనవరి 30, 1948న 79 సంవత్సరాల వయసులో ఆగిపోయింది. 19,20 శతాబ్దాలలో దేశంలో ఎంతో మంది భారతీయులు సాంఘిక చైతన్యానికి కృషి చేసినా, కోట్లాది బీద ప్రజల గొంతులకు మాట్లాడే అవకాశం కల్పించి వారితో జాతీయోద్యమాన్ని నిర్మించి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపచేసినందున గాంధీజీని మనం 'జాతిపిత' అంటున్నాం. ఆయన గొప్ప రాజకీయ నాయకుడు. జాతి నిర్మాత. జాతి, మతం, కులం, లింగ బేధం లేకుండా సర్వమానవాళి శ్రేయస్సు కోసం ఆయన పాటు పడ్డారు. జీవితాంతం రచనలుచేశారు. యంగ్‌ఇండియా, నవజీవన్, ఇండియన్ ఓపీనియన్,హరిజన్ పత్రికలు నిర్వహించారు. హింద్ స్వరాజ్, ద స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్, దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం ఆయన రచనలు. 1960లో భారత ప్రభుత్వం ఆయన మొత్తం రచనలను 'ద కలెక్టెడ్ వర్క్ బై ఎం.కె. గాంధీ'పేరుతో యాభైవేల పేజీలతో 100 వాల్యూమ్స్‌గా ముద్రించింది. న్యూయార్క్, సావోపాలలో ఆయన విగ్రహాలు పెట్టారు. హ్యూస్టన్‌లో గాంధీజిల్లా ఉంది. అనేక దేశాల్లో వేలాదిరోడ్లు ఆయన పేరుపై ఉన్నాయి. ప్రఖ్యాత టైం మేగజైన్ మండేలా, లూథర్ కింగ్, సూకీ, తదితరులను గాంధీ పిల్లలుగా వర్ణించింది. ●

భారత్‌లో ఉద్యోగ సమస్య పెద్దసవాలు

కె.అమర్

వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగాల కల్పనలో వైఫల్యంపై రానురాను తీవ్రమవుతున్న విమర్శలకు సమాధానాలు చెప్పడం 2018లో ప్రభుత్వానికి పెద్ద సవాలు. ఉద్యోగాల భవిష్యత్తుపై అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ)వార్షిక నివేదికలో 2018, 2019లో నిరుద్యోగం 3.5 శాతం స్థాయికి ఉండగలదని పేర్కొంది. అంటే 0.6 మిలియన్ నిరుద్యోగులుగా ఉంటారు. ఐఎల్‌ఒ వరల్డ్‌ఎంప్లాయిమెంట్ అండ్ సోషల్ అవుట్‌లుక్ ట్రెండ్స్ 2018 నివేదిక ప్రకారం భారతదేశంలో నిరుద్యోగుల సంఖ్య 2017లో 18.3 మిలియన్ ఉండగా, 2018లో 18.6 మిలియన్‌కు, 2019లో 18.9 మిలియన్‌కు చేరుతుందని వెల్లడించింది. నిరుద్యోగుల సంఖ్య రానురాను పెరుగుతోందన్న వ్యాఖ్యలులో వాస్తవం లేదని, అబద్ధాలు ప్రచారమవుతున్నాయని ఇటీవల అధ్యయనంలో వర్తమాన సంవత్సరంలో ఏడు మిలియన్ ఉద్యోగాలకల్పన జరిగినట్టు స్పష్టమయిందని ఇటీవల ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ తరువాతనే ఐఎల్‌ఒ నివేదిక వెలువడడం గమనార్హం. ఆసియా, పసిఫిక్ దేశాల్లో నిరుద్యోగ స్థాయిలు చాలా తక్కువలో ఉన్నట్టు ఐఎల్‌ఒ నివేదిక పేర్కొంది. 2017 తరువాత ఆదేశాల్లో ఉద్యోగులు 23 మిలియన్ వరకు అంటే 1.2 శాతం పెరిగారని నివేదిక వెల్లడించింది. ఏదెలాగున్నా ఉద్యోగాల కల్పనలో ఎక్కువ భాగం నాణ్యత తక్కువ కలిగినవే ఉండడం కొనసాగుతోంది. భారతదేశానికి సంబంధించి గత రెండు దశాబ్దాలకుపైగా ఏవో మొక్కుబడి ఉద్యోగాలు, నాణ్యత లేనివే కల్పించడమయింది. అసంఘటిత రంగంలో స్వయం ఉపాధి కల్పన ద్వారా ఉద్యోగాలు కల్పించినట్టు మోడీ ప్రభుత్వం తనకు తాను తన నిర్వహణను సమర్థించుకొంటోంది. 'మీ ఆఫీస్ ముందర ఎవరైనా పకోడా దుకాణం పెడితే అది ఉద్యోగ కల్పన కింద లెక్కలోకి రాదా? ఆ వ్యక్తి రోజూ వారీ సంపాదన రూ.200 ఎలాంటి ఖాతాలోకిరాదు. వాస్తవానికి ఎంతోమంది జనం ఉపాధి పొందుతున్నారు' అని మోడీ సమర్థించుకొన్నారు. భారతదేశంలో ఉద్యోగాల 'బూమ్' అసంఘటిత రంగంలోని నిర్మాణరంగం, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలు, ఆహారపదార్థాల విక్రయాలు, పరిశ్రమలలో గత పదేళ్లుగా ఉద్యోగాలు లభించాయని ఐఎల్‌ఒ నివేదిక వివరించింది. అయితే ప్రపంచం మొత్తం మీద 2019 ఆఖరికి 34 మిలియన్ మంది అసంఘటిత రంగంలో చేరతారని వీరిలో ఎక్కువ శాతం మంది ఆగ్నేయాసియా దేశాల వారే అవుతారని నివేదిక చెప్పింది. దక్షిణాసియాలో అంచనాగా72శాతం మంది కార్మికులపై చిన్న చిన్న ఉద్యోగాల ప్రభావం కొనసాగుతూనే ఉంది. వీరిలో ఆగ్నేయాసియా, పసిఫిక్, దక్షిణాసియా దేశాల్లో ఈ చిన్న కూలిపనుల్లో పురుషుల కన్నా మహిళల వేతనాలే 8 నుంచి 10 శాతం ఎక్కువగా ఉంటాయని నివేదిక చెప్పింది. భారతదేశంలో ఈ బలహీనమయిన ఉద్యోగం 2019నాటికి 77శాతానికి చేరుకుంటుంది. దక్షిణాసియాలోని ఇతర దేశాల కన్నా ఇదే ఎక్కువ. దేశంలోని 535 మిలియన్ కార్మిక శక్తిలో 398.6 మిలియన్ వరకు 2019లో తక్కువ నాణ్యతగల ఉద్యోగాలు లభిస్తాయి. అందువల్ల నిరుద్యోగ సంఖ్య పెరగకపోవచ్చు. సంఘటిత రంగంలోని ఉద్యోగాలు కరవైపోతాయి. దేశ జనాభాలోఎక్కువ శాతంమందికి దీనివల్ల నష్టం జరుగుతుంది. ఇటువంటి మొక్కుబడి, బలహీన ఉద్యోగాల తగ్గింపులో చెప్పు కోదగిన ప్రగతి గతంలో కనిపించినప్పటికీ 2012 నుంచి అది ఆగిపోవడం తప్పనిసరైంది. అంటే 2017లో చిన్నచిన్న పనుల్లో 1.4 బిలియన్ కార్మికులు ఉన్నట్టు అంచనాగా చెప్పవచ్చు. అలాగే 2019 నాటికి అదనంగా 35 మిలియన్ మంది ఈ పనుల్లో కొత్తగా చేరవచ్చు. ●

సక్రమంగా పనిచేస్తే 15శాతం వృద్ధి సులభమే

జన్మభూమిలో వచ్చిన వినతులు 31లోగా పరిష్కరించాలి: సిఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 29, ప్రభాతవార్త: ఈ ఏడాది తొలి అర్ధసంవత్సరంలో 11.59శాతం వృద్ధి సాధించామని, 62శాతం ప్రజల్లో సంతృప్తికి చేరుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఈ స్ఫూర్తిని ఇదే విధంగా కొనసాగించాలని, 15శాతం వృద్ధి, 80శాతం ప్రజా సంతృప్తి లక్ష్యంగా అందరూ పనిచేయాలని, సక్రమంగా పనిచేస్త 15శాతం వృద్ధి సాధించడం సులభమే అని ముఖ్యమంత్రి అన్నారు. తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయ పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గత నెలలో 5శాతం సంతృప్తి ప్రజల్లో పెరిగిందని, ఏప్రిల్ నాటికి మరో 5శాతం సంతృప్తి చెందేలా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. పెన్షన్లపై సంతృప్తి గత నెలలో ఉన్నట్లే 79శాతం ఉండగా, ఈ నెలలో రేషన్‌పై సంతృప్తి 69శాతం నుంచి 76శాతం వరకు పెరగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జన్మభూమిలో వచ్చిన వినతుల పరిష్కారంపై శ్రద్ధ చూపిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. జనవరి 31లోపు వినతులన్నీ పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు.

ప్రపంచ దృష్టిని ఆకర్షించిన ఎపి ప్రకృతి వ్యవసాయం

ఇటీవల జరిగిన దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో వ్యవసాయం-ఆహార భద్రతపై ఫలప్రదమైన చర్చ జరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. పెట్టుబడులు లేని ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ నమూనా ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నారు. ప్రపంచంలో మైలేన విధానాలు, మెరుగైన పద్ధతులను అధ్యయనం చేసి వాటిని రాష్ట్రానికి తెస్తున్నామన్నారు.



సకాలంలో సాగునీరు అందించాం, తొలకరికే సేద్యం పనులు ప్రారంభించాం. అందుకే పంట దిగుబడులు పెంచగలిగామని తెలిపారు. ఈ ఏడాది వర్షాభావాన్ని అధిగమించి రాయలసీమ రైతాంగానికి సాగునీరు అందించడం సంతృప్తిగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ ఏడాది వేరుశనగ దిగుబడులు గణనీయంగా పెరిగాయంటూ వేరుశనగ, మినుము, అపరాల రైతులకు మద్ధతు ధర లభించేలా చూడాలన్నారు. పెరుగుతున్న పంట దిగుబడులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలలో గోడౌన్ల అందుబాటుపై కలెక్టర్లు శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కడెక్కడ ఎంత విస్తీర్ణంలో గోడౌన్ల సదుపాయం ఉందో, ఎంత పెంచవచ్చో నివేదిక రూపొందించాలన్నారు.

ఆక్వాలో కాలుష్య బెడదను పూర్తిగా నిర్మూలించాలి

అక్వాలో కాలుష్యం బెడదను పూర్తిగా నిర్మూలించాలన్నారు. కాలుష్యం కారణంగా మన ఆక్వా ఉత్పత్తులకున్న ప్రాధాన్యత తగ్గే ప్రమాదం ఉందంటూ అజాగ్రత్తగా ఉంటే వృద్ధిరేటుపై గణనీయ ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అజాగ్రత్తగా ఉన్న చోట వెనుకబడుతున్నామని, జాగ్రత్తగా ఉన్న చోట ముందంజలో ఉన్నామని సోదాహరణగా వివరించారు.

ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం చేయాలి

ఇళ్ల నిర్మాణానికి ప్రజల్లో డిమాండ్ అధికంగా ఉందన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 2016-17ఎన్టీఆర్ గ్రామీణ ఇళ్ల నిర్మాణం 64శాతం మాత్రమే చేశారంటూ 100శాతం లక్ష్యంగా చేరుకోవాలన్నారు. 2017-18, 2018-19ఇళ్ల కేటాయింపులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరిలో రెండవ విడత సామూహిక గృహ ప్రవేశాలు పండుగగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడి భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని, నిర్మించిన ప్రతి అంగన్‌వాడి భవనాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

నరేగాతో ఉపాధి, ఆస్తుల కల్పన ఎపిలోనే

ఇతర రాష్ట్రాలలో ఉపాధికి మాత్రమే నరేగా వినియోగిస్తున్నారు. మన రాష్ట్రంలో అటు ఉపాధి మాత్రమే నరేగా వినియోగిస్తున్నారు. మన రాష్ట్రంలో అటు ఉపాధి, ఇటు ఆస్తుల కల్పనకు నరేగా నిధులు సద్వినియోగం చేసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పంటకుంటల తవ్వకంలో మొదటిస్థానంలో ఉన్నామని, నరేగా నిధుల వ్యయంలో 3వ స్థానంలో ఉన్నామని పనిదినాల సంఖ్య మరింతగా పెంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జియోట్యాగింగ్ చేశాకే నరేగా పనులను ప్రారంభించాలని, లేకపోతే ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారు. మెటీరియల్ కాంపోనెంట్ పనులు ఎక్కువ జరిగిన జిల్లాలో లేబర్ కాంపోనెంట్ పెంచుకోవాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల పెరుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, ఉద్యాన, పశుగణాభివృద్ధి, జలవనరులు, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖల ముఖ్యకార్యదర్శులు, ఇతర అధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

సిపి చెంతకు సిట్ నివేదిక

- 6 నెలల దర్యాప్తు పూర్తి - 333 ఫిర్యాదులపై విచారణ



సిట్ దర్యాప్తు బృందం దర్యాప్తు పూర్తిచేసిన నివేదికను నగర పోలీసు కమిషనర్ యోగానంద్‌కు అందజేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 29, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖలో భూకుంభకోణాలు, రెవెన్యూ భూ దస్త్రాల అవకతవకలు, ప్రభుత్వ భూముల కబ్జాపై ప్రత్యేకంగా ఏర్పాటైన సిట్ దర్యాప్తు బృందం దర్యాప్తు అనంతరం పూర్తిచేసిన నివేదికను నగర పోలీసు కమిషనర్ యోగానంద్‌కు సోమవారం అందించింది. దాదాపు వివిధ మాధ్యమాల ద్వారా 2875 ఫిర్యాదులు స్వీకరించి వాటిలో ప్రభుత్వ ఉత్తర్వుల పరిధిలోని 333 ఫిర్యాదులపై విచారణ జరిపింది. అదేవిధంగా ప్రజా నాయకుల నుంచి వచ్చిన 11 ఫిర్యాదులను నేరుగా స్వీకరించి దర్యాప్తు చేసింది. దీంతోపాటుగా ప్రభుత్వం విస్తృత పరిచిన ఉత్తర్వుల ప్రకారం ఎన్‌ఓసీ వంటి విషయాలపై కూడా దృష్టి సారించి విచారణ జరిపింది. ప్రభుత్వం ప్రాథమిక దశలో వీరికి 2 నెలల పాటుకాలం నిర్ణయించగా తదుపరి విస్తృత పరిచిన ఉత్తర్వుల ప్రకారం వివిధ కార్యాలయాల్లో దస్త్రాలను, నివేదికలను స్వీకరించడంలో ఏర్పడిన జాప్యం కారణంగా మరో రెండు పర్యాయాలు విచారణ కాలాన్ని పొడిగించారు. 2017 డిసెంబరు 28న సిట్ నిర్దేశిత కాలం ముగిసింది. సుమారు 6నెలల పాటు 333 ప్రజా ఫిర్యాదులు, 11 ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులు, 68 ఎన్‌ఓసీలను విచారించి జనవరి 29న నివేదికను నగర పోలీసు కమిషనర్ యోగానంద్ అందించింది. ఈ నివేదిక ఆయన ద్వారా ప్రభుత్వానికి చేరనుంది. విచారణ సమయంలో వచ్చిన అనేక విషయాలను పొందుపర్చి ప్రభుత్వ పరంగా తదుపరి చర్యలకు సిఫార్సు చేయడం జరిగింది.

ప్రభుత్వం ఈ సిఫార్సులపై స్పందించాల్సి ఉండడంతో నివేదికలో పొందుపర్చిన వివరాలను బహిర్గతం చేయలేక పోతున్నామని సిట్ బృందం స్పష్టం చేసింది. విచారణలో ఉన్న వ్యక్తులు, అధికారులపై చర్యలకు సిఫార్సు చేయడంపై మాత్రమే పరిమితం కాకుండా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు సలహాలు కూడా తుది నివేదికలో పొందుపర్చారు. వ్యవస్థ ప్రక్షాళనకు సమాజంలోని మేధావులు అందించిన సలహాలు, సూచలను నివేదికలో పొందుపర్చారు. సిట్ బృందంలో పోలీసులు, రెవెన్యూ, సర్వే డిపార్ట్‌మెంటు కలిసి అత్యంత వేగవంతంగా నివేదికను తయారు చేశారు. సిట్ అధికారులను పలువురు అధికారులు అభినందించారు.

సమాజ హితానికి పాటుపడాలి: మంత్రి యనమల



సమావేశంలో మాట్లాడుతున్న యనమల

విజయవాడ సిటీ, జనవరి 29, ప్రభాతవార్త: సమాజంలో ఉన్నత స్థితికి చేరుకున్న వ్యక్తులు సమాజం కోసం ఎంతో కొంత ఖర్చు చేయాలని, ప్రభుత్వంతో కలిసి ముందుకు పోవాల్సిన అవశ్యకత వుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కుటుంబం క్లీనిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ పరిధిలోని 265 గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. సమాజంలో అసమాన తలు తొలగించి సమగ్ర అభివృద్ధికి టాటా ట్రస్టు వంటి సంస్థలకు ముందుకు రావాలన్నారు. స వ్యస్థ కుటుంబం ఒక విశిష్టమైన కార్యక్రమమని ఇందు కోసం టాటా ట్రస్టు చైర్మన్ రతన్ టాటాను ఒపి ్ఎంచి కార్యాచరణలోకి తీసుకురావడంలో కేశినేని శ్రీనివాస్ సఫలీకృతులయ్యారన్నారు. స్వస్థ కుటుంబం పథకం ద్వారా గ్రామీణ పేదల కుటుం బాలకు ఆరోగ్య రక్షణ కల్పించడమే కాకుండా లక్ష రూపాయల వరకు ఆరోగ్య బీమాను కల్పించడం పట్ల సమాజంపై వారికున్న నిబద్ధతతను చాటు తోందన్నారు. ఆరోగ్యం, విద్య వుంటేనే అభివృద్ధి సాధ్యమని ప్రతి మనిషికి జీవితంలో ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. రాష్ట్ర బడ్జెట్లో రు.7,300 కోట్లు వైద్య ఆరోగ్య శాఖకు కేటాయించామన్నారు. ఎంపి కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ నియోజకవర్గ పరిధిలో 265 గ్రామాల పరిధిలో 72 వేల మరుగుదొడ్లను నిర్మించడంలో టాటా ట్రస్టు సహకారం మరువలేనిదన్నారు. గ్రామాలంటే రోడ్లు, మౌలిక వసతులు మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణం, ఆర్థిక అసమానతలు, సంపూర్ణ ఆరోగ్యం, విద్యవంటి అంశాలుప్రాధాన్యత వహిస్తాయన్నారు. వైద్య సేవలకోసం టెలిమెడిసన్ సేవలందించడానికి టాటా ట్రస్టు ముందుకు రావడం ముదావహమన్నారు. టాటా ట్రస్టు దక్షిణ భారత ఇన్‌చార్జి పవిత్ర కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ దిశలో భాగంగా విజయవాడ పార్లమెంటు పరిధిలో సంపూర్ణ మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. టెలీమెడిసన్లో నూతన విధానాన్ని ఆవిష్కరిస్తూ వీడియో కాన్ఫరెన్సు ద్వారా మెరుగైన వైద్య సేవ అందించడం కోసం స్వచ్ఛ కుటుంబం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామ న్నారు. కేన్సర్‌పై కూడా పోరాటం చేస్తున్నామని, త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో అవగాహన ఒప్పందం చేసుకుంటా మన్నారు. స్వస్థ కుటుంబం క్లీనిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా 20 గ్రామాలకు టెలీమెడి సన్ కిట్లను లాంఛనంగా అందించారు. వత్స వాయి గ్రామ ప్రెసిడెంటుకు బ్యాటరీ స్కూటర్‌ను, బండిపాలెం, గౌరవరం, అనుమంచిపల్లి, వీరుల పాడు, కొటికలపూడి గ్రామాల అధ్యక్ష కార్యదర్శు లకు స్వచ్ఛ ట్రై సైకిల్స్, వాటర్ ట్రైసైకిల్స్‌ను అందజేశారు. జూపూడి, ఆతుకూరు గ్రామ అధ్యక్ష, కార్యదర్శులకు 50 చొప్పున ట్రీగార్డ్స్ అందజే శారు. రాయనపూడి, కె తాడేపల్లి, జక్కంపూడి గ్రామ అధ్యక్ష, కార్యదర్శులకు వాటర్ ట్రైసైకిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సభలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య, శ్రీరామ్ రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు, టాటా ట్రస్టు ప్రతినిధులు, లక్ష్మణ్, శ్రీరామ్, స్టార్ హెల్త్ సీనియర్ ఎగ్జిక్యూ టివ్ సుందరేసన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ హత్యకేసులో పోలీసుల కట్టుకథ

సిబిఐతో విచారణ చేపట్టాలి -లేదంటే సిఎం హస్తం ఉందని భావించాల్సి ఉంటుంది

మాజీ ఎమ్మెల్యేను చంపేస్తారేమో: కోమటిరెడ్డి వెంకటరెడ్డి -కోదండరామ్‌ను లేపినా ఆశ్చర్యపోలేం: విహెచ్

హైదరాబాద్, జనవరి 28 ప్రభాతవార్త: నల్లగొండ మున్సిపల్ చైర్మన్ భర్త శ్రీనివాస్ హత్య కేసుపై పోలీసులు అధికార పార్టీతో కుమ్మక్కై కట్టుకథ అల్లారని కాంగ్రెస్ శాసనసభ ఉపనేత, నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లాలో జరుగుతున్న వరుస హత్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ త్వరలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను కూడా చంపేస్తారేమోనని వెంకటరెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై డిజికీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. అసెంబ్లీ మెస్‌హాల్లో మాజీ ఎంపి వి.హనుమంతరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ దోపిడీ రాజ్యానికి అండగా ఉండడానికి పోలీసులు ఉన్నారా అని ప్రశ్నించారు. సిఎం కెసిఆర్‌కు నిజాయితీ ఉంటే బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసును సిబిఐకి సిఫారసు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ హత్య వెనక సిఎం కెసిఆర్ హస్తం ఉందని భావించాల్సి ఉంటుందన్నారు. శ్రీనివాస్ హత్య కేసును సిబిఐకి అప్పగించకపోతే న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

శ్రీనివాస్ హత్యకేసులో పోలీసులు కట్టుకథ చెప్పారని, ఈ కేసులో మిర్చి బండి యాదయ్యను ఎందుకు విచారించలేదని కోమటిరెడ్డి ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ తన భర్త శ్రీనివాస్ శవాన్ని మొదట చూసిందని అబద్ధం చెప్పారని, పోలీసు స్టేషన్‌కు వెళ్లాకే భర్త చనిపోయాడని లక్ష్మికి తెలిసిందన్నారు. సిఎం అండ చూసుకునే నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం, డిఎస్పీల వల్లే ఈ హత్య జరిగిందని ఆరోపించారు. నాలుగు రోజుల కాల్‌డేటా తీస్తే మొత్తం వ్యవహారం బయటపడుతుందని పేర్కొన్నారు. హత్య చేయగానే నిందితులు నకిరేకల్ వెళ్లి, అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లారని చెప్పారు. ఈ కేసు విచారణలో పోలీసులు చెప్పిన వాటికి ఏమాత్రం పొంతన కుదరడంలేదన్నారు. హత్య జరుగబోతోందని పోలీసులకు ముందే సమాచారం అందని కోమటిరెడ్డి ఆరోపించారు. డిజిపి, ఎస్పీ, అందరూ కుమ్మక్కై ఈ కేసులో కట్టుకథ అల్లారని విమర్శించారు. హత్య పథకం ప్రకారం జరిగిందని, రాళ్లు కూడా ముందే తెచ్చి పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న వారు కోవర్టుగా మారారని తెలిపారు. ఇది ప్రభుత్వ ప్రయోజిత రాజకీయ హత్యఅని, డిఎస్పీ వల్లే నల్గొండలో హత్యలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకే పోలీసులు శ్రీనివాస్ హత్య కేసులో అబద్దాలు చెప్పారని విమర్శించారు. పది, ఇరవై రూపాయలు విక్రయాలు జరిగే మిర్చిబండి గొడవలో హత్యలు జరుగుతాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏం చెబితే పోలీసులు అదే చేస్తారన్నారు. చంపుకోవడానికే తెలంగాణ వచ్చిందా అని ప్రశ్నించారు. నేడు శాసనసభ్యులకే రక్షణలేదా అని ప్రశ్నించారు. జెఎసి చైర్మన్ కోదండరామ్‌ను లేపినా ఆశ్చర్యపోయేది లేదన్నారు. అన్నింట్లో నంబర్ వన్ అని చెబుతున్న కెసిఆర్ చంపేదాంట్లోనూ నవంబర్ వన్ అని చెప్పు అని సలహా ఇచ్చారు. రాష్ట్రంలో కెసిఆర్, కెటిఆర్, కవిత తప్ప ఎవరిదీ నడవడం లేదని, మంత్రులు ఉత్సవిగ్రహాలుగా మారారని విమర్శించారు. కెటిఆర్‌కు దావోస్ ఆహ్వానం అందలేదని, ప్రధాని బృందంతో దావోస్ వెళ్లారని అన్నారు. తిడితే జైళ్లలో పెడతారట తాను జైలుకు వెళ్లడానికి రెడీగా ఉన్నానని విహెచ్ సవాల్ విసిరారు.


సోమవారం అసెంబ్లీ మెస్‌హాల్‌లో మీడియాతో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఫలితాలిస్తున్న వ్యవసాయ సంస్కరణలు

విత్తన సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించిన కార్యదర్శి


సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ సంస్థ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారధి

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: వ్యవసాయ రంగంలో ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు సత్ ఫలితాలను ఇస్తున్నాయని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి పార్థసారధి అన్నారు. హైదరాబాదలో తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ సంస్థ నూతన కార్యాలయాన్ని సోమవారం పార్థసారధి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వ్యవసాయం అంత లాభసాటిగా ఉండేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వ్యవసాయ రంగంలో ప్రభుత్వం కొత్త సంస్కరణలు, విధివిధానాలను తీసుకొచ్చిందన్నారు. ప్రధానంగా సాగుకు 24 గంటల విద్యుత్, ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు, ఎరువులు, విత్తనాలతో సహా పెట్టుబడి సాయం తదితర పథకాలను అందిస్తున్నట్లు ఆయన వివరించారు. అయితే వ్యవసాయం లాభసాటిగా ఉండి, రైతు నష్టపోకుండా, మంచి లాభాలు పొందాలంటే ధృవీకరించిన నాణ్యమైన విత్తనమే దీనికి పునాది లాంటిదన్నారు. ఇందుకే తెలంగాణ విత్తన ధృవీకరణ సంస్థ నూతన విధానాలను అవలంబిస్తూ కల్తీని నియంత్రిస్తూ రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను అందిస్తోందని చెప్పారు. దీంతో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని సంపాదించిందన్నారు. మేలైన, నాణ్యమైన విత్తనాలను అందిస్తున్న ఈ సంస్థకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి ఆర్థిక తోడ్పాటును అందిస్తోందని వెల్లడించారు. రాష్ట్రాన్ని ప్రపంచ విత్తన భాండాగారం దిశగా అడుగులు వేయాలని చెబుతూ అందుకు ఆయన దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా తెలంగాణ విత్తన ధృవీకరణ సంస్థ ఒక్క దేశీయ విత్తన ధృవీకరణే కాకుండా అంతర్జాతీయ ధృవీకరణ, సేంద్రీయ ధృవీకరణ అనే మరో రెండు విభాగాలను ఏర్పరచి గత ఏడాది దాదాపు 17 వేల క్వింటాళ్ల జొన్న, మొక్కజొన్న, వరి తదితర విత్తనాలను ఈజిప్టు, సూడాన్, ఫిలిఫైన్స్ వంటి దేశాలకు ఎగుమతులను చేసిందని వివరించారు. అదేవిధంగా దేశంలోనే తొలిసారిగా ఆన్‌లైన్ విత్తన ధృవీకరణ పద్ధతిని తెలంగాణ విత్తన ధృవీకరణ సంస్థ ప్రవేశపెట్టిందన్నారు. దీని ద్వారా నాణ్యమైన విత్తనోత్పత్తి జరిగి, కల్తీ విత్తనాలకు అడ్డుకట్ట వేసిందని వెల్లడించారు. కాగా 2019లో అంతర్జాతీయ విత్తన సదస్సు ఆసియా ఖండంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో జరగనున్నట్లు ఆయన చెప్పారు. దీనికి వివిధ దేశాల నుండి ప్రతినిధులు హాజరవుతారన్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం జగన్మోహన్ మాట్లాడుతూ విత్తన ధృవీకరణ సంస్థకు కావాల్సిన అన్ని సహాయ సహకారాలను వ్యవసాయ శాఖ ఇస్తుందన్నారు. రైతుకు సీడ్ ఈజ్ గుడ్ కావడంతో మంచి నాణ్యమైన విత్తనాలను అందించాల్సిన బాధ్యత విత్తన ధృవీకరణ సంస్థపై ఉందని, ఆదిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. తెలంగాణలో గ్రామ విత్తనోత్పత్తి పథకం ద్వారా పెద్ద మొత్తంలో విత్తనోత్పత్తి చేసి ధృవీకరణ చేయించి రైతులకు సరఫరా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విత్తన ధృవీకరణ సంస్థ డైరక్టర్ కేశవులు, అన్ని డివిజన్ల అధికారులు పాల్గొన్నారు.

గుడుంబా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాం: ఎక్సైజ్ మంత్రి పద్మారావు గౌడ్

హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త: తెలంగాణను గుడుంబారహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని, త్వరలో ధూల్‌పేట్‌లో కాటేజీ ఇండస్ట్రీ ఏర్పాటు చేస్తామని ఎక్సైజ్ మంత్రి పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం నగరంలోని పీపుల్స్ ప్లాజాలో హైదరాబాద్ జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో ధూల్‌పేట్ సారా బాధితులకు పునరావాస కల్పనలో భాగంగా లబ్దిదారులకు ఆటోలను అందజేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావులు హాజరై వివిధ యూనిట్లకింద ఎంపికైన 114 మంది లబ్దిదారులకు ఆటోలు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి పద్మారా వుగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత ముఖ్యమంత్రి వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా జరిగిన సంఘటనల ఆధారంగా సమాజంలోని సమస్యలపై ఆధ్యయనం చేయగా అధిక జిల్లాల్లో గుడుంబా మహమ్మారి అనేక కుటుంబాలను, సంసారాలను విచ్చిన్నం చేస్తూ సమాజం అభివృద్ధి కాకుండా చేస్తున్నదని గ్రహించినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశంతో గుడుంబా మహమ్మారిపై యుద్ధం ప్రకటించడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో గుడుంబా తయారీ, అమ్మకాలను నివారించి స్థానిక పరిస్థితిని సమీక్షించిన తర్వాత పోలీసు ,రెవెన్యూ శాఖల సహకారంతో 2015 డిసెంబర్‌లో అప్పటి 8రెవెన్యూ జిల్లాలను గుడుంబా రహిత జిల్లాలుగా ప్రకటించామని తెలిపారు. తరువాత 2016 అక్టోబర్ 2న హైదరాబాద్‌ను గుడుంబా రహిత జిల్లాగా ప్రకటించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 6066 కుటుంబాలు గుడుంబా తయారీపై ఆధారపడిన కుటుబాలు ఉన్నట్లు గుర్తించామని వారికి పునరవాసం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పద్మారావుగౌడ్ తెలిపారు.

ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ గుడుంబా సేవించడం వలన కలిగే అనర్థాలను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయడం గ్రామాలలో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం వలన ప్రజల్లో అవగాహనా తీసుకుపోగాలిగామన్నారు. ఈసందర్భంగా హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ ధూల్‌పేట్ వాసులకు కాటేజీ ఇండ్రస్టీ ఏర్పాటు చేయడానికి కృషిచేస్తున్నామని, ఆటోలు అందుకున్న లబ్ధిదారులు అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ రావు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎక్సైజ్ కమీషనర్ సోమేష కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్‌సబర్వాల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా, ఎక్సైజ్‌శాఖ అదనపు కమిషనర్ రాజశేఖర్, సంయుక్త కమిషనర్ అజయ్‌రావు, హైదరాబాద్ డిప్యూటీ కమిషర్ వివేకానందరెడ్డి, మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


సోమవారం లబ్దిదారులకు ఆటోలను అందజేస్తున్న మంత్రులు నాయిని, అలీ, పద్మారావు

సింగరేణి రామగుండం రీజియన్‌ను సందర్శించిన కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి సుశీల్‌కుమార్


సోమవారం ఓసిపిని వ్యూపాయింట్ నుంచి తిలకిస్తున్న కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి సుశీల్‌కుమార్

గోదావరిఖని, జనవరి 29, ప్రభాతవార్త: సింగరేణి రామగుండం రీజియన్‌ను కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి సుశీల్ కుమార్ సింగరేణి సి అండ్ ఎండి నడిమెట్ల శ్రీధర్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఆర్జీ-3పరిధిలోని ఓసిపి-2లో పర్యటించారు. ఇన్‌ఫిట్ క్రషింగ్ అండ్ కన్వేయర్ పద్ధతిని వ్యూపాయింట్ నుంచి తిలకించారు. అదేవిధంగా ఓసిపి-1ను కూడా సందర్శించారు. గనిలో గల డ్రాగ్‌లైన్ యంత్ర పనితీరును, బొగ్గు ఉత్పత్తి, తదితర విషయాలను తెలుసుకున్నారు. వారి వెంట డైరెక్టర్లు జె.పవిత్రన్, ఎస్.చంద్రశేఖర్, బి.భాస్కర్ రావు, జిఎం రాజేందర్ రెడ్డి, పిఒ వీరాస్వామి ఉన్నారు.

అనంతరం మంచిర్యాల జిల్లా జైపూర్ వద్దగల సింగరేణిథర్మల్‌విద్యుత్ కేంద్ర పర్యటనకు వెళ్లారు.

సమన్వయంతో పార్టీని బలోపేతం చేద్దాం: ఎల్.రమణ

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: రాష్ట్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడోద్దని, ఆత్మస్థైర్యంతో సమిష్టిగా, సమన్వయంతో పార్టీని బలోపేతం చేసుకుందామని టిడిపి-టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ పిలుపునిచ్చారు. ఏదైనా సాదకబాధకాలు ఉంటే రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకొస్తే వాటిలో పాలుపంచుకుంటానమి, జాతీయ పార్టీ మనకు అండగా ఉందని ఆయన భరోసా వ్యక్తం చేశారు. ఒంటేరు ప్రతాప్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులపై డిజిపిని, గవర్నర్‌ను కలిశామని, సోమవారం ఒంటేరుకు బెయిల్ వచ్చిందన్నారు. ఈ అక్రమ కేసులపై కేంద్ర హోంమంత్రిని కూడా కలుస్తామన్నారు అక్రమ కేసులపై ప్రజాక్షేత్రంలో ఒకవైపు ఎండగడుతూనే మరోవైపు జాతీయ స్థాయికి తీసుకెళ్తామని, కాబట్టి ఎవరూ అధైర్యపడ్డవద్దని రమణ కోరారు. సోమవారం ఎన్టీఆర్‌భవన్‌లో రమణ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలపై సమీక్షా సమావేశం జరిగింది. మొదట ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి-టిఎస్‌నాయకులు నివాళులర్పించారు. తదనంతరం ఆత్మహత్య చేసుకున్న నెన్నెల మండల పార్టీ అధ్యక్షుడు రంగు రామగౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని 2నిమిషాలు మౌనం పాటించారు.

అనంతరం రమణ మాట్లాడుతూ ఎన్టీఆర్ 22వ వర్ధంతి సందర్భంగా జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు నిర్ణయా నుసారం పల్లెపల్లెకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈకార్యక్రమం ద్వారా టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్తున్నామన్నారు. ఈకార్యక్రమంపై సమీక్ష చేసుకుని తద్వారా పటిష్ట కార్యాచరణను రూపొందించుకొని మరింత ముందకెళ్ధామన్నారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండల పార్టీ అధ్యక్షుడు రంగు రామగౌడ్ టిఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలను ఎండగట్టినందుకు అక్రమంగా అట్రాసిటీ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారనీ, ఈ కేసులపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో రామగౌడ్ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి పార్టీ తరుపున బిఎన్ .రెడ్డిని పంపించడం జరిగిందని, బంద్‌కు పిలు పునిస్తే ఆ బంద్‌లో అందరూ పాల్గొన్నారన్నారు. రామగౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

పోలిట్‌బ్యూరో సభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో తీర్మానం చేశామని.. ఈవిషయాన్ని ఇప ్పటికే కేంద్రం దృష్టికి తీసుకెళ్లామన్నారు. పర్టీ వీడిన వారు గొప్పవారు ఏమీ కాదని..పార్టీ అవకాశమిస్తేనే వారు నాయకులయ్యారని గుర్తు చేశారు. టిడిపి సహకారం లేనిదే రాష్ట్రంలో ఏప్రభుత్వం ఏర్పడలేదని, ఎవరూ నిరుత్సాహ పడవద్దన్నారు. జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇ. పెద్దిరెడ్డి మాట్లాడుతూ పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమంలో నాయకులు ఉత్సాహంగా పాల్గొనాన్నరన్నారు. ప్రజలు బాగా స్పందిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఇంకా జాతీయ పార్టీ ఉపాధ్యక్షులు ఎంపీ గరికపాటి మోహన్‌రావు, జాతీయ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బక్కని నర్సింహులు, జాతీయ పార్టీ అధికార ప్రతినిధులు కొత్తకోట దయాకర్‌రెడి , అరవింద్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు సామా భూపాల్‌రెడ్డి, ఎం. అమర్‌నాథ్‌బాబు, రాష్ట్ర పార్టీ ప్రధానా కార్యదర్శులు జి. బుచ్చిలింగం, శోభారాణి, నన్నూరి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో టెర్రెస్ గార్డెన్లు

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని పట్టణాల్లో ఇక మల్టీ లెవల్ టెర్రస్ గార్డెన్లు కనిపించ నున్నాయి. ఈమేరకు రాష్ట్ర ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకూ ముంబాయి వంటి పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన ఈ టెర్రెస్ గార్డెనింగును తొలుత హైదరాబాద్ మహానగరంలో త్వరలో ప్రవేశ పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. తక్కువ స్థలంలో ప్లాస్టిక్‌తో ఏర్పాటు చేసిన మెట్లు నిర్మించి, వాటిపై ఆకు కూరలు, కూరగాయలను పెంచుకునేందుకు వీలు కలుగుతుంది. అంతేకాకుండా ప్రధానంగా నగరంలో కాలుష్యం పెరుగుతున్న క్రమంలో టెర్రెస్ గార్డెనింగ్ కారణంలో ఈ సమస్యను కొంత వరకూ గట్టెక్క వచ్చని భావిస్తున్నారు. కాగా ఈ గార్డెనింగ్‌కు ప్రత్యేకంగా నీటి సరఫరా వ్యవస్థ ఉంటుందని, చిన్న పాటి భవనంపై తక్కువ స్థలంలో ఈ మల్టీ లెవల్ టెర్రెస్ గార్డెన్లను ఏర్పాటు చేసుకునే వీలుందని అధికారులు చెబుతున్నారు. ఈవిధమైన టెర్రెస్‌ను ఏర్పాటు చేసేందుకు దాదాపు లక్ష రూపాయల వరకూ ఖర్చవుతుందని అంచనా. త్వరలో జీడిమెట్లలోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో ప్రజల పరిశీలనార్థం ఈ మల్టీలెవల్ టెరెస్‌గార్డెనింగ్‌ను ఏర్పాటుచేసేందుకు అవస రమైన అన్ని చర్యలూ చేపట్టారు. ప్రజల్లో ఈవిధా నంపై అవగాహన వచ్చిన తర్వాత ఔత్సాహికులకు శిక్షణ కూడా ఇవ్వాలని నిర్ణయించినట్లు ఉద్యానశాఖ అధికారులుఅంటున్నారు. అయితే ఈటెర్రెస్ గార్డెనింగ్ పై సబ్సిడీ ఇచ్చే విషయంపై తెలంగాణ ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోలేదు.



కాంగ్రెస్ నేతల మధ్య ఐక్యతారాగం

రాజకీయ వ్యూహాలు, పార్టీ భవిష్యత్తుపై చర్చ- టిపిసిసి కోశాధికారి ఇంట్లో విందు, ఆత్మీయ సమ్మేళనం

హాజరైన టిపిసిసి చీఫ్, కేంద్ర మాజీ మంత్రులు, మాజీ ఎంపిలు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: నిత్యం నేతల మధ్య కుమ్ములాటలు, బాహాటంగా ఒకరిపై ఒకరు పరస్పర విమర్శలు గుప్పించునే కాంగ్రెస్ నేతలు ఒక్కసారిగా ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలకు ఆత్మీయ సమ్మేళనం వేదికమైంది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా రెండోసారి కొనసాగింపు నేపథ్యంలో టికాంగ్రెస్ నేతల్లో ఐక్యతను తీసుకువచ్చేందుకు మొదటి సారిగా టిపిసిసి నేతల విస్తృతస్థాయి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఇన్నాళ్లు మనస్పర్థలతో ఉన్న నేతల మధ్య సమన్వయం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆత్మీయ పలకరింపులతో పాటు, రాజకీయ ఎత్తుగడలు, పార్టీ భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. టిపిసి కోశాధికారి గూడురు నారాయణరెడ్డి ఇంట్లో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు మాజీ కేంద్రమంత్రులు జైపాల్‌రెడ్డి, సర్వే సత్యనారాయణ, మండలి విపక్షనేత షబ్బీర్ అలీ, ఎఐసిసి కార్యదర్శి వి.హనుమంతరావు, పిఎసి చైర్మన్ గీతారెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతి, రేవంత్‌రెడ్డి, సంపత్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, దానం నాగేందర్, ముఖేష్‌గౌడ్, మాజీ ఎంపిలు మల్లు రవి, అంజన్‌కుమార్ యాదవ్ తదితర ముఖ్యనాయకులు, డిసిసి అధ్యక్షులు, టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు, అధికార ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్, జైపాల్‌రెడ్డి, సర్వే, షబ్బీర్‌అలీ, విహెచ్ తదితర నాయకులు పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ ఎలాంటి వ్యూహాలతో ముందుకు పోవాలన్న అంశాలపై లోతుగా చర్చించినట్లు తెలిసింది. ముఖ్యనేతలంతా ఒకే వేదికపై ఉండడంతో చర్చ ఉత్సాహంగా సాగినట్లు సమాచారం. రాజకీయ అంశాల్లో చర్చించి తెలంగాణ సర్కార్ హయాంలో మహిళలకు అణచివేతలకు గురవుతున్నట్లు జరుగుతున్న మహిళా నేతలు ఆందోళన వెలిబుచ్చినట్లు తెలిసింది. మొత్తం మీద కాంగ్రెస్ నాయకులంతా ఒక్క తాటిపైకి వస్తుండ డంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఆత్మీయ సమ్మేళనంలో నాయకుల మధ్య భిన్నా భిప్రాయాలు పక్కన పెట్టి భవిష్యత్తులో పార్టీని ఎలా అధికారంలోకి తీసుకురవాలనే దానిపైనే ప్రధానంగా చర్చ జరిపినట్లు తెలిసింది.


సోమవారం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

ఉత్తమ్‌కు దమ్ముంటే పరకాలలో పోటీ చేసి గెలవాలి

టిఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తర కుమారుడి ప్రగల్బాలు పలుకుతున్నారని టిఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. టిఆర్ఎస్ఎల్పీలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 స్థానాలు వస్తాయని ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలను వట్టి పగటికలగా అభివర్ణించారు. మొత్తం 119 స్థానాల్లో ఒక్క స్థానంలోనూ కాంగ్రెస్ గెలవలేదన్నారు. వేలాదిమంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఒక నాయకుడు చెప్పగానే ఉత్తమ పరకాల నియోజకవర్గానికి వచ్చి గీసుకొండలో మీటింగ్ పెట్టారని, కానీ నలుగురైదుగురు గల్లీస్థాయి నాయకులు తప్ప ఎవరూ చేరకపోవడం, మీటింగ్‌కు ప్రజలు దూరంగా ఉండటంతో తీవ్ర అసహానికిలోలైన ఉత్తమ్ పిచ్చిపిచ్చిగా మాట్లాడారన్నారు. కాంగ్రెస్‌పాలనలో పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బిసిలు, ఇతరవర్గాల ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో కులవృత్తులు కూలిపోయి వాటిమీద బతికే వారంతా గ్రామాలు వదిలి నగరాలకు వలసలు పోయారన్నారు. కానీ తమ ప్రభుత్వం కులవృత్తులకు ప్రాణం పోస్తుండటంతో వలసపోయి వారు వాపస్ వస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను ఏనాడు పట్టించుకోలేదని, కోతలు తప్ప కరెంటు లేదని చల్లా పేర్కొన్నారు.

కానీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత 24 గంటల నిరంతర విద్యుత్ ఇస్తు న్నామని, ప్రభుత్వమే మద్దతు ధరలకు అన్ని రకా ల పంటలను కొనుగోలు చేస్తుందన్నారు. తాను తన నియోజకవర్గం అభివృద్ధికోసమే టిఆర్ఎస్‌లో చేరానని, పరకాల నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గతంలో ఎన్ని నిధులిచ్చారు? ఇప్పుడెన్ని నిధులు వచ్చాయో తేల్చుకునేందుకు ఉత్తమ్ చర్చకు రావాలన్నారు. ఉత్తమ్, రేవంత్‌రెడ్డిలు ఎవరొచ్చి పరకాలలో పోటీ చేస్తారో చేసి గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ధర్మారెడ్డి సవాల్ చేశారు.

టిడిపిని వీడే ప్రసక్తే లేదు

మోత్కుపల్లి అలా అనడం సరికాదు: నామా, సండ్ర

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీని వీడే ప్రసక్తే లేదని పోలిట్‌బ్యూరో సభ్యుడు, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. టిడిపిని టిఆర్ఎస్‌లో విలీనం చేయాలని ఆపార్టీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపిన నేపథ్యంలో టిడిపికి చెందిన కీలక నేతలు నాగేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్యలు ఈ విధంగా స్పందించారు. ఎంపీగా ఉండగా 2.64 లక్షల సంతకాలు చేసి, 1.20 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు, 60 వేల మందికి రైల్వేపాస్‌లు ఇచ్చానని తెలిపారు. తాను చేసినన్ని పర్యటనలు ఎవరూ చేయలేదని ఆయన పేర్కొన్నారు. టిడిపి సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ పల్లెపల్లెకూ టిడిపి పేరుతో అన్నిమండలాల్లో పెద్దఎత్తున కార్యక్రమాలు చేస్తుంటే, పార్టీ మారతారంటూ తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను పార్టీ మారే ప్రశ్నేలేదన్నారు. మోత్కుపల్లి అలా పేర్కొనడం సరికాదని వెంకటవీరయ్య హితవు పలికారు.

2018-19కి పంటల రుణ పరిమితి ఖరారు

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: వ్యవసాయానికి సంబంధించి 2018-19సంవత్సరానికి గాను వివిధ పంటలకు రుణ పరిమితిని రాష్ట్ర సాంకేతిక కమిటీ ఖరారుచేసింది. గతఏడాది అంటే 2017-18 సంవత్సరానికి 81 పంటలకు రుణ పరిమితిని ఖరారు చేసిన రాష్ట్ర సాంకేతిక కమిటీ, ఈ ఏడాది 101రకాల పంటలకు రుణ పరిమితిని నిర్ణయించింది. వానాకాలం కంటే యాసంగి సీజను పంటలకు ఎక్కువ రుణ పరి మితిని ఖరారు చేసింది.

రుణ పరిమితి వివరాలు (రూపాయల్లో..)

పంట పేరు	వానాకాలం	యాసంగి
వరి	30,000	40,000
వరి విత్తనోత్పత్తి	40,000	42,000
పత్తి	30,000	35,000
పత్తి విత్తనోత్పత్తి	94,000	1.26 లక్షలు
జొన్నలు	11,000	18,000
మొక్కజొన్న	25,000	28,000
కందులు	15,000	18,000
వేరుశెనగ	21,000	23,000
మల్బరీ	40,000	50,000
టమాట	30,000	35,000
అల్లం	55,000	60,000
వెల్లుల్లి	25,000	28,000
మామిడి	30,000	35,000
సపోటా	20,000	25,000
స్వీట్ ఆరంజ్	40,000	45,000

పాటే ఆమె కీర్తిబావుటా

ఆమె పాట వింటే పల్లె వాతావరణం ఇట్టే గుర్తుకు వస్తుంది. ఆవులు, దూడలు గెంతులేసి, ఆనందిస్తాయి. చెరువుల్లోని నీళ్లు గలగల శబ్దాలతో ఆమె పాటకు తందానతాన పలుకుతాయి. కొమ్మలపై ఉన్న పక్షులన్నీ పరవశించి, తమ కిచకిచ రాగాలను ఆపేసి, ఆమె పాటను వింటాయి. పల్లెప్రజలంతా ఆమె చెంతకు చేరుకుంటారు. పట్టణాల్లో, నగరాల్లో ఉన్నవారు ఆమె గళం నుంచి జాలువారే స్వరాలను వింటుంటే వారు పల్లెవెలుగులను గుర్తుకు చేసుకుంటారు. అక్కడి స్వచ్ఛత, అనురాగం, ప్రేమను జ్ఞప్తికి తెచ్చుకుని, చెమరే కళ్లతో ఆనందిస్తారు. ఆమె పాటల్లో సామాజిక, మహిళ సమస్యలన్నీ ఇట్టే కళ్లముందు కనిపిస్తాయి. జీవితంలోని ఆటుపోట్లన్నీ మదిలో జ్ఞాపకాల పేజీలు తిరగేస్తూ, కళ్లకు నీళ్లను తెప్పిస్తాయి. ఆమె పాటలో సంగీత, సాహిత్య పాండిత్యం కనిపించదు కానీ, సామాన్యమానవుడికి సైతం అర్ధమయ్యే జానపదకళ కనిపిస్తుంది. అందుకే ఆమెకు జానపదగానంలోనే గుర్తింపు వచ్చింది. పద్మశ్రీ అవార్డు వరకు నడిపించింది. ఆమె పేరు ప్రొఫెసర్ విజయలక్ష్మి నవనీతకృష్ణన్. తమిళనాడుకు చెందిన విజయలక్ష్మి జానపద కళాకారిణి మాత్రమే కాదు, ఆమె నిత్యపరిశోధకురాలి పనిచేస్తున్నారు. అంతేకాదు ఆమె ప్రొఫెసర్ కూడా. భర్తతో కలిసి, ఎన్నో జానపద గీతాలను ఆలపిస్తూ, తమిళనాడులో మాత్రమేకాక, దేశంలోనే పేరు పొందింది. తమిళనాడుకు చెందిన విజయలక్ష్మి భారతీయ అనాదికాల సంప్రదాయ కళల్లో ఒకటైన జానపదకళలో రాణిస్తూ, ఆ కళకే వన్నె తెచ్చింది. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో ఉన్నాయి. ఇందులో మహిళలకు చెందినవి మరెన్నో..ఈ పరిస్థితుల్లో విజయలక్ష్మి తనవంతు కృషిగా సామాజిక సేవ చేయాలనే ఆశయం కలిగి వున్నారు. ఇందులో భాగంగా ఆమె జానపద కళను ఎంచుకున్నారు. జానపద గీతాలను ఆలపించేందుకు సంగీత పాండిత్యం అక్కర్లేదు. వాడుకభాషలో, అందరికి అర్ధమయ్యేలా పాడుతూ, ఆరంగంలో పేరుప్రఖ్యాతులను పొందారు. ఒకవైపు ఆమె ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే మరొకవైపు పరిశోధనారాలిగా ఉంటూ, జానపద కళలో రాణిస్తున్నారు. విజయలక్ష్మి తన భర్త నవనీతకృష్ణన్‌తో



కలిసి, అనేక ప్రదర్శనలు ఇస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన తమిళనాడులో ఆమెకు బాల్యం నుంచి హిందు మతమన్నా, ఆ సాంప్రదాయాలు అన్నా ఎనలేని అభిమానం. తన మతం, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచదేశాలకు చాటిచెప్పాలనే ఉద్దేశంతో ఆమె జానపద కళను ఎంపిక చేసుకున్నారు. దాదాపు 10వేల ఆడియో క్యాసెట్లను విడుదల చేసి, పాపులర్ అయ్యారు. 1946లో జన్మించిన విజయలక్ష్మి తన లేతవయసులోనే సంగీతంపై మక్కువ పెంచుకున్నారు. ఆమె చదువుకున్న స్కూల్లో టైలరింగ్, సంగీతం నేర్చుకునే అవకాశం ఉండడంతో, విజయలక్ష్మి తల్లి, అమ్మమ్మలిద్దరు సంగీతం నేర్చుకుని, పండుగల సమయంలో దేవాలయాలు, గుడులలో పాడేవారు. వారినుంచి ప్రేరేపించబడ్డ విజయలక్ష్మి తాను కూడా పాటలనే తన అభిరుచిగా ఏర్పచుకున్నారు. మధురైలోని కామరాజ్ యూనివర్సిటీలో ఆర్ట్ అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్ట్ ప్రొఫెసర్‌గా పని చేసి, పదవీవిరమణ పొందారు. రిటైర్డ్ అయ్యాక తన భర్తతో కలిసి, జానపద ప్రదర్శనలను ఇస్తున్నారు. జానపద పాటలు కొన్నిసార్లు కొన్నివ్యాధులకు చికిత్సగా, థెరపీగా పనిచేస్తుందని విజయలక్ష్మి విశ్వసిస్తారు. పలుకేసుల్లో ఈ విషయం నిజమని కూడా రుజువైందని అంటారు. విజయలక్ష్మి జానపద పాటల ప్రదర్శన ఇస్తూనే, వీటిపై పలు పుస్తకాలను కూడా రాసారు. ఆల్‌ఇండియా రేడియో 1980 నుంచి నిర్విరామంగా ప్రదర్శన ఇస్తూనే ఉన్నారు. ఆమె కళకు ముగ్ధుడైన అప్పటి ముఖ్యమంత్రి ఎంజిఆర్ ఒక ఖాళీచెక్కును ఇచ్చి, ఎంత కావాలంటే అంత డబ్బు రాసుకోమని ఇచ్చారు అంట. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఆమె సేవల్ని గుర్తించి, ఆర్ట్ విభాగంలో ఈ సంవత్సరం పద్మశ్రీ అవార్డును ఇచ్చి, గౌరవించింది. భవిష్యత్తు లో మరిన్ని ప్రదర్శనల ద్వారా సామాజిక రుగ్మతలను తనవంతు రూపుమాపాలనే ఆశయంతో జీవిస్తున్నారు. ఆమె ఆశయం నెరవేరాలని కోరుదాం. ❒



సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి

పవిత్ర భారతదేశంలో తరతరాలుగా సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట. అలాంటి భారతా వనిలో స్త్రీకి సముచిత స్థానం ఉండి వేదకాలం నుండి ఆర్యుల రాకతో మనదేశంలో స్త్రీకి పురుషునితో సమాన అవకాశాలు కల్పించారు. మధ్యయుగంలో స్త్రీకి పరదా బాల్య వివాహాల వల్ల స్థాయి తగ్గిపోయింది. రాను రాను స్త్రీ స్థానం దిగజారిపోవడమే కాని మార్పేమీ కన్పించడం లేదు.

పరపత్నతుయాస్త్రీ స్యాద సంబంధాచ యోనితః తాంబ్రూ యాద్భవతీ త్యేవం సుభగే భగినీతి చ

తన సోదరీ సంబంధంలో చేరని ఇతర వనితను సుభగే అని భగిని అని ఉచ్చరించాలి. సుభగే భగినీ వ్యవహారిక పదజాలంలో అక్కా అని చెల్లీ అని అర్థం గోచరిస్తుంది. శాస్త్రాలు నొక్కి వక్కాణించడం ఏమనగా స్త్రీలను పరస్త్రీలను సోదరీలాగా భావించాలని. మనుధర్మశాస్త్రం స్త్రీల విషయంలో వారిని గౌరవించే రీతులలో ఖచ్చితమైన నిర్ణయాలు అభిప్రాయాలు ఉన్నాయి.

మాతృష్వసామంతులానీ
శ్వగ్రూరపి పితృష్వసా
సంపూజ్యాగురుపత్నీపత్
సమాప్తా గురుభ్నార్యయా

తల్లికి సోదరి, మేనమామ, మేనత్త అత్తగార్ని గురుపత్నులతో సమానులు వీరిని ఆహ్వానించే టప్పుడు అభివాదం తప్పనిసరిగా చెయ్యాలన్నది మనుధర్మశాస్త్రం.

యత్న నార్యన్తుపూజ్యంతే
రమంతే తత్ర దేవతాః
యత్త్రై తాస్తునపూజ్యంతే
సర్వాస్తత్రా ఫలాః క్రియాః

ఏ గృహంలో అయితే స్త్రీలు అన్ని వస్త్ర భరణాదులచేత పూజింపబడి ఆనందంగా ఉంటుందో ఆ గృహంలో సమస్త దేవతామూర్తులు ప్రసన్నులై అనుకూల ముగా సర్వం అభీష్ట ప్రకారమే సిద్ధి స్తుంది. ఆ రీతిగా కాక స్త్రీలు ఏ గృహంలో విచారకరంగా ఉంటారో ఆ యజమాని ఆ కుటుంబ సభ్యులు సమస్త సత్కర్మములు నిర్వీర్యమగుతాయన్నది శాస్త్ర వాక్యము.

అనాది కాలం నుండి స్త్రీకి అత్యంత గౌరవ మర్యాదలు ఇచ్చిన నేటి గ్లోబలైజేషన్‌లో నిర్వీర్యమైపోతున్నాయి. మన సంస్కృతిలో స్త్రీకి చిన్నచూపు చూడటం భావ్యం కాదు. 64కళలతో జన్మించిన శిశువు పెరిగి పెద్దయి మహిళగా సమాజపు అకృత్యాలకు బలి అవుతోంది. గృహహింస వేధింపులు, ప్రేమోన్మాదం ర్యాగింగు కిరసనాయిలు పోసి తగలపెట్టడం, గొడ్డుని బాదినట్లు బాదడం, వాతలు ఇలా రకరకాల హింసలకు



గురికావల్సి వస్తోంది. స్త్రీ కన్నా పురుషుని మేధోశక్తి తక్కువే అని జార్జియా శాన్‌డియాగో,అంటారియో వంటి దేశాలు నొక్కి వక్కాణిస్తూనే ఉన్నాయి. ఇక నేటి సమాజం స్త్రీ గురించి మనం చర్చించుకుంటే ఇది పురుషాధిక్య ప్రపంచం మహిళలకి స్థానం లేదు అన్ని రంగాలలో తొక్కిస్తున్నారు.

ఇక శారీరకంగా బలహీనత వల్ల స్త్రీ ఎదగలేకపోతోంది. ర్యాగింగ్ భూతపు కోరలకు బలవుతోంది. అలా అని మహిళలలో ప్రగతి నశించిందని చెప్పటం లేదు. బార్బెరా ఘోష్, ఇందిరాగాంధీ, కిరణ్‌బేడి, ప్రతిభా పాటిల్, కుముద్ బెన్‌జోషి శారదాముఖర్జీ, సోనియాగాంధీ, విజయలక్ష్మి పండిట్, సిరిమావో బండారు నాయకే ఇలా స్త్రీలు కష్టాలు దాటుకుని అనేకానేక రంగాలలో ముందు స్థానంలో లేకపోలేరు. సునీత విలియమ్స్ ఆర్థిక రాజకీయ వాణిజ్య విద్యా అనేకానేక రంగాలలో స్త్రీలు పురోగమిస్తున్నారు.

విద్య అనేది స్త్రీ జీవితంలో కీలకమైనది. నేటి సమాజంలో విద్యలేని మహిళ సమాజంలో మనగల స్థితి దాటి పోతోంది. ఇక ఉద్యోగం చేసే స్త్రీలు ఎదుర్కొనే బాధల పరంపర ఆ పరమాత్మ తప్ప ఎవ్వరు తీర్చలేరు. చివరగా అలుపెరగని బాటసారి స్త్రీ. స్త్రీకి స్త్రీయే శత్రువు అన్న రీతిన సమాజం ఇంకా కొనసాగుతూనే ఉంది. మహిళా సంఘాలు స్త్రీకి న్యాయం చేకూర్చడం ఆవగింజలో అర్థభాగం చందాన ఉంది. స్త్రీ సాధికారత అనడమే తప్ప స్త్రీకి స్వేచ్ఛ ఏది. స్త్రీల చట్టాలు అమలు జరగవు.

జరిగినా చట్టం ధనవంతుల చేతిలో పప్పెట్ కీలుబొమ్మ. ఇక బీద సామాన్య మధ్య తరగతి స్త్రీకి న్యాయం మృగ్యంగా గాంధీజీ చెప్పిన అర్ధరాత్రి స్త్రీ రోడ్డుపైన ఒంటరిగా నడిచి వస్తే సంపూర్ణ స్వాతం త్ర్యం అన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని అన్ని రంగాలలో స్త్రీలకు రక్షణ కల్పించ వలసిన బాధ్యత ప్రభుత్వానిది. ❒

కాలీఫ్లవర్‌తో...

కాలీఫ్లవర్ కూడా ఓ రకమైన పువ్వుజాతికి చెందినదే. విదేశాల నుండి భారతదేశానికి చేరింది. కాలీఫ్లవర్ పువ్వులలో చాలా ఖాళీలు ఉంటాయి. వీటి మధ్య పురుగులు ఉంటాయి. అందువలన చాలామంది ఈ పువ్వును తీసుకొనరు. దీనికి తోడు ధర కూడా ఎక్కువ. ఏది ఏమైనప్పటికి ఈ కాలీఫ్లవర్ పువ్వులలో సి విటమిన్ పుష్కలంగా ఉన్నాయి.

శరీరానికి అవసరమైన అన్ని రకాల లవణాలు ఉంటాయి. అందువలన ఖరీదు ఎక్కువ అయినప్పటికీ, నిర్లక్ష్యం చేయకుండా, కనీసం అప్పుడప్పుడైనా కాలీఫ్లవర్‌ను కూర రూపంలో గాని, మరొక విధంగా కానీ తీసుకోవటం మంచిది. 100గ్రా కాలీఫ్లవర్‌లో పోషక విలువలు ఈ విధంగా ఉంటాయి. పిండిపదార్థాలు-5.3గ్రా.


క్రొవ్వు పదార్థాలు 0.4గ్రా, మాంసకృత్తులు-3.5గ్రా,
సున్న(కాల్షియం)-30మి.గ్రా, భాస్వరం.- 60మి.గ్రా, మెగ్నీషియం -20మి.గ్రా
ఇనుము-1.3మి.గ్రా, ఉప్పు-12మి.గ్రా
పొటాషియం-285మి.గ్రా, పీచుపదార్థం-1.2మి.గ్రా

నిజానికి, క్యాబేజి కన్నా విలువైన పోషకాలను కలిగి ఉన్నది కాలీఫ్లవర్. విటమిన్ బి6, విటమిన్ సి, ఫోలేట్ ఆరోగ్యదాయకమైన ఎన్నో ఫైటో కెమికల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది క్యాన్సర్ నిరోధక కాయగూరలలో రారాజు. క్యాన్సర్‌ను నిరోధించే బయో ఫ్లావనాయిడ్స్ కాలీఫ్లవర్‌లో పుష్కలంగా ఉంటాయి. పీచుపదార్థం ఎక్కువ. అందువలన మల విసర్జన సాఫీగా జరగటానికి, వ్యర్థ పదార్థాల బహిష్కరణకు దోహద పడుతుంది.

వంధ్యత్వాన్ని పోగొడుతుంది. రేచీకటిని, చిన్న వయసులో జుట్టు తెల్లబడటాన్ని, ఊడిపోవడాన్ని నివారిస్తుంది. ❒



నగలు శుభ్రపరచుకోండిలా...!



ఒకప్పుడు ఏదైనా వేడుకల సందర్భాలలోనే నగలను ఎక్కువగా ధరించేవారు. కానీ ఇప్పుడు ప్రతి చిన్న ఫంక్షన్‌కూ, రోజువారీ కూడా నగలు ధరించడం అలవాటయింది. కేవలం బంగారమే కాకుండా, ప్లాటినమ్, డైమండ్ నగలను కూడా రోజువారీ ఆఫీసులకు కూడా పెట్టుకుంటున్నారు. ఈరోజువారీ వాడకం వల్ల వీటికి మట్టిపట్టి మొదట ఉండే ఆకర్షణ తగ్గిపోతోంది. దీనికి తోడు కాలుష్య ప్రభావం, పెర్‌ఫ్యూమ్‌ల వంటి రసాయనాల నుండి నగలను రక్షించుకోవాలనేది కొంతమందికి తెలియదు. వీటిని ఎలా భద్రపరచాలో, శుభ్రపరచుకోవాలో ఇపుడు తెలుసుకుందాం.

బంగారం వస్తువులైనా, ముత్యాలవైనా సరే వాటిని ధరించిన వెంటనే వాటికోసం తయారుచేసిన మఖ్‌మల్ క్లాత్ గల బాక్సులలో పెట్టాలి. ఈ బాక్సులలో పెట్టడం వల్ల ఆ భరణాలపై గీతలు పడటం కాని, మట్టిపడటం కాని జరగదు. ఎప్పుడూ కొత్తగా కనిపిస్తాయి.

బంగారు ఆభరణాలు: వీటిని జాగ్రత్తగా చూసుకోకపోతే విరిగిపోవటం,గీతలు పడిపోవటం జరుగుతుంది. బ్రాస్‌లెట్లు, ఇయర్‌రింగ్స్, నెక్లెస్‌లను పెట్టుకుని తీసాక వాటికి ఏర్పాటుచేసిన బాక్సుల్లోనే పెట్టాలి. విడిగా పడేస్తే ఫోల్డయి మధ్యకు విరిగిపోయే ప్రమాదముంది. ముఖానికి వాడే బ్యూటీక్రీమ్స్, జుట్టుకు వాడే హెర్బల్ ప్రొడక్ట్స్, కలరింగ్ వల్ల కూడా ఈ ఆభరణాలు తమ ప్రకాశాన్ని కోల్పోతాయి. అంతేకాకుండా స్విమ్మింగ్‌పూల్‌లోకి దిగినపుడు వాటర్‌లో ఉండే క్లోరిన్ వల్ల బంగారం నల్లగా మారే అవకాశం ఎక్కువ. అంతేకాదు తొందరగా తెగిపోతాయి కూడా. అందుకనే నీళ్లల్లోకి వెళుతున్నప్పుడు బంగారం ధరించకూడదు. ఇలా నల్లబడిన మీ బంగారం మెరుపు సంతరించుకోవాలంటే టూత్‌బ్రెష్‌ను సబ్బునీటిలో ముంచి నెమ్మదిగా నగలమీద రుద్దాలి. నగల మీద గ్రీజు మరకలేమైనా పడితే వాటిని ఆల్కహాల్‌లో ఒకసారి ముంచి తీస్తే ఆ మరకలు పోతాయి. నగలను శుభ్రపరిచాక తప్పనిసరిగా ఆరబెట్టాలి.

వెండి వస్తువులు

ఇవి ఎండలో పెడితే బాగా మెరుస్తాయి. వెండి వస్తువులను ఎప్పుడూ కూడా ప్లాస్టిక్ బ్యాగులలో పెట్టకూడదు. ఈ బ్యాగులలో ఉండే సల్ఫర్ రసాయనాల వల్ల తొందరగా మెరుపు తగ్గే అవకాశం ఉంది. ఈ వెండి వస్తువులను శుభ్రపరచుకోవాలంటే వేడినీళ్లలో కాస్త కొంచెం అల్యూమినియం పౌడర్ వేసి వాటిని ఐదు నిమిషాలు ముంచి ఉంచాలి. ఆతరువాత తీసి కాస్త బేకింగ్ సోడా కలిపిన నీటిలో వేసి అరగంట ఉంచి తీస్తే వెండి వస్తువులు తళతళలాడతాయి. వీటిని శుభ్రంగా తుడిచి ఆరబెడితే ఎటువంటి మరకలు లేకుండా వస్తువులు బాగుంటాయి.

ముత్యాల ఆభరణాలు

ఈ ముత్యాలు చాలా సున్నితమైనవి. ముఖానికి, జుట్టుకు వాడే పెర్‌ఫ్యూమ్స్ వల్ల ఇవి తొందరగా పాడయ్యే అవకాశం ఉంది. ఈ లోషన్లు కేవలం మెరుపు తగ్గడమే కాకుండా ముత్యాలను తినివేస్తాయి. అందుకే మీరు మేకప్ చేసుకోవడం అంతా అయిపోయాక ఈ ఆభరణాలను ధరించితే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. ముత్యాలు శుభ్రపరచాలంటే గోరువెచ్చని నీళ్లతో కడగాలి. వీటిని బ్రెష్ పెట్టి శుభ్రపరచకూడదు. నీటితో కడిగి మెత్తని బట్టతో తుడికి ఆరాక బాక్సులో పెట్టాలి.

డైమండ్స్


బంగారం ఆభరణాలను ఏవిధంగానైతే శుభ్రపరచుకుంటామో డైమండ్స్‌ను కూడా అదే పద్ధతిలో శుభ్రపరచాలి. వీటికి మీరు వాడే స్కిన్‌లోషన్లు తగలకుండా చూసుకోవాలి. అంతేకాకుండా ఎక్కువగా వాటిమీద చేతుల పెడితే వాటి ప్రకాశాన్ని కోల్పోతాయి.

ప్లాటినమ్

దీనితో తయారుచేసిన వస్తువులు నల్లబడతాయని దిగులు పడవల్సిన అవసరం లేదు. కాని వీటిని జాగ్రత్తగా భద్రపరచుకోకపోతే విరిగిపోతాయి. బంగారు వస్తువులను ఏవిధంగా శుభ్రపరుస్తారో అదేవిధంగా వీటిని శుభ్రపరుచుకుంటే ఎక్కువ కాలం మెరుపును సంతరించుకుంటాయి.

నవరత్నాలు

సూర్యకాంతి పడటం వల్ల కొన్ని రాళ్లు తమ రంగును కోల్పోతాయి. కొన్ని మరొక రంగులోకి మారడం జరుగుతుంది. కొన్నయితే పగిలిపోతాయి. జెమ్‌స్టోన్స్‌లో పచ్చలు, కెంపులు, వజ్రాలు, పగడాలు, పుష్యరాగాలు, నీలం, ముత్యం, గోమేధికం వంటి వాటిని సబ్బునీటితో అస్సలు శుభ్రపరచకూడదు. ఈవిధంగా చేస్తే వాటి రంగు పోవడమే కాకుండా మెరుపుకూడా తగ్గుతుంది. వీటిని మెత్తటి బట్టతో తుడిస్తే చక్కగా మెరుస్తాయి. వీటిని మీరు పూర్తిగా తయారైన తరువాతే ధరించాలి. లేకపోతే మీరు వాడే ఫెర్‌ఫ్యూమ్స్‌కి ఇవి వాటి రంగు కోల్పోతాయి. ఏ నగలైనా మెరుపు తగ్గినప్పుడు నమ్మకమైన కంసాలితో పాలిష్ పెట్టించుకోవడం మంచిది. ❒



చెలికానుక

- పాత్రలు దింపేందుకు వాడే పట్టకారు నల్లబడిపోతే, దాన్ని బియ్యం కడిగిన నీటిలో నానబెట్టి తోమాలి. ఇలా చేస్తే తెల్లగా అవుతుంది.
- నేల మీద తడి మట్టిని పరిచి, దానిమీద బంగాళ దుంపలు పెడితే ఎక్కువ రోజులు చెడిపోకుండా ఉంటాయి.
- డాబాల మీద బట్టలారేసే తీగల పక్కగా ఎలక్ట్రిక్ తీగలూ పోతుంటాయి. అందుకని రబ్బరు చెప్పులు వేసుకుని, కర్రపుల్లతో బట్టలారేస్తే షాక్ కొట్టే ప్రమాదం ఉంది.
- పాలకాయలు చేసేటప్పుడు పిండిని తేలికగా ఉండలు చేస్తే నూనెలో వేయించేటప్పుడు పగలకుండా ఉంటాయి.
- మందారపు ఆకుల్ని బాగా రుబ్బి తలకు పట్టించుకుని కొంచెం సేపు ఆగి తలంటుకొంటే నల్లగానూ, మృదువుగా ఉంటుంది.
- నువ్వులనూనెలో జీడిగింజలను వేసి కాచి, ాసుకుంటే శిరోజాలు నలుపును కోల్పోకుండా ఉంటాయట.
- ఎండిన మందారపువ్వులను కొబ్బరినూనెలో వేసి నూనెను తలకు రాసుకుంటే తలనొప్పులు తగ్గి శిరోజాలు నల్లగా పెరుగుతాయి.
- అరటికాయను కోసి ముక్కల్ని ఉప్పునీటిలో ముంచండి. తరువాత వాటిని వేపుకుంటే కరకరలాడతాయి. ❒

పెసర వడియాల పులుసు

కావలసినవి: వడియాలు: పెసర బద్దలు లేదా పెసర్లు-ఒక కప్పు
పచ్చిమిర్చి-4, జీలకర్ర-ఒక టేబుల్‌స్పూన్
అల్లం-చిన్నముక్క, ఉప్పు-తగినంత
పులుసు: చింతపండు-నిమ్మకాయంత, టమాట-1,
ఉల్లిపాయ-1,
కరివేపాకు-రెండు రెబ్బలు
అల్లంవెల్లుల్లి ముద్ద-అర టేబుల్‌స్పూన్
కారంపొడి-ఒక టేబుల్‌స్పూన్,
పసుపు-పావు టేబుల్‌స్పూన్
ఉప్పు-తగినంత, నూనె-రెండు టేబుల్‌స్పూన్లు
ఆవాలు, జీలకర్ర-అర టేబుల్‌స్పూన్, ఎండుమిర్చి-2,
బెల్లం-చిన్నముక్క



తయారుచేసే విధానం : పెసర బద్దలు లేదా పెసర్లు నీళ్లలో నాలుగు గంటలు నానబెట్టి వడకట్టి పచ్చిమిర్చి, జీలకర్ర, అల్లం, ఉప్పువేసి బరకగా రుబ్బుకుని చిన్నచిన్న ముక్కలుగా వడియాలు వేసి ఎండబెట్టుకోవాలి. చింతపండు నీళ్లు పోసి పదినిముషాలు నానబెట్టి పలుచగా పులుసు వేసి పెట్టుకోవాలి. ఇందులో తరిగిన ఉల్లిపాయ, కరివేపాకు, పసుపు, కారంపొడి, ధని యాలపొడి, తగినంత ఉప్పు వేసి కలుపుకోవాలి. వడియాలను నూనెలో వేయించి పెట్టుకోవాలి. గిన్నెలో నూనె వేడిచేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి కాస్త వేగాక పులుసు వేసి మరిగించాలి. పులుసు వాసన పోయాక బెల్లం, వడియాలు వేసి రెండు నిముషాలు మరిగించి దింపేయాలి. ❒

యక్షప్రశ్నలు

తరచుగా పిల్లలుగాని, పెద్దలు కాని అర్థం కాని విషయాలు ప్రశ్నించినపుడు లేదా ఒక సంఘటనకు మధ్యలో ప్రవేశించిన వారికి గాని, ఎదుటి వారి భావము అర్థంకాక పోయిన కొంతసేపు అయోమయంలో పడిపోతుంటారు. కాస్త నిదానంగా ఆలోచిస్తే తగిన సమాధానాలు చెప్పవచ్చు. ఒక్కొక్కసారి వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని విషయ పరిజ్ఞానము లేకపోయినా వాటికి "యక్షప్రశ్నలు" అని వాడుతుంటాము. ఒక్కొక్కసారి మానసిక పరిపక్వత లేకపోయినా సామాజిక విషయాలపై అవగాహన లేకపోయినా ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై అవతలివారికి తగిన నైపుణ్యం లేకపోయినా సరియగు సమాధానాలు చెప్పలేకపోవచ్చును. అలాంటి వాటిని యక్షప్రశ్నలనే పదం మనవారు వాడుతుంటారు. అసలు ఈ ప్రశ్నల మూలం ఏదని పరిశీలిద్దాం.

ఈ యక్షప్రశ్నలు మహాభారతంలో అరణ్యపర్వంలో యుధిష్టిరుడు(ధర్మరాజు) వనవాసం చేయుచున్న క్లిష్ట పరిస్థితులలో తన తమ్ములు, ద్రౌపదితో న్యాయబద్ధ జీవితాన్ని గడుపుటకై కొన్ని నియమాలను పెట్టుకొని అతిథి అభ్యాగతులను సేవిస్తూ ధర్మబద్ధ జీవనం సాగిస్తుంటారు. ఒకనాడొక బ్రాహ్మణుడు పరిగెత్తుకొంటూ వారి నివాసముల వద్దకు చేరి పాండవులను తనయజ్ఞము చేసుకొనే అరణి కట్టెను (అగ్గిని రగిలించే యంత్రం) ఒక లేడికొమ్ములకు తగిలించుకుని అడవిలోనికి పారిపోయెను. దానిని మీలో ఎవరైనా ఒకరు వెంబడించి నాకు తెచ్చిపెట్టవలసిందిగా వేడుకొనెను. ఎవరైనా ఒకరు వెంబడించి నాకు తెచ్చిపెట్టవలసినదిగా వేడుకొనెను. అంత అర్జునుడు తన విల్లు, అంబులను తీసుకుని లేడి వెంటబడి అరణ్యం అంతర్భాగము (లోపలికి)నకు వెళ్లెను. అతని రాక ఆలస్యము అగుచుండగా, పోయిన తమ్ముని విషయం కనుగొని రమ్మని భీమసేనుని, నకుల, సహదేవులను పంపుతారు. వారు కూడా తిరిగి రారు. ధర్మరాజు వారు వెళ్లిన మార్గంలో వెళ్లి వెదుకుతూ ముందుకు వెళ్లి ఒక సరస్సు వద్ద వారందరూ విగత జీవులై పడి ఉంటారు. వారి దుస్థితికి విచారించి, దీనికి కారణమేమిటని ఆలోచిస్తూ తన దప్పికను తీర్చుకొనుటకై ఆ సరస్సులోకి దిగి దోసిలితో నీరందుకొని తాగబోతాడు. ఆ సమయంలో ఒక అదృశ్యవాణి అతని అడ్డగించి, ఈ సరస్సు నాది, ఈ జలాలు నావి. వాడిన ఎడల నీ తమ్ములకు పట్టిన ప్రమాదం నీకును జరగగలదు. జాగ్రత్త! ఆగు! నా ప్రశ్నలకు తగు సమాధానాలు చెప్పి నన్ను సంతృప్తి చేయుము అని నిలదీసెను. అ ఆ సందర్భంలో ఈ ప్రశ్నలు అడగబడినాయి. పాండవులతో మిగిలిన సోదరులు ఆధ్యాత్మిక, ధార్మిక అంశాలపై అవగాహన

ఆధ్యాత్మికం

లేనివారగుటచే యక్షుడు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రమాదాన్ని కొని తెచ్చుకొనిరి. విగతజీవులైరి అతడు అడిగిన ప్రశ్నలలో మార్మికతను జ్ఞానముపై సాధికారత లేనివారగుటచే అవి అర్థరహితంగా భావించి బుద్ధిబలం వినియోగించక, కండబలం ఉందనే అహంకారముతో యక్షుని మాటలు చెవిని పెట్టక ఊరకనే అపజయులైనారు. ధర్మరాజు తన విచక్షణాశక్తి, వివిధ ధర్మాశాస్త్రాలపై జ్ఞానం, మాటలతో నైపుణ్యం, మార్మిక శాస్త్రంపై అవగాహన, సమయానుకూలంగా చెప్పగల్గే సమయస్ఫూర్తి, అడిగిన వాటిని నిశితంగా పరిశీలించి సూక్ష్మమైన బుద్ధితో తగిన జవాబులు చెప్పి యక్షునిచే మెప్పించబడి తన సోదరులను పునరుజ్జీవింప చేయును. సుఖము శాంతిని పొందును. అవి ఏమనగా మచ్చుకు కొన్ని పరిశీలిద్దాం.

1. ఆకాశం కంటె గొప్ప ఎవరు? తండ్రి
2. భూమి కంటే గొప్పది ఏది? తల్లి
3. ఎండ గడ్డికన్నా హీనం? చింత
4. నిద్రబోయి కండ్లుమూయునది ఏది? చేప
5. గాలి కంటే వేగమయినది ఏది? మనస్సు
6. ఏది విడిస్తే దుఃఖం ఉండదు? కోపం
7. ఎన్నటికీ తగ్గని రోగం ఏది? పిసినారితనం
8. ఏది మానుకుంటే మనిషికి సంపద కలుగుతుంది. ఆశ
9. ఈ లోకంలో అన్నింటి కంటే వింతైనదేది. ఇతరులు చనిపోవటం చూస్తూ గూడా మానవులు కలకాలం బతకాలనుకోవటం.
10. గొప్ప స్నానం ఏది? మనసు శుద్ధి చేసుకొనుట.

ఇంకా ప్రశ్నలు చాలా అడిగెను. అన్నింటికి ఓపికగా జవాబులు చెప్పెను. ఫలితం పొందెను.

- ఎల్. శ్రీనివాసరావు



సినిమాలే నా ప్రపంచం

నటుడు మోహన్‌బాబు

డాక్టర్ ఎం మోహన్‌బాబు నటిస్తూ అరియానా, వివియానా , విద్యానిర్వాణ సమర్పణలో శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్‌పై నిర్మిస్తున్న చిత్రం 'గాయత్రి'.. మదన్ దర్శకుడు.. తమన్ సంగీతం అందించిన ఈసినిమా ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది.. డాక్టర్ మోహన్‌బాబు ఆడియో సిడిలను ఆవిష్కరంచారు. కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడారు.. మోహన్‌బాబు వెండితెరపై స్టైలే వేరని అన్నారు. 560 సినిమాలకు పైగా నటించటం గొప్ప విషయమన్నారు.. ఆయన తనకెంతో ఆత్మీయుడని అన్నారు.. వైవిధ్యమైన నటన మోహన్‌బాబు సొంతం అన్నారు. ఈసినిమా కచ్చితంగా సూపర్‌హిట్ అవుతుందన్న నమ్మకం ఉందన్నారు. మోహన్ బాబు మాట్లాడుతూ, పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయని అంటుంటా.. అలాగే సినిమాను కష్టపడితీయగలుగుతాయం. కానీ జయా పజయాలు ప్రేక్షకుల చేతిలోనే ఉంటాయన్నారు. నాకు తెలిసింది సినిమా ఒక్కటే. అన్నారు. ఇంకేం తెలియదని అన్నారు. నటుడిగా ఉంటాను,నిర్మాతగా సినిమా చేశాను..ఇవి తప్ప వేరే వ్యాపకాలు లేవని అన్నారు. గాయత్రిసినిమాను కష్టపడి చేశాం. ఫలితం మాత్రం దేవుడి చేతిలోనే ఉందన్నారు. ఎంత అణిగిమణిగి, సౌమ్యంగా ఉంటే అంత గొప్ప ఆశీర్వాదాన్ని దేవుడు మనకు ప్రసాదిస్తాడని అన్నారు.. నన్ను నటుడిగా పరిచయం చేసింది మా గురువుగారు దాసరిగారు అని.. నాకు ఎన్ని మంచి పాత్రలు ఇచ్చారో తనకు తెలుసునని, ఆయన లేకపోవటం పెద్దలోటు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నటుడు గిరిబాబు, మంచు లక్ష్మి, తనికెళ్ల భరణి, అనసూయ భరద్వాజ్, డాక్టర్ బ్రహ్మానందం, మంచుమనోజ్, బి.గోపాల్, కోట శ్రీనివాసరావు, నటి శ్రియా, మంచు విష్ణు, దర్శకుడు మదన్ మాట్లాడారు.

శ్రీకాంత్ సినిమా రిలీజ్ డేట్



శ్రీకాంత్ హీరోగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా ,విలన్‌గా వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు.. తాజాగా శ్రీమిత్ర చౌదరి సమర్పణలో శ్రీకాంత్ హీరోగా నటిస్తున్న సినిమా 'రా..రా'.. శ్రీకాంత్ సరసన నజియా హీరోయిన్‌గా నటిస్తోంది.. ఈసినిమా ఫిబ్రవరి23న విడుదల కానుం ది.. ఇటీవల అనంతపురంలో జరిగిన టాలీవుడ్ క్రికెట్ మ్యాచ్‌లోఈ సినిమా ఆడియోను విడుదల చేశారు.. కామెడీ హారర్, థ్రిల్లర్‌గా తెరెకెక్కిన ఈసినిమా విజి చరిఫ్ విజన్స్ పతాంకపై నిర్మించబడింది.. గిరిబాబు, ఆలీ, పోసాని, పృధ్వీ ప్రధాన పాత్రల్లో నటించారు.. విజి చరిష్ దర్శకత్వం వహించారు.. రాప్‌రాక్ సంగీతం అందించారు. మనుషులకు దెయ్యాలకు మధ్య జరిగే సరదా సన్నివేశాలతో ఈసినిమా ఉంటుందన్నారు.



రూ.300 కోట్లు, 32 భాషలు



దక్షిణాది స్టార్ హీరోల్లో ఒకరైన విక్రమ్ ఈ మధ్యే తన తమిళ, హిందీ ద్విభాషా చిత్రం 'మహావీర్ కర్ణ'ను ప్రకటించిన సంగతి తెలిసిందే.. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మితం కానున్న ఈ చిత్రాన్ని న్యూయార్క్‌కు చెందిన యునైటెడ్ ఫిలిమ్స్ కింగ్డమ్ సంస్థ నిర్మించనుండగా, ఆర్‌ఎస్ విమల్ డైరెక్టు చేస్తున్నారు.. ఇండియాలోనే అత్యంత ఖరీదైనదిగా చెప్పబడుతున్న ఈ ప్రాజెక్టు ను సుమారు 32 అంతర్జాతీయ భాషల్లో విడుదల చేయనున్నారు.. అలాగే ఏ భారతీయ చిత్రానికి దక్కనంత భారీ రిలీజ్ ఈ సినిమాకు దక్కనుందట.. ఈ ఏడాది అక్టోబర్‌లో మొదలు కానున్న ఈచిత్రాన్ని 2019 ఆఖరుకి విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి..

నిజంగా ఇక్కడే బాగుంది

మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతోంది?

సినిమాలో నా పేరు పుష్ప.. సాధారణంగా హీరోయిన్లకు కామెడీ చేయటానికి స్కోప్ ఉండదు.. కానీ ఇందులో నాకు ఆ అవకాశం వచ్చింది.. రవితేజకు, నాకు మంచి కామెడీ సీన్స్ ఉంటాయి..

మీ ఫెర్ఫామెన్స్‌కు కాంప్లిమెంట్స్ ఏమైనా వచ్చాయా?

డబ్బింగ్ పూర్తికాగానే హీరో రవితేజగారు నాకు ఫోన్ చేసి చాలా బాగా చేశావు అని అన్నారు. అదే నాకు బిగ్ కాంప్లిమెంట్.

రవితేజతో వర్క్ ఎలా ఉంటుంది?

ఆయన చాలా ఎనర్జిటిక్‌గా ఉంటారు.. సెట్సలోఎప్పుడూ సరదాగా నవ్వుతూ, నవ్విస్తూ ఉంటారు.. ఆయనతో వర్క్ నిజంగా చాలా బాగుంటుంది.. ఆయనతో ఇంకో సినిమా చేసే అవకాశం వచ్చినా చేసేస్తాను.

ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎందు కోసం?

సినిమాకోసం , నా కోసం కూడ. ముఖ్యంగా నా కోసం తగ్గాను.

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'టచ్‌చేసి చూడు'. ఈచిత్రంలో రాశిఖన్నీ, సీరత్‌కపూర్ హీరోయిన్లుగా నటించారు. ఫిబ్రవరి 2న ఈసినిమా రిలీజ్ కానుంది.. ఈసందర్భంగా సోమవారం రాశీఖన్నా ఈచిత్రం గురించి మీడియాతో మాట్లాడారు.. ఆ వివరాలు మీకోసం..

టచ్ చేసి చూడు ఎలా ఉండబోతోంది?

ఇదొక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ కథ.. ఇందులో మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి.. అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది.

తెలుగు బాగా నేర్చుకున్నారు.. డబ్బింగ్ మీరే చెప్పుకోవచ్చు కదా?

అవును. నేను కూడ డబ్బింగ్ చెప్పాలని అనుకున్నాను.. కానీ టైం దొరకలేదు.. డబ్బింగ్ చెప్పాలంటే ఎక్కువ సమయం పడుతోంది.. అందుకే కుదరలేదు.

ఒకవైపు గ్లామర్ , మరోవైపు నటనకు ఆస్కారమున్న రోల్స్ చేస్తున్నారు.. ఎలా ఉంది?

చాలా బాగుంది.. ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేస్తే బోర్ అన్పిస్తుంది.. అందుకే భిన్నమైన పాత్రలు చేయాలి

సీనియర్, యంగ్ హీరోలతో చేయటం ఎలా ఉంది?

బాగుంది సీనియర్ హీరోలతో వర్క్ అపుడు వాళ్ల నుంచి చాలా నేర్చుకోవచ్చు.. యంగ్ హీరోలతో నటించేటపుడు వాళ్లతోపాటే కొత్తవి నేర్చుకోవటానికి ట్రై చేస్తుంటాను.

బాలీవుడ్ ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా?

లేవండీ.. నేనైతే ఎలాంటి ప్రయత్నాలు చేయట్లేదు.. నాకిక్కడే బాగుంది.. మంచి సినిమాలు . పాత్రలు వస్తున్నాయి. చాలా హ్యాపీగా ఉంది.



సీనియర్‌నటుడు మోహన్‌బాబు నటించి 'గాయత్రి' చిత్రం ఫిబ్రవరి 9న రిలీజ్ కానుంది.. ఈసందర్భంగా చిత్రంలో కీలకపాత్ర పోషించిన నటి శ్రియ శరన్ మీడియాతో మాట్లాడారు.. ఆవిశేషాలు..

నేను చాలా లక్కీ

ఈసినిమాలో మీపాత్ర ?

ఇందులో నేను ఒక చిన్న పల్లెటూరుకు చెందిన అమ్మాయిగా కన్పిస్తా.. నా క్యారెక్టర్ చాలా ఇన్నోసెంట్‌గా నిజాయితీగా, తెలివిగా ఉంటుంది.

ఈసినిమాను ఒప్పుకోవటానికి కారణం?

డైరెక్టర్ మదన్ చెప్పిన కథ బాగా నచ్చింది.. నా పాత్ర కూడ సహజంగా, అందంగా ఉంటుంది.. అందుకే ఈసినిమా చేయటానికి ఒప్పుకున్నాను.

సినిమా షూటింగ్‌లో మీ అనుభవాలు?

షూటింగ్ చేసినన్ని రోజులుచాలా బాగా ఎంజాయ్ చేశాను.. నా మీద ఒక అందమైన పాట కూడ ఉంది.. ముఖ్యంగా నా కాస్ట్యూమ్స్ డిజైనర్ డిజైన్ చేసిన డ్రెస్సులు చాలా బాగున్నాయి.

డైరెక్టర్ మదన్ వర్క్ ఎలా ఉంది?

దర్శకుడు మదన్ చాలా కూల్‌గా ఉంటారు.. ఎక్కడా ఇబ్బందిపడలేదు.. ప్రతి ఒక్కరినీ కంఫర్ట్‌గా ఉంచుతారు.. ఆయనతోకలిసి పనిచేయటం చాలా బాగుంది.

ఇంత లాంగ్ కెరీర్ కొనసాగించటం వెనుక సీక్రెట్?

దర్శకులు, రచయితలు మంచి కథలు, పాత్రలు రాస్తున్నారుకాబట్టి నా కెరీర్ చాలా బాగుంది.. అలాగే నేను ఎంచుకునే సినిమాలు కూడ నాకు బాగా కలిసొచ్చాయి.. అంతేకాదు నేను లక్కీ కూడ..

మీ తర్వాతి సినిమాలు?

తెలుగులో 'వీరభోగ వసంతరాయలు' చేస్తున్నాను.. తమిళంలో కార్తీక్ నరేన్‌తో 'నరగసూరన్' చేస్తున్నాను..తర్వాత శాతకర్ణి సినిమా కెమెరామెన్ నిర్మాతగా మారి సినిమా చేస్తున్నారు.. అందులో కూడ నటిస్తున్నాను.. ఆ చిత్రాన్ని ఒక లేడీ డైరెక్టర్ డైరెక్టు చేయనున్నారు.

యువ దర్శకులతో వరుస సినిమాలు చేయటానికి కారణం?

వాళ్లు రాసే కథలే ప్రధాన కారణం.. వసంతరాయలుసినిమాకు ఆ దర్శకుడు రాసిన కథ చాలా బాగుంటుంది.. అలాగే కార్తీక్ నరేన్ రాసిన కథ కూడ చాలా బ్యూటిఫుల్ స్టోరీ. అంత బాగా రాశారు కాబట్టే నేను చేయటానికి ఒప్పుకున్నాను.

'ఎన్‌హెచ్ 47 బూత్ బంగ్లా'



ఏకే 9 స్టూడియోస్ ఫిలిమ్స్ సమర్పణలో ఆజయ్ కౌండిన్య ,సంధ్య, అనూష హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'ఎన్‌హెచ్ 47 బూత్ బంగ్లా.. ఈచిత్రం ఆడియో ఫిలింఛాంబర్‌లోజరిగింది.. ఠాగూర్ బాలాజీ సింగ్ , వి., ఆంజనేయ అతిథులుగా సిడిలను ఆవిష్కరించారు.. కార్యక్రమంలో దర్శకుడు అజయ్ కౌండిన్య, సంగీత దర్శకుడు చైతన్య రాజ, నిర్మాత అరుణాచలం, సంధ్య, అనూష, శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎక్కడ నా ప్రేమ'

మనోజ్ నందం. సౌందర్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎక్కడ నాప్రేమ'. గాయత్రి సినీ క్రియేషన్స్ సమర్పణలో నంది క్రియేషన్స్ సంస్థ ఈచిత్రాన్ని నిర్మిస్తోంది.. ఎస్.రామకృష్ణ, వడ్డే గోపాల్ నిర్మాతలు.. ఎఎండి హుస్సేన్ దర్శకత్వం వహించారు.. ఘనశ్యామ్ సంగీతం అందించిన ఎక్కడ నా ప్రేమ ఆడియో



కార్యక్రమం హైదరాబాద్‌లో ప్రసాద్‌ల్యాబ్స్ లోజరిగింది. నిర్మాతలు మాట్లాడుతూ, రెండు తరాల వ్యక్తిత్వాన్ని చూపిస్తున్నామన్నారు. సెన్సార్‌క్లీన్ యు సర్టిఫికెట్ అందించిందని,, ఫిబ్రవరి 22న ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోందని అన్నారు.

శీలవతి



జీ స్టూడియోస్ పతాకంపై మలయాళం సూపర్‌స్టార్ షకీలా హీరోయిన్‌గా, సాయిరాం దాసరి దర్శకత్వంలో రాఘవ ఎం.గణేష్ , వీరు బాసింశెట్టి నిర్మించిన సైకలాజికల్ థ్రిల్లర్ 'శీలవతి'.. ఇటీవలే షూటింగ్ పూర్తిచేసుకుంది. హైదరాబాద్‌లో శీలవతి మూవీ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.. దర్శకుడు మాట్లాడుతూ మా హీరోయన షకీలా కు ఇది 250వ చిత్ర మన్నారు.. కేరళలో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈచిత్రాన్ని తెరకెక్కించామన్నారు..

నాగశౌర్య, రష్మిక మందన్న హీరో హీరోయిన్లుగా నటించిన చలో చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది.. ఈచిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కాబోతున్న వెంకీ కుడుముల ఈచిత్రం రిలీజ్ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా

మీ నేపథ్యం?

మాది ఖమ్మం జిల్లా అశ్వారావుపేట. సినిమా పరిశ్రమపై ఆసక్తితో డైరెక్టర్ తేజ గారి దగ్గర సహాయకుడిగా జాయిన్ అయ్యాను. ఆయన దర్శకత్వం వహించిన నీకు నాకు డాష్ డాష్ సినిమాలో చిన్నపాత్రలో కూడ నటించాను.. ఆ తర్వాత త్రివిక్రమ్ అ ఆ సినిమాకు దర్శకత్వశాఖలో పనిచేశాను.

చలో సినిమా ఎలా ప్రారంభమైంది?

నాగశౌర్య నటించిన జాదుగాడు. సినిమాకు నేను డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేశాను.. ఆ సమయంలో నాగశౌర్య ఒక స్క్రిప్టు రెడీ చేసుకుని రమ్మనిచెప్పగా నేను చలో స్టోరీ విన్పించాను.. ఆది నచ్చి వెంకటే ఒకే చేశారు. ఆ తర్వాత సినిమా ప్రారంభమైంది..



తొలిసినిమా నాగశౌర్య హోమ్ ప్రొడక్షన్స్‌లోచేశారు.. దాని గురించి?

నా కథను నమ్మి నాగశౌర్య పేరెంట్స్ డబ్బుపెట్టి చిత్రాన్ని నిర్మించినందుకు వారికి కృతజ్ఞతలు చెప్పాలి.. నాపై వారి నమ్మకాన్నివమ్ము చేయకుండా సినిమాను తెరకెక్కించటం జరిగింది.ఎలాంటి కాంప్రమైజ్ కాలేదు..

హీరోయిన్ రష్మిక మందన్నను ఎంపిక చేయటం కారణం?

చలో అనేది ప్యూర్ లవ్‌స్టోరీ. ఈసినిమా కోసం కొత్త అమ్మాయి అయితే బాగుంటుందని అనుకున్నాను.. అలాగే కన్నడలో కిరిక్ పార్టీ చూశాక రష్మిక ఈ కథకు షూట్ అవుతుందన్పించింది.. ఆ తర్వాత నాగశౌర్య పేరెంట్స్‌ను సంప్రదించటం వారు ఒకే అనటంతో ఫైనల్ చేశాము.

సంగీత దర్శకుని గురించి?

సాగర్ ..మణిశర్మగారి అబ్బాయిఅని అందరికీ తెలుసు.. జాదుగాడు సినిమా సమయంలో ఆయన నాక పరిచయం అయ్యారు.. ఛలో సినిమాకు సాగర్ బాగుంటుందని నాగశౌర్య చెప్పగా, ఆయన సరే అన్నారు.. నా నమ్మకం ప్రకారమే సాగర్ చలో సినిమాకు అద్భుతమైన సంగీతం అందించారు.

మీ తదుపరి సినిమా?

ప్రస్తుతం నేను ఈసినిమా విడుదల కోసం వెయిట్ చేస్తున్నాను.. చలో రిలీజ్ అయ్యాక కొత్త సినిమా స్క్రిప్టు పనులు ప్రారంభిస్తాను.

మౌలికరంగానికి రూ.4.5లక్షల కోట్ల డాలర్లు

భవిష్యత్ ప్రణాళికలపై ఆర్థికసర్వే



న్యూఢిల్లీ, జనవరి 29: మౌలికవనరులరంగాన్ని అభివృద్ధి చేయాలంటే 2040 నాటికి భారత్‌కు 4.5 లక్షల కోట్ల డాలర్ల నిధులు అవసరం అవుతాయని ప్రధాన ఆర్థికసలహాదారు అరవింద్ సుబ్రహ్మణియన్ అంచనావేసారు. ప్రస్తుతధోరణులప్రకారం చూస్తే భారత్ సుమారు 3.9 లక్షల కోట్ల డాలర్ల ఇన్‌ఫ్రాపెట్టుబడులను సమకూర్చుకోగలదని అంచనా వేసారు. అయితే 4.5 లక్షల కోట్ల డాలర్ల వరకూ పెట్టుబడులు అవసరం అవుతాయని అన్నారు. అంతర్జాతీయంగా మౌలికవనరుల పరిస్థితిని చూస్తే ఆదాయవనరుల స్థాయి పెరుగుతున్నదని, ఆర్థిక రంగంలో మరింత వృద్ధి కనిపిస్తోందని, దీనివల్ల ఇన్‌ఫ్రా పెట్టుబడులకు మరింత డిమాండ్‌కలుగుతుందని, రానున్న 25 ఏళ్లలో మరింత డిమాండ్ పెరుగుతుందని అన్నారు. ఇదే తరుణంలో భారత్ వృద్ధికిగాను 2040వరకూ 4.5 లక్షల కోట్ల డాలర్లు అవసరం అవుతాయని ఆర్థికసర్వే నివేదికలో అరవింద్ ఉటంకించారు. ఆర్థికవృద్ధి, సామాజిక వృద్ధి, వారి జీవనశైలిని వృద్ధిచేసేందుకు ఈ రంగం అవసరం అవుతుందన్నారు. భారత్‌మౌలికవనరుల రంగంలో పెట్టుబడులు 2040 నాటికి 526 బిలియన్ డాలర్ల అవసరం అవుతాయని అంచనావేసింది. అవసరమైన మౌలికవనరుల పెట్టుబడులు,ప్రస్తుత పెట్టుబడులధోరణులు కూడా ఏటికేడాది పరిధిని పెంచు కోవాల్సి ఉంటుందని అన్నారు. ప్రైవేటు పెట్టుబడులు పెరగడం, సంస్థాగతంగా పెట్టుబడులు సమీకరించుకోవడం కీలకమని, నేషనల్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు వంటి అంతర్జాతీయసంస్థలు, ఆసియా ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు అంటే బ్రిక్స్‌బ్యాంకుల నుంచి పెట్టుబడులకు నిధులు రాబట్టుకునే అవసరం ఏర్పడుతున్నదన్నారు. మౌలికవనరులరంగంలో ఇప్పటికీ పెట్టుబడుల కొరత ఉన్నదని, ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్య విధానం కొంతమేర నిలిచిపోవడంతో ఈ పరిస్థితి ఎదురయింది. ప్రత్యేకించి విద్యుత్, టెలికాం ప్రాజెక్టుల్లో పెట్టుబడులు నిలిచిపోయాయి. అలాగే ప్రైవేటు కంపెనీల్లో ఆస్తిఅప్పులపట్టీలు సమన్వయంకాలేకపోవడం కూడా కొంత పెట్టుబడులకు విఘాతం కలిగించింది. అలాగే కొన్ని ప్రాజెక్టులపరంగా భూసేకరణ, అటవీశాఖ అనుమతులు క్లిరెన్సుల్లో జాప్యం కూడా మరికొంత కారణం అయిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఆర్థికవ్యవస్థకు గణనీయంగా రవాణారంగం నుంచే ఎంతోకొంత మకూరుతోంది. రోడ్ల నిడివి 57.17 మిలియన్ కిలోమీటర్లకు పెంచే ప్రతిపాదనలు జరుగుతున్నాయి. అలాగే 2001లో 33.73 మిలియన్ల కిలోమీటర్లు మాత్రమే ఉన్నాయని, అలాగే వాహనాలు నాలుగురెట్లుపెరిగి 229 మిలియన్లకు చేరాయని ఆర్థికసర్వే ఉటంకించింది. జపాన్, అమెరికా, చైనా, బ్రెజిల్, రష్యాలకంటే భారత్‌లో రోడ్ల సాంద్రత ఎక్కువగానే ఉందని అయితే బ్రిటన్, రష్యా, చైనాలతో పోలిస్తే తక్కువని అంచనా వేసింది. 2017 సెప్టెంబరునాటికి 1263 అమలవుతున్న ప్రాజెక్టుల్లో 482 ప్రాజెక్టులు రోడ్డు రవాణా, హైవేలపరంగా ఉన్నాయని, వీటి ఖర్చు 3.17 లక్షల కోట్ల రూపాయలని తేల్చింది. మొత్తం 43ప్రాజెక్టులు నిర్మాణవ్యయం పెరిగిందని, 74 ప్రాజెక్టులకాలపరిమితి ముగిసిపోయిందని తేల్చింది. ఇక రైల్వేరంగపరంగాచూస్తే ఆర్థికసర్వేలో ఇతర రవాణా విభాగాల నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నదని అన్నారు. మెట్రోరైల్‌పరంగా చూస్తే 425 కిలోమీటర్ల మెట్రోరైల్ వ్యవస్థలు ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, జైపూర్, లక్నో, కోచి నగరాల్లో అమలులో ఉన్నాయి. మరో 684 కిలోమీటర్ల మేర నిర్మాణంలో ఉన్నాయని, డిసెంబరు నాటికిపూర్తి కావాల్సి ఉందని ఆర్థికసర్వే వెల్లడించింది. ఇక పౌర విమానయానశాఖపరంగాచూస్తే మొత్తం 50 వరకూ ఇప్పటివరకూ పనిచేయని ఎయిర్‌పోర్టుల పునరుద్ధరణకు 4500 కోట్లు కేటాయించినట్లు వివరించారు. అంతేకాకుండా డిసెంబరు నాటికి పూర్తిచేసేందుకు వీలుగా బడ్జెట్ మద్దతు కూడా పొందనున్నట్లు ఆర్థిక సర్వేలో ప్రస్తావించారు. ఇక షిప్పింగ్‌పరంగాచూస్తే 2017-18 ప్రాజెక్టులు రూ.10వేల కోట్లతో ప్రారంభించి 80ఎంఎంటిపిఎ సామర్ధ్యానికి పెంచుతున్నట్లు వెల్లడించారు. వీటిలో 15ప్రాజెక్టుల్లో పెట్టుబడులు 3,159 కోట్ల రూపాయలుగా ఉన్నాయని, వీటి సామర్ధ్యం 18ఎంటిపిఎకుపెంచేందుకు ఇప్పటికే పనులు కేటాయించామన్నారు. ఇక భారత్‌మాలా, సాగర్‌మాలా వంటివి హైవే,షిప్పింగ్‌రంగాల్లో కీలకమైనవిగా మారాయి. సాగర్‌మాలా పరిధిలో ఓడరేవులు ఇక మాస్టర్‌ప్లాన్లు ఖరారు చేసినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. మొత్తం 131పోర్టుల సామర్ధ్యం విస్తరణప్రాజెక్టులు 85,436 కోట్ల రూపాయలతో చేపట్టినట్లు తెలిపారు. వచ్చే 20 ఏళ్లలో ఈప్రాజెక్టులు పూర్తవుతాయి. భారత్‌దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి సామర్ధ్యం 330860.6 మెగావాట్లకు పెంచేలక్ష్యంతో ఉందని సర్వేలో వెల్లడించారు. ఇక రావాణారంగానికి సంబంధించి భారతీయ రవాణా మర్కెట్ 2020 నాటికి 215 బిలియన్ డాలర్లకు చేరుతుందని, సంఘటిత వృద్ధి 10.5శాతంగా ఉంటుందని అంచనా. టెలికాం రంగపరంగాచూస్తే రెండోదశలో భారత్‌నెట్ 1.5 లక్షల పంచాయితీలకు చేరుతుందని, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌క 2019 మార్చినాటికి పూర్తవుతుందని వెల్లడించింది.

లాభాలు / నష్టాలు

రూ.లలో రూ.లలో

కంపెనీ పేరు	ప్రస్తుత ధర రూ.లలో	మార్పు శాతం
డాక్టర్‌రెడ్డీస్	2561.85	1.56
ఇండిగో	1237.90	3.70
బజాజ్‌ఆటో	3335.60	1.25
ఇన్‌ఫ్రాటెల్	343.00	1.11
ఐఒబి	23.50	1.08
హెచ్‌సిఎల్	1018.85	2.55
అపోలోటైర్స్	267.25	1.00
టిసిఎస్	3174.60	2.30
టెక్‌మహీంద్ర	601.35	2.30
ఇన్ఫోసిస్	1185.15	0.85
జెఅండ్‌కెబ్యాంకు	76.65	0.72

మార్కెట్ నష్టాలు (బిఎస్ఇ)

జెట్‌ఎయిర్‌వేస్	772.85	-2.85
ఐడియా	94.05	-5.38
ఐసిఐసిఐబ్యాంకు	352.65	-2.60
జిందాల్‌స్టీల్	276.65	-4.85
గ్రాసిమ్	1197.20	-2.16
హిండాల్కో	259.45	-2.02
టైటాన్	887.10	-1.85
ఎన్ఎండిసి	145.05	-2.94
సైయింట్	643.00	-3.10
టాటామోటార్స్	403.60	-3.46
నాట్కోఫార్మా	991.20	-2.50

వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870

(రూ. కిలోకు)	(Rs. Per Kg)	
ఫామ్‌గేట్	(Farmgate)	80
డ్రెస్డ్	(Dressed)	102
విత్ స్కిన్	(with skin)	148
స్కిన్‌లెస్	(Skinless)	168

గుడ్ల ధరలు

Ph:040-23234068

నెక్ రేట్లు (30 - 1 - 2018) NECC RATES

వందకు, రూ.లలో	Rs.per 100 eggs	
హైదరాబాద్	402	Hyderabad
(రిటైల్ ధర రూ.4.60	(Retail Price Rs.4.60)	
విజయవాడ	412	Vijayawada
గోదావరి	412	Godavari
విశాఖపట్నం	412	Visakha
వరంగల్	404	Warangal
చిత్తూరు	398	Chittoor
చెన్నై	405	Chennai
ముంబయి	447	Mumbai
న్యూఢిల్లీ	425	New Delhi
కోల్‌కతా	464	Kolkata
బెంగళూరు	408	Bangalore
నమక్కల్	390	Namakkal

బులియన్ ధరలు

	29 న ముగింపు	క్రితం ముగింపు
ఢిల్లీ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30690	30600
22 క్యారెట్లు (10గ్రా)99.5	28810	28720
వెండి .999 (కేజీ)	41977	42446
ముంబయి		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30670	30580
22 క్యారెట్లు (10గ్రా)99.5	28790	28700
వెండి .999 (కేజీ)	41969	42464
చెన్నయ్		
24 క్యారెట్లు10(గ్రా)	30700	30610
22 క్యారెట్లు	28820	28730
వెండి బార్ (కేజీ)	41985	42456
హైదరాబాద్		
24 క్యారెట్లు (10గ్రా)	30750	30650
22 క్యారెట్లు (10గ్రా)	28870	28770
వెండి (కేజీ)	41992	42482
విజయవాడ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30700	30610
22 క్యారెట్లు (10గ్రా)99.5	28820	28730
వెండి .999 (కేజీ)	41977	42446
విశాఖపట్నం		
24 క్యారెట్లు10(గ్రా)	30700	30610
22 క్యారెట్లు	28820	28730
వెండి బార్ (కేజీ)	41977	42446

బడ్జెట్‌పైనే రియాల్టీ రంగం చూపు!

ముంబై, జనవరి 29: ప్రతీఏటా కేంద్ర బడ్జెట్ వస్తోందని అనగానే అన్ని రంగాలు అలర్ట్ అయిపోతాయి. అటు ఆర్థిక రంగాన్ని ఇటు దేశ ప్రగతిని, మరోవైపు రాజకీయ ప్రయోజనాలను, ఇంకోవైపు ప్రజల సంక్షేమానికి సమతూకం పాటిస్తూ బడ్జెట్ రూపకల్పన చేసేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుంది. కొన్నిసార్లు కఠిన నిర్ణయాలకు కూడా వెనుకాడని వైనం కనిపిస్తుంది. అందుకే బడ్జెట్ అందరినీ అన్నిసార్లు మెప్పించడం సాధ్యంకాదు. అయితే వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు రానుండడంతో, ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్రం ప్రజల సంక్షేమానికి మొగ్గనుందనే అంచనాలు ఉన్నాయి. దేశ అభివృద్ధిలో అత్యంత కీలకపాత్ర రియాల్టీ రంగానికి ఉంటుంది. వాస్తవానికి రియల్‌ఎస్టేట్ రంగానికి ప్రస్తుత బిజెపి ప్రభుత్వం బాగానే సహకరిస్తోంది. డిమానిటైజేషన్, రెరా చట్టం వంటి వాటితో రియాల్టీ స్పీడ్ తగ్గడంతో, ఆ తర్వాత నిర్మాణ రంగానికి ప్రోత్సాహం ఇచ్చే చర్యలు చేపట్టారు. ముఖ్యంగా అందరికీ ఇల్లు అంటూ చేపట్టిన అఫోర్డబుల్ హౌసింగ్, రియాల్టీ రంగానికి ఊతం ఇచ్చింది. రియాల్టీరంగాన్ని క్రమబద్ధీకరించడంలో కేంద్రం అత్యంత చురుకుగా వ్యవహరిస్తున్నా, పలు పాలసీ సంబంధిత అంశాలలో కొన్ని కీలకమైన అంశాలపై, బడ్జెట్ 2018లో స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు రియల్టర్లు. సింగిల్ విండో క్లియరెన్స్ అంశంపై చాలా కాలంగా మాటలు వినిపిస్తున్నా, ఇది అత్యంత ఆవశ్యకత గత అంశం అని ఈ రంగం కోరతున్నా, 2022నాటికి అందరికి సొంతిల్లు అంటూ కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకటించినా, ఇప్పటివరకూ ఇది ఎందుకు సాధ్యమవలేదు అంటే అదో మిస్టరీ అనాల్సిందే. రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు సింగిల్ విండో క్లియరెన్స్ అమలు చేయగలిగితే, ఎంతో సమయా ఆదా అవుతోంది. ఇది రియల్టర్లకు వడ్డీభారం తగ్గించి, ఆ మేరకు కస్టమర్లకు కూడా ప్రయోజనం చేకూర్చుతుంది. వ్యాపార వాతావరణం కూడా మెరుగవుతుందంటూ పలువురు నిపుణులు చెబుతున్నా, ఇంకా ఇది అమలులోకి రావడంలేదు. తమకు పరిశ్రమ హోదా ఇవ్వాలని



రియల్ ఎస్టేట్ రంగం ఎప్పటి నుంచో కోరుతున్నా, ఇప్పటికీ ఇదిసాధ్యపడలేదు. జిడిపి వృద్ధిలో అత్యంత కీలకమైన ఈ రంగాన్ని ఇండస్ట్రీగా పరిగణించాలంటూ డిమాండ్స్ ఎక్కువవుతున్నాయి. మన దేశంలో నాలుగో అతిపెద్ద ఉపాధి కల్పన రంగం రియాల్టీ. పరిశ్రమ హోదా దక్కితే డెవలపర్స్‌కు తక్కువ వడ్డీరేట్లకే రుణాలను పొందే సదుపాయం ఉండడంతో, ప్రాజెక్టు కాస్ట్ తగ్గుతుంది. ఇది డిమాండ్ పెరిగేందుకు కూడా కారణం కానుంది. మనదేశంలో ఆర్ఐటిల లిస్టింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. వీటి లిస్టింగ్‌పై ఉన్న కఠిన పన్ను నిబంధనలను కొంతమేర అయినా సడలించడం ద్వారా రియాల్టీ రంగంలో ఇన్వెస్టర్ల పెట్టుబడులను పెంచేందుకు అవకాశాలు ఉన్నాయి. ప్రతీసారి రియల్ ఎస్టేట్ సెక్టార్‌లో జోష్ తెచ్చే అంశాల్లో రెసిడెన్షియల్ విభాగం ఒకటి. ప్రస్తుతం తొలిసారి ఇల్లు కొనేవ్యక్తి. ఐటి యాక్ట్‌లోని సెక్షన్ 80ఈఈ ప్రకారం రూ.50వేలవరకుపన్ను మినహాయింపు పొందవచ్చు. ఈ పరిమితిని మరింతగా పెంచే యోచనపై సమాలోచనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఆస్తులపై 12శాతం జిఎస్‌టి విధిస్తున్నారు. గత పన్నులతో పోలిస్తే ఇది బాగా ఎక్కువే. రియల్ ఎస్టేట్ రంగానికి ప్రోత్సాహం ఇచ్చేందుకు, డిమాండ్ పెరిగేందుకు చర్యలు తీసుకో వడంలో భాగంగా జిఎస్‌టి తగ్గించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అలాగే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విషయంలో కూడా మరింత స్పష్టత కావాలని కోరుకుంటున్నారు. పట్టణ పర్యావరణం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. కానీ గ్రీన్ బిల్డింగ్‌ల ప్రస్తుతం ఎక్కువ ఖర్చుతో కూడు కున్న విషయం. అందుకే డెవలపర్లు ఈవైపుగా అంతగాఅడుగులు వేయడం లేదు. ప్రస్తుత, భవిష్యసవాళ్లకు సిద్ధంకావడంలో భాగంగా, గ్రీన్‌బిల్డింగ్ నిర్మాణాలకు, సాంకేతికతకు కేంద్రం ప్రోత్సాహం ఇచ్చే అవకాశాలున్నాయి.

12ఏళ్ల తర్వాత బడ్జెట్ ముందు మార్కెట్ల జోరు

ముంబై, జనవరి 29: 34,000, 35,000, 36,000 బాంబే స్టాక్ ఎక్ఛేంజీ సెన్సెక్స్ ఇటీవల అనతికాలంలోనే దాటేసిన అరుదైన మైలురాళ్లు. చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా నెల రోజుల వ్యవధిలోనే సెన్సెక్స్ 2000పాయింట్లు పెరిగింది. అటు జాతీయ స్టాక్ ఎక్ఛేంజీ నిఫ్టీ కూడా



జోరును అందిపుచ్చుకుంటూ 11వేల మైలురాయిని తాకింది. 2018 ఆరంభం నుంచి మార్కెట్ల జైత్రయాత్ర కొనసాగుతూనే ఉంది. మధ్య మధ్యలో కొన్ని ఆటుపోట్లు వచ్చినప్పటికీ నిలదొక్కుకుంటూ చరిత్ర పుటల్లో కొత్త రికార్డులను లిఖిస్తున్నాయి. అక్టోబరు-డిసెంబరు ఆశాజనక త్రైమాసిక ఫలితాలు, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, ఇలా కారణాలు ఏవైనా 2018-19 బడ్జెట్‌కు ముందు మాత్రం సూచీల దూకుడు ఆగట్లేదు. అయితే ఇలా బడ్జెట్‌కు ముందు దేశీయ మార్కెట్లు రికార్డుస్థాయిలో లాభపడటం 12ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. గతంలో 2006బడ్జెట్ సమావేశాలకు ముందు సెన్సెక్స్ 5శాతం వరకు లాభపడింది. సమావేశాల తర్వాత కూడా దాదాపు 7శాతంపెరిగింది. ఆ తర్వాత మళ్లీ అలా జరిగిన దాఖలాలు లేవు. 2007 బడ్జెట్ సమావేశాలకు ముందు సెన్సెక్స్ భారీగా పతనమైంది. దాదాపు 9శాతం వరకు నష్టపోయింది. ఆ తర్వాత కోలుకోవడానికి చాలా సమయమే పట్టింది. గతేడాది ముందు వరకు బడ్జెట్ సమావేశాలకు ముందు సూచీలకు నష్టాలు తప్పలేదు. బడ్జెట్ తర్వాతే మెరుగుపడ్డాయి. అయితే 2017 బడ్జెట్ సమావేశాలకు ముందు మాత్రం సూచీలు కాస్త లాభాల్లోనే కదలాడినా అది 2006లో కంటే తక్కువే.కాగా, ఈ ఏడాది మాత్రం సూచీలు అందుకు భిన్నంగా పయనిస్తున్నాయి. చరిత్రను తిరగరాస్తూ, 2018జనవరి నుంచ ఇప్పటివరకు సెన్సెక్స 6శాతానికి పైగా లాభాలను ఆర్జించింది. గతేడాది డిసెంబరు 26న 34 వేల మైలురాయిని చేరుకున్న సెన్సెక్స్, జనవరి 17న 35వేలు, 23న 36వేల మార్క్‌ను దాటేసింది. ఈ ఏడాది బడ్జెట్‌పై సానుకూల ప్రభావం ఉండటమే ఇందుకు కారణం అంటున్నారు. మార్కెట్ నిపుణులు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారీ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ పురోగతి చెందుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిడిపి పెరిగే అవకాశముందని పలు అధ్యయనాలు చెప్పడం కూడా ఇందుకు దోహద పడింది. దీంతో సూచీలు వెనుదిగిరి చూడట్లేదు.

జిఎస్‌టి ఇబ్బందులు అధిగమిస్తాం

అరవింద్ సుబ్రమణియన్

న్యూఢిల్లీ, జనవరి 29: జిఎస్‌టి అమలు వల్ల తలెత్తిన ఇబ్బందులు నెమ్మదిగా సమసిపోతున్నాయని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ తెలిపారు. ఆర్థిక సర్వే విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 14ఏళ్లలో తొలిసారి సరళీకృత వ్యాపార నిబంధనలు ఉన్న దేశాల జాబితాలో భారత్ స్థానం మెరుగుపడడం విశేషమని ఆయన పేర్కొన్నారు. 2016వ సంవత్సరం మధ్యలో వడ్డీరేట్లు పెరగడం డిమాండ్‌పై ప్రభావం చూపిందని తెలిపారు. తయారీ రంగంలో 11.3శాతం వృద్ధి నమోదు చేయడం విశేషమన్నారు. ప్రస్తుతం ఎగుమతులు పుంజుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు పుంజుకోవడమే దీనికికారణమన్నారు. వచ్చే ఏడాది జిడిపి, ఎగుమతులుమరింత పుంజుకునే అవకాశం ఉందన్నారు. భారత సమాఖ్య వ్యవస్థలో సమన్వయం అద్భుత ఫలితాలను ఇస్తుందని జిఎస్‌టి రుజువు చేసిందన్నారు. పెరుగుతున్న చమురు ధరలతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అరవింద్ పేర్కొన్నారు. చమురు ధర 10శాతం పెరిగితే జిడిపి వృద్ధి 0.2శాతం పడి పోతుందని తెలిపారు. ఈ ఏడాది చమురు ధరలు 16శాతం పెరుగుతాయని ఐఎంఎఫ్ అంచనా వేసినట్లు చెప్పారు. స్టాక్ మార్కెట్లలో కొంత కరెక్షన్ జరగవచ్చని, ప్రస్తుతం మాత్రం ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గ



చూపుతున్నారని అన్నారు. భారత్ పరిశోధన, అభివృద్ధి రంగంపై ఎక్కువ దృష్టిపెట్టాలని అరవింద్ సుబ్రమణియన్ పేర్కొన్నారు. దీనిని ఉద్యమ స్థాయిలో చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఎగుమతుల్లో 70శాతం వాటా ఐదు రాష్ట్రాలదే!

న్యూఢిల్లీ, జనవరి 29: దేశంలో కేవలం ఐదు రాష్ట్రాల్లో మాత్రమే మొత్తంఎగుమతుల్లో 70శాతం వాటాతో ఉన్నాయని ఆర్థికసర్వే ఉటంకించింది. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణరాష్ట్రాలో మొత్తం ఎగుమతుల్లో 70శాతం వాటాతో ఉన్నాయని సర్వే వెల్లడించింది. ఎగుమతులపరంగా వివిధ రాష్ట్రాల మధ్య తేడాలున్నాయని రవాణారంగం తన సేవలను మరింత విస్తృతం చేసిందని, దిగుమతిచేసుకునే దేశాల్లో పరిరక్షణ వైఖరి పెరుగుతుండటంతో కొన్ని రాష్ట్రాలు ఎగుమతుల్లో వెనకబడ్డాయి. ఆర్థికసర్వేలో మొదటి సారిగా రాష్ట్రాల నుంచి అంతర్జాతీయ స్థాయి ఎగుమతుల ప్రస్తావన వచ్చింది. రాష్ట్రాల నుంచి ఎగుమతుల పనితీరు, అక్కడి జీవనప్రమాణాలను సైతం తేటతెల్లంచేస్తోంది. అంతర్జాతీయ వాణిజ్యపరంగాను, అంతర్‌రాష్ట్ర వాణిజ్యం, ఆర్థిక అభ్యున్నతికి సంబంధించి మొదటిసారిగా భారత చరిత్రలో ఐదు రాష్ట్రాలు భారీ వాటాతో ఉన్నట్లు సర్వేలో వెల్లడించింది. భారత్ ఎగుమతులు కొంతమేర సజావుగాలేవని, భారీ సంస్థలు ఎగుమతుల్లో చిన్నవాటాతోనే ఉన్నాయని, ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌పరంగా తగ్గుముఖంతో ఉన్నట్లు వెల్లడించారు. భారత్‌సంస్థల్లో ఒకటిశాతం 38శాతం ఎగుమతుల వాటాతో ఉంటే ఇతర దేశాలు భారీ వాటాలతో ఉన్నాయి. బ్రెజిల్ 72శాతం, జర్మనీ 68శాతం, మెక్సికో 67 శాతం, యుఎస్ఎ 55శాతం వాటాతో ఉన్నాయి.




భారత్‌లోని టాప్ ఐదునుంచి పదిశాతం సంస్థల్లో ఈ తేడాలున్నాయని వెల్లడించారు. ఎగుమతిదారులకు కేటాయించిన సుంకాలుకారణంగా రెడీమేడ్ వస్త్రాల ఎగుమతులు పెంచాయి. 16శాతానికి పెరిగాయి. గతఏడాది ఆర్థికసర్వే పరంగాచూస్తే అంతర్ రాష్ట్ర వాణిజ్యం జిడిపిలో 30నుంచి 50శాతంగా ఉంది. జిఎస్‌టి డేటాను చూస్తే భారత్ అంతర్గత వాణిజ్యం వస్తుసేవల్లో జిడిపిలో 60శాతానికి ఉన్నట్లు అంచనావేసారు. భారత్‌లో రవాణారంగం 160 బిలియన్ డాలర్ల టర్నోవర్‌తో ఉంది. వార్షికవృద్ధి గడచిన ఐదేళ్లలో 7.8శాతం చొప్పున నమోదయింది. మొత్తం 22 మిలియన్ల మందికి ఉపాధినిస్తున్న ఈ రంగం ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్స్ సూచీలో 35వ స్థానంలో ఉంది. 2014లో 54వర్యాంకులో ఉన్న భారత్ 35వ ర్యాంకుకు పెరిగింది. వాణిజ్య సేవలపరంగా ప్రపంచదేశాలకు ఎనిమిదో అతిపెద్ద ఎగుమతిదేశంగా భారత్‌నిలిచింది. 2016లో 3.4 శాతంగా ఉంది. భారత వాణిజ్య ఎగుమతుల్లో ప్రపంచ వ్యాప్తంగాచూస్తే 1.7శాతం వాటాతో ఉంది. ఇక భారత్‌లోని సేవలరంగం ఎగుమతుల వృద్ధి గత ఏడాది 5.7శాతంగా ఉంది. ఏప్రిల్‌నుంచి సెప్టెంబరు వరకూ చూస్తే వృద్ధిసేవలరంగ ఎగుమతుల్లో 16.2 శాతంగా ఉంది. అయితే దిగుమతులపరంగా కూడా 17.4శాతానికి పెరిగింది. నికర సేవలరంగం రాబడులు 14.6శాతం పెరిగినట్లు ఆర్థికసర్వే ఉటంకించింది.

స్టార్టప్ పెట్టుబడుల్లో ఒకటే పన్ను

ఐటి రంగం ఆకాంక్ష

ముంబై, జనవరి 29: అంకుర సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించి దేశ-విదేశీ పెట్టుబడిదార్లకు ఒకే పన్నురేటు విధించాలని నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ కంపెనీస్) కోరుతోంది. ప్రస్తుతం నమోదు కాని సంస్థల్లో వాటాలు విక్రయించినపుడు దేశీయ పెట్టుబడిదార్లకు 20శాతం, విదేశీ పెట్టుబడిదార్లకు 10శాతం పన్నురేటు అమలవుతోంది. ప్రభుత్వం డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్న తరుణంలో సాధారణ సేవల కంటే డిజిటల్ సేవలపై అధిక పన్ను విధించరాదని నాస్కామ్ అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ కోరారు. 100బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.50లక్షల కోట్ల) ఎగుమతుల స్థాయికి పెరిగిన ఈ పరిశ్రమ దేశీయంగా 39లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్న తరుణంలో, మరింత దూసుకెళ్లేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. విదేశీ పన్ను క్రెడిట్ నిబంధనలకు సంబంధించి, ఒక్కో దేశంనుంచి వచ్చిన ఆదాయం, చెల్లించిన పన్నుకు బదులుగా, అంతర్జాతీయంగా ఎగుమతులపై లభించే ఆదాయం, వాటిపై చెల్లించిన పన్నును పరిగణనలోకి తీసుకోవాలి. అంకుర సంస్థలకు



కనీస ప్రత్యామ్నాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సేవలకు సాధారణ పద్ధతి కంటే అధిక వసూళ్లు ఉండకూడదు.

టెక్‌మహీంద్రా నికరలాభం రూ.924కోట్లు



ముంబై, జనవరి 29: సాఫ్ట్‌వేర్ సేవల దేశీయ దిగ్గజం టెక్ మహీంద్రా ఈ ఏడాది మూడో క్వార్టర్‌లో ఆర్థిక ఫలితాలు విడుదల చేసింది. మూడవ త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.924 కోట్ల నికరలాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.7776కోట్లకు చేరింది. నిర్వహణ రూ.1256కోట్లను తాకింది. ఇబిటా మార్జిన్లు 16.3శాతంగా నమోదయ్యాయి. సోమవారం ట్రేడింగ్‌లో టెక్ మహీంద్రా షేరు 1.3 శాతం బలపడి రూ.606వద్ద ముగిసింది. వడ్డీకి ముందు ఆదాయం 17.9శాతం పెరిగి 990కోట్ల రూపాయలకు చేరుకుంది. ఆపరేటింగ్ మార్జిన్ 12.7శాతం పెరిగింది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై తాము ఎక్కువగా దృష్టిపెట్టామని, భవిష్యత్ ఆవశ్యకతలకు అనుగుణంగా తమ ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నామని టెక్ మహీంద్రా వైస్ ఛైర్మన్ వినీత్ నయ్యర్ తెలిపారు. సోమవారం మార్కెట్లు ముగిశాక ఫలితాలు విడుదల చేయడంతో ఈ ప్రభావం మంగళవారం ట్రేడింగ్‌లో కనిపించే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

తీవ్ర ఒత్తిడికి గురవుతున్న టెలికాం రంగం

న్యూఢిల్లీ, జనవరి 29: దేశీయ టెలికాం రంగం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని 2017-18 ఆర్థిక సర్వే విశ్లేషించింది. ముఖ్యంగా టెలికాంరంగంలోకి కొత్తగా ప్రవేశించిన రిలయన్స్ జియో మార్కెట్ సంక్షోభానికి కారణమైందని పేర్కొంది. ఇతర కారణాలతోపాటు టారిఫ్ వార్ టెలికాం సేవల సంస్థలను దెబ్బతీసిందని చెప్పడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త టెలికాం పాలసీ తీసుకొస్తోందని, దీని రూపకల్పన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపింది. 2018లో ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని విడుదల చేయనుందని సర్వే వెల్లడించింది. అలాగే రెగ్యులేటరీ, లైసెన్సింగ్ విధానాలు, కనెక్టివిటీ, సేవల నాణ్యత, వ్యాపార సరళీకరణ, 5జి సేవలు, ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ లాంటి కొత్త టెక్నాలజీపై ఈ కొత్త విధానం దృష్టిపెట్టాలని సర్వే సూచించింది భారీ అప్పులు, టారిఫ్‌వార్, అసంబద్ధమైన స్పెక్ట్రం ఛార్జీలు టెల్కోలనుదెబ్బతీశాయని వ్యాఖ్యానించింది. టెలికాం మార్కెట్‌లో తక్కువధరలతో ఎంట్రీ ఇచ్చిన రిలయన్స్ జియో మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడిందనీ, దీనికారణంగా ఇతరకంపెనీల ఆదాయం పడిపోయిందని తెలిపింది. ఈ సంక్షోభం పెట్టుబడిదారులు, రుణదాతలు, భాగస్వాములతో పాటు ఈ టెలికాం కంపెనీల వెండార్స్‌ను తీవ్రంగా ప్రభావితం చేసిందని సర్వే పేర్కొంది. అయితే హేతుబద్ధమైన స్పెక్ట్రమ్‌వేలం, ఇతరఖర్చుల హేతుబద్ధీకరణ ద్వారా దీన్ని నియంత్రించాలని సర్వే సిఫార్సు చేసింది.



మార్కెట్లకు ఆర్థికసర్వే బూస్ట్

రికార్డుస్థాయికి సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి,జనవరి 29: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థికసర్వేలో ఆర్థికవృద్ధి వచ్చేసంవత్సరానికి గాను 7 నుంచి 7.5శాతంగా ఉంటుందని ప్రకటించడంతో సెన్సెక్స్, నిఫ్టీలు మరోసారి రికార్డులు నమోదుచేసాయి. సెన్సెక్స్ 232.81 పాయింట్లు పెరిగి 36,283.25 పాయింట్లకుచేరింది.ఆల్‌టైమ్‌రికార్డుస్థాయి 36,443.98 పాయింట్లకు చేరిన తర్వాత 1.09శాతం పెరిగింది. నిఫ్టీ 50సూచి కూడా 60.75 పాయింట్లుపెరిగి 11,130.40 పాయింట్లకు చేరింది. ఒకదశలో రికార్డుస్థాయికి అంటే 11,171.55పాయింట్లకు చేరింది. బిఎస్ఇలోని వివిధ సూచీల్లో ఆటో సూచి ఎక్కువ పెరిగి 1.6శాతం నమోదయింది. ఐటిరంగం 1.16శాతం, టెక్ 0.92శాతం, వినియోగరంగ ఉత్పత్తులు 0.6శాతం పెరిగితే పిఎస్‌యుసూచి 1.22శాతం, మౌలికవనరులు 0.95శాతం, హెల్త్‌కేర్ 0.92శాతం, ఆయిల్ అండ్‌గ్యాస్ 0.85 శాతం తగ్గాయి. టాప్ ఐదుసంస్థల్లో లాభాలు పొందిన వాటిలో మారుతిసుజుకి 3.85శాతం, హెచ్‌డిఎఫ్‌సి 2.66 శాతం, టిసిఎస్ 2.48శాతం, హీరో మోటోకార్ప్ 2.23శాతం, కోటక్‌బ్యాంకు 2.06శాతం పెరిగితే నష్టాలు పొందిన సంస్థల్లో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ 5.92శాతం, భారతిఎయిర్‌టెల్ 2.66శాతం, ఐటిసి 1.85శాతం, ఎస్‌బ్యాంకు 1.64శాతం, ఒఎన్‌జిసి 1.58 శాతం చొప్పున నష్టపోయాయి. విద్యుత్‌రంగానికి బడ్జెట్ కేటాయింపులు గడచిన ఐదేళ్లుగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో కూడా కేటాయింపులు పెరుగుతాయని, దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామ్‌జ్యోతి యోజన, సౌభాగ్యస్కీంల పరిధిలో కేటాయింపులు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. బ్యాంకింగ్‌రంగానికి ఇప్పటికే 88 వేల కోట్లకుపైబడిన మూలధన నిధులు అందించేందుకు ప్రభుత్వం ప్రకటించడంతో ఈ రంగం షేర్లు పెరుగుతూనే ఉన్నాయి. బ్యాంకింగ్‌రంగంలో సంస్కరణలు, పన్నుల మినహాయింపు హామీలు ఎక్కువ ఉంటాయన్న లక్ష్యంతో ఆర్థికరంగ సేవలసంస్థలు భారీగా వృద్ధిని సాధిస్తున్నాయి. ఇక ఐటిరంగపరంగా న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ 8.9శాతం పెరిగి 266.70 రూపాయలకు పెరిగింది. ఐపిఒధర 245 కంటే పెరిగాయి. ఇక టాటా స్టీల్స్, రిలయన్స్ఇండస్ట్రీస్, ఎస్‌బిఐవంటివి రానున్న కాలంలో మరింత పెరిగే అవకాశం ఉందని స్టాక్ బ్రోకర్లు సూచిస్తున్నారు.ఇక పార్టిసిపేటరీ నోట్ల పెట్టుబడులు ఆరునెలల గరిష్టానికి పెరిగాయి. 1.5 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక కరెన్సీ మార్కెట్లపరంగాచూస్తే డాలర్ మూడేళ్ల కనిష్టానికి పడిపోయింది. ఇతర మేజర్ దేశాల కరెన్సీలతో పోలిస్తే క్షీణించింది. ఇక బంగారంధరలు స్వల్పంగా పెరిగాయి. అమెరికా డాలరు మూడేళ్ల కనిష్టానికి చేరడంతో పసిడిధరలు కూడా కొంత తగ్గాయి. స్పాట్‌మార్కెట్‌లో బంగారంధరలు ఔన్స్ ఒక్కింటికి 1347.60డాలర్లుగా నడిచింది. ఫిబ్రవరి డెలివరీ ఫ్యూచర్స్‌మార్కెట్‌లో 0.5శాతంక్షీణించి 1345.80 డాలర్లుగా నిలిచింది. రానున్నకాలంలో బంగారంధరలు ఔన్స్‌కు 1400 డాలర్లుగా నిలుస్తాయన్న అంచనాలున్నాయి. 2013సెప్టెంబరులోఒకసారి బంగారంధరలు ఔన్స్‌కు 1400 డాలర్లుగా నడిచాయి. ఇక వెండిధరలు కూడా 0.4శాతం క్షీణించి ఔన్స్ ఒక్కింటికి 17.33డాలర్లుగా కొనసాగాయి. గతవారంలో2.3శాతంపెరిగాయి. ప్లాటినమ్0.5 శాతం క్షీణించి ఔన్స్‌కు 1004.74 డాలర్లుగా నడిచింది.



వార్త, హైదరాబాద్, మంగళవారం, జనవరి 30, 2018

ఒకే దేశం ఒకే ఎన్నిక

- పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు
- ట్రిపుల్ తలాక్ బిల్లుకు సత్వర ఆమోదం
- ఉభయ సభల్లో రాష్ట్రపతి కోవింద్

న్యూఢిల్లీ, జనవరి 29: పార్లమెంటులో ట్రిపుల్ తలాక్ బిల్లు సత్వరమే ఆమోదం పొందుతుందని ఆశాభావంతో ఉన్నామని, ముస్లిం మహిళలు ఎలాంటి భయాలూ లేకుండా స్వేచ్ఛగా జీవించే హక్కులను ప్రసాదించే బిల్లు పార్లమెంటు ఆమోదం పొందాలని ఆశిస్తున్నట్లు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. సోమవారం ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి కోవింద్ మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి సాధికారతకోసం ఎంతైనా చేస్తుందని అన్నారు. ఎలాంటి భయాలు లేకుండా హుందాగా ముస్లిం మహిళలు జీవించేందుకు తోడ్పడుతోందని అన్నారు. అలాగే దేశంలో పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరగాల్సిన అవసరం ఉందని, వీటిపై ఏకాభిప్రాయానికి అన్ని పార్టీలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒకేసారి అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీ ఎన్నికలు జరిపే తరుణం భారత్‌లో సత్వరమే రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని ఆయన కోరారు. అలాగే ఒకే దేశం ఒకే ఎన్నిక అన్న ఆలోచన ఎంతోకాలంగా కొనసాగుతోందని, 1999లో లాకమిషన్ సూచించిందన్నారు. పార్లమెంటు స్థాయీ సంఘం కూడా 2015లో ఒక నివేదిక ఇచ్చిందని, ఒకేసారి ఎన్నికల నిర్వహణవల్ల ప్రజాధనం ఆదా చేసినట్లవుతుందని వెల్లడించిందన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించడంద్వారా వ్యయం రూ.4500 కోట్ల వరకూ అవుతుందని, ప్రధాని మోడీ ఈ ఆలోచనకు మద్దతిస్తున్నారని అన్నారు. ఇక ట్రిపుల్‌తలాక్‌పై మాట్లాడుతూ ముస్లిం మహిళల గౌరవం రాజకీయపరమైన చిక్కుల్లోకి రాకూడదని, ఇపుడు దేశంలో వారికి స్వేచ్ఛను ప్రసాదించే అవకాశం వచ్చిందన్నారు. తమ ప్రభుత్వం ట్రిపుల్ తలాక్‌పై బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిందని, సత్వరమేచట్టరూపంలోకి రాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. చట్టరూపంలోకి వచ్చిన వెంటనే ముస్లిం కుమార్తెలు, సోదరీమణులు స్వేచ్ఛగాను, హుందాగా జీవించేందుకు హక్కులు ప్రసాదించిన వారం అవుతామన్నారు. ఉపాధ్యక్షుడు వెంకయ్యనాయుడు,



సోమవారం ఉభయ సభలనుద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ప్రధాని నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్ర మంత్రులు, బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, సోనియా గాంధీవంటి ప్రముఖులు పార్లమెంటు సెంట్రల్ హాలుకు హాజరయ్యారు. మోడీ ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ఉటంకిస్తూ రాష్ట్రపతి పక్కాఇళ్లు, మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం అందరికీ కల్పిస్తోందని, 2022 నాటికి పేదలందరికీ పక్కాగృహ నిర్మాణం చేపడుతుందని అన్నారు. పన్నుల రంగంలో జిఎస్‌టిని ప్రవేశపెట్టి పారదర్శకతను పెంచిందని దీనివల్ల పన్నులు చెల్లించేవారి సంఖ్యకూడా పెరిగిందని అన్నారు. దేశంలో ఆధార్ ఉపయోగం విస్తృతంగా పెరిగిందని, మధ్యవర్తుల ప్రమేయంలేకుండా ప్రభుత్వం 57 వేల కోట్లు ఆదా చేయగలిగిందన్నారు. నిరుపేదలందరికీ నేరుగా లబ్ధిచేకూరుతోందని, డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయని, సుమారు 400 ప్రభుత్వ స్కీంలలో ఈ లబ్ది నేరుగా లబ్దిదారులకే వెళుతోందని అన్నారు. డిజిటల్ చెల్లింపుల ద్వారా ప్రభుత్వం రూ.57 వేల కోట్లు ఆదా చేసిందన్నారు. భీమ్ అప్లికేషన్‌ద్వారా డిజిటల్ లావాదేవీలు భారీగా పెరిగాయన్నారు. ఇటీవలే విడుదల చేసిన ఉమంగ్ యాప్ కూడా మొత్తం 100 ప్రభుత్వ సేవలను మొబైల్ ఫోన్లపై అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తిరంగపరంగా మొత్తం 113 మొబైల్ ఫోన్ కంపెనీలు దేశంలో ఉన్నాయన్నారు. 2014లో కేవలం రెండు కంపెనీలు మాత్రమే ఉన్నాయన్నారు. దీనివల్ల ఎక్కువమంది యువత ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ అక్షరాస్యత పథకాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రామీణ అక్షరాస్యత పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించడం గర్వకారణమని రాష్ట్రపతి కోవింద్ పేర్కొన్నారు. ఇక ఒకేసారి ఎన్నికలకు సంబంధించి రాష్ట్రపతి మాట్లాడుతూ ప్రతి నాలుగు ఆరు నెలలకు ఓ పర్యాయం రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ఎన్నికలు నిర్వహించడం సంక్లిష్టంగాను, వ్యయభరితంగాను ఉన్నదన్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణపై విస్తృత చర్చలు జరగాలన్నారు. ఒకేసారి దేశం మొత్తం నిర్వహించకపోయినా దేశంలో కనీసం 12 రాష్ట్రాలకు తగ్గకుండా ఎన్నికలు నిర్వహించేటట్లు రాజకీయ పార్టీలు అవగాహనకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరించకుండా ప్రభుత్వం బలహీనవర్గాలు, పేదల సంక్షేమానికి ఎక్కువ కృషిచేస్తోందన్నారు. సామాజిక న్యాయం, ఆర్థిక ప్రజాస్వామ్యంతో సాధారణ మానవుని జీవితం మరింత మెరుగుపడుతుందని కోవింద్ వెల్లడించారు. నిరుపేదలకు వంట గ్యాస్, బ్యాంకింగ్ కవరేజి, మరుగుదొడ్ల నిర్మాణం, బాలికా విద్యా పథకం, యువ పారిశ్రామికవేత్తలకు బ్యాంకు రుణాలు మరింతగా పెరిగాయన్నారు. ఇక వ్యవసాయరంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, అలజడిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని రైతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి వ్యయం తగ్గించేవిధంగా ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు. 2022 నాటికి ఎన్‌డిఏ ప్రభుత్వం రైతు రాబడులు రెట్టింపు అయ్యేటట్లు చూస్తుందన్నారు. పురుషుల తోడులేకుండా 45 ఏళ్లు దాటిన ముస్లిం మహిళలు హజ్‌యాత్రకు అనుమతించిందన్నారు. ఇక వెనుకబడిన తరగతులకు జాతీయస్థాయిలో కమిషన్ నియమించేందుకు రాజ్యాంగ సవరణ బిల్లునుసైతం పార్లమెంటుకు తెస్తోందని, ఈ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ట్రిపుల్ తలాక్ బిల్లుకు మద్దతివ్వండి

రాజకీయ పార్టీలకు ప్రధాని మోడీ విజ్ఞప్తి



ట్రిపుల్ తలాక్ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతునివ్వాలని మీడియా సమావేశంలో విజ్ఞప్తి చేస్తున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, జనవరి 29: ముస్లిం మహిళల సాధికారతకు నిర్దేశించిన ట్రిపుల్ తలాక్ బిల్లుకు అన్ని రాజకీయపార్టీలు మద్దతునివ్వాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజ్ఞప్తి చేశారు. ప్రజల అంచనాలు, ప్రభుత్వ కార్యాచరణకు అనుగుణంగా ట్రిపుల్ తలాక్ బిల్లును పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. ముస్లిం మహిళలకు కొత్త సంవత్సర కానుకగా ట్రిపుల్‌తలాక్ బిల్లును ఆమోదించి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు హౌస్ బయట మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాచరణ, ప్రజల అంచనాలకు అనుగుణంగా ట్రిపుల్ తలాక్ బిల్లు గత సమావేశాల్లో ఆమోదం పొందలేకపోయిందన్నారు. ఈ బిల్లులో ఎలాంటి రాజకీయాలు లేవని, ముస్లిం మహిళల హక్కులకోసమే ఈ బిల్లును సవరించి ప్రవేశపెట్టామని అయితే బిల్లును ఆమోదించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. ముస్లిం మహిళల వివాహ పరిరక్షణ హక్కుల బిల్లు 2017ను లోక్‌సభలో ఆమోదించామని, రాజ్యసభలోనే పెండింగ్‌లో ఉందని, అనేక ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి నివేదించాలని డిమాండ్ చేశాయి. దీనితో బడ్జెట్ సమావేశాల ముందురోజు నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కూడా ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించాలని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేసారు. బడ్జెట్ సమావేశాల్లో ఏకాభిప్రాయ సాధనతో ఈ బిల్లును ఆమోదింప చేసేందుకు కృషి చేయాలని ప్రభుత్వ యంత్రాంగాన్ని, తమ ప్రభుత్వ ప్రతినిధులను ప్రధాని కోరారు. రాజ్యసభలో ఆమోదం పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలను సంప్రదించి చర్చించేందుకు ఎలాంటి వెనుకంజ వేయబోమని ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో ఆమోదింప చేసుకుంటామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్‌సైతం వెల్లడించారు. అయితే ప్రతిపక్షంమాత్రం ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని పట్టుబడుతోంది. గత ఏడాది డిసెంబరు 28న లోక్‌సభలో ఈ బిల్లును ఆమోదించింది.

ఈ కొత్త సవరణ బిల్లు ప్రకారం ట్రిపుల్ తలాక్ చెపితే మూడేళ్లపాటు జైలు, ఉల్లంఘనులకు భారీజరిమానా విధిస్తారు. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభలో అన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. రాజ్యసభలో అధికారపక్షానికి తగినంత బలం లేనందున ప్రతిపక్షం మద్దతు లేకుండా బిల్లును ఆమోదింప చేసుకునేందుకు సమస్యలు ఎదుర్కొంటున్నది.

రాజ్యసభలో ఆప్ ఎంపిల ప్రమాణ స్వీకారం

రాష్ట్రపతి ప్రసంగాన్ని బాయ్‌కాట్ చేసిన ఆప్ సభ్యులు



న్యూఢిల్లీ, జనవరి 29: ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురు పార్లమెంటు సభ్యులు బడ్జెట్ సమావేశాల సందర్భంగా తమ తమ ప్రమాణ స్వీకారం చేసారు. ఎంపిలతోపాటు కేంద్ర మంత్రి హరదీప్‌సింగ్ పూరి కూడా ప్రమాణ స్వీకారం చేసారు. కేంద్ర పట్టణాభివృద్ధి, హౌసింగ్‌శాఖ మంత్రి ఉత్తరప్రదేశ్ నుంచి సహాయ మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవలే రాష్ట్రంలో ఉప ఎన్నిక జరిగింది. ఇక ఆమ్ ఆద్మీ పార్టీపరంగా నారాయణ్ దాస్ గుప్తా, సుశీల్ కుమార్ గుప్తా, సంజయ్‌సింగ్ రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసారు. దేశ రాజధాని ప్రాదేశిక ప్రాంతం ఢిల్లీ నుంచి ఎగువ సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురితో ఆప్ రాజ్యభలో ప్రవేశించినట్లయింది. పూరి మొదట హిందీలో ప్రమాణంచేసారు. తర్వాత గుప్తా ఆంగ్లంలోను, సుశీల్‌కుమార్, సంజయ్‌సింగ్ హిందీలోను ప్రమాణ స్వీకారం చేసారు. రాజ్యసభ ఛైర్మన్ ఎం వెంకయ్యనాయుడు కొత్త సభ్యులు, కేంద్ర మంత్రికి కరచాలనం చేసి అభినందనలు తెలిపారు. వీరంతా రిజిస్టర్లలో సంతకాలు చేసి తమ తమ సీట్లలో ఆశీనులయ్యారు. ప్రతిపక్షంలో చివరి వరుసలో వీరికి సీట్లు కేటాయించారు. ఆప్‌ఎమ్మెల్యేలు సోమవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగాన్ని బహిష్కరించారు. తమ పార్టీకి చెందిన 20మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడాన్ని వారు నిరసన వ్యక్తం చేసారు. ఆమ్ ఆద్మీ పార్టీ లోక్‌సభ సభ్యులు సాధుసింగ్, భగవంత్ మాన్, రాజ్యసభ సభ్యులు సంజయ్‌సింగ్, సుశీల్‌గుప్తా, ఎన్‌డి గుప్తా పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నినాదాలు చేసారు. సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఎఫ్‌డిఐను అనుమతించడం, ఎన్నికల సంఘం అనర్హత వేటుకు నిరసనగా వీరు నినాదాలు చేసారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వానికి తావులేని పెద్దగా నినదించారు. ఎమ్మెల్యేలపై అనర్హత వేటును ప్రస్తావిస్తూ సంజయ్‌సింగ్ దేశంలో ఎక్కడా రెండు చట్టాలు ఉండకూడదని పేర్కొన్నారు.

యుపిలో మరో ట్రిపుల్ తలాక్



న్యూఢిల్లీ, జనవరి 29: ట్రిపుల్ తలాక్ రద్దుపై పార్లమెంటులో విస్తృత చర్చ జరుగుతుండగానే ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో మరో బాధితురాలు ట్రిపుల్ తలాక్ బాధితురాలైంది. తనపై అత్యాచారం చేసిన ఒక వ్యక్తిని గ్రామంలో నిర్వహించిన పంచాయితీ ప్రకారం వివాహమాడిన వెంటనే ఆ భర్త ట్రిపుల్ తలాక్ చెపుతూ ఆమెకు విడాకులిచ్చినట్లు బాధితురాలి మేనమామ మీడియాకు వెల్లడించారు. బాధితురాలిని మానసికంగాను, భౌతికంగాను వేధించారు. వివాహం తర్వాత విపరీంతగా వేధింపులకు గురిచేసినట్లు వెల్లడించాడు. బాధితురాలి కథనం ప్రకారం ఆమెతోపాటు తన తండ్రిని కూడా ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారని, అక్కడ తనను విడాకులపత్రాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి తెచ్చారన్నారు. తనను ఒత్తిడిచేసి తన చేతి వేలిముద్రలను విడాకుల పత్రాలపై తీసుకున్నారని, తదనంతరం ట్రిపుల్ తలాక్ చెప్పారని తమకు న్యాయం చేయాలని బాధితురాలు వాపోయింది. ఆమె తన భర్తకు వ్యతిరేకంగా కేసును కూడా నమోదు చేసింది. హాపూర్ ఎస్‌ఎస్‌పి రామ్‌మోహన్‌సింగ్ మాట్లాడుతూ ఈ కేసును విచారిస్తున్నామని, అందిన వివరాల ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

జిఎస్‌టిలో కొత్తగా 34 లక్షల రిజిస్ట్రేషన్లు



న్యూఢిల్లీ, జనవరి 29: పరోక్షపన్నులరంగంలో తెచ్చిన సంస్కరణల కారణంగా జిఎస్‌టి అమలయిన తర్వాత పన్నులపరిధి పెరిగిందని, కొత్తగా 34 లక్షల వ్యాపారాలు జిఎస్‌టి పను ్నపరిధిలోనికి వచ్చాయని ఆర్థికసర్వే తేటతెల్లంచేసింది. 50శాతం వరకూ వృద్ధి కనిపిస్తోందని వివరించింది. అనేకమంది వ్యాపారులు స్వచ్ఛందంగా రిజిస్ట్రేషన్లుచేసుకుంటున్నారని, చిన్న సంస్థలు పెద్ద సంస్థలనుంచి కొనుగోలుచేస్తూ ఇన్‌పుట్‌ట్యాక్స్ క్రెడిట్‌లను పొందగలుగుతున్నాయన్నారు. జిఎస్‌టి పరోక్షపన్నులరంగం బేస్‌ను పెంచిందని, 3.4 మిలియన్లవరకూ పెరిగాయన్నారు. జిఎస్‌టి వసూళ్లపై సర్వత్రా ఉత్కంఠ, సందిగ్ధత నెలకొన్నదని ఈ ఏడాది తర్వాత వ్యవస్థ స్థిరపడినత తర్వాత అనిశ్చితి తొలగిపోతుందని ఆర్థికసలహాదారు అరవింద్ సుబ్రహ్మణియన్ వెల్లడించారు. జిఎస్‌టి గత ఏడాది 9.7లక్షలకోట్లవరకూ పెరిగాయని అంచనావేసింది. జిఎస్‌టి జులై నెల లో 95 వేల కోట్లు, ఆగస్టులో 91 వేలకోట్లు, సెప్టెంబరులో 92,150 కోట్లు, అక్టోబరులో 83వేల కోట్లు, నవంబరులో 80,808 కోట్లు వసూళ్లయితే డిసెంబరులో 86,703 కోట్లవరకూ వసూళ్లు వచ్చాయన్నారు. ఎక్కువసంఖ్యలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్‌లనుంచి రిజిస్ట్రేషన్లు వచ్చాయి. పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలపరంగా రిజిస్ట్రేషన్లుచేయించుకున్న సంస్థలు పెరిగాయి. రాష్ట్రాల ఆర్థికవ్యవస్థల ఆధారంగా జిఎస్‌టి పంపిణీ జరుగుతుందని సర్వే వెల్లడించింది. టర్నోవర్ ఆధారంగా 17 లక్షల మంది వ్యాపార సంస్థలు రిజిష్టరు అయ్యాయని 20లక్షల టర్నోవర్‌లోపు ఉన్న సంస్థలు ఉన్నవి రిజిష్టరు అయ్యాయి. స్వచ్ఛందంగా రిటర్నులు దాఖలు చేయడం వల్ల పారదర్శకత పెరుగుతందని అంచనావేసింది. 2017 డిసెంబరు నాటికి 98 లక్షల కొత్త బిజినెస్‌లు జిఎస్‌టి హయాంలోనికి వచ్చాయి. దీనివల్ల మొత్తంగా 3.4 మిలియన్లు కొత్త పన్నుచెల్లింపుదారులు వచ్చారన్నారు. కేంద్ర రాష్ట్రాలపరంగా జిఎస్‌టి వసూళ్లు 9.7 లక్షలుగా ఉన్నాయి. ప్రభుత్వ అంచనాలు మాత్రం 10.9 లక్షలకోట్లుగా ఉన్నాయి. ఇక రాబడుల తటస్థరేట్ చూస్తే 15-16శాతంగా నిర్ణయించారు. రాబడి న్యూట్రల్ రేట్ 15శాతంనుంచి 15.5శాతంగా ఉంది. ప్రత్యక్షపరోక్ష పన్నుల్లో పెరుగుదల కొంతవరకూ ప్రభుత్వ ఖజానాను సుసంపన్నంచేస్తాయని డెల్లాయిట్ ఇండియా ఆర్థికవేత్త అనిస్ చక్రవర్తి పేర్కొన్నారు.

ఆరేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి



ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణియన్

న్యూఢిల్లీ, జనవరి 29: రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్టానికి చేరిందని, 2017-18 ఆర్థిక సంవత్సరంలో 3.3 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం చేరిందని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణియన్ వెల్లడించారు. దీన్నిబట్టి దేశంలో స్థిరమైన ధరల యంత్రాంగం నడుస్తోందని వెల్లడించారు. ద్రవ్యోల్బణాన్ని కట్టడిచేయడం కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన బాధ్యత అని అరవింద్ వెల్లడించారు. 2017-18లో ఈ ద్రవ్యోల్బణం స్వల్ప స్థాయిలోనే నడిచిందన్నారు. వినియోగరంగ ధరల సూచీ ఆధారిత హెడ్‌లైన్ ద్రవ్యోల్బణం తన ద్వైమాసిక విధానంలో 3.3 శాతంగా అంచనావేసింది. గడచిన ఆరు సంవత్సరాలతో పోలిస్తే అత్యంత కనిష్టంగా ఉందని వెల్లడిచింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖంవల్ల వివిధ కీలక ఉత్పత్తుల గ్రూప్‌లలో కొంత కదలిక కనిపించింది. అయితే హౌసింగ్, ఇంధనం, విద్యుత్ రంగాలు మినహాయించి అన్నింటా ధరలు తగ్గాయన్నారు. గరిష్ట స్థాయి నుంచి ఆర్థిక వ్యవస్థ క్రమేపీ సరళీకృత ద్రవ్యోల్బణ దిశగా కదిలిందని, గడచిన నాలుగేళ్లుగా స్థిరీకరించిన ధరలే ఇందుకు దోహదం చేసాయన్నారు. వినియోదారుని ధరలసూచీ ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా నాలుగో ఏడాది కూడా అదుపులోనే ఉందని ఆర్థిక సర్వేలో వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం తగ్గింపు ఆశాజనకంగా ఉందన్నారు. మైనస్ 2.1 శాతం నుంచి 1.5 శాతంగా ఉందని సర్వే ఉటంకించింది. వ్యవసాయ ఉత్పత్తులు భారీగా రావడం, ప్రభుత్వం నిరంతరం ధరలను పర్యవేక్షించడం వల్లనే సాధ్యమైందని అన్నారు. ఆహార ద్రవ్యోల్బణం ఇటీవలి నెలల్లో కొంతమేర పెరిగింది. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు తదితర కేటగిరీల్లో ధరలు పెరిగాయి. రాష్ట్రాలవారీగా ద్రవ్యోల్బణం చూస్తే అనేక రాష్ట్రాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గిందని సర్వేలో స్పష్టం చేసారు. 17 రాష్ట్రాల్లో నాలుగు శాతంకంటే తక్కువగా ద్రవ్యోల్బణం నమోదైందన్నారు. ప్రభుత్వం వివిధ స్థాయిల్లో చేపట్టిన చర్యల కారణంగానే ద్రవ్యోల్బణం దిగి వచ్చిందని అన్నారు. ఇక జిడిపి వృద్ధి సగటున 7.3 శాతంగా ఉందని, 2014-15 నుంచి 2017-18 వరకూ సగటు వృద్ధి 7.3 శాతంగా ఉందని వెల్లడించారు. ప్రపంచంలోని ఇతర మేజర్ ఆర్థిక వ్యవస్థలున్న దేశాలతో పోలిస్తే ఎక్కువేనని ఆర్థిక సర్వే వెల్లడించింది. తక్కువ ద్రవ్యోల్బణం, కరెంటు ఖాతా లోటును సమన్వయం చేయడం, ఆర్థిక లోటు కట్టడివంటి వాటితోనే సాధ్యమైందని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణియన్ వెల్లడించారు.

ఆర్థికలోటు పెరుగుదల అనివార్యం

నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ రాజీవ్‌కుమార్



న్యూఢిల్లీ, జనవరి 29: ఆర్థికలోటు ఈ ఆర్థికసంవత్సరంలో కొంతమేర పెరుగుతుందని ఆర్థికసర్వే అంచనాలు వెల్లడిస్తున్నాయి. అయితే మరీ అంత ఎక్కువ ఉండబోదని, ఎక్కువశాతం పెరిగే అవకాశం లేదని నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్‌రాజీవ్‌కుమార్ వెల్లడించారు. ప్రభుత్వపరంగా తెస్తున్న మార్పులు కారణంగాను, వ్యయంపెరగడం వల్లనైతేనేమి లోటు కొంత స్వల్పంగా పెరుగుతుందని, 2018-19 ఆర్థికసంవత్సరంలోకూడా ఇదే కనిపిస్తుందని అంచనావేసింది. ఆర్థికలోటును ఈ ఏడాది స్థూల దేశీయోత్పత్తిలో 3.2శాతంగాను, వచ్చే ఆర్థిక సంవత్సరానికి 3శాతంగాను లక్ష్యంగా నిర్దేశించింది. పెట్టుబడుల ఉపసంహారణపరంగామరింతగా కార్యాచరణ అమలుచేసినందున, పన్నేతర ఆదాయం పెరిగిందని అందువల్ల ఈ లోటు మరింతగా పెరిగే అవకాశం లేదని రాజీవ్‌కుమార్ వెల్లడించారు. ప్రభుత్వం అనుసరించే మార్గదర్శకాలు మారుతున్నందున కొంతమేర లోటు పెరుగుతుందనే భావిసుత్న్నట్లు నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ వెల్లడించారు. పన్నులరాబడి మరింతగాపెరుగుతుందని అంచనావేసారు. ఇక ముడిచమురుధరలపరంగాచూస్తే కొంత ఆందోళన కలిగించే అంశమేనని అతిపెద్ద చమురుకంపెనీ స్టాక్‌ఎక్ఛేంజిల్లో జాబితా కావడం కూడా కొంత ముడిచమురుధరలపెరుగుదలకు కారణం అవుతుందన్నారు. అయితే ప్రభుత్వం పెట్రోలు ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలని నిర్ణయించిందని అన్నారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఒకటవ తేదీ కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తున్నందున తుదిగణాంకాలు వెల్లడి కానున్నాయి.

విదేశాంగశాఖ కొత్తకార్యదర్శిగా విజయ్‌కేశవ్ గోఖలే



న్యూఢిల్లీ, జనవరి 29: విదేశాంగశాఖ కొత్త కార్యదర్శిగా విజయ్ కేశవ్ గోఖలే బాధ్యతలు స్వీకరించారు. డోక్లామ్‌ప్రతిష్టంభనకు సంబంధించి చైనాతో ఎదురైన వివాదాన్ని పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన గోఖలే కొత్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇప్పటివరకూ పనిచేసిన ఎస్‌జైశంకర్ పదవీవిరమణచేయడంతో ఆయనమూడేళ్ల పదవీ కాలం ముగియడంతో గోఖలేకు బాధ్యతలు అప్పగించారు. 1981 బ్యాచ్ భారత విదేశాంగ సర్వీసు అధికారి అయిన గోఖలే ఆర్థిక సంబంధాల విభాగంలో కార్యదర్శిగా కొనసాగారు. గోఖలే ఈ కార్యదర్శి హోదాలో రెండేళ్లు పనిచేస్తారు. డోక్లామ్‌లో జరిగిన 73 రోజుల ప్రతిష్టంభనలో చైనాతో సంప్రదింపులు జరిపి పరిష్కరించడంలో గోఖలే కీలకపాత్ర పోషించడంతో ప్రభుత్వం ఆయనకే విదేశాంగకార్యదర్శిగా నియామక ఉత్తర్వులు జారీచేసింది.

తమిళనాడులో కొనసాగుతున్న బహిష్కరణల పర్వం

శివగంగ జిల్లాలో 117 మంది తొలగింపు



చెన్నై, జనవరి 29: రాష్ట్రంలో అధికార పార్టీ ఎఐఎడిఎంకె తమ కార్యకర్తలు, నాయకులపై క్రమశిక్షణ వేటును కొనసాగిస్తోంది. పన్నీర్ సెల్వం, కె.పళనిసామిలు సుమారు వంద మందిని పార్టీని అగౌరవపరుస్తున్నారన్న అభియోగాలపై తొలగించారు. ఈ ఇద్దరు నేతలు ఎఐఎడిఎంకె నుంచి మొత్తం 117 మందిని బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ శివగంగ జిల్లా, ఇతర ఉప యూనిట్లు, ఇద్దరు ఆజీ ఎమ్మెల్యేలు కెకె ఉమాదేవన్, చోళన్‌సిటి పళనిసామి వంటివారినిసైతం బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ ప్రాథమిక సూత్రాలకు వ్యతిరేకంగా వ్యవహరించి పార్టీకి అప్రతిష్ట తెచ్చారని పన్నీర్ సెల్వం, ఎఐఎడిఎంకె సమన్వయకులు పళనిసామి వెల్లడించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు బహిష్కృత కార్యకర్తలు నేతలతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోకూడదని సూచించారు. పన్నీర్ సెల్వం, పళనిసామి వర్గాలు విలీనం జరిగిన తర్వాత మొదటిసారిగా గత నెలలోనే పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డిసెంబరు 21న ఆర్‌కెనగర్ ఉప ఎన్నిక సందర్భంగా పార్టీ తొలగించిన టిటివి దినకరన్ గెలుపునకు పనిచేసారన్న విమర్శలు వెల్లువెత్తాయి. అంతకుముందు కూడా లెక్కకు మించిన సంఖ్యలో పార్టీ నాయకులను సస్పెండ్ చేయడం, లేదా బహిష్కరణ వేటు వేయడం వంటివి చేసారు. వీరంతా దినకరన్‌కు అత్యంత సన్నిహితులని పార్టీ భావిస్తోంది. శనివారం కూడా ఈ ఇద్దరు నాయకులు ట్యూటికోరన్ జిల్లాలో 144 మంది పార్టీ నేతలు, కార్యకర్తలను బహిష్కరిస్తూ ఆదేశాలు జారీచేసారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించకపోతే ఉద్యోగ గర్జన : ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, జనవరి 29 ప్రభాతవార్త : టిఆర్ఎస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో తాము రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా నేటికీ నానా కుంటిసాకులతో తాత్సారం చేస్తుందని, రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వశాఖలు, స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలలో పనిచేస్తున్న 2.20లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించకపోతే 2లక్షల మంది ఆయా ఉద్యోగులతో త్వరలో పెద్దయెత్తున ఉద్యోగ గర్జన నిర్వహిస్తామని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఉద్యమం తీవ్రతరమై ఉత్పన్నమయ్యే అన్నిరకాల పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని కూడా ఆయన హెచ్చరించారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మలేరియా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల భారీ మహాసభ జరిగింది. బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎస్.రామలింగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా, బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ, రసూల్‌భాషా, పరమేష్, ఎం.శ్యాంకుమార్, ఎం.డి.మన్సూర్, ఎం.ఆంజనేయకుమార్, జగన్ తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు వెట్టిచాకిరితో సమానమని, ఈ విధానాలనే ఎత్తివేయాలని, వీరికి తక్కువ జీతాలిచ్చి శ్రమదోపిడీ చేస్తున్నారని, అంతేకాక సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతీ ఉద్యోగికి సమానపనికి సమాన వేతనమిచ్చి కోర్టు తీర్పును గౌరవించాలని ప్రభుత్వానికి సూచించారు. అన్నిరకాల పనులకు ఉపయోగించుకొంటున్న ఈ ఉద్యోగులే లేకపోతే ప్రభుత్వాల నడువవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. ఈ ఉద్యోగులది ఆకలి పోరాటం కాదని, ఆత్మగౌరవ పోరాటమన్నారు. ఏజెన్సీలు ఎన్నో అక్రమాలకు పాల్పడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేస్తున్నారని, ప్రజా, ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగంతో కొల్లగొడుతున్నారని, మనది ధనిక రాష్ట్రమని అన్ని వేదికలపై ఊపదంపుడు ప్రసంగాలు చేసే ముఖ్యమంత్రి కెసిఆర్ వీరిని ఎందుకు క్రమబద్ధీకరిస్తరు, ఉద్యోగ భద్రత కల్పిస్తలేరని ధ్వజమెత్తారు. ఎవ్వరైనా తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ఉద్యమించకపోతే ఏప్రభుత్వమూ ముందుకురాదన్న విషయాన్ని మన ఉద్యమ నేపథ్యాలే నిరూపించాయని, అందుకే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా ఉద్యమించే సమయమొచ్చిందని, ఈ ఉద్యమంలో ప్రతీఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని ఉద్యమాన్ని బలోపేతంచేసి తమ సమస్యల పరిష్కార దిశగా పయనించాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిస్తూ, మీకు ఎల్లవేళలా నా సహాయ సహకారాలుంటాయని పూర్తి భరోసానిచ్చారు. ఈ ఉద్యోగులు తమ పైఅధికారులతో ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే తప్పక పూర్తి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ మాతో అన్నిరకాల పనులు చేయించుకొంటున్నా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం ఇవ్వడంలేదని, తక్కువ జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం, పిల్లల్ని చదివించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగంలో ఇంక్రిమెంట్లు, డిఎల పెంపు, వారాంతపు, మెడికల్ సెలవులు, మహిళలకు ప్రసూతి సెలవు ఇవ్వడం లేదని, వెంటనే తమ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌శారు.

చైనా, పాకిస్థాన్ కారిడార్‌పై భారత్‌తో చర్చలకు సిద్ధమే

చైనా అధికారప్రతినిధి హువాన్‌చున్‌యంగ్



మోడీజిన్‌పింగ్

బీజింగ్,జనవరి 29: చైనాపాకిస్తాన్ ఆర్థికకారిడార్‌పై భారత్‌తో చర్చించి విభేదాలు పరిష్కరించుకునేందుకు తాము సిద్ధమేనని చైనా ప్రకటించింది. చైనా పాకిస్తాన్ సంయుక్తంగా 50 బిలతియన్ ఆర్థిక కారిడార్‌ను పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నిర్మించతలపెట్టిన సంగతి తెలిసిందే. చైనాలో భారత్ రాయభారి గౌతమ్ బంబావాలే ఇంటర్వ్యూను ఉటంకించింది. గ్లోబల్ టైమ్స్‌కు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలో చైనాపాకిస్తాన్ ఆర్థికకారిడార్ ప్రతిపాదనలను పెండింగ్‌లో ఉంచుతున్నట్లు ప్రకటించారు. చైనా విదేశాంగశాఖ అధికార మహిళాప్రతినిధి హువాచున్‌యింగ్ మాట్లాడుతూ ఈ కారిడార్‌పై తాము చర్చలకు సిద్ధమేనని వెల్లడించారు. చైనా పాకిస్తాన్ ఆర్థికకారిడార్‌పరంగా చైనా పదేపదే భారత్ వైఖరిని ప్రస్తావిస్తోందని, చైనాభారత్‌లో ఉన్న విభేదాల పరంగా చూస్తే ఈ ప్రాజెక్టును విభేదిస్తోంది. అయితే చైనా మాత్రం భారత్‌తో చర్చలుజరిపి ఈ విభేదాలను, అపోహలను పరిష్కరించుకునేందుకు తాము సిద్ధమేనని రెండుదేశాల శ్రయేస్సుదృష్ట్యా చైనా కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమేనని ప్రకటించింది. పరస్పరగౌరవం, నిజాయితీతో విబేధాలపై చర్చించి పరిష్కరించుకోగలమని మహిళా ప్రతినిధి వెల్లడించారు. ఒకే ఒక పార్టీతో ఈ సమస్య పరిష్కారం కాదని, భారత్‌తో కూడా కలిసి చర్చించేందుకు తాము సిద్ధమేనని మరింత మెరుగైన పరిష్కారం లభిస్తుందని అన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో చైనాపాకిస్తాన్ ఆర్థికకారిడార్‌ను 50 బిలియన్ డాలర్లతోచైనా నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ కారిడార్ పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ గుండా వెళుతోంది. ఉత్తరభారతంలో జమ్ముకాశ్మీర్ రాష్ట్రానికి ఈ కారిడార్‌వల్ల సమస్యలు తలెత్తుతాయని, అంతేకాకుండా భారతీయ ప్రాదేశిక ప్రాంతానికి సైతం విఘాతం కలుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టుకు చైనా పాకిస్తాన్‌లు హద్దులు నిర్ణయించుకోకోయినా చైనా పాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌గా నామకరణంచేసారు. ఈ కారిడార్‌కు పాక్ ఆక్రమిత కాశ్మీర్ గుండా పాకిస్తాన్‌కు లింకు ఏర్పడుతుంది. ఇక భారత్, ఆఫ్గనిస్తాన్‌లు కూడా కొంత సరిహద్దును కలిగి ఉండటంతోపాటు బలవంతంగా ఆక్రమిత కాశ్మీర్‌ను ఆక్రమించుకోవడాన్ని భారత్ తీవ్రంగా అభ్యంతరంవ్యక్తం చేసింది. ప్రస్తుతం ఈ కారిడార్ నిర్మాణ పనులు పాకిస్తాన్, బెలూచిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఈ కారిడాం నేరుగా చైనాలోని గ్జింజియాగ్ ప్రాదేశిక ప్రాంతాన్ని కలుపుతుంది.

ఈప్రాంతం పాక్‌లోని బెలూచి స్తాన్ లో ఉన్న గ్వదర్ ఓడరేవునుంచి చైనా గ్జిన్ జిం యాంగ్‌ను నేరుగా కలుపుతుంది.

కర్ణాటకలో అధికారం కోసం బిజెపి..ఒవైసితో దోస్తీకి జరిగిన చర్చలు?

యుపి మాదిరి ఎన్నికల వ్యూహానికి పడిన బీజాలు

బెంగళూరు,జనవరి 29,(ప్రభాతవార్త): త్వరలో కర్ణాటక శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపధ్యంలో ఈసారి అధికారాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలన్న ధ్యేయంతో కమలనాధులు ఉత్తరప్రదేశ్ ప్రయోగం మాదిరిగా ఇక్కడ మైనారిటీ పార్టీలతో దోస్తీ కట్టేందుకు లోలోపల ప్రయత్నాలు ప్రారంభించారని వినికిడి. ఇందుకు బలమైన ఆధారంగా ఆల్‌ఇండియా ఇత్తేహాదుల్ ముస్లమీన్ పార్టీ అధ్యక్షుడు అసాదుద్దీన్ ఒవైసీతో దక్షిణాదికి చెందిన కమలపక్షం అగ్రనాయకులు చర్చలు జరిపారని బెంగళూరులో వార్తలు గుప్పుమన్నాయి. ఇందుకు బిజెపి సర్వసైన్యాధ్యక్షుడు అమిత్‌షా కూడా ఆమోదముద్ర వేశారని ఈవర్గాలు చెబుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో బిజెపి దక్షిణాదిపార్టీ బాధ్యుడు ఒకరు ఒవైసీతో మంతనాలు జరిపారని ఈమేరకు వచ్చే కర్ణాటక విధానసభ ఎన్నికల్లో ఎఐఎంఐఎం పార్టీ కనీసం 30చోట్ల పోటీకు దిగి కాంగ్రెస్ పార్టీ గెలుపు అవకాశాలను పక్కకు మళ్లించాలని కోరినట్లు సమాచారం. ఈ ప్రయోగం ఉత్తరప్రదేశ్‌లో ఒవైసీ నాయకత్వంలోని ఇత్తేహాదుల్ ముస్లమీన్ పార్టీ చేసింది. మైనారిటీలు పెద్దసంఖ్యలో ఉన్న నియో జకవర్గాల్లో కాంగ్రెస్ స్పీడుకు బ్రేకులు వేసేందుకు అక్కడ ఎఐఎంఐఎం పార్టీ పోటీ చేయగా సదరు నియో జకవర్గాల్లో 19సీట్లను బిజెపి గెలుచుకుంది. ఇది కాంగ్రెస్‌కు పెద్దదెబ్బగా ఎదురైంది. ఈ ప్రయోగాన్ని కర్ణాటకలో అమలుచేస్తే హైదరాబాద్ కర్ణాటక ప్రాంతంలోని ఆరుజిల్లాలు బీదర్, యాదగిరి, గుల్బర్గా, రాయచూరు, బళ్లారి, కొప్పళ్ జిల్లాల్లోను బెంగళూరునగర జిల్లాలోని శాంతినగర, సర్వజ్ఞనగర, చామరాజపేట, పులకేశినగర, చిక్కపేట, శివాజీనగర, హెబ్బాళ, మహదేవపుర నియోజకవర్గాల్లో ఎఐఎంఐఎం పార్టీను బరిలోనికి దించేలా చర్చలు జరిగినట్లు తెలిసింది. ఆయా చోట ఎంఐఎం అభ్యర్థులు పోటీ చేస్తే వారికి తలా పదిలక్షల రూపాయల నగదు, రెండేసి కార్లు, 20మంది బలగాన్ని వీరు సమకూర్చుతారు. ఎన్నికల్లో ప్రచారం చేసి కాంగ్రెస్ వైపు వాలుతున్న మైనారిటీ ఓటర్లను చీల్చటమే దీని ధ్యేయంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌కు ఒక చెందిన ఒక కేంద్రమాజీ మంత్రి ఈ చర్చలకు వేదిక కల్పించారని ఈవర్గాలు తెలిపాయి. ఎంఐఎం పోటీకి దింపితే కాంగ్రెస్‌పార్టీ గెలుపు అవకాశాలను కట్టడి చేయవచ్చని కమల నాధుల ఆలోచనగా ఉందనేది నిజం. ఉత్తరప్రదేశ్ మాదిరి ప్రయోగానికి సర్వసైన్యాధ్యక్షుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్న వార్తలు బయటకు పొక్కాయి. కాగా బెంగళూరులో సోమవారం ఈ వార్తల సారాంశాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.రామలింగారెడ్డి, సిఎం సిద్దరామయ్య ధ్రువపరచారు. ఎఐఎంఐఎం పార్టీను కర్ణాటక ఎన్నికల్లోనికి దింపాలన్న కమలనాధుల చర్యలు పట్ల వీరు ఖండించారు. బిజెపి నేతలు ఒక వంక మైనారిటీల పట్ల చిన్నచూపు చూపుతూ మరోపక్క ఎన్నికల్లో శత్రుపక్షాన్ని తుద ముట్టించేందుకు ఎంఐఎం పార్టీతో దోస్తీ కడుతు న్నారని ఇది బిజెపి ద్వంద్వ వైఖరీను చూసు తోందని విమర్శించారు.

ముస్లింనాయకుడు ఒవైసి ఇటీవల బెంగళూరు శివాజీనగర ప్రాంతంలో ఒక పబ్లిక్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు సిటికి వస్తే ఇక్కడి పోలీసులు ఆయన్ని బహిరంగసభలో పాల్గొనేందుకు అనుమతించలేదు. ఆయన్ని వెనక్కి పంపింది. ఈ పరిణామం నేపథ్యం కూడా ఒవైసీ పార్టీ కర్ణాటకలో పోటీ చేసేందుకు అందుకు బిజెపితో చెలిమి జరిపేందుకు సన్నాహాలు చేసుకుందని తెలిసింది.

బెంగళూరు చామరాజపేట ఎంఎల్ఎ జమీర్ అహమద్‌ఖాన్ మాట్లాడుతూ కర్ణాటక ముస్లిం సోదరులు ఒవైసీ మాయమాటలు నమ్మబోరని అన్నారు. గతంలోను ఇలాంటి ప్రయోగాలు జరిగినా కూడా అది ఇతరపార్టీలకు లాభం చేకూర్చలేదని చెప్పారు.

నగరంలో కొత్తగా 30 పిహెచ్‌సిలు! ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం

జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో నూతన పిహెచ్‌సిలు ఏర్పాటు

ప్రజల చెంతకు వైద్యం అంటున్న ప్రభుత్వం

ప్రజలకు చేరువ కానున్న వైద్య సదుపాయం

హైదరాబాద్, జనవరి29 ప్రభాతవార్త ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే నగరంలో మరికొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏరా ్పటు చేయ నున్నారు. ఇందులో భాగంగానే 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేయ నున్నారు. ఇందుకు జిల్లా వైద్యాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 30 పిహెచ్‌సిలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. జనాభా ప్రాతిపాదికన పిహెచ్‌సిలను ఏరా ్పటు చేస్తున్నారు. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి నివాస స్థలం నుంచి 3 కిలోమీటర్లలోపు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేలా ప్రభుత ్వం వీటిని ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకొస్తున్నది. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి దానికనుగుణంగా ఆరోగ్య కేంద్రాల సంఖ్యను పెంచడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. బస్తీలలో కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఆయా ప్రాంతాల్లో గల కమ్యూనిటీ హాల్లు, కమ్యూనిటీ హాల్లులేని చోట అద్దె ప్రాతిపదికన భవనాలు తీసుకొని అందులో కేంద్రాలను నిర్వహించాలని జిల్లావైద్యారోగ్యశాఖ అధికారి డా.పద్మజను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా ఆదేశాలు జారీచేశారు. జిల్లావైద్య ఆరోగ్యశాఖ, జిహెచ్‌ఎంసి సమన్వయంతో ఆరోగ్య కేంద్రాలు కావలసిన ప్రాంతాలను గుర్తించి త్వరి తగతిన పూర్తిచేయాలని సూచించారు. నగరంలో 85 పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. అయితే బస్తీల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. సీజనల్ వ్యాధుల సమయంలో బస్తీ వాసులు ఎక్కువగా అనారోగ్యాలకు గురవుతున్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, వైరల్ ఫీవర్ వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్యం అందకా ప్రాణాలు కోల్పోతున్నారు. పిహెచ్‌సిలు నివాస ప్రాంతాల నుంచి చాలా దూరంగా ఉండడంతో ప్రజలు కేంద్రాలకు వెళ్లడానికి ఇష్టపడటంలేదు. ప్రైవేట్ ఆస్పత్రులకు ఆశ్రయిస్తున్నారు. పిహెచ్‌సిల్లో వైద్యసదుపాయం, కొందరి వైద్య సిబ్బంది వ్యవహారశైలి, పనితీరువల్ల కేంద్రాలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ నేపథ్యంలో రోగులు ప్రైవేట్ బాటపడుతున్నారు. వ్యాధులకు అత్యధికంగా ప్రభావితమయ్యే బస్తీలను గుర్తించి పిహెచ్‌సిలను ఏర్పాటు చేయడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించడంలో భాగంగా 30 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నూతనంగా ప్రారంభించనున్నట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.పద్మజ తెలిపారు. వీటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రాథమిక ఆరోగ్యం ప్రజలకు మరింతగా చేరువౌతుంది. ఇప్పటికే వీటికోసం కాలనీల్లో ఉన్న ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాల్లు, అద్దె భవనాలను తీసుకొని కేంద్రాలను స్థాపించాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గర్తించి కేంద్రాలను ఏర్పాటు చేసే పనిలో అధికారులు తలమునకలవుతున్నారు.

గాంధేయ విధానంలో స్వచ్ఛత కార్యక్రమాలు

స్వచ్ఛత ర్యాంకింగ్ కోసం జిహెచ్ఎంసి ప్రత్యేక కార్యక్రమాలు

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త గాంధేయ విధానం ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప అహింసా పద్దతి, శాంతియుత పద్దతి, నచ్చ చెప్పడం, మనసు మార్చడం ద్వారా కావాల్సిన పనులను సాధించుకోవడం ఈ గాంధేయ సిద్ధాంతం ప్రధాన ఉద్దేశం. అయితే ఈ గాంధేయ విధానాన్ని దేశంలో పలు వర్గాలు, సంసథలు మరిచిపోతున్నప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించడానికి ఉపయో గించుకుంటుంది. దీనిలో భాగంగా గాంధిగిరతో అదనపు టాయిలెట్లు, మా ఇంటి నేస్తం, ఇంటింటికి బొట్టు, పరిచయ కార్యక్రమం, సిటీ-లాతీ, ముగ్గుల ప్రయోగం, మటన్‌షాపులకు టిఫిన్ బాక్సులతో వెళ్లడం తదితర గాంధేయ మార్గాలను హైదరాబాద్ నగరంలో అనుసరిస్తున్నారు. ఈ గాంధీగిరి పద్దతి ద్వారా హైదరాబాద్ నగరంలో పెట్రోల్ బంకులు, హోటళ్లు, రెస్టారెంట్లను ఒప్పించడం ద్వారా 600లకు పైగ టాయిలెట్లను నగర వాసులు ఉచితంగా ఉపయోగించుకునేలా విజయం సాధించింద. జిహెచ్‌ఎంసి చేపట్టిన గాంధిగిరి విధానాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని స్వచ్ఛ్ భారత్ మిషన్ దేశంలోని అన్ని మున్సిపల్ కార్పోరేషన్లు, మునిసిపాలిటీలు, స్థానిక సంస్థలకు ప్రత్యేకంగా లేఖలు రాసి సూచించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరం బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా కూడా కేంద్ర స్వచ్ఛ్ భారత్ మిషన్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ప్రకటించింది.

స్ఫూర్తిదాయకంగా గాంధీజీ పెయింటింగ్ జిహెచ్‌ఎంసి కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ ఎదురుగా గోడపై వేసిన గాంధీజీ చిత్రం పలువురిని ఆకట్టుకుంటుంది. గాంధేయ సిద్దాంతాలు ఆచరణ కంటే మరిచిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో గాంధేయ పద్దతుల ద్వారా నగర ప్రజల్లో స్వచ్ఛతపై చైతన్యం కలిగించడంతో పాటు స్వయంగా పాటించేలా పలు చర్యలను జిహెచ్‌ఎంసి చేపట్టింది. తద్వారా గ్రేటర్ హైదరాబాద్‌లో స్వచ్ఛ కార్యక్రమాల పట్ల పలు సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు గతం కంటే ఉత్సాహంతో పాల్గొంటున్నారు.

ఇంటింటికి బొట్టు తడి, పొడి చెత్తను వేరు చేయడానికి 44లక్షల డస్ట్‌బిన్‌లను బల్దియా ఉచితంగా అందచేసింది. అయితే వీటిని ఉపయోగించాలని వివిధ ప్రసార మాద్యమాల ద్వారా ఎంతో ప్రచారం చేశారు.

సరైన ఫలితాలు లభించలేదు. దీంతో స్వచ్ఛ్ దూత్ పేరుతో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లను నియమించి ప్రతి ఇంటికి వెళ్లి బొట్టుపెట్టి ప్రచారం చేయనున్నారు. వీటితో పాటు తరచుగా బహిరంగ మూత్ర విసర్జర చేసే ప్రాంతాల్లో లాఠీని ఇచ్చిన మూత్రం పోస్తే గట్టిగా శద్దం చేసస్తూ విజిల్ వేయడం నగరంలో 1116 బహిరంగంగా చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవడం, ఆ ప్రాంతంలో ముగ్గులు వేయడం.

మటన్, చికెట్ దుకాణాలకు వచ్చేవారికి టిఫిన్ బాక్సులను తీసుకుని రావడం, రూ.10వేల నగదు బహుమతిని అందించడం చేస్తున్నారు. జిహెచ ఎంసిలో ఉత్తమ సేవలను అందించే కార్మికులను, సిబ్బందిని గుర్తించి వారిని పౌర సమాజం ద్వారా సన్మానం చేసే కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. 20 వేల మంది పారిశుధ్య కార్మికులు తాము విధులు నిర్వహించే ప్రాంతాల్లో ప్రజలను కలిసి తమకు తాము పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

నగర పబ్లిక్ టాయిలెట్ల కేర్ టేకర్‌లను ప్రత్యేక డ్రెస్ కోడ్ విధించి పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా అందించడం, ఎస్‌బిఐ ఎన్ ఎండిసి తదితర సంస్థల నుంచి కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ద్వారా షీ టాయిలెట్ల నిర్మాణం, స్వచ్ఛ సేవల ఏర్పాటు తదితర ఎన్నో విధానాల ను జిహెచ్ ఎంసి అమలు చేస్తుంది.

వ్యవసాయరంగంలో 25శాతం తగ్గిన దిగుబడులు



న్యూఢిల్లీ,జనవరి 29: వాతావరణంలోనెలకొంటున్న మార్పులకారణంగా భారత్ వ్యవసాయరంగ రాబడులు 20నుంచి 25శాతం తగ్గాయని ఆర్థికసర్వే స్పష్టంచేసింది. 2022 నాటికి రైతు రాబడులు రెట్టింపుచేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా వ్యవసాయ దిగుబడులున్నాయి. 2014నుంచి ఇప్పటివరకూ వ్యవసాయరంగ వృద్ధి కేవలం నాలుగు శాతం మాత్రమే ఉంది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాలనుంచి పట్టణ ప్రాంతాలకు పురుషుల్లో వలసలు ఎక్కువ పెరుగుతుండటంతో గ్రామీణ వ్యవసాయరంగంలో మహిళలు కీలకపాత్ర పోసిసుత్న్నారని రైతు మహిళలుగా ఎదుగుతున్నట్లు తెలిపింది. రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యవసాయ కూలీ లుగా మహిళలే అధికంగా ఉన్నారని ఆర్థిక సర్వే ఉటంకించింది.

బిందు తుంపర్లసేద్యం ఉద్యానవనర రైతులకు నేరుగా లబ్ది వారి ఖాతాలకే చేరాలని సూచించింది. భారతీయ ప్రాదేశిక ప్రాంతంలో నెలకొంటున్న వాతావరణ మార్పులు వ్యవసాయ దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయని అంచనా వేసింది. అత్యధిక ఉష్ణోగ్రతలు వర్షపాత లేమి వంటివి ఎక్కువగా భౌగోళిక మార్పులకు హేతువవుతున్నాయి. దీనివల్ల వ్యవసాయ రాబడుల్లో తగ్గుదల నమోదవుతున్నదని ప్రధానార్థికసలహాదారు అరవింద్‌ను బ్రహ్మణియన్ ఆందోళన వ్యక్తంచేసారు. ఈప్రభావం సాగదునీటి వసతిలేనిప్రాంతాల్లో రెండుసార్లు ప్రస్ఫుటం అయిందని వివరించింది. ఆంధ్రప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌ఘర్ వంటి రాష్ట్రాలు వైవిధ్య భరితమైన పంటల్లో టాప్‌మూడు రాష్ట్రాలు గానిలిచాయి. భూవినియోగంలో మార్పులు రావడమే ఇందుకుకీలకమని ఆర్థికసర్వే ప్రస్తావించింది.

సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి వర్గీకరణకు స్వస్తి పలకాలి:చెన్నయ్య డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జి.చెన్నయ్య

సైఫాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును దిక్కరించి రాజకీయ పార్టీలు అఖిల పక్షంగా ఢిల్లీ వెళ్ళి వర్గీకరణ కోసం కృషి చేస్తే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని ఆయన హెచ్చరించారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీ వెళ్లి అన్ని రాజకీయ పార్టీలకు వినతి పత్రాలను సమర్పిస్తామని, వర్గీకరణను అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. వర్గీకరణ అంశాన్ని ప్రక్కన పెట్టి దళితులు రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దళితులు రాజ్యాధికారంలోకి రాకుండా ఉండేందుకు మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టి తమ పబ్బం గడుపుకుంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు జంగా శ్రీనివాస్, జి.రమేష్, వై.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం కలిసి నడుద్దాం

పంజాగుట్ట, జనవరి 29 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం అన్ని పార్టీలు కలిసి కట్టుగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తీర్మాణం చేశాయి. ఈ మేరకు సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ చట్టబద్ధతపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. వర్గీకరణపై పార్లమెంట్‌లో బిల్లుపెట్టేలా అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి పంపిస్తామని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి నేడు ఆ విషయంపై మాట్లాడకపోవడాన్ని పలు పార్టీలు తీవ్రంగా ఖండించాయి. టీఆర్ఎస్ పార్టీ లేక పోయినా మిగితా పార్టీలు ఓ బృందంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కార్యచరణ రూపొందించుకోవాలని పలు పార్టీల నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్, టీటీడిపి అధ్యక్షులు ఎల్.రమణ, సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, ప్రజా యుద్ధనౌక గద్దర్, న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్, తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు చెరుకు సుధాకర్‌తో పాటు పలువురు రాజకీయ పార్టీల నేతలు హాజరై ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సంధర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు మద్దతు తెలుపుతుందన్నారు. త్వరలో ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ఈ విషయాన్ని పార్టీ నేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్తానని ప్రకటించారు. వరీక్గరణ కోసం అన్ని పార్టీలతో కలిసి నడిచేందుకు తెలంగాణ కాంగ్రెస్ సిద్దంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బీజేపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ వర్గీకరణ అంశాన్ని ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నానని, కొన్ని చట్టపరమైన సాంకేతిక అంశాల చిక్కుల వల్ల జాప్యం జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ నెల 31న వర్గీకరణ అంశంపై బిజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షాను కలిసి చర్చించనున్నట్లు, అమిత్‌షా కూడా సమయం కేటాయించినట్లు సమాచారం అందిందని తెలిపారు. అయితే ఈ అంశంపై టీఆర్ఎస్ ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయకుండా నాన్చుడు ధోరణి అవలంబించడం బాధాకరమన్నారు. ఏకంగా సీఎం అసెంబ్లీలో ప్రకటించి ఇప్పటికీ బృందాన్ని ఢిల్లీకి పంపించకపోవడం టీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. పైగా తమ న్యాయమైన డిమాండ్ కోసం శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన వారిపై కేసులు నమోదు చేయడం అన్యాయం అన్నారు. రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అధికార పార్టీ పౌర ప్రజాస్వామిక హక్కులను కాల రాస్తుందన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం అణిచివేయడం సరికాదన్నారు. ఈ అంశంపై కూడా అన్ని పార్టీలు కూర్చొని చరించాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. ధర్నాచౌక్‌ను పున:రుద్దరించే అంశంపై కూడా అన్ని పార్టీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇక ఎస్సీ వర్గీకరణకు జేఏసీ మద్దతుగా నిలుస్తోందని, తమ కమిటీ సమావేశంలో చర్చించి ఎంఆర్‌పీఎస్ చేపట్టబోయే కార్యక్రమంలో పాలుపంచుకుంటామని స్పష్టం చేశారు. ఇక టీఆర్ఎస్ పార్టీ ఢిల్లీకి రాకపోతే మిగిలిన పార్టీలతో ఒక బృందంగా ఏర్పాటుచేసి ఢిల్లీకి వెళ్ళి పార్లమెంట్‌లో బిల్లుపెట్టేలా ఒత్తిడి తేవాలని సూచించారు. అప్పుడు ప్రభుత్వం చేయని పని మనం చేశామన్న పేరు కూడా దక్కుతందన్నారు.

ఎంఆర్‌పీఎస్‌కు మద్దతు ఇస్తున్నంత మాత్రనా జేఏసీ మాలలకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మంద కృష్ణ మాటా ్లడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఓబీసీ ఉపవర్గీకరణ, కాపుల రిజర్వేషన్‌ల అంశాలపై చర్చలు జరుపుతుందని, అలాంటప్పుడు గత 24సంవత్సరాలుగా వర్గీకరణపై జరుగుతున్న ఆందోళనలను నేటికి పట్టించుకోక పోవడం బాధకరమన్నారు. ఇక టీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించి నేటికి స్పందించకపోవడం ఆ పార్టీ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే ప్రభుత్వం అఖిలపక్ష బృందాన్ని ఏర్పాటుచేసి ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక మిగతా పార్టీలు కూడా ఈ బడ్జెట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు అమలు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకపోతే కొన్ని సంవత్సరాల పాటు ఈ అంశం వాయిదా పడే ప్రమాదం ఉందన్నారు. వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ చేపట్టబోయే ప్రతి కార్యక్రమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని సీపీఐ, సీపీఎం, ఇంటి పార్టీ, న్యూడెమొక్రసీ తదితర పార్టీల నేతల ప్రకటించారు.

విషాదాన్ని మిగిల్చిన వివాహేతర సంబంధాలు

నగరంలో కలకలం రేపిన మూడు గృహ హత్యలు
భార్య, కుమార్తె, అత్తను దారుణంగా హతమార్చిన కసాయి
రెండు రోజుల అనంతరం బయటపడ్డ దారుణం
పోలీసుల వద్ద లొంగిపోయిన నిందితుడు

సైబరాబాద్ ప్రతినిధి, జనవరి 29 ప్రభాతవార్త ఇదివరకే పెళ్లై భార్య ఇద్దరు పిల్లలుండగా మరో మహిళపై వ్యామోహంతో తనకు పెళ్లికాలేదని నమ్మబలికి ప్రేమ పేరుతో ఆమెను రెండో వివాహం చేసుకున్నాడు. గుట్టు చప్పుడు కాకుండా కాపురం కొనసాగించి మరో చిన్నారికి తండ్రయ్యాడు. అసలు విషయం తెలుసుకొని రెండేళ్లుగా తనకు దూరంగావుంటూ ఇటీవల మరో వ్యక్తితో చనువుగావుంటున్న ఆమెపై కక్ష పెంచుకున్నాడు. పథకం ప్రకారం మిట్టమధ్యాహ్నం ఆమె ఇంట్లోకి ప్రవేశించి మంచంపై ఆదమరచి నిద్రిస్తున్న తన నాలుగేళ్ల చిన్నారిని, ఆమె పక్కనే పడుకున్న తన అత్తను గొంతు నులిమి చంపాడు. అంతలోనే మధ్యాహ్న భోజనంకోసం ఇంట్లోకి వచ్చిన తన భార్యను వెంబడించి వంటింట్లో దాక్కున్న ఆమెను రుబ్బురాయితో తలపై మోది అతి దారుణంగా హతమార్చాడు. ఆపై గుట్టు చప్పుడు కాకుండా బయట నుంచి ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. రెండు రోజుల అనంతరం విషయం వెలుగులోకి రాగా సమాచారమందుకున్న సైబరాబాద్ పోలీసులు మూడు హత్యల ఉదంతంపై వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఘటన వెలుగు చూసిన ఆరు గంటల అనంతరం తమ ముందు లొంగిపోయిన నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని చందానగర్‌లో 27వ తేదీ మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఉదంతం స్థానికంగా తీవ్ర కళకళం రేపింది. ఘటనా స్థలంలో లభించిన ఆధా రాలు, పోలీసులు తెలిపిన ప్రకారం ఈఘ టనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా వున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన అపర్ణ(30) కూకట్‌పల్లిలో నివాసముంటూ సెల ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తున్న మధు(35) అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. రెండేళ్ల అనంతరం వీరికి కుమార్తె(కార్తికేయ) పుట్టింది. మరో రెండేళ్లు గడిచాక మధుకు ఇదివరకే పెళ్లయిందని, అతనికి ఇద్దరు కుమార్తెలు సైతం ఉన్నారన్న విషయం తెలుసుకున్న అపర్ణ అప్పటి నుంచి తన భర్తకు దూరమై తన తల్లి జయమ్మ(55), కుమార్తెతో కలిసి చందానగర్‌లోని వేముకుంటలో నివాసముంటోంది. స్థానికంగా ఒక ఎలక్ట్రానిక్స్ షోరూంలో ప్రమోటర్‌గా పనిచేస్తున్న ఈమె గతకొంత కాలంగా రూపాలాల్ అనే వ్యక్తితో చనువుగా ఉంటుందని మధు గమనించాడు. ఈ విషయమై తరచుగా అపర్ణతో గొడవ పడు తుండేవాడు. అయినా అపర్ణ తన మాట విన డంలేదని కక్ష పెంచుకున్న మధు అపర్ణతోపాటు ఆమె అమ్మను, తన కుమార్తెను సైతం మూకు మ్మడిగా హత్య చేయాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం సమయంలో అపర్ణ ఇంట్లోకి ప్రవేశించిన మధు పడకగదిలోని బెడ్‌పై నిద్రిస్తున్న తన అత్త జయమ్మ, కుమార్తె కార్తీకేయను ఒక్కసారిగా గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. మధ్యాహ్న భోజనంకోసం అపర్ణ ఇంటికి రాగా అప్పటికే ఇంట్లో మాటువేసిన మధు ఆమెపై దాడి చేశాడు.

వంటింట్లోకి పరుగెత్తిన అపర్ణను వెంబ డించి పక్కనేవున్న రుబ్బురోలుతో ఆమె తలపై మోది అతి దారుణంగా హతమార్చాడు. ఎవరికీ అనుమానం రాలేదని గమనించి బయటకు వెళ్లిన మధు ఇంటికి తాళంవేసి వెళ్లిపోయాడు.

రెండు రోజులు గడిచినా అపర్ణ కుటుంబం జాడ తెలియ కపోవడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని కిటికీలోంచి తొంగిచూడగా పడకగదిలో బెడ్‌పై అపర్ణ తల్లి జయమ్మ కాళ్లు కనిపించాయి. దీంతో ఆయన చందానగర్ పోలీసులకు సమా చార మందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీ సులు తాళం పగుళగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా ముగ్గురి మృతదేహాలు కనిపించాయి. ఈమేరకు క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించిన పోలీసులు ఆధారాలను సేకరించారు. పంచనామా నిర్వ హించిన అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సైబరా బాద్ సంయుక్త పోలీస్ కమిషనర్ షానవాజ్ ఖాసీం, మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్, కూక ట్‌పల్లి ఎసిపి బుజంగరావ్, చందానగర్ ఇన్‌స్పెక్టరు తిరుప తిరావు, మియాపూర్ ఇన్‌స్పెక్టర్ హరి చ్చంద్రా రెడ్డిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పథకం ప్రకారమే అందరినీ హతమార్చాడు.

రెండు రోజుల అనంతరం సోమవారం అపర్ణ కు టుంబం దారుణ హత్యకు గురైందన్న విషయం వెలుగులోకి రాగా ఆమె భర్తే ఈ ఉదంతానికి ఒడి గట్టాడన్న విషయం వెలుగులోకి రావడంతో చేసే దిలేక సోమవారం సాయంత్రం మధు పోలీసుల వద్ద లొంగిపోయాడు. దీంతో అప్పటివరకు మిస్టరీ గావున్న ఈ ఘటనలో మధు అపర్ణ తల్లి జయ మ్మను, చిన్నారి కార్తికేయను, అనంతరం అపర్ణను ఎలా చంపాడన్న విషయం వెలుగులోకి వచ్చింది. అయితే తన మొదటిభార్యకు అసలు విషయం తెలిసి కుటుంబంతోపాటు బంధువుల నుంచి వత్తిడి పెరగడంతో ఎలాగైనా రెండోభార్య కుటుంబాన్ని సమూలంగా అంతం చేయాలనుకున్న మధు ఈ దారుణానికి ఒడిగట్టాడని తెలిసింది.

అయితే మధుకు మరెవరైనా సహకరించారా అన్న విషయమై పోలీసులు ఆరాతీస్తున్నారు. చందా నగర్‌లోని ఓ ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో అపర్ణ ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం రెండున్నర గంటల సమ యంలో భోజనం కోసం ఇంటికి వెళ్లినట్లుగా షాపులోవున్న సిసి టివి ఫుటేజిలో రికార్డయిందని పోలీసులు తెలిపారు.

వివాహేతర సంబంధాలే హత్యలకు దారితీశాయి

తనకు భార్య ఉండి కూడా మధు మరో యువతి అపర్ణపై వ్యామోహం పెంచుకొని ప్రేమపేరుతో పెళ్లి చేసుకొని కాపురం మొదలుపెట్టాడు. అయితే అసలు విషయం తెలుసుకొని మధుకు దూరమైన అపర్ణ రూపాలాల్ అనే మరో వ్యక్తితో సహజీవనం చేస్తుందన్న అనుమానంతో మధు ఆమెపై కక్ష పెంచుకున్నాడు.

ఎట్టకేలకు ఈ రెండు వివాహేతర సంబంధాలు అపర్ణతోపాటు ముక్కుపచ్చలారని చిన్నారి కార్తికేయను, వృద్ధురాలైన అపర్ణ తల్లి జయమ్మను పొట్టన పెట్టుకున్నట్లుగా తెలుస్తోంది.

మహాత్మాగాంధీ కూడా కులాలను ప్రోత్సహించారు



ఇండో-అమెరికన్ దళిత రచయత సుజాతా గిడ్లా
జైపూర్ లిటరసీ ఫెస్టివల్‌లో వ్యాఖ్యలు
మాటవరకే అంటరానితనాన్ని వ్యవతిరేకించారు
నల్లజాతీయులను సోమరిపోతులన్న గాంధీ

జైపూర్,జనవరి29,ప్రభాతవార్తజైపూర్ లిటరసీ ఫెస్టివల్‌లో ప్రముఖ ఇండో-అమెరికన్ రచయత సుజాతా గిడ్లా మహాత్మాగాంధీపై సంచలన వ్యాఖ్యలు చేసారు. ఆయన కుల వ్యవస్థకు వ్యవతిరేకం కాదు. కులాలకు అనుకూలం.కుల వ్యవస్థ వృద్ధిచెందాలని కోరుకున్న వారిలో ఆయన కూడా ఉన్నారు.కులాల ద్వారా రాజకీయ లబ్ది పొందటంపై ఆయన మౌనం వహించారని గిడ్లా వ్యాఖ్యాలు చేసారు. న్యూయర్క్‌కు చెందిన దళిత రచయత అయిన సుజాతా గిడ్లా జైపూర్ ఫెస్టివల్‌లో పాల్గొంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వంలో హిందువులకు మెజారిటీ కావాలి. .అందుకు గాంధీకూడా మాటవరసకు అంట రాని తనానికి వ్యవతిరేకం అన్నారు. అంతేకాదు గాంధీ వర్ణబేధాన్ని చూపారు అని ఆమె అన్నారు. దక్షిణాఫ్రికాలో బ్రిటీషు వారికి వ్యవతిరేకంగా నల్లజాతివారు పాస్‌పోర్టు అంశంలో పోరాడుతున్నపుడు గాంధీ వారిని సోమరిపోతులని వ్యాఖ్యానించారు. భారతీయులతో వారిని పోల్చుతూ భారతీయులు కష్టపడి పనిచేసేవారని.. సోమరిపోతులకే పాస్‌పోర్టు ఇచ్చినపుడు మనకెందుకు ఇవ్వరని వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ పార్టీ,బిఎస్‌పి అధినేత దళిత రచయత మాయావతిపై కూడా ఆమె వ్యాఖ్యలు చేసారు. ఓట్ల కోసం ఆమె దళిత రక్షకురాలుగా మారారని వివరి ంచారు. కాంగ్రెస్ ఎన్నో మాటలు చెబుతుందని కానీ ఆచరణలోకి వచ్చేసరికి బిజెపికి ఏమాత్రం తీసిపోదని విమర్శించారు.

నాగాసమస్య డిమాండ్‌పై ఎన్నికల బహిష్కరణ

బిజెపి కాంగ్రెస్ సహా అన్ని పార్టీల నిర్ణయం

గౌహతి,జనవరి 29: నాగారాజకీయ సమ స్యను పరిష్కరించేంతవరకూ నాగాలాండ్‌అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తమతమ అభ్యర్థులను ప్రకటించకూడదని నిర్ణయించాయి. వచ్చే నెలలో ఎన్నికలుజరుగుతున్న తరుణంలో తమ డిమాండ్ల సాధనకు ఇదే తగిన సమయమని అంచనావేసాయి. మొత్తం 11 పార్టీల నాయకులు ఒక డిక్లరేషన్‌పై సంతకాలుచేసారు. నాగా పీపుల్స్ ఫ్రంట్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలతోపాటు అన్ని పార్టీలు కూడా గొంతుకలిపాయి. నాగా ట్రైబల్ హోహోస్ అండ్ సివిల్ ఆర్గనైజేషన్స్ కీలకకమిటీ కోహిమాలో నిర్వహించిన ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరయ్యాయి. జాతీయ,ప్రాంతీల పార్టీలు మొత్తం అన్ని ఒకేవేదికపైకి వచ్చి ఎన్నికలకు ముందే ఒక పరిష్కారం తీసుకురావాలని నిర్ణయించాయి. 13వ నాగాల్యాండ్ అసెంబ్లీకి ఎన్నికలుసైతం బహిష్కరించేందుకు ఈ పార్టీలు సిద్ధం అయ్యాయి. రాజకీయంగానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందనిభావిస్తున్న పార్టీలు ఆక స్మికంగా నిర్ణయంప్రకటించాయి. సత్వర పరి ష్కారం కోసం నాగా డిమాండ్‌కు కొంత వ్యవధి ఇవ్వాలని అందువల్ల ముందుగానే ప్రకటించినట్లు డిక్లరేషన్‌లో పార్టీలనేతలు వెల్లడించారు. ప్రజల ఆశయాలు అభిమతానికి అనుగుణంగా అభ్యర్థులకు పార్టీ టికెట్లు ఇచ్చి నామినేషన్ల దాఖలుకు పంపించకూడదని నిర్ణయించుకున్నట్లునేతలు వెల్లడించారు. శక్తివంతమైన నాగా హోహోమొత్తం 16 గిరిజన తెగలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇతర పౌర హక్కులసంస్థలు కూడా అంతకుముందు ఎన్నికలసంఘానికి సైతం తాము నాగాసమస్య పరిష్కారం అయ్యేంతవరకూ ఎన్నికలను బహిష్కరిస్తామని అలాగే లేదా వాయిదా వేయాలని విజ్ఞప్తిచేశాయి. మంగళవారం ఎన్నికలకు సంబంధించి గెజిట్‌నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. పోలింగ్ వచ్చేనెల 27వ తేదీ జరుగుతుంది. ప్రస్తుత నాగాలాండ్ అసెంబ్లీ కాలపరిమితి మార్చి 14వ తేదీతో ముగుస్తుంది. నాగా సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఇసాక్ ముయివాహ్) గ్రూపుతో సంతకాలుచేసింది. అయితే ఈ డీల్ ఇప్పటివరకూ వెల్లడికాలేదు. ఇక సత్వర పరిష్కారం మరింత సత్వరమే లభిస్తుందన్న ఆశాలు క్షీణించాయి. అయితే ఢిల్లీ ప్రభుత్వం మరో ఆరు రెబెల్ పార్టీలతో కూడా సంప్రదింపులు ప్రారంభించాయి. ప్రజలకు, అన్ని పార్టీలకు ఆమోదయోగ్యమైన ఒప్పందం జరుగుతుందని సత్వరమే సంతకాలు కూడా చేస్తారని ప్రచారంజరిగింది. ఎన్ఎస్‌సిఎన్(ఐఎం) అస్సామ్‌లోని నాగా ప్రాంతాలు, మణిపూర్, అరుణాచల ప్రదేశ్‌లోని నాగా ప్రాంతాలన్నింటినీ ఏకం చేసి గ్రేటర్ నాగా మండలిని ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేస్తోంది. అయితే కేంద్రం ఈ డిమాండ్‌ను తిరస్కరిస్తోంది. ఇంతకూ తుదివిడత పరిష్కారం ఏమిటన్నది ఎవకిరీ అర్థం కావడంలేదు. అత్య వసరంగా కేంద్రం స్పందించిఎన్నికలలోపు చర్యలు తీసుకోవాలని, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చేయాలని కోరుతోంది. పరిష్కారం లభించేంతవరకూ నాగాలాండ్‌కు ఎన్నికలు నిర్వహించవద్దని ఎన్నికల సంఘాన్నిసైతం ఈ పార్టీలు కోరాయి. 1998లో ఎన్ఎస్‌సిఎన్, ఇతర ప్రముఖ ఎన్‌జిలు రాజకీయపార్టీలన్నీ ఎన్నికలు బహిష్కరించాలనికోరాయి. అన్ని రాజకీయపార్టీలు ఇందుకు అంగీకరించగా కాంగ్రెస్ పార్టీ మాత్రం అన్ని సీట్లకు నామినేషన్లు దాఖలుచేసాయి. ఆసమయంలోనే 60 సీట్లలో 59స్థానాల్లో అభ్యర్థులు గెలిచారు. ఎన్నికలకుముందే పరిష్కారం అన్న నినాదంతో కాంగ్రెస్‌సైతం బైటకు వచ్చింది. బిజెపి ఎన్‌పిఎఫ్ ఆధ్వర్యంలోని అధికార కూటమిలో మిత్ర పక్షంగా ఉంది. అయితే తన వైఖరిని ఇప్పటికీ స్పష్టంచేయలేదు.సోమవారం బిజెపి కూడా డిక్లరేషన్‌పై సంతకం చేసిందని సమాచారం. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ పది పార్టీలతోపాటు బిజెపి కూడా ఎన్నికల్లో పాల్గొనకూడదన్న ఒ ప్పందంపై సంతకం చేసింది. అయితే ఎన్నికలను వాయిదా వేయడం అంత సులువైన అంశం ఏమీకాదు. నిబంధనల ప్రకారం నిర్ణయించిన ఎని నకలు కేవలం రాజ్యాంగ సవరణ చేయడం ద్వారానే వాయిదావేసే వీలుంది. లేదా అనుకోని అత్య వసర పరిస్థితులు తలెత్తినా వాయిదా వేసే అవకాశం ఉంది.

పత్తి విత్తనాలకు కరవు

వానాకాలంలో విత్తనాలే సమస్య
బిజి-2తో దెబ్బతిన్న తోటలు
ఆందోళనలో రైతాంగం

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్తతెలంగాణ రాష్ట్రలో రానున్న వానాకాలం సీజనుకు పత్తి విత్తనం పెద్ద సమస్య కానుంది. తెల్ల బంగారంగా పరిగణించే పత్తి పంటకు అవసరమైన విత్తనం కరువు కానుంది. ప్రతీ ఏటా తెలంగాణ రాష్ట్రలో సాగయ్యే మొత్తం విస్తీర్ణంలో సుమారు సగ భాగం వరకూ పత్తి విస్తీర్ణమే ఉంటుంది. గత ఖరీఫ్ సీజనులో తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 18.61 లక్షల హెక్టార్లలో రైతులు పత్తిని సాగు చేశారు. వచ్చే వానాకాలం సీజనులో పత్తి విత్తనం దొరికితే ఇది కాకుండా అదనంగా కూడా సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. మార్కెట్‌లో విక్రయించే పత్తి విత్తనం రెండు లేక మూడు ప్యాకెట్లు అయితే ఒక్కో ఎకరానికి సరిపోతుంది. ఈలెక్కన 18.61 లక్షల హెక్టార్లలో పత్తి వేయాలంటే కనీసం కోటికి పైగా ప్యాకెట్ల విత్తనం కావాల్సి ఉంటుంది. అయితే మార్కెట్‌లో ప్రస్తుతం ఏ రకమైన పత్తి విత్తనం లేకపోవడంతో వ్యవసాయ శాఖ అధికార్లు ఆందోళన చెందుతున్నారు. గత దశాబ్దకాలంగా రైతులు బిటి-1 (బిజి-1), బిటి-2 (బిజి-2) పత్తిని వేస్తున్నారు. బిజి-1 ఇప్పుడు మార్కెట్‌లో ఎక్కడా లేదు. ఈ స్థానం బిజి-2 ఆక్రమించింది. 2017 వానాకాలం సీజనులో బిజి-2 పత్తి విత్తనమే 48 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. బోల్‌వార్మ్‌ను తట్టుకునే శక్తి ఈవిత్తనానికి ఉందన్న ఉద్దేశ్యంతో రైతులంతా ఇదే విత్తనాన్ని వేశారు. అమెరికాకు చెందిన అంతర్జాతీయ సంస్థ అయిన మోన్‌శాంటో మాత్రమే బిజి-2 టెక్నాలజీని అభివృద్ధి చేసింది. భారత్‌లోని మహికో అనే సంస్థతో మోనోశాంటో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పత్తి పంటకు తెగులు సోకకుండా జన్యుపరమైన సాంకేతిక విజ్ఞానాన్ని మహికోకు అందచేస్తోంది. ఈ విజ్ఞానమే భారత్‌లోని వివిధ విత్తన కంపెనీలు ఉపయోగించి బిజి-2 విత్తనాన్ని ఉత్పత్తి చేయించి విక్రయిస్తున్నారు. దాదాపు 20 కంపెనీల వరకూ మహికో నుండి సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకుంటున్నట్లు వెల్లడిస్తున్నారు. ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నందుకు మోనోశాంటోకు డబ్బు చెల్లిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంతో పాటు, ఇతర రాష్ట్రాల్లోని రైతులు 2017 సంవత్సరం ఖరీఫ్ సీజనులో వేసిన బిజి-2 విత్తనం విఫలమైంది. అంతకు ముందు నాలుగైదు సంవత్సరాల నుండి కూడా ఈ విత్తనం వేస్తున్నప్పటికీ ఇంత భారీ ఎత్తున విఫలం కాలేదు. గులాబి రంగు పురుగు బిజి-2 పంటలపై దాడి చేయడంతో పంట బాగా దెబ్బతింది. పత్తి పంటకు ఏ పురుగు సోకకుండా బిజి-2 పత్తి విత్తనాన్ని మార్కెట్‌లో ప్రవేశపెట్టారో అదే పురుగు బిజి-2 పంటలపై దాడి చేసింది. దీంతో పత్తి ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. బిజి-2 రకం విత్తనాల దెబ్బతో రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ప్రధానంగా బిజి-2 రకానికి చెందిన పత్తి కారణంగా అనుకున్న దిగుబడి వచ్చే అవకాశాలు లేకుండా పోయాయి.రాష్ట్ర వ్యాప్తంగా గత ఖరీఫ్‌లో అన్ని పంటల కంటే పత్తి సాగు పెరిగింది. రాష్ట్రంలో పత్తి సాగు సాధారణ విస్తీర్ణం 16.76 లక్షల హెక్టార్లు కాగా, 2017 ఖరీఫ్‌లో 18.61 లక్షల హెక్టార్లలో సాగైంది. అంటే 111 శాతంగా అది నమోదైంది. గత రెండు సంవత్సరాలుగా తెలంగాణలో ఖరీఫ్ సీజనులో పత్తి సాగును పరిశీలిస్తే 2015 సంవత్సరం ఖరీఫ్ సీజనులో 16.78 లక్షల హెక్టార్లలో పత్తి సాగు కాగా, 2016 సంవత్సరంలో 12.4 లక్షల హెక్టార్లకు పరిమితం అయ్యింది. అది 2017 ఖరీఫ్ సీజనులో సాధాణ విస్తీర్ణానికి మించి పెద్ద ఎత్తున 18.61 లక్షల హెక్టార్లలో సాగు కావడం విశేషం. కాగా బీజీ-2 రకానికి చెందిన పత్తి సాగు చేయడంతో ఒక్కో మొక్క 6 నుండి 7 అడుగులకు పెరిగాయి. చేను ఇంత బాగా ఎదిగినందున ఎకరానికి 10 నుండి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. అయితే చెట్టు ఎదిగినా పూత, కాయ మాత్రం మొక్కుబడిగా వచ్చినట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఒక్కో చెట్టుకు 10 నుండి 12 కాయలే వచ్చాయి. ఈ లెక్కన హెక్టారుకు 3.15 క్వింటాళ్లకు మించి పత్తి దిగుబడి రాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ ఏడాది 18.61 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేయగా, హెక్టారుకు 21 క్వింటాళ్ల చొప్పు పత్తి దిగుబడి వచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాలు అంచనా వేశాయి. ఈనేపథ్యంలో రైతులు తీవ్రమైన ష్టానికి గురయ్యారు. మహారాష్ట్ర ప్రభుత్వం విత్త కంపెనీలపై వివిధ రూపాల్లో వత్తిడి తెచ్చి బిజి-2 పత్తి వేసి నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ఇప్పించింది. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఎటువంటి పరిహారం అందలేదు. రాష్ట్రంలో సమగ్ర విత్తనం చట్టం లేకపోవడమే ఇందుకు కారణమని అంటున్నారు. పత్తి వేసే రైతులు ఒక్కో ఎకరాపై 25 వేల రూపాయల వరకూ పెట్టుబడి పెడతారు. దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తే ఒక్కో ఎకరంపై పెట్టుబడి పోను, సుమారు 25 నుండి 35 వేల రూపాయల వరకూ లాభం ఉంటుంది. గత ఏడాది అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని బిజి-2 పత్తి విత్తనాన్ని మోన్‌శాంటో ఉపసంహరించుకున్నట్లు తెలియవచ్చింది. తెలంగాణతో సహా దేశంలోని ఏ విత్తన కంపెనీ కూడా బిజి-2 లేదా దానికి ప్రత్యామ్నాయమైన ఇతర పత్తి విత్తనాన్ని తయారుచేయ లేదు. వ్యవసాయ శాఖతోపాటు, తెలంగాణ విత్తనోత్పత్తి సంస్థ వద్ద కూడా ఏరకమైన విత్తనం అందుబాటులో లేదని తెలియవచ్చింది. అంతేకాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద కూడా పత్తి విత్తనం లేకపోవడంతో వచ్చే వానాకాలం సీజనులో ఈ పంటను సాగు చేసే రైతాంగం విపత్కర పరిస్థితులను ఎదుర్కొనబోతున్నారు.

తత్కాల్ పాస్‌పోర్టు జారీలో కొత్త విధానం

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: రాష్ట్రంలో తత్కాల్ పాస్‌పోర్టు జారీలో కొత్త విధానం అమలు కానుంది. ఇప్పటి వరకు తత్కాల్ పద్ధతిలో పాస్‌పోర్టు కావా లంటే ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు లేదా మిలటరీలో మేజర్ స్థాయి అధికారుల సిఫార్సు లేఖలు వుంటేనే జారీ అయ్యేది. ఈ పద్ధతి వల్ల తత్కాల్ పద్ధ తిలో పాస్‌పోర్టు కావాలనుకునే వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే వారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో ఓ నేరగాడికి తత్కాల్ పాస్‌పోర్టు కోసం తెలియకుండా ఓ ఐఎఎస్ అధికారి ఇచ్చిన సిఫార్సు లేఖ ఆయన సస్పెండ్‌కు దారితీసింది. దీంతో బ్యూరోక్రాట్లు తత్కాల్ పాస్‌పోర్టుల విషయంలో తమ రక్త సంబంధీకులు లేదా అత్యంత సన్నిహితులకు తప్పించి ఇతరులకు సిఫార్సు లేఖలు ఇవ్వడం నిలిపి వేశారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో తత్కాల్ పద్ధతిలో పాస్‌పోర్టు పొందాలనుకునే వారు చాలా కాలంగా అగచాట్లకు గురవుతున్నారు. దీనికి విరుగుడుగా తెలంగాణ రాష్ట్ర పాస్‌పోర్టు విభాగం అధికారులు తత్కాల్ పాస్‌పోర్టు జారీలో నూతన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఇదివరకటిలా ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు లేదా మిలటరీలో మేజర్ స్థాయి అధికారుల సిఫార్సు లేఖలు లేకుండానే కేవలం అభ్యర్థుల ఆధార్ కార్డు, సెల్ఫ్ డిక్లరేషన్, రెండు గుర్తింపు పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే కేవలం మూడు రోజుల్లో పాస్‌పోర్టు వచ్చేలా ఏర్పాటు చేసినట్లు పాస్‌పోర్టు అధి కారి విష్ణువర్దన్ రెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయంలో 2017 ఏడాదిలో జారీ అయిన పాస్‌పోర్టుల వివరాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. దేశ వ్యాప్తంగా పాస్‌పోర్టుల జారీలో హైదరాబాద్ మొదటి స్థానంలో వుందని ఆయన తెలిపారు. త్వరలో ఖమ్మం, నల్లగొండ, మెదక్, సిద్దిపేట, ఆదిలాబాద్‌లలో పాస్‌పోర్టు కేంద్రాలను ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు.

పసుపుతో ఆరోగ్యం



వార్త సైన్స్‌డెస్క్: పసుపు క్రిమి సంహారిణి. శరీరానికి మేలు జరుగుతుందని భారతీయ ప్రతీ వంటకాలలో పసుపును ఒక భాగం చేసారు పెద్దలు. ఇప్పటికీ మన వంటకాలలో పసుపును వాడుతుంటాం. పెద్దలు చెప్పినట్లు పసుపులో నిజంగా ఏంటీ సెప్పిటిక్ లాంటి గుణాలు ఉన్నాయా అని శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసారు. విస్తృత పరిశోధనల అనంతరం పసుపు ఖచ్చితంగా ఏంటీబయాటిక్‌గా పనిచేస్తుందని జీర్ణవ్యవస్థ సులువుగా పనిచేసేలా ఉపకరిస్తుందని తేలింది. అంతేకాక నాడీ వ్యవస్థ, మెదడు పనిచేసే తీరును వృద్ధి చేస్తుందట. అల్జీమర్స్ వంటి మెదడు, జ్ఞాపకశక్తికి సంబంధించిన వ్యాధులను అరికట్టేలా పసుపు పనిచేస్తుందని ఇటీవల సుమారు వంద మందిపై పరిశోధనలను చేసి తేల్చారు. ఆ వంద మందికి ప్రతిరోజు 90 మిల్లీగ్రాముల పసుపును ఏదోరకంగా 18నెలల పాటు ఉపయోగించేలా చేసి పరీక్షించారట. పొ జిషన్ ఎమిషన్ టోమోగ్రఫీ(పెట్)ని చేసి మరింత సూక్ష్మంగా మెదడు పనితీరును పరీ క్షించారట. ఏంటీ బయోటిక్‌గా జ్ఞాపకశక్తి విషయంలోనూ పసుపు మన పెద్దలు చెప్పినట్లే అమోఘంగా పనిచేస్తుందని తేలింది.

వంటకాలలో పసుపు వాడిన తర్వాత సమారు 28శాతం మెదడు పనితీరు మెరుగయిందిట. దీంతో ప్రపంచ వ్యా ప్తంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై ఒక్కసారిగా అటెంషన్ పెరిగిపోయింది.

పక్కదారి పడుతున్న ఆరోగ్యశ్రీ నిధులు

ప్రైవేటు ఆసుపత్రులతో కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కు
అనుకూలమైన ఆసుపత్రులకు వెంటనే బిల్లులు క్లియర్
అక్రమాలకు తావు లేకుండా బిల్లుల చెల్లింపు : ఆరోగ్యశ్రీ సిఇఒ డా.మనోహార్

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త : నిరుపేద రోగులకు ఖరీదైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం పక్కదారి పడుతోంది. ఆరోగ్యశ్రీ ట్రస్టులో పనిచేస్తున్న కింది స్థాయి ఉద్యోగులు ప్రైవేటు ఆసుపత్రులతో కుమ్మక్కై తమకు అనుకూలమైన ఆసుపత్రులకు వెంటనే బిల్లులు చెల్లించేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోగులకు వైద్య సేవలు అందించిన వివరాలను బిల్లులతో పాటు పది రోజుల తరువాత ఆన్‌లైన్‌లో ఆసుపత్రి నుంచి ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఒక్కో జబ్బుకు ఒక్కో రేటును ప్రభుత్వం నిర్ణయించింది. ఆసుపత్రుల నుంచి వచ్చిన బిల్లులను డాటా ఎంట్రీ ఆపరేటర్స్ పూర్తిగా పరిశీలిస్తారు. రోగి రేషన్ కార్డు సరైనదేనా ? అతడు ఏ వ్యాధికి చికిత్స తీసుకున్నాడు ? శస్త్ర చికిత్సకు ఎంత ఖర్చయింది ? వంటి వివరాలు అన్నింటినీ పరిశీలిస్తారు. అన్నీ సక్రమంగా ఉన్నట్లయితే అప్రూవల్ కోసం ప్యానల్ డాక్టర్ల వద్దకు పంపిస్తారు. ట్రస్టు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా, సరైన ప్రూఫులు లేకున్నా ఆ ఫైల్‌ను తిరిగి వెనక్కి పంపిస్తారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు పార్ట్‌టైమ్ ప్యానల్ వైద్యులు కూడా ఉంటారు. వారు డాటా ఎంట్రీ ఆపరేటర్లు పంపిన ఫైళ్లను గంటకు కొన్ని చొప్పున క్లియర్ చేస్తారు. ఫైళ్లను క్లియర్ చేసిన సంఖ్య ఆధారంగా వారికి ట్రస్టు డబ్బులను అందజేస్తుంది. ఆసుపత్రుల నుంచి వచ్చే కేస్‌షీట్ సర్జరీ ప్రసీజర్స్, డయాగ్నస్టిక్స్ రిపోర్టులను పార్ట్‌టైం ప్యానల్ వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుంది. వీరిచ్చే నివేదికలో ఏమాత్రం తేడా వచ్చినా ఆసుపత్రికి రావాల్సిన బిల్లు పూర్తిగా నిలచిపోతుంది. లేదా బిల్లులో కోత పడుతుంది. అయితే, ఇటీవల ఒక ఆసుపత్రికి సంబంధించి బిల్లుల చెల్లింపులలో అవకతవకలు జరిగాయనీ, ఇందులో ఇక్కడ పనిచేసే ఓ కీలక అధికారి ఆ ఆసుపత్రికి అనుకూలంగా వ్యవహరించాడనే ఆరోపణలు రావడంతో అతనిని విధుల నుంచి తొలగించారు. దీంతో ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపుల వ్యవహారంలో అవకతవకలు జరుగుతన్న విషయం వెలుగులోకి వచ్చింది. మరోవైపు, ఆసుపత్రులు రోగికి అందించిన వైద్య సేవలకు సంబంధించిన బిల్లుల చెల్లింపకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే ట్రస్టు అధికారులు ఈ విషయాన్ని ధృవీకరించుకోవడానికి సదరు ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది.

ఆ ఆసుపత్రిలో రోగికి అందించిన వైద్య చికిత్సలకు అనుగుణమైన పరికరాలు ఉన్నాయా? లేవా? అని పరిశీలించాల్సి ఉంటుంది. సిబ్బంది సరైన సంఖ్యలో ఉన్నారా?చికిత్సలు అందించిన వైద్యులు ఆ ఆసుపత్రిలో పనిచేస్తున్నారా? లేదా అనే విషయాలను ధృవీకరించుకోవాలి. ఆ తరువాతనే సంబంధిత బిల్లుల చెల్లింపుకు క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, ట్రస్టు అధికారులు మాత్రం ముందు బిల్లుల చెల్లింపులకు క్లియరెన్స్ ఇచ్చేస్తున్నారు. బిల్లుల క్లియరెన్స్‌కు సంబంధించి ఆసుపత్రులు అవకతవకలకు పాల్పడుతున్న విషయం వెలుగులోకి వచ్చిన తరువాతనే ఆ ఆసుపత్రులకు తనిఖీలకు వెళుతున్నారు. 2015-17 మధ్య కాలంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా దాదాపు 4 లక్షల మందికి పైగా రోగులకు బిల్లులు చెల్లించారు. ఇందుకు గాను మొత్తం రూ. 1053 కోట్లు ఆయా ఆసుపత్రులకు విడుదలయ్యాయి. వీటిలో గతంలో పనిచేసిన ట్రస్టు సీఈవో పదవి నుంచి దిగి పోవడానికి ముందు కేవలం నాలుగు నెలల్లోనే రూ. 254 కోట్లకు పైగా నిధులు విడుదల చేయడం అనేక సందేహాలకు తావిస్తున్నది. ఆరోగ్యశ్రీ పరిధిలోని కొందరు వైద్యులు తమకు డబ్బులు ఇస్తేనే రోగులకు వైద్యం చేస్తామని ప్రభుత్వం డిమాండ్ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఆరోగ్యశ్రీ ట్రస్టు పరిధిలోని నెట్‌వర్క్ ఆసుపత్రులలో వైద్య చికిత్సలు పొందిన రోగులకు సంబంధించిన బిల్లులను ఆయా ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు తమకు తొలుత అందిన ప్రకారం (ఫస్ట్ కం ఫస్ట్ అవుట్) బిల్లులను క్లియర్ చేయాల్సి ఉంటుంది. అయితే, ట్రస్టు అధికారులు ఈ నిబంధనను పాటించకుండా తమకు కమిషన్ చెల్లించడానికి అంగీకరించిన ఆసుప్రతులకే ముందుగా బిల్లులు క్లియర్ చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు గాను రూ.లక్షకు 5 నుంచి 10 శాతం వరకు కమిషన్ రూపంలో ట్రస్టు సిబ్బందిని డబ్బులు ముదుతున్నట్లు తెలిసింది. దీనికితోడు కొన్ని ఆసుపత్రులు సిబ్బందికి ఎలాగూ కమిషన్ చెల్లిస్తున్నామనే కారణంతో ఎక్కువ మొత్తంలో బిల్లులు ట్రస్టుకు పంపించి ఆ మొత్తాన్ని ప్రభుత్వం నుంచి క్లెయిమ్ చేస్తున్నట్లు సమాచారం. ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు విషయంలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూస్తున్నామని ఆరోగ్యశ్రీ ట్రస్టు ఇన్‌చార్జి సీఈవో, నిమ్స్ డైరెక్టర్ డా.మనోహర్ స్పష్టం చేశారు. బిల్లుల చెల్లింపుకు సంబంధించి ట్రస్టుకు తొలుత అందిన (ఫస్ట్ కం ఫస్ట్ అవుట్) పద్ధతిలో ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రాధాన్యత మేరకు క్లియర్ చేస్తున్నామన్నారు. తాను సీఈవో బాధ్యతలు తీసుకున్న అనంతరం రూ. 150 కోట్ల బిల్లులను ఆయా ఆసుపత్రులకు క్లియర్ చేశామన్నారు. అయితే, బిల్లు క్లెయిమ్‌ల విషయంలో ఆసుపత్రులు ఎక్కడా అక్రమాలకు పాల్పడకుండా అప్‌లోడింగ్ సిస్టమ్‌లోనే జాగ్రత్తలు తీసుకున్నామనీ, అక్ర మాలకు పాల్పడితే వెంటనే తెలిసిపో తుందన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అలాగే, రోగి చనిపోతే ఎలా చనిపోయాడు? అనే విషయాలపై కూడా ఈ బృందం విచారణ నిర్వహిస్తుందన్నారు. వీటికి సంబంధించి ప్రతీ వారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఫెలికాన్ పక్షుల పండుగను జయప్రదం చేయండి

కలెక్టర్ లక్ష్మికాంతం, జెసి విజయకృష్ణన్


ఫెలికాన్ పెస్టివల్ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మికాంతం, జేసి విజయకృష్ణన్

కైకలూరు, జనవరి, 29(ప్రభాతవార్త): కృష్ణాజిల్లా కైకలూరు కొల్లేటిసరస్సులోని అటపాక పక్షుల కేంద్రం వద్ద ఫిబ్రవరి 4వతేదిన నిర్వహించనున్న ఫెలికాన్ ఫెస్టివల్ కార్యక్రమ ఏర్పాట్లను కృష్ణాజిల్లా కలెక్టర్ బి లక్ష్మికాంతం, జాయింట్ కలెక్టర్ విజయ కృష్ణన్ పరిశీలించారు. ఏర్పాట్లు పట్ల కలెక్టర్ లక్ష్మి కాంతం సోమవారం అధికారులతో మాట్లాడి స్టేజీ ఏర్పాటు నిర్వాహణ పట్ల అధికారులకు భాధ్య తలను అప్పగించారు. ఫెలికాన్ పెస్టివల్ తొలి కార్య క్రమం సందర్భంగా దేశంలోనే వినోధంతోపాటు విలువైనదిగా ప్రతిభను గుర్తించాలని అందుకు మనమంతా కృషి చెయ్యవలసిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. స్టేజి ఏర్పాట్లులలో 100 మంది దయాస్‌పై సిట్టింగ్ ఉండే విధంగా చర్యలు చేపట్టాలని పక్షుల కేంద్రంలో విహారయాత్ర చేయూటకు 3 బోట్లను ఏర్పాటుచేయ్యాలని ఫారెస్టు అధికారులను అదేసించడం జరిగింది. జాతీయరహదారి నుండి పెస్టివల్ జరిగే ప్రాంతా నికి విధ్యూత్ ధీపాల అలంకరణ భాధ్యతలు విధ్యూత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టా లని, ప్రజలకు పెస్టివల్ ప్రాంతానికి చేరేందుకు అర్టీసి బస్సులను ఏర్పాటుచేయ్యాలని గుడివాడ డిపోమేనేజర్ బాలాజి దీనదయాళ్‌కు తెలిపారు. ఇదేవిధంగా ఎటువంటి అనారోగ్యానికి గురైనా వైద్యసేవలు అందించేందుకు మందులతోపాటు అంబులేన్స్‌లు సిద్దంగా వుంచాలని, పెస్టివల్‌కు వచ్చిన ప్రజలకు త్రాగునీరు ఇబ్బందిలేకుండా అర్‌డబ్ల్యూఎస్ అధికారులు చూడాలని, ప్రారంభం రోజు శోభా యాత్రగా భారీగా ఊరేగింపుతో పాదయాత్ర చేస్తూ నిర్వాహణ ప్రాంతానికి వెళ్లాలని తెలిపారు. ఎటువంటి ట్రాపిక్ అభ్యంతరాలు, వివాదాలు జరగకుండా పోలీసులు బంధోబస్తు ఏర్పాటు చేయ్యాలని తెలిపారు. జలసిరి హారతీ, అమ్మకు వందనం, సూర్యాఅరాధన, తదితర కార్యక్రమాలు పూర్వకాలం నుండి నిర్వహిస్తున్నాయ్యని ప్రకృతిని అరాధించడం మన సాంప్రదాయం అని దానిలో భాగంగా పక్షులను కూడా గుర్తించి వాటి పండుగ నిర్వహించుకోవడం అనందదాయకం అని కలెక్టర్ లక్ష్మికాంతం వివరించారు. ఈ పెలికాన్ పక్షుల పండుగకు సినీనటులు విక్టరి వెంకటేష్, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, గాయకులు గీతామాధురి, ఉషా, ధనుంజయ్, అనసూయ వీరితో పాటు మంత్రులు అర్ధికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, భారీ నీటిపారుదలశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు, వ్యవసాయశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, వైద్యఅరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, టూరిజంశాఖ మంత్రి భూమా అఖిలప్రియ, తదితర ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు, ప్రజాప్రతినిధులు తరలివస్తున్న సందర్భంగా విజయంవంతం చేయ్యాలని కోరారు

తిరుమలలో తగ్గిన భక్తులు

శ్రీవారి దర్శనానికి 5గంటలు


భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపుల్లో 3.95కోట్లు రూపాయలు ఆదాయం చేకూరింది.

తిరుమల,జనవరి 29 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో భక్తుల రద్దీ నామమాత్రంగా వుంది. నాలుగు రోజులు కిటకిటలాడిన తిరుమల సోమవారం సాయంత్రానికి భక్తులు నామమాత్రంగా వున్నారు. సోమవారం సాయంత్రానికి వైకుంఠం-2లో 19కంపార్టుమెంట్లునిండిపోయి సర్వదర్శనానికి 5గంటలు సమయం పడుతోంది. సాయంత్రం 6గంటలవరకు సుమారు 43,631వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకు న్నారు.

తెలుగుప్రజలకు శుభాలు కలగాలి

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ శర్మ


శ్రీవారిని దర్శించుకున్న అనంతరం జస్టిస్ శర్మ

తిరుమల,జనవరి 29 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆశీస్సులతో దేశప్రజలు సుఖసంతోషాలతో వుండాలని స్వామివారిని ప్రార్ధించినట్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌కె శర్మ తెలిపారు. శ్రీవారి దర్శనార్థం సోమవారం ఉదయం జస్టిస్ శర్మ కుటుంబం ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆల యంలో ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం సన్నిధిలోకి చేరుకుని మూల విరాట్టును దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు స్వామివారికి వేదాశీర్వచనంచేశారు. ఆలయ డిప్యూటీ ఇవో కోదండరామారావు స్వామివారి తీర్ధప్రసాదాలు అందజేశారు. శ్రీవారి శేషవస్త్రాన్ని బహుకరించి చిత్రపటాన్ని అందించారు.

చంద్రబాబులా అబద్ధాలు చెప్పిఉంటే
జగన్ ఎప్పుడో సిఎం అయ్యేవారు

'వాక్‌విత్ జగనన్న' కార్యక్రమంలో ఉరవకొండ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి
ఉరవకొండ నుండి వందలాది మంది కార్యకర్తలతో బూదగవికు పాదయాత్ర

ఉరవకొండ, జనవరి 29 ప్రభాతవార్త: చంద్రబాబునాయుడిలా అమలుకు సాధ్యంకాని అబద్దపు వాగ్దా టనాలు, హామీలు ఇచ్చి వుంటే జగన్ గత ఎన్నికల్లోనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి వండేవారని ఉరవకొండ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీను కూడా గడిచిన మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చలేదని ప్రజా విశ్వాసం కోల్పోయిన తెలుగుదేశం ప్రభుత్వానికివి అంతిమ ఘడియలన్నారు. రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైసీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర 1,000 కిలో మీటర్ల మైలు రాయి దాటిన సందర్భంగా వైసీపీ పార్టీ పిలుపు మేరకు సోమవారం ఆయన 'వాక్‌విత్ జగనన్న' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణం నుండి భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల పరిధిలోని బూదగవి గ్రామానికి 5 కిలో మీటర్ల పాదయాత్ర నిర్వహించగా పార్టీ గ్రామ కార్యకర్తలు, ప్రజల నుండి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వస్తే రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తామని గత ఎన్నికల సమయంలోనే ప్రకటించమని జగన్‌పై తామందరం ఒత్తిడి తేస్తే అమలుకు సాధ్యకాని, ప్రజలను మభ్యపెట్టే హామీలు తానివ్వలేనని, కేవలం అమలు చేయగలిగిన హామీలనే ఇద్దామని జగన్ తేల్చి చెప్పారని అది ఆయన విశ్వసనీయతని పేర్కొన్నారు. జన నేత జగన్ చేపట్టిన పాదయాత్ర 74వ రోజుకు చేరగా వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకొందని ఆయన పాదయాత్రకు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశ విదేశాల్లోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అభివృద్ధిని కాంక్షించేవారు సంఘీభావ పాదయాత్రలు చేస్తున్నారన్నారు. జగన్ పాదయాత్ర లక్షలాది మంది భాగస్వామ్యంతో విస్తృత ప్రజాధరణ నడుమ చారిత్రాత్మకంగా కొనసాగుతోందన్నారు. వైసీసీ అధికారంలోకి రావడంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారన్నాని పేర్కొన్నారు. ప్రజలు జగన్‌ను కలిసి తమ కష్టాలు, పడుతున్న ఇబ్బందులను వివరించి మీరే కాబోయే ముఖ్యమంత్రి, మీరు మాసమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారన్నారు. రాష్ట్రంపట్ల, రాష్ట్ర ప్రజల సమస్యలపట్ల పూర్తి అవగాహన కల్గిన జగన్ ఈ పాదయాత్ర ద్వారా మరింత పరిణితి కల్గిన నేతగా నిలుస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలుచేసే నవరత్రాలు పథకాలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం జరిగాయని సామాన్యులకు ఎవరినడినా వారే పథకాలవల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారని తెలిపారు.

కేసులకు, స్వార్ధ ప్రయోజనాలకు చంద్రబాబు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు:

రాష్ట్ర విభజన సమయంలో నాటి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు ఓటుకు నోటు కేసుకు, తన స్వార్ధ ప్రయోజనాలకు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి హోదాను తాకట్టుపెట్టి రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేశారని ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవినని దాన్ని సాధించుకోవడానికి తాము మీవెంట పోరాడటానికి సిద్దంగా వున్నామని వైసీపీతోపాటు ఇతర రాజకీయ పార్టీలు ప్రకటించినా చంద్రబాబు స్పందించలేదన్నారు. దాదాపు 4 సంవత్సరాల పాటు మౌనంగా వుండి హోదాకు బదులు ప్యాకేజీకు తలూపి నేడు ఎన్నికలు దగ్గర పడుతున్నాయని విభజన హామీల అమలకు కోర్టుకు వెళతామని, బీజేపీతో పోట్లాడుతానని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని వాపోయారు.

ఫిబ్రవరి 2న మంత్రి మండలి సమావేశం

అమరావతి, జనవరి29 ప్రభాతవార్త: అమరావతిలోని ఏపీ సచివాలయం 1వ బ్లాక్ మొదటి అంతస్తులోని సమావేశ మందిరంలో మంత్రిమండలి సమావేశం ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం సాయంత్రం 3గంటలకు జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్‌కుమార్ సోమవారం ఒ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల కార్యదర్శులు తమ ఎజెండా అంశాలను ఫిబ్రవరి 1వ తేదీ సాయంత్రం 3గంటల లోప సాధారణ పరిపాలనాశాఖకు పంపించాలని కోరారు.

మేము మిత్రధర్మం పాటిస్తున్నాం: మాణిక్యాలరావు

విజయవాడ సిటీ, జనవరి 28, ప్రభాతవార్త

మిత్రధర్మం పాటిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతో తాము మిత్రధర్మం సరిగానే పాటిస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలను సిఎం చంద్రబాబు అదుపుచేస్తామని చెప్పారని, తాము కూడా తమ పార్టీ నేతలను అదుపుచేస్తామనా న్నరు. ఇకపై ఎలాంటి విభేధాలు లేకుండా కలిసి పనిచేస్తామని మాణిక్యాలరావు స్పష్టం చేశారు.


సోమవారం కడప జిల్లా పోలీసు కార్యాలయంలో ఘరానా దొంగలను విలేకరుల ముందు ప్రవేశపెడుతున్న పోలీసులు

అంతర్‌రాష్ట్ర దొంగలు ముగ్గురు అరెస్టు

కడప క్రైం, జనవరి 29ప్రభాతవార్త: ఇంటి దొంగతనాలకు పాల్పడే ముగ్గరు ఘరాన దొంగలను అరెస్ట చేసి వారి వద్ద నుండి 60 లక్షలు విలువ చేసే బంగారు, వెండి, ఎల్ఇడి టివిలు, కార్లు, స్వాధీనం చేసుకున్నట్లు కడప జిల్లా ఓఎస్డీ అధ్నాన్ నయింఅస్మి తెలియజేశారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎల్‌హెచ్‌ఎంఎస్ అండ్ సిసిసి సిస్టమ్ ద్వారా కడప పట్టణంలో, జిల్లాలో ఇటీవల ఇంటి దొంగతనాలకు వాహనాల దొంగతనాలకు పాల్పడే వారిని పట్టుకున్నామన్నారు. ముగ్గరు ఘరాన దొంగలు బి. విజయకుమార్ (27), నిమ్మల హరీష్ (26), బొల్లవరం ప్రసాద్‌రెడ్డి (24)లను అరెస్టు వారి వద్ద నుండి ఒక కెజి 182 గ్రాముల బంగారు, 4 కేజిల వెండి, 8 ఎల్ఇడి టివిలు, 5 మోటర్‌సైకిళ్లు, 4 ల్యాబ్‌టాప్‌లు, 4 సెల్‌ఫోన్లు, 2 కార్లు, గ్యాస్ స్టవ్, సిలిండర్ స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలియజేశారు. సిసిఎస్ డిఎస్పీ ఎస్.కె. చంద్రశేఖర్‌కు రాబడిన సమాచారం మేరకు టౌన్ డిఎస్పీ ఎస్. మాసుంబాషా సూచనల మేరకు

ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా బట్టబయలు

చిన్నచౌకు పోలీసుస్టేషన్ సిఐ బి. రామక్రిష్ణ, సిసిఎస్ సిఐ పి. ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు ఆర్.మోహన్, రుషేంద్రబాబు, ఎల్. జీవన్‌రెడ్డి, కె. రాజారెడ్డి, బి. యోగేంద్ర, ఎ. రాధాక్రిష్ణ వారి సిబ్బందితో ఈనెల 28వ తేదీ రాత్రి కడప టౌన్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా 29వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటలకు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేశామని తెలిపారు. వారి విచారించగా కడప జిల్లాలో 17 చోరీలు, తిరుపతిలో 15 చోరీలు, చిత్తూరు జిల్లాలో 3 చోరీలు, నెల్లూరు జిల్లాలో 5 చోరీలు, కర్నూలులో 3 చోరీలు మొత్తం 43 చోరీలు చేసినట్లు బహిర్గతమైందని తెలిపారు. వారి వాగ్మూలం మేరకు వారు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నామని ముద్దాయిలను చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలోని పక్కీర్‌పల్లె ఏరియాలోని కేశవరెడ్డి స్కూల్ పక్కన ఒక ఇంటిలో ఏర్పాటు చేసి ఎన్‌హెచ్ కెమెరా ద్వారా బెజ్జు విజయకుమార్ పట్టుకున్నామని మిగతా ఇద్దరు పారిపోయారని వారిని కూడా సుబ్బిరెడ్డి కాలనీ సమీపంలో అరెస్టు చేశామని తెలిపారు.

వచ్చే రెండేళ్లలో కాఫీ గింజల వ్యాపారంరూ.500కోట్లు

మంత్రి నక్కా ఆనంద్‌బాబు
కాఫీ బాగుంది, రోజూ తాగుతా..
మంత్రి జవహార్
మార్కెట్‌లోకి అరుకువ్యాలీ కాఫీ ప్యాకెట్లు విడుదల


సోమవారం మార్కెట్‌లోకి కాఫీ ప్యాకెట్లలను విడుదల చేస్తున్న మంత్రులు జవహార్, ఆరంద్ తదితరులు

అమరావతి, జనవరి29 ప్రభాతవార్త: అరకు కాఫీని సేవించి గిరిజనులను ఆదుకోవాలని రాష్ట్ర సాంఘీక, గిరిజన సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పిలుపు ఇచ్చారు. సచివాలయం 3వ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ సమావేశమందిరంలో సోమవారం మధ్యాహ్నం ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహార్‌తో కలిసిన ఆయన అరకువ్యాలీ ఇన్‌స్టంట్ కాఫీ 2గ్రాములు, 10గ్రాముల ప్యాకెట్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆ సందర్భంగా మంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులతో పాటు కాఫీ గింజలను సేకరించి, ప్రాసెసింగ్ చేయించి, మార్కెటింగ్ చేసి వచ్చిన లాభాలను వారికి అందించడమే గిరిజన సహకార సంస్థ(జీసీసీ) విధి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ, ప్రోత్సహంతో 2014లో రూ.90కోట్ల టర్నోవర్ ఉన్న జీసీసీ వ్యాపారం రూ.247కోట్లకు చేరుకుందన్నారు. ఈ ఏడాది రూ.317కోట్లు, వచ్చే రెండేళ్లలో రూ. 500కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రెండు లక్షల ఎకరాల్లో కాఫీ సాగును ప్రోత్సహిస్తూ గిరిజనుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన ఉత్పత్తులను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంచడానికి రిటైల్ షాపులను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో సచివాలయంలో కూడా ఒక షాపును ఏర్పాటు చేస్తామని మంత్రి ఆనంద్‌బాబు చెప్పారు. అనంతరం మంత్రి జవహార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు మన అరకు కాఫీ రుచిని ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. పోడు, గంజాయి సాగు చేసుకునే గిరిజనులను ఆదుకోవ దానికి కాఫీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన కుటుంబాలు నెలకు రూ.10వేలు సంపాదించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.. ఈ సందర్భంగా కాఫీ డీలర్లు అరకు వ్యాలీ ఇన్‌స్టంట్ కాఫీ ప్యాకెట్ల కోసం అడ్వాన్స్‌గా రూ.30లక్షల చెక్‌ను మంత్రి ఆనంద్‌బాబుకు అందజేశారు.

దళితులంతా ఐకమత్యంతో ముందుకు సాగండి

జాతీయ ఎస్సి, ఎస్టి కమీషన్ సభ్యుడు కె.రాములు

ప్రభాతవార్త-ఏలూరు: దళితులకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రక్షణ కల్పించే విషయంలో న్యాయం చేసే దిశగా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు కె.రాములు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో చదివేది దళిత విద్యార్థులేనని అందువల్ల ప్రభుత్వం పాఠశాలల మూసివేతను విరమించుకోవాలన్నారు. దళితులంతా ఐకమత్యంగా ముందుకు సాగితేనే ఏదైనా సాధ్యపడుతుందన్నారు. దళితులు క్రైస్తవాన్ని ఆరాధించినా కుల పరంగా దళితులంతా ఒక్కటేననే నినాదంతో ముందుకు సాగాలని హితవు పలికారు. గరగపర్రు సమస్యను త్వరితగతిన పరిష్కరించే దిశగా జిల్లాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సోమవారం రాత్రి జిల్లా పరిషత్ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాములు మాట్లాడారు. ఎవరు ఏ మతంలోకైనా మారవచ్చని, అయితే ఇతర మతాలను కించపరిచే విధంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ప్రతీ ఒక్క దళిత క్రైస్తవుడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని ఇంట్లో వుంచుకోవడం వల్ల కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడానికి ఎటువంటి ఇబ్బంది వుండదన్నారు. దళితులు ఏ మతం స్వీకరించినా ఎస్సీలుగానే గుర్తించాలనే విషయాన్ని అనేక మంది తన దృష్టికి తీసుకువచ్చారని, దీనిని తాను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై, స్కాలర్‌షిప్, సబ్‌ప్లాన్, దళితవాడలు అభివృద్ధి, విద్య, రుణాలు అందజేత, అసైన్డ్ భూములు తదితర వాటిపై అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. అలాగే గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు హామీ ఇప్పటి వరకు అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. వీటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని, గ్రామస్థులతో చర్చించి అందరికీ అంగీకారమైన చర్యలు తీసుకుని గరగపర్రు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. గరగపర్రులో రోడ్డుప్రమాదంలో మృతి చెందిన యాకూబు కుటుంబానికి నష్టపరిహారం క్రింద రూ.5 లక్షలు చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించామన్నారు.

దేవాదాయ ధర్మాదాయ శాఖ పేరు మార్పునకు కృషి

మంత్రి మాణిక్యాలరావు

అమరావతి (విజయవాడ సిటీ), జనవరి 28, ప్రభాతవార్త: దేవాదాయ ధర్మాదాయ శాఖ పేరు మార్పుకు కృషి చేస్తున్నట్లు ఆ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు తెలిపారు. సోమవారం వెలగపూడి సచివాలంలో తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖలో పనిచేసే సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని బట్టి కుటుంబ వారసత్వ ఉద్యోగాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దివ్యదర్శనం పేరుతో ప్రస్తుతం 50 వేల మంది భక్తులకు ప్రముఖ దేవాలయాల్లో ఉచిత దర్శనం ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో 1లక్ష 50 వేల మందికి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రముఖ దేవాలయాల్లో దర్శనం అరగంటలో అయ్యేలా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తిరుమలలో రోజుకు 70 వేల మంది భక్తులు స్వామివారిని దర్శనం చేసుకుంటున్నారన్నారు. ఈ దర్శనాల్లో కూడా మార్పులు చేస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అందరికి దర్శనభాగ్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. పదేపదే తిరుమలకు వెళ్ళే వాళ్ళను తగ్గించి ప్రతి సామాన్య భక్తుడు దేవుణ్ణి దర్శించుకోడానికి ఏర్పాట్లు చేయడానికి చర్చలు జరుగుతున్నాయన్నారు.

జగన్‌కు తోడుగా ప్రజలను రమ్మని పిలవడం పెద్ద మోసం

మంత్రి జవహార్

అమరావతి, జనవరి29 ప్రభాతవార్త: దళితుల భూముల్ని కొల్లగొట్టిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు జగన్‌కు తోడుగా ప్రజలు రావాలని విజయమ్మ పిలవడం పెద్ద మోసం అని, జగన్ ముఖ్యమంత్రి కావడం కోసమే తప్ప ప్రజల కోసం కాదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహార్ ఆరోపించారు. సచివాలయంలోని 4వ బ్లాక్ పబ్లిసిటీ సెల్ నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాల నెత్తిన చేతులు పెట్టడం, ఎదురువచ్చిన వారికి ముద్దులు పెట్టడం తప్ప జగన్‌యాత్రలో ఏమీలేదన్నారు. వాక్‌విత్ జగన్ అన్నది ట్రాఫిక్‌కి అడ్డంకులు సృష్టించడమే అన్నారు. ఎన్నికలు దగ్గరకొచ్చినప్పుడు మాత్రమే జగన్‌కి ప్రత్యేక హోదా గుర్తొస్తుందని, పార్లమెంట్ సమావేశాల్లో జగన్ పార్టీ ఎంపీలు ప్రత్యేక హోద కోసం ఎందుకు రాజీనామా చేయరని ప్రశ్నించారు. వైసిపి రెక్కలు ఉడిపోతున్న తరుణంలో వాటిని కాపాడుకోవడానికి మాత్రమే జగన్ పాదయాత్రను చేపట్టారన్నారు. కేవలం అధికారమే పరమావధిగా ఆయన పాదయాత్రను చేస్తున్నారని కాని ఎక్కడా ప్రజల సమస్యను తీర్చలేదని, కనీసం వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన దాఖలాలు లేవన్నారు. పవన్‌కళ్యాణ్ యాత్ర చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ఆ సమస్యలను ప్రభుత్వానికి తెలుపుతూ ప్రతిపక్షపారత పోషిస్తున్నారని మంత్రి తెలిపారు. జనవరి 26 నా పుట్టినరోజు కావడంతో దళిత తేజం కార్యక్రమానికి హాజరు కాలేకపోయానని తెలిపారు.


సోమవారం తిరుమలలో క్యూకాంప్లెక్స్‌లలో సివిఎస్‌వో ఆకేరవికృష్ణ తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

వైకుంఠం-1లోనూ భక్తుల క్రమబద్ధీకరణ

క్షురకులలో నిజాయితీ అవసరం
తిరుమలలో సివిఎస్‌వో రవికృష్ణ తనిఖీలు

తిరుమల,జనవరి 29 ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో ప్రదానంగా వైకుంఠం-1 కంపార్టుమెంట్లలో, క్యూలైన్లలో భక్తుల తోపులాటజరగకుండా చర్యలు తీసుకోవాలని, భక్తుల క్రమబద్ధీకరణ చేపట్టాలని టిటిడి సివిఎస్‌వో ఆకేరవికృష్ణ ఆదేశించారు. కల్యాణకట్టలో క్షురకులు నిజాయితీగా సేవలందించాలని అన్నారు. సోమవారం తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లలో సివిఎస్‌వో ఆకేరవికృష్ణ తనిఖీలు చేశారు. భక్తుల మద్య తోపులాటలేకుండా క్యూకాంప్లెక్స్ క్యూలైన్లను నియంత్రించాలన్నారు. ఈ తనిఖీల్లో కల్యాణకట్ట డిప్యూటీ ఇవో నాగరత్న, విజివో విమలకుమారి, ఏవిఎస్‌వోలు నందీశ్వర్, రామచంద్రయ్య, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

కోస్టల్‌జోన్ స్థాపనకు పోటీపడుతున్న ఒరిస్సా, ఆంధ్ర

పర్యాటకశాఖ డైరక్టర్ హిమాన్స్‌శుక్లా

నెల్లూరు కలెక్టరేట్, జనవరి 29 ప్రభాతవార్త

కోస్టల్‌జోన్ స్దాపనకు ఒరిస్సా, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడుతున్నాయని ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకొనేందుకు అంధ్రప్రదేశ్ తీవ్రంగా కృషిచేస్తున్నట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటకశాఖ డైరక్టర్ హిమాన్స్‌శుక్లా పేర్కొన్నారు. సోమవారం జిల్లాకు వచ్చిన అయన పరిశ్రమల ఏర్పాటుకు సంబందించి జిల్లాలోని ముత్తుకూరు, చిల్లకూరు మండలాల్లోని పలు భూములను కలెక్టర్ ముత్యాల రాజుతో కలిసి పరిశీలించారు. సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్ పరిధిలోని మౌళిక అంశాలపై జరిగిన సమీక్షా సమావేశంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కోస్టల్‌జోన్ స్దాపనకు ఒరిస్సా, అంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడుతున్నాయని ఈ ప్రాజెక్ట్‌ను దక్కించు కొనేందుకు అంధ్రప్రదేశ్ తీవ్రంగా కృషిచేస్తున్నట్లు చేస్తోందన్నారు. కాగా పరిశ్రమల స్దాపనకు నెల్లూరుజిల్లా ఎంతో అనుకూలంగా వుందని పేర్కొన్న అయన పారిశ్రామివేత్తలు ఇందుకు సంబందించి ముందుకురావాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూములు ఎక్కువగా వుండడం, విశాలమైన సముద్రతీరం వుండడం వల్ల పరిశ్రమల స్దాపనకు ఎక్కువ అవకాశాలు వున్నాయన్నారు. పరిశ్రమల స్దాపనకు అవసరమైన భూములను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తే అంత మేర కేంద్ర ప్రభుత్వం నిదులు సమకూరుస్తుందని శుక్లా తెలిపారు.

రఘురామలకోట గ్రామాన్ని మున్సిపాలిటిలో కలుపవద్దు

జిల్లా కలెక్టర్ కార్యలయం ముందు ధర్నా

ప్రభాతవార్త ప్రతినిధి, జగిత్యాల): ప్రభుత్వం జగిత్యాల మున్సిపల్ చుట్టు ఉన్న గ్రామాలను మున్సిపల్ పరిదిలో కలుపుతున్నట్లు తెలియడంతో పట్టణనానికి చుట్టు ఉన్న గ్రామాల రైతులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులో బాగంగానే సోమవారం జగిత్యాల జిల్లా, మండలంలోని రఘురాములకోట గ్రామనికి చెందిన రైతులు, మహిళలు సుమార 1 వేయ్యి మంది 11 ట్రాక్టర్లు, ద్వీచక్ర వాహనాలలో ర్యాలీగా జగిత్యాలకు తరలి వచ్చారు. బారి ర్యాలీతో మాగ్రామాన్ని జగిత్యాల మున్సిపాలీటిలో కలుపవద్దని నినాదాలు చేస్తు జిల్లా కలెక్టర్ కార్యలయానికి చేరుకున్నారు. అనంతరం రైతులు, మహాళలు జగిత్యాల, కరీంనగర్ రోడ్డు ధర్నా నిర్వహించారు. వాహనాలు నిలిచి పోవడంతో పోలీసులు చేరుకోని ధర్నా విరమించమని సమాదాయించిన రైతులు ససేమిరా అన్నారు. కోద్ది ఉద్రిక్తత వాతవారణం నెలకోంది. వాహనాలు చాల సేపు నిలిచి పోయి ట్రాపిక్ ఇబ్బంది కలిగింది. అనంతరం పోలీసులు సముదాయించడంతో ధర్నా విరమించారు. రైతులు, మహిళలు ప్రజావాణి కోనసాగుతున్న దరూర క్యాంపులోని ఐఎంఎ భవణం చేరుకోని ప్రజవాణి నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి కోరారు.

డయాబెటిస్‌ని నిరోధించే కొత్త రకం గోధుమ

టైప్-2 డయాబెటిస్‌తో పోరాడే ఏటిమతో పాటు క్యాన్సర్ ను లొంగదీసే కొత్తరకం గోధుమను పరిశోధకులు కనుగొన్నారు. ఫైబర్ (పీచువంటి పదార్థం) సమృద్ధిగా ఈ గోధుమ రకంలో ఉంటుంది."అమిలోజ్" సమృద్ధిగా పుష్కలంగా ఉంటుంది. జీర్ణశక్తిని ప్రేరేపించే ప్రతిఘటన పిండి పదార్థం ఎక్కువ అమిలోజ్ గోధుమలో ఉత్పత్తి అవుతుంది. సాధారణ గోధుమరకం కన్నా ఈ అమి లోజ్ గోధుమలో పది రెట్లు ఎక్కువగా ప్రతిఘటన పిండి పదార్థం ఉత్పత్తి అవుతుంది. జీర్ణప్రక్రియ ఆరోగ్యాన్ని పెంపొందించే శక్తి ప్రతిఘటన పిండి పదార్థంలో ఉంది. క్యాన్సర్‌కు దారితీసె జన్యు వినాశాన్ని ఇది నివారించి కాపాడ గలుగుతుంది. ఇదే టైప్ -2 డయాబెటీస్ నినివారించడానికి సహ కరిస్తుంది. సాధారణంగా ఆహారం చిన్న పేగుల్లో చేరి అక్కడ విభజింప బడుతుంది. రక్తంలో గ్లూకోస్ చేరే వేగాన్ని తగ్గిస్తుంది. ఈ పరిశోధన భారత దేశానికి ముఖ్యంగా చెప్పకోతగినది. ఎందు కంటే ప్రపంచ దేశాలన్నిటిలోనూ భారతదేశం దయాడెటిస్‌కు కేంద్రంగా విస్తరిస్తోంది. ఈ వ్యాది .తో 50 మిలియన్ కు పైగా రోగులు బాధపడు తున్నారు. జీవన శైలిలో వచ్చే వ్యాధులు ప్రపంచ మంతా ఉన్నాయి. ఇప్పుడు టైప్-2 దయాబెటిస్ ప్రపంచ ఆరోగ్య సవాల్‌గా మారింది. భారత్ వంటి వర్ధమాన దేశాలు అన్నిటికీ ఇదొక సమస్యగా నిలిచిందని కామన్‌వెల్త్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (సిఎస్ ఐఆర్‌డి) ప్రధాన పరిశోధక శాస్త్ర వేత్త రెజినా అహ్మద్ పేర్కొన్నారు. ఈ పరిశోధన బృందానికి ఆమె నాయకత్వం వహిస్తున్నారు. ఈ వ్యాధి విస్తరణ ఎక్కువ మందిని బలిగొంటోంది. వైద్య చికిత్స ఖర్చు కూడా పెరుగుతుంది. పోషక విలువలు విశేషంగా ఉండే గోధుమ వంటి ప్రధాన పంటల ప్రభావం ప్రజారోగ్యంపై బాగా పని చేస్తుంది. ఆహారంలో ఎలాంటి మార్పులు చేయవలసిన అవసరం ఉండదు. గోధుమను విస్తారంగా పండించే దేశాల్లో భారత్ ముందంజలో ఉంది. దాదాపు గోధుమ రకాలన్ని స్వదేశీ అవసరాలకే వినియోగిస్తుంటారు. పోషక విలువలు ఎక్కువగా ఉన్న గోధుమ వినియెగదారులకు ఆరోగ్యప్రయో జనాలను బాగా చేకూరుస్తుంది.

సాంక్రామికేతర వ్యాధులతో భారతదేశం భయాందోళనలతో అల్లాడుతోంది. సీజన్ల వారీగా వచ్చే మలేరియా, డెంగ్యూ, డయేరియా, వ్యాధులు ఒక పక్క పీడిస్తే మరోవైపు మధుమేహం, గుండె

> జీర్ణప్రక్రియ ఆరోగ్యాన్ని పెంపొందించే శక్తి ప్రత్తిఘటన పిండి పదార్థంలో ఉంది. క్యాన్సర్‌కు దారితీసె జన్యు వినాశాన్ని ఇది నివారించి కాపాడ గలుగుతుంది. ఇదే టైప్ -2 దయాబెటీస్ నినివారించడానికి సహ కరిస్తుంది. సాధారణంగా ఆహారం చిన్న పేగుల్లో చేరి అక్కడ విభజింప బడుతుంది. రక్తంలో గ్లూకోస్ చేరే వేగాన్ని తగ్గిస్తుంది. ఈ పరిశో ధన భారత దేశానికి ముఖ్యంగా చెప్పకోత గినది. ఎందు కంటే ప్రపంచ దేశాలన్నిటిలో నూ భారతదేశం దయాడెటిస్‌కు కేం ద్రంగా విస్తరిస్తోంది.



జబ్బులు, క్యాన్సర్లు తదితర సాంక్రామితేతర వ్యాధులు చాపకింద నీరులా విస్తరించి ప్రాణాలను తోడేస్తున్నాయి. ఆగ్నేయాసియా దేశాల్లో ప్రస్తుతం 46,90,3000 మధుమేహ రోగులుండగా, 2030 నాటికి 11,95,41,000 మంది వరకు మధుమేహ రోగులు పెరగవచ్చని , ఇది చాలా విపరీత పరిస్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వెలిబుచ్చింది. ఆయా దేశాలు, రాష్ట్రాలు తక్షణం ఈ రోగాల నివారణకు పక్కా ప్రణాళికలు అమలు చేయాలని అప్రమత్తం చేసింది. భారతదేశంలో 62 మిలియన్ల మందిని మధుమేహం పీడిస్తుంది. ఏటా దాదాపు ఒక మిలియన్ భారతీయులు దీనివల్లనే ప్రాణాలు కోల్పోతున్నారు. 2030 నాటికి భారతదేశంలో 101 మిలియన్ వరకు ఈ రోగుల సంఖ్య చేరుకో వచ్చు. 2000 సంవత్సరం నాటికి 32 మిలియన్ మధుమేహ రోగులుండగా 2013 నాటికి 63 మిలియన్ వరకు ఈ రోగుల సంఖ్య పెరగడం గమనించదగిన అంశం. అంటే 13 ఏళ్ళలో మధుమేహ రోగుల సంఖ్య రెండింతలు అమాంతంగా పెరిగింది. భారతదేశంలో కేరళ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో అత్యధిక శాతం మధుమేహ రోగులున్నారు. పురుషుల్లో 8.2 శాతం, మహిళల్లో 6.8 శాతం మంది ఈ వ్యాధిగ్రస్తులుగా తేలింది. 30 నుంచి 69 సంవత్సరాల వారిలో ఏటా 75,900 మంది, మహి ళల్లో అదే వయస్సువారిలో 51,700మంది ప్రాణాలు కోల్పోతు న్నారని అధ్యయానాల్లో బయటపడింది. 2005 లో రెండు లక్షల 24 వేల మందిని, 2015 లో 3లక్షల 46 వేల మందిని మధు మేహం కబళించిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మరణానికి కారణమయ్యే వ్యాధుల జాబితాలో గతంలో 13వ స్థానంలో ఉండే మధుమేహం ప్రస్తుతం ఏడో స్థానానికి చేరడం ఆందోళన కలిగించే విషయమని భారతీయ వైద్య పరిశోధన మండలి హెచ్చరించింది. చైనాలో 8 కోట్ల మంది మధుమేహ రోగులుండగా భారతలో కూడా అదే స్థాయిలో అంటే 7 కోట్ల మంది మధుమేహ రోగులున్నారు. పల్లెల్లో 47శాతం, పట్టణ ప్రాంతాల్లో 57శాతం మరణాలకు సాంక్రే మికేతర వ్యాధులే కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. మధు మేహం వల్లనే ప్రతి ఆరు సెకన్లకు ఒకరు మరణిస్తున్నారని తేలింది. మధుమేహ రోగుల్లో దాదాపు సగం మందికి తమకు ఈ వ్యాధి ఉందన్న సంగతే తెలియదు, మరో అయిదు, పదేళ్లలో మధుమేహ ప్రభావం వల్లనే మధుమేహ రోగులు 60లక్షల మంది కంటి చూపు ను కోల్పోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సాంక్రేమికేతర వ్యాధుల కారణాంగానే భారతదేశం 2030 నాటికి రూ. 312 లక్షల కోట్ల నష్టం పోనుందని ప్రపంచ ఆర్థిక నివేదిక అంచనా వేసింది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో సాంక్రామికేతర వ్యాధుల నిర్ధారణ పరీక్షలను నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వ్యాధులు దాపురించడానికి కారణాలేమిటో ప్రజల జీవన శైలిలో ఏయే అంశాలు ఈ వ్యాధులు ముమ్మరం కావడానికి దోహదపడుతున్నాయో దేశమంతటా అవగాహన శిబిరాలు నిర్వ హించి ప్రజారోగ్య భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తేనే కాని వీటిని నివారించడానికి దారి ఏర్పడదు.

-వార్త రీసెర్చ్ డెస్క్

కణాల్లో జరిగే మార్పులను తెలుసుకునేందుకు పరిశోధనలు

నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ మార్టిన్ చల్ఫీ

గచ్చిబౌలి, జనవరి 29 ప్రభాతవార్త: కణాల్లో జరిగే మార్పులను సమూలంగా తెలుసుకునేందుకు డెవలప్‌మెంటల్ బయాలజీ అనే ప్రయోగాల ద్వారా పరిశోధనలు చేస్తున్నట్లు నోబెల్ బహుమతి గ్రహిత ప్రొఫెసర్ మార్టిన్ చల్ఫీ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇన్సురెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్ మెంట్ అథారిటీ(ఎఆర్‌డిఎఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ లెక్చర్ సీరిస్-2018లో భాగంగా సోమవారం ప్రొఫెసర్ మార్టిన్ చల్ఫీ ప్రసంగించారు. కణాల ఆకృతిపై కొత్త కోణాలను ఆవిష్కరించే విధంగా ప్రొఫెసర్ చల్ఫీ ప్రవేశపెట్టిన గ్రీన్ ఫ్లూరోసింట్ ప్రోటీన్(జిఎఫ్‌పి)కి గుర్తింపుగా 2008 సంవత్సరంలో కెమిస్ట్రీ విభాగంలో ఆయనకు నోబెల్ బహుమతి వరించింది. హెచ్‌సియులో నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్ చల్ఫీ మాట్లాడుతూ శరీరంలో ఉండే కణాల పరిణామక్రమంపై పూర్తిస్థాయి పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. శరీరంలోని ఒక కణాన్ని తొలగించినప్పుడు అక్కడ తిరిగి ఏర్పడే కణం ముందున్న దానికి భిన్నంగా ఉంటుందన్నారు. దీనికి గల కారణాలు, వాటిలో జరిగే చర్యలపై పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. ఒక కణాన్ని ముట్టుకున్నప్పుడు దాని ప్రతి చర్యలు ఎక్కడ జరుగుతున్నాయో తెలుసుకునే దిశగా ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యార్థులు పరిశోధనా రంగంలో అడుగుపెట్టాలనుకుంటే ముందు బేసిక్ సైన్స్‌ను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, అప్పుడే ముందుకు వెళ్లడం సాధ్యమవుతుందని అన్నారు. బేసిక్ సైన్స్ తెలుసుకోకుండానే పరిశోధనలు చేయాలనుకోవడం సరైంది కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సిలర్ ప్రొఫెసర్ అప్పారావుతో పాటు విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



సోమవారం హైదరాబాద్ లెక్చర్ సీరిస్-2018 లో భాగంగా సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చల్ఫీ



శ్రీశ్రీ దరమ్‌గురు శ్రీమాన్ మాదవ్‌సింగిజీదీవన్‌సాబ్ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాజస్థానీలు

రాజస్థానీయులు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలి

మాజీ మంత్రి సిర్వీసామజ్ శ్రీశ్రీదరమ్‌గురు దీవన్‌సాబ్ పిలుపు

హైదరాబాద్‌జన వరి29 (ప్ర భాతవార్త): రాజస్థాన్ వ్యాపారులు,ఆయా వృత్తులో జీవిస్తున్నా ప్రతి ఒక్కరు సమాజంలో ఇతరులకు మార్గదర్శకులుగా ఉండాలని రాజస్థాన్ మాజీ మంత్రి సిర్వీ సమాజ్ శ్రీశ్రీ దరమ్‌గురు శ్రీమాన్ మాదవ్‌సింగిజీదీవన్‌సాబ్ పిలుపు నిచ్చారు మహేశ్వరంలో సోమవారం అశరామ్‌చౌదరీ అధ్యర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిదిగా పాల్గొని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రాజస్థానీలతో పాటు స్థానిక ప్రజల నుద్దేశించి మాట్లాడారు. రాజస్థానీలు మంచి కష్టజీవులని అత్యధిక శాతం వ్యవసాయం మీదా ఆదారపడి జీవనం సాగిస్తున్నా వ్యవసాయానికి సాగునీటి వనరులు అంతంత మాత్రంగానే ఉండడంతో వేలాది మంది నిరుద్యో గులుగా మారుతున్నారని. అందులో భాగంగానే ప్రత్యమ్నాయంగా ఉపాధి అవకాశాలకోసం దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలైన కర్ణాటక,తమిళనాడు, బొంబాయి, తెలంగాణ, ఆంధ్ర,వంటి అనేక ర్షాష్టాలో ఉద్యోగులుగా, చిన్న చిన్న వ్యాపారాలు చేసు కుంటు జీవనం సాగిస్తున్నా రాజస్థాన్ రా ష్ట్రానికి చెందిన ప్రతి ఒక్కరు తమ వృత్తులో నీతి నిజాయితిగా పనుల చేస్తు ప్రతి ఒక్కరికి ఆదర్శవం తులుగా మారాలని ఆయన సభ ముఖంగా కోరారు. రాజస్థాన్ ప్రాంతంలో ఉన్న మన ఆచారాలు, కట్టడలు పాటిస్తు ముందుకు సాగాలని కోరారు. దేశ వ్యాప్తంగా హైదరాబాద్, విశాఖపట్నం, విజయ వాడవంటి నగరాల్లో కూడా రాజస్థానీయులు రానిస్తున్నారని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రతి ఒక్కరు తమ పనుల్లో మంచి నైపు ణ్యత కనబరుస్తు ముందుకు సాగాలని, జీవనోపాది కోసం వచ్చిన ప్రతి ఒక్కరిని తెలుగు ప్రజలు ఆదరించిడం పట్ల ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. భక్తిభావనతో ఉండాలని దీవన్‌సాబ్ సుచించారు.

ఈ సమావేశంలో మహేశ్వరం నియోజ కవర్గం శాసన సభ్యుడు తీగల క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో రాజస్థానీయులు అధ్య ధిక శాతం జీవిస్తున్నారని, వేలాది మంది చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటు జీవిస్తుండగా, మరి కొంతమంది ఉద్యోగులుగా ఉన్నారని,ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేస్తు ఆర్థికంగా ఎదుగుతున్నారని ఆయన పేర్కొన్నారు.

కల్తీ సరుకుల లేకుండా, నాణ్యత ప్రమాణాలతో కూడినవే అమ్మాలన్నారు. రాజస్థానీయులకు తాము అన్ని విదాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అశరామ్‌చౌదరి, సంగారెడ్డి జిష రామ్, రుగరామ్, చెన్నారామ్, కాలురామ్, గావర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనే అత్యధికశాతం పన్ను వసూళ్లు

ప్రత్యక్ష పన్నులశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.పి.చౌదరి



సభలో మాట్లాడుతున్న ఎస్.పి.చౌదరి, గౌరాశ్రీనివాస్ తదితర అతిథులు

నాంపల్లి, జనవరి 29 ప్రభాతవార్త : ఉభయ తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనే అత్యధికశాతం ప్రత్యక్ష పన్నుల వసూళ్ల జరిగాయని, ఇంది దేశంలోనే అత్యధికమని ప్రత్యక్ష పన్నులశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.పి.చౌదరి పేర్కొన్నారు. రెడ్ హిల్స్‌లోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక, ఆర్థిక మరియు వాణిజ్య మండళుల సమాఖ్య ఎఫ్టాప్సీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎఫ్టాప్సీలోని ఫెడరేషన్ హౌజ్‌లో 'ట్యాక్స్ చెల్లించడంలో ఎదురవుతున్న సమస్యలు మరియు సవాళ్ళు' అంశం మీద సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎస్.పి.చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసి దేశంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్ల 18శాతం కాగా అందులో ఉభయ తెలుగురాష్ట్రాల్లో 30.9 శాతంగా నమోదయ్యిందని, ఇప్పటికీ ట్యాక్స్ చెల్లింపుదారులు అనేకమంది పన్ను చెల్లించడంలేదని, వారిని కూడా పన్ను చెల్లింపుదారుల్లో చేర్చడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. ట్యాక్స్ చెల్లింపుల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర అత్యంత కీలకమని, కొందరు చార్టర్డ్ అకౌంటెంట్లు పన్ను చెల్లింపుదారులను పక్కదారి పట్టిస్తూ వారిచేత తక్కువ పన్ను చెల్లించేలా ప్రోత్సహిస్తున్నారని, అది సరి కాదన్నారు. ట్యాక్స్ చెల్లింపుదారులు సరైన విధంగా పన్నులను చెల్లించినప్పుడే దేశ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా వెలుగొందుతుందని, ప్రతీ చార్టర్డ్ అకౌంటెంట్ తమ కస్టమర్ల దగ్గర నుంచి పూర్తిస్థాయిలో ప్రత్యక్ష పన్నులు చెల్లించేలా చూడాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా పారిశ్రామిక, ఆర్థికవర్గాలు పన్నుల విషయంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారమందించారు. ఎఫ్టాప్సీ అధ్యక్షుడు గౌరా శ్రీనివాస్ సభాధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎఫ్టాప్సీ సీనియర్ ఉపాధ్యక్షుడు అరుణ్‌లుహారుకా, ఉపాధ్యక్షుడు కరుణేంద్ర జాస్తి, తదితరులు పాల్గొన్నారు.



పాస్‌పోర్టులు జారీపై కేంద్రానికి కేరళ హైకోర్టు నోటీసులు

-ఆర్థికస్థితి, చదువు వంటి సెగ్రిగేషన్‌పై వివరణ కోరిన కోర్టు
-భిన్న రంగులలో పాస్‌పోర్టులు జారీపై ప్రశ్నలు

కోచి,జనవరి29,ప్రభాతవార్త: విదేశాలకు వెళ్లేందుకు జారీ చేసే పాస్‌పోర్టులలో చదువు కేటగిరితో పాస్‌పోర్టులను విభజించటానికి, భిన్నమైన రంగు(నారింజ)ను కేటాయించటంలో ఉన్న ఆంతర్యంపై వివరణ ఇవ్వవలసిందిగా కేరళ హైకోర్టు సోమవారం కేంద్రానికి నోటీసులు జారీచేసింది. కేరళహైకోర్టు ఆంటొనీ డామ్నిక్, న్యాయమూర్తి శేషాద్రినాయుడులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఒక పిల్‌ను సోమవారం విచారిస్తూ... పదవతరగతి లోపు చదివి, ఆదాయపు పన్ను పరిధి లోపులో ఆదాయం ఉన్న వారికి ఆరెంజ్ కలర్‌లో పాస్‌పోర్టును జారీచేయాటం వల్ల రాజ్యాంగంలో ఉన్న అందరినీ సమానంగా చూడాలన్న ప్రాథమిక సూత్రానికి విరుద్ధంగా ఉందన్న పిటీషనర్ ఆరోపణలకు స్పందిస్తూ బెంచ్ కేంద్రానికి నోటీసులు జారీచేసింది. వివిధ కారణాలకోసం విదేశాలకు వెళ్లాలనుకునే వారికి పాస్‌పోర్టులను జారీచేసే విషయంలో ఇలాంటి విభజనను అమలు చేయటం వల్ల రాజ్యాంగంలో ఉన్న మౌలికమైన ప్రాథమిక హక్కులకు భిన్నంగా ఉందని ఇటువంటి సెగ్రిగేషన్‌ను వెంటనే ఉప సంహరించుకోవాలని పిటిషన ర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

తెలంగాణ నియంతను ఓడించే వరకు నిద్రపోను: ఒంటేరు ప్రతాప్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: తెలంగాణా నియంతను ఓడించే వరకు నిద్రపోనని టిడిపి నాయకులు ఒంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. చంచల్‌గూడ జైలులో ఉన్న ఒంటేరు ప్రతాప్‌రెడ్డికి బెయిలు మంజూరు కావడంతో సోమవారం సాయంత్రం ఆయన విడుదలయ్యారు. జైలు బయట మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నియంతృత్వ పాలన నడుస్తుందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఇంటింటికి వెళ్తానని, ప్రజల మధ్య ఉండి పోరాటం చేస్తానని, తెలంగాణా రాష్ట్రానికి పట్టిన నియంతను ఓడించే వరకు నిద్రపోనని అన్నారు. వంద సంవత్సరాల యూనివర్సిటీ చరిత్రలో మొదటిసారిగా దాదాపు 22 మంది విద్యార్థులపై ముఖ్యమంత్రి కెసిఆర్ 307 సెక్షన్‌లపై కేసులు పెట్టించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తో తనకు ప్రాణభయం ఉందన్నారు. 2019లో కెసిఆర్ ఓడిపోతే పరువు పోతుందన్న భయంతోనే తనను చంపించడానికి, ఎన్‌కౌంటర్ చేయించడానికి కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి అవినీతిని బయట పెడతామని ఆయన పేర్కొన్నారు. తన స్వంత గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకుంటే చూడడానికి యూనివర్సిటీకి వెళ్లిన తనపై పోలీసులు దాడి చేసి అక్రమంగా కేసులు పెట్టడం జరిగిందన్నారు. తెలంగాణా రాష్ట్రం మొత్తం పోలీసుల రాజ్యంగా మారిందన్నారు. మాదిగను ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పిన కెసిఆర్ ఇప్పుడు మందకృష్ణ మాదిగను జైలులో పెట్టడం జరిగిందన్నారు. అవినీతిని ప్రశ్నించే వారు ఉండవద్దన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. పవన్‌కళ్యాణ్ బయటకు వెళితే రాని శాంతిభద్రతల సమస్య కోదండరాం బయటకు వెళితే ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. 506, 507 కేసుల్లో పోలీసులకు జ్యుడిషియల్ పవర్ ఇవ్వడం సరికాదన్నారు. తెలంగాణాలో ప్రజాస్వామ్యం లేదని, నిరసన తెలపడానికి అవకాశం లేకుండా చేశారని అన్నారు.



సోమవారం జైలు బయట మీడియాతో మాట్లాడుతున్న ఒంటేరు ప్రతాప్‌రెడ్డి

బిసి బిల్లుపై 3న అఖిలపక్ష రాజకీయ పార్టీలతో సమావేశం

-బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త: బిసి బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, జాతీయ బిసి బిల్లుకు అన్ని రాకజకీయ పార్టీలు బేషరతుగా మద్దతు తెలపాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3వ తేదీన హైదరాబాద్ లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతోఎ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నామని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగునున్నందున ఈసమావేశాలలోనే బిసి బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు రాజ్యాంగ పరమైన హక్కులు కల్పించడానికి అన్ని రాజకీయ పార్టీలు తమ విధానపరమైన ప్రకటన చేయాలన్నారు.

వచ్చేనెల 3వతేదీన ఉదయం 11గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగే అఖిలపక్ష సమావేశానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈసమావేశంలో భవిష్యత్ కార్యచరణపై చర్చించి ప్రకటిస్తామని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

వయోవృద్ధులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకొంటుంది : ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి



సోమవారం రవీంద్రభారతి లో త్రైమాసిక పత్రికను ఆవిష్కరిస్తున్న పాతూరి,శైజల తదితర అతిథులు

రవీంద్రభారతి, జనవరి 29 ప్రభాతవార్త : నేటి ఆధునిక సాంకేతికయుగంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ కుప్పకూలిపోయి, పాశ్చాత్య ధోరణులు, భార్యాభర్తలు ఉద్యోగాలు చేయాల్సిన తదితర అనేక కారణాల దృష్ట్యా వృద్ధులను ఆత్మీయంగా చేసేవారే కరువైపోయారని ఆవేదన వ్యక్తంచేస్తూ తెలంగాణ ప్రభుత్వం వయోవృద్ధులను అన్నివిధాలా ఆదుకొంటుందని ఎమ్మెల్సీ, తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సీనియర్ సిటిజన్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంఘం వారి త్రైమాసిక పత్రిక 'సీనియర్ సిటిజన్స్ పిలుపు' ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి పాతూరి సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి 'సీనియర్ సిటిజన్స్ పిలుపు' త్రైమాసిక పత్రికను అతిథులతో కలసి ఆవిష్కరించి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 2015 అక్టోబరు 10న తీసుకొచ్చిన చట్టం ప్రకారం వృద్ధుల వారసులు విధిగా వారిని పోషించాలని చెప్పబడిందని, కానీ తల్లిదండ్రులు పిల్లలమీద ప్రేమ, మమకారాలతో వారిపై ఫిర్యాదులు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. ఇక సీనియర్ సిటిజన్ల సంఘం జిల్లాల్లో ప్రభుత్వ నిధుల సహాయంతో నడుస్తున్న వృద్ధాశ్రయాలమీద దృష్టిసారించి, నిధులు దుర్వినియోగం కాకుండా, వృద్ధులకు సక్రమంగా అందేటట్టు చూడాలని, వీలైనంతవరకు ఆయా జిల్లా సంఘాలే నిర్వహించేందుకు కృషిచేయాలని సూచించారు. భారతీయ సెంటిమెంట్ ప్రకారం వృద్ధులను గౌరవిస్తే మన మూ అభివృద్ధి చెందుతామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సంఘం సేవాదృక్పథంతో పనిచేయాలని, రాష్ట్రప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన అవగాహనా సదస్సులకు తమవంతు సహకారమందించాలని కోరారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సంచాలకురాలు బి.శైలజ మాట్లాడుతూ వేల సంవత్సరాలుగా మన భారతీయ సంప్రదాయం ప్రకారం పెద్దవాళ్లను గౌరవిస్తూ ప్రపంచానికే మార్గదర్శకంగా నిలిచిన మనం కారణాంతరాల వల్ల పెద్దవాళ్లయిన వృద్ధులను సరిగ్గా చూడలేకపోవడం శోచనీయమన్నారు. అయితే పిల్లలకు పెద్దలను గౌరవించాల్సిన ఆవశ్యకతను, బాధ్యతను తెలియజెప్పు పాఠశాల చదువులో దానినొక పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయ పడ్డారు. తమపట్ల పిల్లల ఆదరణ, ఆప్యాయతలు సన్నగిల్లాయన్న ఆవేదనతో వృద్ధులు మానసిక ఒత్తిడిలకు గురవుతూ ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి పెద్దపీటవేస్తూ చట్టప్రకారం రాష్ట్రంలోని పాతజిల్లాల్లో అప్పిలేట్ ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, కొత్త ఏర్పాటైన జిల్లాల్లో త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. అయితే ఈ ట్రిబ్యునల్స్‌ని రాష్ట్రంలో కేవలం 30శాతమే ఉపయోగించుకొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ వృద్ధాశ్రయాలు 3, ప్రైవేట్‌వి 20 ఉన్నాయని, వచ్చే మార్చి మాసాంతంలోగా ప్రభుత్వ నిధులతో మరో 20 వృద్ధాశ్రయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కోటి రూపాయల నిధులతో 20 గ్రంథాలయాలలో కనీస సౌకర్యాలు

సిఎం దృష్టికి సమస్యలను తీసుకొని వెళ్తాం: మంత్రి శ్రీనివాసయాదవ్

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: విజ్ఞాన కేంద్రాలుగా భాసిల్లుతున్న గ్రంథాలయాల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు, మొదటి దశలో 20 గ్రంథాలయాలను ఎంపిక చేసి అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించనున్నట్లు మంత్రి శ్రీనివాసయాదవ్ తెలిపారు. నగరంలో మొత్తం 86 గ్రంథాలను పనిచేస్తున్నాయని, గ్రంథాలయాల అభివృద్ధి కోసం 10 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జంట నగరాల్లో నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రంథాలయాలపై పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యోగితారాణా పాల్గొన్నారు. కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి కోటి రూపాయలను మొదటి దశలో ఎంపిక చేసిన 20 గ్రంథాలయాలలో కనీస అవసరాలను తీర్చేందుకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఆవశ్యకతను కలెక్టర్ వివరించారు. చిన్నప్పటి నుంచి గ్రంథాలయంలో సమయం వెచ్చించి పుస్తకాలను చదవి ప్రస్తుతం తాను కలెక్టర్ స్థాయికి ఎదిగినట్లు తెలిపారు. అంతటి మహోన్నత స్థానం ఉన్న గ్రంథాలయాలకు సేవలందిస్తున్న లైబ్రేరియన్‌లు తమ బాధ్యతలను గుర్తుంచుకుని, గ్రంథాలయాలను తమ సొంతఇంటిలా భావించి పనిచేసినప్పుడే అవి ఎంతో అభివృద్ధి సాధిస్తాయన్నారు.



సోమవాం సచివాలయంలో గ్రంథాలయాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న మంత్రి తలసాని

గ్రంథాలయాల అభివృద్ధి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి అవసరమైన నిధులను తీసుకుని వచ్చేందుకు కృషి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు అన్ని వసతులను కల్పించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పుస్తకాలను కొనుగోలు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉండగా, మరికొన్ని భవనాలు వర్షాకాలంలో లీకేజీల కారణంగా నీరు కురవడం వల్ల పుస్తకాలు తడిపోయాయన్నారు. 15రోజుల్లో మొదటి దశలో ఎంపిక చేసిన 20 గ్రంథాలయాలను గుర్తించి మూడు నెలలో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అవసరమైన పుస్తకాల జాబితాను అందజేస్తే ఆయా గ్రంథాల యాలకు ప్రభుత్వ పరంగా కాకుండా దాతల సహకారంతో సమకూర్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

ప్రతి గ్రంథాలయాల్లో టేబుళ్లు, చైర్లు, విద్యుత్ సరఫరా, తాగునీటి వంటి కనీస వసతులు ఉండే విధంగా చూడాలన్నారు. కార్పొరేటర్లు కూడా తమ పరిధిలోని గ్రంథాలయాలను దత్తత తీసుకుని దాతల సహాకరంతో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈనెల 31న హరితప్లాజాలో జరిగే జిల్లా ఎమ్మెల్యే సమావేశంలో గ్రంథాలయాలకు నిధుల కేటాయింపు ఎజెండాగా చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రగ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ శ్రీనివాస్ యాదవ్ చొరవ తీసుకుని గ్రంథాలయాల అభివృద్ధి కోసం సమావేశం నిర్వహించినట్లు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏమంత్రి కూడా గ్రంథాలయాల అభివృద్ధి కోసం సమావేశం నర్విహించలేద న్నారు. మంత్రి, కలెక్టర్‌ల సహకారంతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న, ఇంచార్జ్ జా యింట్ కలెక్టర్ నిఖిల, హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఉమారాణి, సభ్యులు మమతా గుప్తాలు పాల్గొన్నారు.

కోడి పందాలను నియంత్రించాలని ఆదేశించినా పట్టదా?

ఎపి ప్రభుత్వంపై హైకోర్టు అసంతృప్తి

హైదరాబాద్, జనవరి 29ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో కోడి పందాల నిర్వహణను నియంత్రించాలని మేం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయరా ? అని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆ రాష్ట్రంలోని పలు జిల్లాలలో కోడి పందాలను అడ్డుకోవడంలో అధికారులు విఫలమయ్యాయరని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈమేరకు సోమవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ ఎంఎస్‌కే జైశ్వాల్‌తో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ సాగించింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశం మేరకు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు.

డీజీపీల సదస్సు ఉన్నం దున డీజీపీ మాలకొండయ్యకు వ్యక్తిగత హాజరు నుంచి గతంలోనే మినహాయింపు ఇచ్చింది. తీ ర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో కోడి పందాలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయి ? నిందితులు ఎవరు ? ఉభయ గోదావరి జిల్లాలలో 806 చోట్ల జరిగినట్లుగా చెబుతున్న కోడి పందాలను ఎవరు నిర్వహించారు ? అన్న దానిపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. వివరాలు సమర్పించేం దుకు కొంత సమయం కావాలని సీఎస్, డీజీపీ కోరడంతో ధర్మాసనం అందుకు అంగీకరించింది. తదుపరి విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపును ఇవ్వాలని సీఎస్ కోరగా హైకోర్టు అనుమతించింది. గత ఏడాది పశ్చిమ గోదావరి జిల్లాలలో కోడి పందేలను అడ్డుకోవడంలో విఫలమైన తహాశీల్దార్లు, ఎస్‌ఐలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని హైకోర్టు ఆదేశించింది. కోడి పందాల నిర్వహణలో ప్రతీ ఏటా ప్రజాప్రతినిధులు వ్యవహారిస్తున్న తీరుపై ధర్మాసనం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. బహిరంగంగా కోడి పందాలను ప్రజాప్రతినిధులు ప్రోత్సహిస్తు న్నారని వ్యాఖ్యానించింది. దీనిపై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఎసిబి వలలో అవినీతి జలగ

ఉడా అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్‌పై దాడులు

ఏక కాలంలో 12 చోట్ల తనిఖీలు

దాదాపు రూ.10 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు


కీలక పత్రాలు లభ్యం, కొనసాగుతున్న దాడులు



ఉడా అధికారి ప్రదీప్ కుమార్ ఇంటినుంచి స్వాధీనం చేసుకున్న నగదు, వెండి, బంగారు ఆభరణాలు. (ఇన్‌సెట్) ప్రదీప్ కుమార్

విశాఖపట్నం, జనవరి 29, ప్రభాతవార్త: అవినీతికి అడ్డాగా మారిన వుడాలో మరో ఉన్నతస్థాయి అధికారి ఎసిబి అధికారులకు అడ్డంగా బుక్కయ్యాడు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజామునుంచి ఏకకాలంలో ఏసీబీ అధికారులు చేసిన దాడుల్లో దాదాపు రూ.10 కోట్లకుపైగా అక్రమాస్తులను గుర్తించారు. బంగారం, వెండితోపాటు పెద్దఎత్తున నగదు, కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. దీనికి సంబందించి ఎసిబి డిఎస్‌పి ప్రసాద్ విడుదలచేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి. వుడాలో అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న పసుపర్తి ప్రదీప్ కుమార్ భారీఎత్తున అక్రమాస్తులు కూడగట్టి నట్టు అనేక ఫిర్యాదు అందడంతో ఎసిబి అధికా రులు ఆయన నివాసంతో పాటు బంధువులు, స్నేహితుల ఇళ్ళల్లో కూడా సోదాలు నిర్వహించారు. నగరంలోని సంపత్ వినాయగర్ సమీపంలోని నటరాజ్ టవర్‌లో ఆయన నివాసముంటున్నారు. ఒక్క ఎపిలోనే కాకుండా తెలంగాణా రాష్ట్రంలో కూడా ఆయనకు ఆస్తులున్నట్టు ఎసిబి సోదాల్లో బైటపడింది.

ముందుగా వుడా కార్యాలయంతో పాటు ఆయన పెద్ద కుమారుడు హేమంత్‌సాయి ఇంట్లోనూ, స్నేహితుల ఇళ్లల్లోనూ ఒకేసారి సోదాలు నిర్వహించారు. వీటితోపాటు ఒంగోలు, అనంతపురం ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రదీప్ కుమార్ తండ్రి, ఆయన దగ్గర బంధు వుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఆయన మామగారు హైదరాబాద్‌లో నివాసముంటుండడంతో అక్కడ కూడా సోదాలు నిర్వహించారు. అదేవిధంగా ఆయన వదిన ఇళ్ళపై కూడా ఏసీబీ సోదాలు నిర్వహించింది. దీంతో ఏసీబీ అధికారుల సైతం విస్మయం చెందెలా అక్రమాస్తులు బైటపడ్డాయి. మూడు లక్షల రూపాయల నగదు, 18 లక్షల విలువగల బ్యాంక్ డిపాజిట్లు, పది లక్షల రూపాయల విలువగల ఇన్సూరెన్సు బ్యాండ్లు, 20 లక్షల రూపాయల విలువగల గృహోపకరాలు, 2.700 కేజీల బంగారం లభ్యమైంది. బంగారం విలువ రూ.70 లక్షల రూపాయల వరకూ వుంటుందని అధికారులు భావిస్తున్నారు. బంగారం కంటే విలువైన రెండు ప్లాటినం రింగులు కూడా అధికారులు గుర్తించారు. సుమారు నాలుగు లక్షలు విలువ చేసే వెండితోపాటు కొడుకు పేరిట పది లక్షల రూపాయల విలువగల పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు, ఒకకారు, రెండు దిచక్ర వాహనాలను ఎసిబి గుర్తించింది. దీంతోపాటుగా అయిదు ఇళ్ళు, నాలుగు ఇళ్ళ స్థలాలు, సుమారు 9.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వీటితోపాటుగా ఏసీబీ అధికారులు వారి సోదాల్లో బ్యాంకు లాకర్లను కూడా గుర్తించారు. తనిఖీలు ఇంకా పూర్తి కాలేదని ఎసిబివర్గాలు చెప్పాయి. ప్రదీప్‌కుమార్‌కు ఇద్దరు కుమారులు కాగా వారిలో హేమంత్ సాయిని విదేశాల్లో చదివించాడు. సాయి మధురవాడ హెచ్‌ఎస్ కన్‌స్ట్రక్షన్స్ పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మరో కుమారుడు మణిపాల్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువు తున్నాడు. ఏడాదికి మూడు లక్షల రూపాయలను ప్రదీప్ ఫీజు రూపేణా చెల్లిస్తున్నాడు.



ప్రదీప్‌కుమార్ నివాసం వుండే అపార్ట్‌మెంట్

దాడులు జరిగిన సమయంలో ప్రదీప్‌కుమార్ భార్య లత సింగపూర్ పర్యటనలోఉన్నారు. ఆమె పేరిటఉన్న మూడు బ్యాంకు లాకర్లు తెరవాల్సి ఉంది. లాకర్లలో కూడా బంగారం, ఇతర పత్రాలు ఉండి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రదీప్‌కుమార్‌ను అరెస్టు చేసి విజయవాడ ఎసిబి కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్టు ఎసిబి అధికారులు తెలిపారు.

2019 ఎన్నికల్లో జనసేన పోటీ

అమరావతి ఉద్యోగాల్లో సీమకు ప్రాధాన్యత ఇవ్వాలి - హైకోర్టును రాయలసీమలోనే ఏర్పాటు చేయండి -జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

హిందూపురం/ధర్మవరం జనవరి 29 ప్రభాతవార్త: నూతన రాజధాని అమరావతిలో రాయలసీమ ప్రాంత వాసులకు ఉద్యోగాల్లో సమ ప్రాధా న్యత కల్పించాలని, అన్ని ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా హైకోర్టును కూడా సీమలో ఏర్పాటు చేయాలని జనసేన అధినేత, పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ డిమాండు చేశారు. కరవు యాత్ర పేరుతో పవన్ కళ్యాణ్ అనంతపురంజిల్లాలో మూడురోజులుగా నిర్వహించిన పర్యటన హిందూ పురంలో సోమవారంతో ముగిసింది. ఉదయం పుట్టపర్తి నుంచి ధర్మవరం వెళ్లి ఆ తరువాత హిందూపురానికి మధ్యాహ్నం 1.30 గంటలకు పవన్ చేరుకున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తరువాత పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న జెవిఎస్ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు. 1.40 గంటలకు చేరుకుని 1.50 గంటలకు తన ప్రసంగం ప్రారంభించారు. ప్రత్యేక హోదాను ఇస్తామని చెప్పిన భారతీయ జనతాపార్టీ ఇప్పుడు విస్మరించిందని ఢిల్లీలో ఉన్న వారిపై ఒత్తిడి తేవాలంటే ఇక్కడున్న తెలుగుదేశం, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకహోదా నినాదంతో పోరాడితే జనసేన ఈ అంశానికి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ కోసం అన్ని పార్టీలు ఏకమై రాష్ట్ర సాధన చేసినట్లుగా హోదాను మనం సాధించాలని అన్నారు. హోదా సాధనతోనే కొత్త పరిశ్రమలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అనంతపురం జిల్లాలో రైతాంగం పరిస్థితి దుర్భరంగా ఉండడం తనను కలచివేసిందన్నారు. రైతుల కోసం ప్రభుత్వాలు, పాలకులతో జనసేన పోరాడుతుందని వారి కష్టనష్టాల్లో పాలుపంచుకుంటుందని ఆవేశంతో మాట్లాడుతూ ఊగిపోయారు. అనంత కష్టాలను తీర్చేంతవరకు జనసేన అండగా ఉంటుంద న్నారు. 2019 ప్రత్యక్ష ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయడం తథ్యం అని ప్రకటించారు. కాగా సదస్సులో గందరగోళం ఏమాత్రం తగ్గకపో వడంతో ఆయన కేవలం 10 నిమిషాల్లోనే తన ప్రసంగం ముగించారు.

చేనేతలకు అండగా నిలుస్తా : చేనేత అరుదైన కళ అని, అది అంతరించి పోకుండా చూడాల్సిన బాద్యత ప్రభుత్వంపై ఉందని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రభుత్వాలు చేనేత పరిశ్రమ పరిరక్ష ణకు కొన్ని ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోక పోవడంవల్లనే ఈ పరిశ్రమ కనుమరుగవు తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ధర్మవరం వచ్చిన పవన్ కల్యాణ్ చేనేతలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా



సోమవారం అనంతపురం జిల్లా సదస్సులో ప్రసంగిస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

ఆయన మాట్లాడుతూ కళాత్మకతకు ప్రతీకగా నిలిచిన చేనేత కళాకారులు పట్టువస్త్రంపై తన చిత్రాన్ని సృష్టించడం అద్భుత మన్నారు. ఈ కళాకారులకు పాదాభివందనమని ఆయన అభివాదం చేశారు. 2009 ఎన్నికల నుండి తాను అనేక గ్రామాలు, ప్రాంతాలు తిరిగి చేనేతల ఇబ్బందులను గమనించానన్నారు. తన చిన్నతనంలో చీరాలలో మగ్గంనేసే మిత్రుల కుటుంబాలకు వెళ్ళేవాడినని, అప్పుడు చేనేతల కష్టాలు తెలుసునన్నారు. కార్మికుల శరీరాలు కృషిస్తాయని, కంటిచూపు మందగిస్తుందని, సగం వయసుకే వారు మంచం పట్టే పరిస్థితి నెలకుంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారి వెథలను వింటే కంటనీరు రాకమానద న్నారు. నాటినుండి చేనేతల బాధలు, ఇబ్బం దులు, సమస్యలు అలాగే ఉన్నాయని, కూడు పెట్టే వృత్తి అంతరిస్తున్న సమయంలో పోరాటం తప్పనిసరన్నారు. రైతులతో పాటు చేనేతలనూ ఢిల్లీకి తీసుకపోయి ప్రధానమంత్రికి వారి సమస్యలను వివరిస్తానని తెలిపారు. సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన పట్టువస్త్రం దేశ, విదేశాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందనడంలో సందేహం లేదన్నారు. అంతటి కళా నైపుణ్యం కలిగిన చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతుండడం బాదాకరమని ఆయన వాపోయారు. వృత్తి నశిస్తే కార్మికుల ఉనికికే ప్రమాదన్నారు. ఈ పరిశ్రమ అంతరించిపోకుండా చూస్తానని ఆయన బరోసా ఇచ్చారు. ధర్మవరం చేనేత పట్టుచీరకు కంచిపట్టు చీరగా పేరు మార్చి వ్యాపారులు మార్కెట్ చేసుకుంటున్నారని, అయితే ఆ చీరలను నేసిన కార్మికులకు ఏమాత్రం లాభంలేదన్నారు. ధర్మవరం చేనేత పట్టుచీరకు ధర్మవరం మార్కు లేకపోవడం విచారకరమన్నారు. ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకపోయి ధర్మవరం చేనేత ముద్రకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

జిహెచ్ఎంసికి లీగల్ అడ్వైజర్ పోస్టు కోసం దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: న్యాయస్థానంలో ఉన్న కేసులను పర్యవేక్షించడానికి జిహెచ్ఎంసి కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా లీగల్ అడ్వైజర్‌ను నియమించాలని నిర్ణయించారు. హైకోర్టు, సివిల్ కోర్టులలో జిహెచ్ఎంసిపై ఉన్న కేసులను మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్, జిహెచ్ఎంసి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించి కౌంటర్లు దాఖలు చేయడం, మధ్యంతర ఉత్తర్వులను అమలు చేయడం తదితర అంశాలపై ఈ లీగల్ అడ్వైజర్ సహకరిస్తారు. ఇందుకోసం పదవి విరమణ చేసిన జడ్జీలను నియమించాలని ప్రభుత్వం జిహెచ్ఎంసికి అనుమతి ఇచ్చింది. కాగా జడ్జి హోదాలో పదవి విరమణ చేసిన అడ్వైయిజ్ పోస్టు నియామకానికి ఫిబ్రవరి 15వ తేదీలోగా జిహెచ్ఎంసికి దరఖాస్తు చేసుకోవాలని జిహెచ్ఎంసి ఒక ప్రకటనలో తెలిపింది.

అక్రమ హోర్డింగ్ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయండి

ఎంఎయుడి ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: హైదరాబాద్ నగరంలో అక్రమ హోర్డింగ్‌లపై అధికారులు చర్య లు ప్రారంభించారు. అందులో భాగంగానే నగ రంలో అక్రమ హోర్డింగ్‌లు ఉంటే వారిపై క్రిమి నల్ కేసులు నమోదు చేయాలని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. సోమవారం జిహెచ్ ఎంసి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోర్డింగ్‌లపై సమీక్షించిన ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. భవనాల యజమానాలు, ఏజెన్సీలు తక్షణమే వాటిని తొలగించాలని సూచించారు. తొలగించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడు తూ అక్రమహోర్డింగ్‌లను తొలగిస్తున్నట్లు తెలిపారు. 2011నుంచి యూనిపోల్స్‌కు కొత్త అనుమతులు ఇవ్వడంలేదన్నారు. కేవలం నిబంధనలకు అనుగుణంగా రెన్యువల్ చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా అక్రమ కట్టడాలను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు.

జూనియర్ లైన్‌మన్ అభ్యర్థుల శిక్షణను ప్రారంభించిన సిఇఐజి

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు హాజరయ్యే నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని తెలంగాణ విద్యుత్ తనిఖీ ప్రధానాధికారి ఎజి రమణ ప్రసాద్ అన్నారు. సోమవారం తెలంగాణ ఎలక్ట్రికల్ వర్క ర్స్ అసోసియేషన్ ఆధ్వ్యంలో మింట్‌కాంపౌండ్ అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో జెఎల్ఎం పోస్టుల కోసం పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఇఐజి రమణ ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ తరగతుల ద్వారా పరీక్షల పట్ల సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు. ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డుసభ్యులు నక్క యాదగిరి మాట్లాడు తూ శిక్షణ ఫిబ్రవరి 10వ తేదీ వరకు సాయంత్రం 4గంటల నుంచి 8వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రికల్ లైసెన్సింగ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, తెలంగాణ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగరాజు, నేమాల బెనర్జీ పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ కింద రబీ ప్రశ్నార్థకమే

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: తెలంగాణలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగు నీరందే అవకాశాలు కనిపించడం లేదు. రబీ సాగు నిమిత్తం 4.10 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందివ్వనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే జలాశయంలో నీటి నిల్వలు తగినంతగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేయడం అనుమానాస్పదమే అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలాశయంలో రబీ ప్రారంభమైన డిసెంబరు 25 నాటికి కేవలం 47 టిఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. గత ఏడాది రబీ సీజనుకు అదే సమయానికి 80 టిఎంసీల నీళ్లన్నాయి. గత సీజనుతో పోలిస్తే.. ఈ రబీ సీజనుకు నీటి నిల్వ సగానికి తగ్గడంతో సాగునీటి సరఫరాకు అవాంతరాలు ఎదొర్కొనాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ప్రస్తుత రబీ సీజనులో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకింద మొత్తం 4.15 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. లక్ష్మీ కాలువకింద నిజామాబాద్ జిల్లా పరిధిలో 16వేల ఎకరాలు, నిర్మల్ జిల్లా పరిధిలోని సరస్వతి కాలువకింద 16,400 ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా, కరీంనగర్ జిల్లాల పరిధిలో సుమారు 3.70 లక్షల ఎకరాల ఆయ కట్టుకు సాగునీరందించాల్సి ఉంది. అలాగే కాకతీయ కాలువ పరిధిలోని ఎల్ఎండి ఎగువ భాగం వరకూ ఆయకట్టుకు సాగునీటిని సరఫరా చేసేలా నీటిపారుదలశాఖ ప్రణాళికలను రూపొందించింది. కాకతీయ కాలువకు వారబందీ విధానంలో నీటిని విడుదల చేస్తున్నారు. తొలుత రోజుకు ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే చివరి ఆయకట్టుకు సాగునీరు చేరకపోవడంతో ప్రస్తుతం రోజుకు ఆరు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు తడుల నిమిత్తం 38.4 టిఎంసీల నీటి అవసరం ఉంది. అయితే రిజర్వాయరులో 47 టిఎంసీలు మాత్రమే ఉండడం, డెడ్ స్టోరేజ్, ఎవాప్రేషన్ లాస్, మంచినీటి అవసరాలుపోగా సుమారు 33టిఎంసీలు మాత్రమే వాడుకునేందుకు అవకాశంఉంటుందని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ లెక్కన దాదాపు 5 టిఎంసీల నీటి కొరత ఏర్పడే ప్రమాదముందని అంచనావేస్తున్నారు. దీంతో పంటకీలకదశ చివరి తడికిఇబ్బంది వస్తుందనేఅభిప్రాయంఅధికారవర్గాలువ్యక్తం చేస్తున్నాయి.

నాన్‌సభ్యుల నుండి డిపాజిట్లు వద్దు: ఆర్‌బిఐ

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: రాష్ట్రంలోని సహకార సంఘాలకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా షాక్ ఇచ్చింది. సభ్యులు కానివారినుండి డిపాజిట్లను తీసుకోవద్దని సహకార సంఘాలకు స్పష్టమై ఆదేశాలు ఇచ్చింది. సహకార సంఘాల్లో నామమాత్రపు సబ్యులు, అనుబంధ సభ్యుల నుండి కూడా ఎటువంటి డిపాజిట్లను సేకరించరాదని రిజర్వు బ్యాంకు రీజనల్ డైరక్టర్ సుబ్రమణియన్ తెలిపారు. సహకార సంఘాలకు బ్యాంకింగ్ వ్యాపారం చేయడానికి రిజర్వు బ్యాంకు బిర్ యాక్టును అనుసరించి ఎటువంటి లైసెన్సును జారీచేయలేదని పేర్కొన్నారు. అటువంటి అధికారం కూడా ఇవ్వలేదని వెల్లడించారు. ఇటువంటి సహకార సహకార సంఘాల్లో డిపాజిట్ చేసిన సొమ్ముకు ఎటువంటి బీమా కవరేజ్ ఉండదని ఆయన తేల్చిచెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సహకార సంఘాల్లో ఎవరూ డిపాజిట్లను వేసేవిషయంలో జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. పలు సహకార సంఘాలు పొదుపు చేసుకుని తమ సభ్యులకు అప్పులుగా ఇస్తుంటాయి. కొన్ని పెద్ద సంఘాలు సభ్యులు నుంచే కాకుండా సభ్యులుకాని ఇతరుల నుంచి కూడా పెద్దఎత్తున డిపాజిట్లను సేకరిస్తున్నట్లు రిజర్వు బ్యాంకు దృష్టికి వచ్చింది. ఈవిధంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించే అర్హత వాటికి లేదని ఆర్‌బిఐ అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇటువంటి వాటికి ఆర్‌బిఐ నుండి ఎటువంటి అనుమతి లేదు. రాష్ట్రంలో ఇలా అక్రమంగా పలు సహకార పరపతి సంఘాలు దాదాపు 1,000 కోట్ల రూపాయల వరకూ డిపాజిట్లు సేకరించినట్లు ఆర్‌బిఐ అధికారవర్గాలు ప్రాథమిక అంచనా వేశాయి. సహకారశాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో 25 సహకార సంఘాలు రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా 200 కోట్ల రూపాయల వరకూ డిపాజిట్ల రూపంలో నిధులు సేకరించినట్లు బయటపడింది. అంతేకాకుండా కొన్ని పెద్దపెద్ద ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన ఉద్యోగులు ఏర్పాటు చేసుకున్న సహకార సంఘాలు ఇందులో కీలకంగా ఉన్నాయి.

మేడారం తర్వాత ప్రత్యేక అసెంబ్లీ?

2వ తేదీన మేడారం వెళ్లనున్న కెసిఆర్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జనవరి29: సర్పంచ్‌ల విధి విధానాలకు సంబంధించి పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు,చేర్పుల కోసం రూపొందిస్తున్న బిల్లుపై మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన నివేదికపై టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమ ంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర రావు తుది నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మేడారం జాతర తర్వాత అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి బిల్లును ఆమోదింప చేసేందుకు ఇటీవల కలెక్టర్ల సమావేశంలో తుది నిర్ణయం కూడా తీసుకున్నారు. సిఎం కెసిఆర్ ఫిబ్రవరి 2న మేడారం జాతరకు వెళ్లనున్నారు. ఇప్పటి వరకు గడిచిన అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సైనడే అయినప్పటికీ, ప్రోరోగ్ కాలేదు. దీంతో సమావేశాలు గవర్నర్‌తో అనుమతి లేకుండా సెషన్‌ను నిర్వహించుకునేందుకు స్పీకర్‌కు అవకాశం ఉంది. ఈమేరకు మేడారం జాతర తర్వాతనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశం కానుంది. 3వ తేదీన మేడారం జాతర ముగియనుంది. దీంతో అదే నెల 5,6 తేదీల్లో అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. కాగా, కాగా, సిఎం కెసిఆర్ మేడారం పర్యటన ఖరారైంది. ఫిబ్రవరి2న తెలంగాణ కుంభమేళం మేడారం మహాజాతరకు ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా రానున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలుత 2016లో జాతర జరిగింది. అప్పుడు ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని జాతర నిర్వహించింది. కానీ సిఎం కెసిఆర్ పలు కారణాలతో రాలేకపోయారు. ఉద్యమ నేతగా 2012లో సతీసమేతంగా మేడారం వచ్చి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. మళ్లీ ఆరేళ్ల తర్వాత సమ్మక్క, సారక్క చెంతకు వస్తున్నారు.

లారాను దాటేసిన కోహ్లీ

అతడి ఖాతాలో మరో రెండు రికార్డులు....

సఫారీ గడ్డపై టెస్టు విజయం అందించిన మూడో కెప్టెన్‌గా విరాట్

గవాస్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన ఆటగాడిగా రికార్డు



పోతుగంటి వెంకట రమణస్పోర్ట్స్ ప్రతినిధి: భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో విజయంతో పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. సఫారీగడ్డపై టెస్టు విజయం అందించిన మూడో కెప్టెన్‌గా నిలిచాడు. అంతేగాక ఐసిసి ఆల్‌టైం ర్యాంకింగ్స్‌లో లారాను దాటేశాడు. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ రికార్డుని సమం చేశాడు. జోహెన్స్‌బర్గ్ వేదికగా జరిగిన మూడో టెస్టులో దక్షిణాఫ్రికాపై కోహ్లీసే 63 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అనిశ్చితి పరిస్థితుల మధ్య వాండరర్స్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుపై టీమిండియా గెలవడం నిజంగా అద్భుతం. మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీసుల్లో భాగంగా అంతకుముందు జరిగిన రెండో టెస్టులో టీమిండియా ఓటమి పాలవడంతో సిరీస్‌ను 2-0తో చేజార్చుకుంది. అలాంటి సమయంలో మూడో టెస్టులో కోహ్లీసేన విజయం సాధించడం అటు అభిమానులతో పాటు భారత క్రికెటర్లలో ఉత్సాహాన్ని నింపింది. ఈ విజయాన్ని కోహ్లీసేన కూడా పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేసుకుంది. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. ఇప్పటివరకు దక్షిణా ఫ్రికాలో టీమిండియా టెస్టు సిరీస్‌ను గెలవలేదు. ఈ సిరీస్‌కు ముందు కోహ్లీసేన అద్భుతమైన ఫామ్‌లో ఉండటాన్ని చూసి సఫారీ గడ్డపై దక్షిణాఫ్రికా విజయం సాధిస్తుందని అందరూ ఊహించారు. అయితే అలా జరగలేదు. చివరకు 1-2తేడాతో సిరీస్‌ను చేజార్చుకుంది. 1992 నుంచి ఇప్పటివరకు సఫారీ గడ్డపై దక్షిణాఫ్రికాతో టీమిండియా 20 టెస్టు మ్యాచ్‌లాడింది. ఇందులో కేవలం మూడు టెస్టుల్లో మాత్రమే భారత్ విజయం సాధించడం విశేషం. జోహెన్స్‌బర్గ్ విజయంతో విరాట్ క కోహ్లీ మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ టెస్టుల్లో అత్యధిక విజయాల రికార్డుని సమం చేశాడు. టెస్టుల్లో భారత్‌కు అత్యధిక విజయాలనందించిన జాబితాలో మహేంద్రసింగ్ ధోని (27)అగ్రస్థానంలో ఉండగా...విరాట్ కోహ్లీ, సౌరవ్ గంగూలీ (21) విజయాలతో రెండో స్థానంలో ఉన్నారు. అయితే, ఇక్కడ విరాట్ కోహ్లీకి విజయశాతం ఎక్కువగా ఉండటం విశేషం. కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ 35 టెస్టులకు ప్రాతినిథ్యం వహించగా, కేవలం 5 టెస్టుల్లో మాత్రమే భారత్ ఓటమి పాలైంది. సఫారీ గడ్డపై దక్షిణాఫ్రికాను ఓడించిన మూడో కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. అంతకుముందు 2006లో ఇదే వేదికపై రాహుల్ ద్రవిడ్ నేతృత్వంలోని టీమిండియా విజయం సాధించగా, ఆ తర్వాత 2010లో మహేంద్ర సింగ్ ధోని నేతృత్వంలోని టీమిండియా దర్బన్ వేదికగా జరిగిన టెస్టులో విజయం సాధించింది. భారత్ విజయం సాధించిన ఈ మూడు సార్లు జట్టులో మురళీ విజయ్, ఛతేశ్వర్ పుజారా, ఇషాంత్ శర్మ సభ్యులుగా ఉన్నారు. జోహెన్స్‌బర్గ్‌లో మూడో టెస్టులో విజయం సాధించడంతో టీమిండియా తన రికార్డుని సజీవంగా ఉంచుకుంది. జోహెన్స్ బర్గ్‌లో టీమిండియా ఐదు టెస్టులాడగా రెండింటిలో విజయం సాధించగా, మూడింటిని డ్రాగా చేసుకుంది.

టీమిండియాకు అత్యధిక విజయాలు అందించిన కెప్టెన్లు

ఎంఎస్ ధోని – 27 విజయాలు (60 మ్యాచ్‌లు, ఓటమి 18 మా య్చ్‌లు)
విరాట్ కోహ్లీ – 21 విజయాలు (35 మ్యాచ్‌లు, ఓటమి 5 మ్యాచ్‌లు)
సౌరవ్ గంగూలీ – 21 విజయాలు (40మ్యాచ్‌లు, ఓటమి 13 మ్యాచ్‌లు)
మహ్మద్ అజారుద్దీన్ – 14 విజయాలు (47 మ్యాచ్‌లు, ఓటమి 14 మ్యాచ్‌లు)
సునీల్ గవాస్కర్ – 9 విజయాలు (47 మ్యాచ్‌లు, ఓటమి 8 మ్యాచ్‌లు)
మన్సూరలీ ఖాన్ పటౌడీ – 9 విజయాలు (40 మ్యాచ్‌లు, ఓటమి 19 మ్యాచ్‌లు)
రాహుల్ ద్రావిడ్ – 8 విజయాలు (25 మ్యాచ్‌లు, ఓటమి 6 మ్యాచ్‌లు)

దక్షిణాఫ్రికాపై టీమిండియా సాధించిన టెస్టు మ్యాచ్ విజయాలు...

– జోహెన్స్‌బర్గ్ వేదికగా డిసెంబర్ 2006లో 123 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది.(మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ శ్రీశాంత్)
– దర్బన్ వేదికగా డిసెంబర్ 2010లో 87 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది. (మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ వివిఎస్ లక్ష్మణ్)
– జోహెన్స్‌బర్గ్ వేదికగా 2018లో 63 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించింది. (మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ భువనేశ్వర్ కుమార్)

ఐసిసి ఆల్‌టైం ర్యాంకింగ్స్‌లో లారాను దాటేసిన కోహ్లీ....

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ఘనత సాధించాడు. జోహెన్స్‌బర్గ్ టెస్టులో రాణించిన కోహ్లీ 12 రేటింగ్ పాయింట్లను మెరుగుపరుచుకుని 912 పాయింట్లను ఖాతాలో వేసుకున్నాడు. తద్వారా ఆల్‌టైం ర్యాంకింగ్స్‌లో బ్రియాన్ లారాను దాటేశాడు. కోహ్లీ ప్రస్తుతం 26వ స్థానానికి చేరుకున్నాడు. భారత్ తరుపున అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన సునీల్ గవాస్కర్ (916 పాయింట్లు)కు మరింత చేరువయ్యాడు. ఆల్‌టైం హై పాయింట్ల పట్టికలో ఆసీస్ దిగ్గజం డ్రాన్ బ్రాడ్ మ్యాన్ 964 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానంలో ఉన్న స్టీవ్ స్మిత్ 947 పాయింట్లతో ఆల్‌టైం హై పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికాతో జరిగని రెండో టెస్టులో 153 పరుగులు సాధించడం ద్వారా విరాట్ కోహ్లీ 900 పాయింట్ల మార్కును అందుకున్నాడు.

గవాస్కర్ తర్వాత ఈఘనత సాధించిన రెండో భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. సౌతాఫ్రికాతో జరిగిన చివరి టెస్టులో 54, 41 పరుగులు చేసిన విరాట్ 12 పాయింట్లను మెరుగు పరుచున్నాడు. దీంతో లారా (911), కెవిన్ పీటర్సన్ (909), హషీమ్ ఆమ్లా (907), చంద్రపాల్ (901), మైకేల్ క్లార్క్ (900)లను కోహ్లీ దాటేశాడు.

టెస్టుచరిత్రలో ఇలా జరగడం

ఇదే తొలిసారి





జోహెన్స్‌బర్గ్: గత మూడు రోజుల క్రితం భారత్-దక్షిణాఫ్రికా జట్లు మూడు టెస్టుల సిరీస్ ముగిసిన సంగతి తెలిసిందే. చివరి టెస్టులో టీమిండియా 63 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సిరీస్‌ను క్లీన్‌స్వీప్ కాకుండా తప్పించుకుంది. అయితే ఇరు జట్ల మధ్య జరిగిన ద్వైపాక్షిక మూడు టెస్టుల సిరీస్‌లో అరుదైన నమోదైంది. ఈ సిరీస్‌లో భారత్-దక్షిణాఫ్రికాలు ప్రతీ ఇన్నింగ్స్‌లోనూ ఆలౌట్ కావడంతో టెస్టు క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించబడింది. మూడు టెస్టుల సిరీస్‌లో ఇరు జట్లు 12 సార్లు కూడా ఆలౌట్ కావడం టెస్టు చరిత్రలో ఇది మొదటిసారి మాత్రమే. మొత్తంగా 120 వికెట్లు కుప్పకూలడంతో సరికొత్త చరిత్రకు నాంది పలికింది. మరోకవైపు విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌లో భారత్ ప్రత్యర్థి వికెట్లన్నీ కుప్పకూల్చడం ఇది రెండో సారి మాత్రమే. గతంలో 1986లో ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత్ ఆరు ఇన్నింగ్స్‌ల్లోనూ ప్రత్యర్థిని ఆలౌట్ చేసింది.

కింగ్స్ ఎలెవెన్ పంజాబ్ పేరు మార్పు..?



ఢిల్లీ: ఐపిఎల్ 2018 సీజన్ ఆటగాళ్ల వేలంలో భారీ ధరకి స్టార్ క్రికెటర్లని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచింది. బెంగుళూరు వేదికగా గత శని, ఆదివారం జరిగిన ఈ వేలంలో రూ.11కోట్లకి ఓపెనర్ కెఎల్ రాహుల్‌ని దక్కించుకున్న పంజాబ్...రవిచంద్రన్ అశ్విన్ (రూ.7.6కోట్లు), ఆండ్రూ టై (రూ.7.2కోట్లు), ఆరోన్ ఫించ్ (రూ.6.2కోట్లు), స్టాయినిస్ (రూ.6.2కోట్లు), కరుణ్ నాయర్ (రూ.5.6కోట్లు), క్రిస్‌గేల్ (రూ.2కోట్లు) కొనుగోలుతో జట్టుని బలిష్టం చేసుకుంది. గత మూడు సీజన్లలోనూ జట్టు ప్రదర్శన మరీ తీసికట్టుగా మారడంతోనే ఫ్రాంచైజీ ఈ సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో...పాటు ఈ ఏడాది సీజన్‌కి జట్టు పేరుని కూడా మార్చాలని ఫ్రాంచైజీ యోచిస్తోందట. ఈ మేరకు బిసిసైకి ఇప్పటికే పేరు మార్పుపై దరఖాస్తు చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. పదేళ్ల ఐపిఎల్ చరిత్రలో ఒకసారి మాత్రమే ఫైనల్‌కు చేరిన కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు....2014 నుంచి కనీసం ప్లేఆఫ్‌కి కూడా అర్హత సాధించలేకపోయింది. దీంతో వేలంలో మ్యాచ్‌ల్ని గెలిపించే ఆటగాళ్లపైనే ఫ్రాంచైజీ ఎక్కువగా దృష్టి సారించి దక్కించుకుంది. ఆటగాళ్ల మారు ్పతో పాటు జట్టుపేరు మార్పు పంజాబ్‌కి ఏమేరకు టైటిల్ తెచ్చిపెడుతుందో చూడాలి.

ఐపిఎల్ లో అమ్ముడుపోని బెస్ట్ విదేశీ క్రికెటర్లు



బెంగుళూరు: ఐపిఎల్ 2018 వేలం ముగిసింది. కొందరు ఆటగాళ్లు అంచనాలకు మించి కోట్లు పలికారు. మరికొందరు అంచనాల్ని అందుకోలేక చతికిలపడ్డారు. కొందరు ఆటగాళ్లు అయితే గత ఫ్రాంచైజీల నిరాదరణతో షాక్ తిన్నారు. ఈ జాబితాలో ఆటగాళ్లలో 11మంది ఉన్నారు. బెంగళూరు వేదికగా జరిగిన రెండో రోజుల వేలంలో శ్రీలంక స్టార్ బౌలర్ లసింత్ మలింగను కొనుగోలు చేసేందుకు ఎనిమిది ఫ్రాంచైజీలలో ఏ ఒక్క ఫ్రాంచైజీ కూడా ముందుకు రాలేదు. నిజానికి కొన్ని సంవత్సరాలుగా టీ20 క్రికెట్‌లో లసిత్ మలింగ జట్టుకు అదనపు బలంగా ఉండేవాడు. 2011లో జరిగిన ఐపిఎల్ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే పర్పెల్ క్యాప్ అవార్డుని మలింగ సొంతం చేసుకన్నాడు. కానీ, ఈ మధ్య కాలంలో ఫిట్‌నెస్‌తో పాటు ఆట పరంగా మలింగ ప్రదర్శన మరీ తీసికట్టుగా తయారైంది. ఇక్కడ ఆశ్చర్యపోవాల్సిన విషయం ఏంటంటే 2017లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు తరుపున సెంచరీలు నమోదు చేసిన షాన్ మార్ష్, ఇయాన్ మోర్గాన్, హషీం ఆమ్లాను ఏ ఒక్కరూ కొనుగోలు చేయకపోవడం. ఇయాన్ మోర్గాన్ ఇంగ్లాండ్ టీ20 జట్టుకు కెప్టెన్‌గా కూడా ఉన్నాడు. అయినప్పటికీ ఫ్రాంచైజీలు అతడిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. మరోవైపు ఇంగ్లాండ్ టెస్టు కెప్టెన్ జో రూట్ కూడా అమ్ముడుపోని ఆటగాళ్ల జాబితాలో ఉన్నాడు. ఐపిఎల్ వేలానికి జో రూట్ రావడం ఇదే మొట్టమొదటిసారి. ఐపిఎల్ 11వ సీజన్‌కు గాను వేలానికి 581మందికి నిర్వాహకులు అనుమతిచ్చారు. వీరిలో ఫ్రాంచైజీలు 169మందిని కొనుగోలు చేయగా మిగతా 412 మంది అమ్ముడుపోని జాబితాలో ఉన్నారు. వేలంలో ఖర్చు చేయదగ్గ గరిష్ట మొత్తం రూ.66కోట్ల నుంచి రూ.80కోట్లకు పెరిగినప్పటికీ, గత సీజన్లలో మాదిరి ఫ్రాంచైజీలు ఆటగాళ్లపై ఖర్చు చేయలేదు.

వేలంలో అమ్ముడుపోని బెస్ట్ 11మంది విదేశీ ఆటగాళ్లు...


– షాన్ మార్ష్ (ఆస్ట్రేలియా), హషీం ఆమ్లా (దక్షిణాఫ్రికా), రాస్ టేలర్ (న్యూజిలాండ్), జో రూట్ (ఇంగ్లాండ్), ఇయాన్ మోర్గాన్ (ఇంగ్లాండ్ టీ20 కెప్టెన్), జానీ బేర్స్టో (ఇంగ్లాండ్, వికెట్ కీపర్), జేమ్ ఫాల్క్నర్ (ఆస్ట్రేలియా), శామ్యూల బాద్రీ (వెస్టిండీస్), డేల్ స్టెయిన్ (దక్షిణాఫ్రికా), టింయల్ మిల్స్ (ఇంగ్లాండ్), లసిత్ మలింగ (శ్రీలంక)

అండర్ 19 ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరిన ఆస్ట్రేలియా



న్యూజిలాండ్ వేదికగా జరుగుతోన్న ఐసిసి అండర్ 19 ప్రపంచ కప్ ఫైనల్లోకి ఆసీస్ చేరింది. సంచలన ప్రదర్శనతో సెమీస్ చేరిన అఫ్ఘనిస్తాన్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించింది. . సోమవారం జరిగిన తొలి సెమీఫైనల్లో అఫ్ఘని స్తాన్‌పై ఆస్ట్రేలియా విజయం సాధించి అండర్ 19 ప్రపంచ కప్‌లో ప్రవేశించిన తొలి జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్ఘనిస్తాన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది.ఆ స్ట్రేలియా బౌలర్ జొనథన్ మెర్లో దెబ్బకు అఫ్ఘనిస్తాన్ బ్యాట్స్‌మెన్ వరుసగా పెవి లియన్‌కు చేరారు. ఇక్రం అలీ (80) తప్ప ఆ జట్టులో మిగతా ఆటగాళ్లు ఎవరూ పెద్దగా రాణించలేదు. ఏడుగురు అఫ్ఘనిస్తాన్ ప్లేయర్లు రెండంకెల స్కోరు చేయలేకపోయారు. దీంతో ఆ జట్టు 48 ఓవర్లలో 181 పరుగులకే కుప్ప కూలింది. అనంతరం 182 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా అలవోక విజయాన్ని సాధించింది. ఆసీస్ ఓపె నర్ ఎడ్వర్ట్స్ (72) రాణించడంతో 37.3 ఓవ ర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఆస్ట్రేలియా లక్ష్యాన్ని ఛేధించింది.ఈ విజయంతో ఐదుసార్లు ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన పాకిస్తాన్ రికార్డును ఆసీస్ సమం చేసింది. అఫ్ఘనిస్తాన్ తరుపున వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్ ఇక్రమ్ అలీ ఖిల్ 80 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బ్యాట్స్‌మెన్ ఎవరూ చెప్పుకోదగ్గ స్కోరు చేయకపోవడంతో ఆఫ్ఘాన్ జట్టు 181 పరుగులకే పరిమితమైంది. ఆసీస్ బౌలర్ జొనాథన్ మెర్లో 4 వికెట్లు తీయగా, జాక్ ఎవా న్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. స్వల్ప లక్ష్యం తో బరిలోకి దిగిన ఆసీస్ ఆరంభంలో ఓపెనర్ మ్యాక్స్ బ్రియాంట్ వికెట్‌ను కోల్పోయింది. కానీ మరో ఓపెనర్ జక్ ఎడ్వర్ట్ (65బంతుల్లో 8ఫోర్లు, 2 సిక్స్‌లతో 72 పరుగులు)ఎదురు దాడికి దిగాడు. దీంతో ఆసీస్ విజయం తేలికైంది.ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన జాక్ ఎడ్వర్ట్స్ మాట్లాడుతూ ఆఫ్ఘాన్ స్పిన్నర్ల బౌలింగ్‌పై పరిశోధన చేశామని చెప్పాడు. వీడియో ఫుటేజ్‌ను పరిశీలించడం ద్వారా వారు బౌలింగ్ ఎలా చేస్తున్నారో అవగాహ నకు వచ్చామని తెలిపాడు. వారు మా మీద దాడి చేయడానికి ముందే ఎదురుదాడి చేసి సత్ఫలితం రాబట్టానని చెప్పాడు. వీడియో ఫుటేజ్ లేకుండా ఆఫ్ఘాన్ స్పిన్నర్లను ఎదుర్కో వడం కష్టమయ్యేదని చెప్పాడు. మొత్తానికి వీడి యో ఫుటేజ్ ఆఫ్ఘాన్‌కు తొలిసారి ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరే అవకాశాన్ని దూరం చేసింది. రెం డో సెమీఫైనల్లో భాగంగా మంగళవారం భారత్- పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుతుంది. ఫిబ్రవరి 3న జరిగే ఫైనల్లో ఈ జట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది.

బిసిసిఐ కోశాధికారిపై వేటు..?



ముంబయి: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) కోశాధికారి అనిరుధ్ చౌదరిపై త్వరలో వేటు పడనుందా...? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. బిసిసిఐలో లోథా కమిటీ సూచించిన సంస్కరణల అమలు కోసం సుప్రీం కోర్టు ప్రత్యేకంగా నియమించిన పాలకుల కమిటీ అధ్యక్షుడు వినోద్ రాయ్ ఈ మేరకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. బోర్డులో సంస్కరణల అమలుకి అనిరుధ్ చౌదరి చొరవ చూపకపోగా...అడ్డుపడుతున్నాడంటూ ఆరోపణలు వినపిస్తున్న నేపథ్యంలో సుప్రీం కోర్టుకి వినోద్ రాయ్ త్వర్వలోనే ఓ నివేదిక సమర్పించనున్నారు. ఇందులో అనిరుధ్ చౌదరిపై వేటువేయాలనేది ప్రధాన సూచనగా ఉన్నట్లు బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. గత ఏడాది జనవరి 2న ఇలానే బోర్డులో సంస్కరణల అమలుపై అలక్ష్యం వహించి, అసత్య ప్రమాణం చేసిన బిసిసిఐ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్‌తో పాటు కార్యదర్శి అజయ్ షిర్కేలను వారి పదవుల నుంచి సుప్రీంకోర్టు తొలగిస్తూ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఇదే తరహా వేటు అనిరుధ్ చౌదరిపై కూడా పడనున్నట్లు తెలుస్తోంది. బిసిసిఐలో పారదర్శకత పెంచేందుకు లోథా కమిటీ కొన్ని సంస్కరణలు సూచించింది. కానీ...రాష్ట్ర క్రికెట్ సంఘాలు ఈసంస్కరణల అమలుకి తొలుత ఆసక్తి కనబరచలేదు. దీంతో పాలకుల కమిటీ...ఆ సంఘాలకి నిధులు నిలిపవేయగా...అవి దారిలోకి వస్తున్నాయి.

నేడు దాయాదులతో యువ భారత్ పోరు

పాక్‌పై గెలిస్తేనే భారత్ ఫైనల్‌కు



ప్రభాతవార్త స్పోర్ట్స్ ప్రతినిధి: న్యూజిలాండ్ వేదికగా జరుగుతున్న ఐసిసి అండర్ 19 ప్రపంచ కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌త భారత్ మంగళవారం తలపడనుంది. టోర్నీలో భాగంగా క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లే ఓవల్ మైదానంలో రెండో సెమీఫైనల్‌లో భారత్-పాకిస్తాన్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 3గం.లకు మ్యాచ్ ప్రారంభం కానుంది. సెమీస్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను చిత్తుగా ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించాలని భారత క్రికెట్ అభిమానులందరూ కోరుకుంటున్నారు. సెమీస్‌లో పాక్‌పై విజయం సాధించాలని భారత జట్టు ఆటగాళ్లు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ టోర్నీలో ఇప్పటివరకు భారత్ మూడు సార్లు ప్రపంచ కప్ గెలవగా పాకిస్తాన్ రెండు సార్లు కైవసం చేసుకుంది. దాయాది దేశాలు కావడంతో పోరుపై అమితాసక్తి ఏర్పడింది. ఇప్పటికే ఈ మ్యాచ్‌కి అమ్ముడైన టిక్కెట్ల సంఖ్య ఈవిషయాన్ని తెలియజేస్తుంది. స్టేడియం కెపాసిటీ మొత్తం అమ్ముడయ్యాయని, అభిమానుల నుంచి వచ్చే డిమాండ్ బట్టి అదనపు స్టాండ్స్ ఏర్పాటు చేస్తామని స్టేడియం నిర్వాహకులు తెలిపారు. సెమీస్ మ్యాచ్ జరిగే ఓవల్ మైదానంలో పరిస్థితులు పాకిస్తాన్‌కు బాగా తెలుసు. క్వార్టర్స్‌లో ఆ జట్టు ఇక్కడే ఆడింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం అండర్ 19 ప్రపంచ కప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న యువ క్రికెటర్లు బెంగుళూరులో జరిగిన వేలంలో కోట్లు పలికారు. పృథ్వీషా తో ఓపెనింగ్‌కు దిగే మన్‌జ్యోత్‌ను కనీస ధర రూ.20లక్షలకు ఢిల్లీనే సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో విజ యం సాధించి ఫైనల్‌కు చేరుకోవాలని శుభమాన్ గిల్ అన్నాడు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుతో ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్ ఆడనుంది.

అశ్విన్‌ను కొనలేకనే హర్భజన్‌ను కొన్నాం: ఫ్లెమింగ్



బెంగుళూరు: భారత స్పిన్ మాంత్రికుడు రవి చంద్రన్ అశ్విన్‌ను ఐపిఎల్‌లో ఆర్‌టిఎం (రైట్ టూ మ్యాచ్) ద్వారా దక్కించుకుంటామని చెన్నై సూపర్ కింగ్స్ వెల్లడిం చింది. కానీ, వేలంలో అశ్విన్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.7.6కోట్లకు దక్కిం చుకున్న విషయం తెలిసిందే. తామే దక్కిం చుకుంటామన్న చెన్నై...అశ్విన్‌ను ఎందుకు వదిలే దసింది. అనే ప్రశ్నపై తాజాగా ఆ జట్టు కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ స్పందించాడు. వేలంలో అశ్విన్‌ను దక్కించుకో వాలనుకోవడం నిజం. అతని కోసం రూ.4కోట్ల వరకు ఖర్చు చేయాలనే వేలానికి ముందే ప్రణాళిక కూడా వేసుకున్నాం. కానీ, సీని యర్ ఆటగాడైన అశ్విన్ కోసం చాలా ఫ్రాంచైజీలు ఆసక్తి చూపాయి. దీంతో అతని ధర ఒకానొక సమయంలో రూ.7కోట్లకు పైగా చేరింది. జట్టులో ఇంకా భర్తీ చేయాలంటే ఎంతో మంది ఆటగాళ్లను కొనాలి. మా దగ్గర ఉన్న మొత్తం తక్కువ. అశ్విన్ ధర మాత్రం పెరుగుతూనే ఉంది. కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.7.6కోట్ల వద్ద ఆగింది. ఈ సమ యంలో సహచరులంతా చర్చించుకుని అశ్విన్‌ను వదిలేద్దామని నిర్ణయించుకున్నాం. జట్టులో సీనియర్ స్పిన్నర్ ఎంతో అవసరం. అందుకే రూ.2కోట్లు పెట్టి హర్భజన్ సింగ్‌కు కొనుగోలు చేశామని ఫ్లెమింగ్ వివరించాడు.

సింగిల్స్,డబుల్స్‌లోనూ రిత్విక్ విజేత.

హైదరాబాద్: అం తర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటిఎఫ్) గ్రేడ్-4 టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరి అద్భు త ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో సింగిల్స్,డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచి రెండు టైటిళ్లను సొంతం చేసుకున్నాడు. బాలుర సింగిల్స్ ఫైనల్లో రిత్విక్ 4-6, 6-2, 6-0తో అబ్దుల్ షకుర్ కబురా (బురుండి)పై గెలుపొందాడు. మరోకవైపు బాలుర డబుల్స్ టైటిల్ పోరులో టాప్ సీడ్ రిత్విక్ (భారత్)-యాన్ అహ్మద్ (గ్రేట్ బ్రిటన్) జంట 6-1, 6-4తో అబ్దుల్ (బురుండి)-ర్యాన్ అటెటొ ర్యాండిక్ (కెన్యా)జోడీపై గెలిచి విజేతగా నిలిచాడు

దక్షిణాఫ్రికా క్రికెటర్లలో వర్ణ వివక్ష..?

జోహెన్స్‌బర్గ్: భారత్‌తో జరిగిన మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో సఫారీ జట్టు కైవసం చేసుకుంది వాండరర్స్ మైదానంలో చివరి టెస్టు అనంతరం సఫారీ జట్టు ట్రోఫీ అందుకుని సంబరాలు చేసుకుంది. ఇదే ఇప్పుడు వారి కొంపముంచింది. చివరి టెస్టులో ఓడిపోయినా సంబరాలు చేసుకున్నందుకు అని అనుకుంటే మాత్రం పప్పులో కాలేసినట్లే. ట్రోఫీ అందుకున్న ఫోటోను కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే...ఇందులో ఒక పక్క డూప్లెసిస్, ఎల్గర్, డివిలియర్స్, మోర్కెల్, మోరిస్, డీకాక , స్టెయిన్ తదితరులు ఉండగా...మరో పక్క రబాడ, ఎంగిడి, ఫిలాండర్, కేశవ్ మహారాజ్,ఫెలుక్వాయో ఉన్నారు. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆటగాళ్లు కావాలని అలా నిల్చున్నారో...ఎందుకు అలా ఎందుకు నిల్చున్నారో తెలియదు కానీ ఈ ఫోటో ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. దేశం తరుపున ఆడుతోన్న ఆటగాళ్ల మధ్య వర్ణ వివక్ష ఉందని ఈ ఫోటో రుజువు చేసిందని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జట్టు విషయంలో కీలకపాత్ర పోషించిన ఫిలాండర్, ఎంగిడి, రబాడలను కలుపుకోలేకపోయారని ట్వీట్ల వర్షం కురిపించారు. దీనిపై ఇప్పుడు అక్కడ పెద్ద చర్చే జరుగుతోంది. ఆటగాళ్ల మధ్య ఎలాంటి వివక్ష లేదని, వారంతా ఒకటేనని ఆ దేశ క్రికెట్ బోర్డు సీఈవో తబాంగ్ మోరోయ్ తెలిపారు. దీనిపై ఆయన తాజాగా మాట్లాడుతూ....జట్టులో ఆటగాళ్ల మధ్య ఎలాంటి తేడాలు లేవు.అందరూదేశం తరుపునే ఆడారు. ఓ మ్యాచ్‌లో రబాడ కీలక వికెట్ తీసినప్పుడు సారథి డూప్లెసిస్ అతడ్ని నుదురుపై ముద్దుపెట్టుకోవడం మనందం చూశాం. ఇలాంటి సంఘటనల గురించి ఎందుకు మాట్లాడరు.



వాండరర్స్ మైదానంలో చివరి టెస్టు అనంతరం సఫారీ జట్టు ట్రోఫీఅందుకుంటున్న దృశ్యం (ఫైల్)

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.